
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 339
గురువారం 29-2-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'


యశస్వికి 'డబుల్'
వార్షిక కాంట్రాక్ట్‌లు ప్రకటించిన బీసీసీఐ.. శ్రేయస్, ఇషాన్ కిషన్ అవుట్ - 14లో


భారత్‌లో బిల్‌గేట్స్
ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించిన టెక్ దిగ్గజం - 15లో



అఖిలేశ్‌ను ప్రశ్నించనున్న సీబీఐ
యూపీలో అక్రమ గనుల కేటాయింపుల కేసుల్లో విచారణకు రావాలని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌ను సీబీఐ ఆదేశించింది.
వివరాలు 6లో ►


3,300 కేజీల డ్రగ్స్ స్వాధీనం
నేవీ, ఎన్‌సీబీ, గుజరాత్ పోలీసులు అరేబియా సముద్ర జలాల్లో ఓ పడవపై దాడి చేసి 3,300 కేజీల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు.
వివరాలు 6లో ►


అమెరికాలో కార్చిచ్చు
టెక్సాస్‌లో కార్చిచ్చు చెలరేగింది. లక్షలాది ఎకరాలు ఆహుతయ్యాయి. టెక్సాస్ చరిత్రలో అతిపెద్ద కార్చిచ్చు ఘటనల్లో ఇది ఐదోది.
వివరాలు 6లో ►


టార్గెట్ హిమాచల్‌ప్రదేశ్?
హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వంపై అవిశ్వాసం ప్రవేశపెట్టడానికి బీజేపీ సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.
వివరాలు 6లో ►

వైఎస్సార్ రైతు భరోసా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



మాటకు మించి సాయం

ప్రతి అడుగులో అన్నదాతకు తోడుగా నిలబడ్డాం: సీఎం జగన్

హామీ కంటే మిన్నగా పెట్టుబడి సాయాన్ని అందించాం

- రూ.50 వేలే ఇస్తామని చెప్పినా ప్రతి ఒక్కరికీ రూ.67,500 ఇచ్చాం.. ఒక్క వైఎస్సార్ రైతు భరోసాతో రూ.34,288 కోట్లు రైతుల చేతికి
- చిన్న రైతులకు పెట్టుబడి ఖర్చుల్లో 80% కవర్
- సకాలంలో సున్నా వడ్డీ రాయితీ, పంట నష్ట పరిహారం.. పైసాభారం పడకుండా బీమా కవరేజ్
- ఏ సీజన్‌లో నష్టపోతే అదే సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ
- ఈ-క్రాప్ ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు
- ఆర్బీకే వ్యవస్థను గ్రామ స్థాయిలో తీసుకొచ్చాం
- 19 లక్షల మంది రైతులకు 9 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్తు.. ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ సరఫరా
- అన్నదాతలకు ఈ ఐదేళ్లలో రూ.1.85 లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూర్చాం
- వైఎస్సార్ రైతు భరోసా మూడో విడతగా 53.58 లక్షల కుటుంబాలకు రూ.1,078.36 కోట్లు
- సున్నా వడ్డీ రాయితీ కింద 10.79 లక్షల మందికి మరో రూ.215.98 కోట్లు
- బటన్ నొక్కి జమ చేసిన సీఎం వైఎస్ జగన్

2 లో

రైతుల కోరిక.. మళ్లీ మీరే

పంట మాది.. బీమా మీది

ఎమ్మెస్పీ కంటే 30% అధికంగా..

2 లో

ఫ్యాక్ట్‌చెక్

గురివింద ప్రయాసే
- బీమా రక్షణతో భద్రంగా ప్రవాసాంధ్రులు
- 2.55 లక్షల మందికి ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ సేవలు
- కరోనా, ఉక్రెయిన్ యుద్ధం వేళ తక్షణమే స్పందన
- మాతృభూమికి సురక్షితంగా ప్రవాసుల తరలింపు

12 లో

చక్కెర కర్మాగారాలను పిప్పి చేసింది బాబే
- చంద్రబాబు హయాంలో పదింటికి తొమ్మిది సహకార చక్కెర ఫ్యాక్టరీలు మూత
- వీటిలో లాభాల్లో ఉన్న ఫ్యాక్టరీలూ ఉన్నాయి
- ఆ ప్రభావంతో 15 ప్రైవేటు ఫ్యాక్టరీలూ మూతపడ్డాయి
- భారీగా రైతులు, కార్మికులు ఉపాధి కోల్పోయారు

3 లో

చందాదారుల ఆస్తులు కొల్లగొడుతున్న

గజదొంగ రామోజీ

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఓ బందిపోటు సంస్థ

- పేదలు, మధ్యతరగతివర్గాలను వేధిస్తోంది
- కాల్‌మనీ రాకెట్‌లా ఇళ్లపైకి దాడులు చేస్తోంది.. చిట్టీల ఉచ్చులో బిగించి ఆస్తులు గుంజుకుంటోంది
- ప్రైజ్‌మనీ ఇవ్వకుండా రశీదు డిపాజిట్లుగా అట్టిపెట్టుకుంటోంది..
- గట్టిగా అడిగితే రూ. లక్షల్లో చిట్టీలు కడితే రూ. వందలు చేతిలో పెడుతోంది
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం

10 లో


మీడియాకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాలు తెలియజేస్తున్న బాధితులు

బాబు గ్రాఫిక్స్ పెట్టుబడులు.. జగన్ రియల్ పెట్టుబడులు

- కేంద్ర వాణిజ్య శాఖ గణాంకాల్లో బట్టబయలైన బాబు మాటల బురిడీ
- బాబు హయాంలో కంటే సీఎం జగన్ హయాంలో రాష్ట్రంలో మూడు రెట్లు పెరిగిన వాస్తవ పెట్టుబడులు
- 2014–18 మధ్య రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులు రూ.32,803 కోట్లే
- 2019 నుంచి 2023 జూన్ వరకు వచ్చిన పెట్టుబడులు రూ.1,00,103 కోట్లు



- రెండేళ్లు కరోనా ఉన్నా భారీ పెట్టుబడులను ఆకర్షించిన జగన్ సర్కారు.. 2022లో రూ.45,217 కోట్ల పెట్టుబడులు తేవడం ద్వారా దేశంలోనే అగ్రస్థానం

10 లో

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేత


గొల్లపల్లి సూర్యారావు
- పి.గన్నవరం టీడీపీ నేత నేలపూడి స్టాలిన్ బాబు కూడా వైఎస్సార్‌సీపీలో చేరిక
- చంద్రబాబు మెడపట్టుకొని గెంటేశారు.. సీఎం జగన్ అక్కున చేర్చుకున్నారు
- టీడీపీ పెత్తందార్లకు అనుకూల పార్టీ.. దళితులకు వ్యతిరేకం
- మీడియాతో గొల్లపల్లి సూర్యారావు

2 లో


సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గొల్లపల్లి సూర్యారావు

ఒంగోలు లోక్‌సభ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా

చెవిరెడ్డి



మరో ఐదుగురు పార్టీ సమన్వయకర్తల నియామకం

గుంటూరు లోక్‌సభకు కిలారి రోశయ్య

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన

3 లో

అందరికీ సీట్లు ఇవ్వలేం
- టీడీపీ–జనసేన ఉమ్మడి బహిరంగ సభలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు
- నా మద్దతుదారులైతే నన్ను ప్రశ్నించకండి: పవన్ కళ్యాణ్
- 24 స్థానాలు తీసుకుంటే ఇంతేనా అంటున్నారు
- టీడీపీలా బూత్ లెవల్‌లో మనకు బలం ఉందా?


11 లో

టీజే ఫ్లాప్ షో!
తుస్సుమన్న టీడీపీ–జనసేన (టీజే) తొలి బహిరంగ సభ.. జనం లేక వెలవెల

11లో

మాటకు మించి సాయం

ప్రతి అడుగులో అన్నదాతకు తోడుగా నిలబడ్డాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్


వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికి సంబంధించి చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: అన్నదాతల కష్టం తెలిసిన ప్రభుత్వంగా ఈ ఐదేళ్లలో ప్రతి అడుగూ రైతులు, రైతు కూలీలు బాగుండాలని మనసా వాచా కర్మణా వేస్తూ వచ్చామని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ప్రగాఢంగా విశ్వసిస్తూ విత్తనం నుంచి పంట విక్రయం వరకూ అన్ని విధాలుగా చేయి పట్టుకుని నడిపించామన్నారు. ప్రతీ పథకాన్ని పేద రైతు కుటుంబాలకు అందుబాటులోకి తెచ్చి సంక్షేమ ఫలాలన్నీ అందించామని, రాష్ట్రంలో ఐదేళ్లుగా మాత్రమే ఇలా జరుగుతోందని గుర్తు చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా చెప్పిన సమయానికి చెప్పినట్లుగా రైతన్నలకు భరోసా కల్పిస్తూ వ్యవసాయాన్ని పండగ చేసిన ప్రభుత్వం ఇదేనని, భవిష్యత్‌లోనూ ఇదే రీతిలో అండగా నిలిచి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా వరుసగా ఐదో ఏడాది మూడో విడత కింద ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున 53.58 లక్షల మందికి రూ.1,078.36 కోట్ల పెట్టుబడి సాయంతో పాటు 10.79 లక్షల మందికి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.215.98 కోట్లు కలిపి మొత్తం 64.37 లక్షల మంది ఖాతాలకు రూ.1,294.34 కోట్లను బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా జమ చేశారు. సీఎం జగన్ ఏమన్నారంటే..

హామీ కంటే మిన్నగా..

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో ప్రతి రైతు కుటుంబానికి రూ.50 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీ కంటే మిన్నగా రూ.12,500 బదులు ఏటా రూ.13,500 చొప్పున అందచేశాం. రూ.50 వేలకు బదులు ఐదేళ్లలో ప్రతి రైతు కుటుంబానికి రూ.67,500 చొప్పున లబ్ధి చేకూర్చాం. హామీకి మించి ప్రతి రైతు కుటుంబానికి రూ.17,500 చొప్పున అదనంగా అందచేశాం. తద్వారా ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున ఈ ఐదేళ్లలో మొత్తం రూ.67,500 రైతన్నల చేతుల్లో పెట్టినట్టైంది. ఇవాళ జమ చేస్తున్న పెట్టుబడి సాయంతో కలిపి ఐదేళ్లలో 53.58 లక్షల రైతు కుటుంబాలకు మొత్తం రూ.34,288 కోట్లు పంటలు వేసే సమయంలో పెట్టుబడి సాయంగా అందించాం.

క్రమం తప్పకుండా సున్నా వడ్డీ రాయితీ

ప్రతి రైతన్నకు పెట్టుబడి సాయంగా డబ్బులు ఇవ్వడమే కాకుండా సున్నా వడ్డీని కూడా వర్తింపజేస్తూ రూ.లక్ష వరకు పంట రుణాలను అందిస్తున్న కార్యక్రమం కూడా మన ప్రభుత్వ హయాంలోనే జరుగుతోంది. పంట రుణాలు క్రమం తప్పకుండా చెల్లిస్తే బ్యాంకులకు రైతులపై నమ్మకం పెరుగుతుంది. ఎక్కువ మంది రైతులకు రుణాలు ఇచ్చే పరిస్థితి నెలకొంటుంది. దీన్ని ప్రోత్సహిస్తూ రైతన్నలు వడ్డీ సొమ్మును బ్యాంకులకు కట్టిన వెంటనే మళ్లీ ఆ వడ్డీ రాయితీ డబ్బులను క్రమం తప్పకుండా అన్నదాతలకు తిరిగి ఇచ్చే కార్యక్రమం చేస్తున్నదీ ఈ ప్రభుత్వ హయాంలోనే. బ్యాంకులకు కట్టిన వడ్డీని తిరిగి వెనక్కి ఇవ్వడం వల్ల రైతులకు వడ్డీ లేకుండా రుణాలు అందుతాయి. ఆ డబ్బులు వారికి వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చుల కింద ఉపయోగపడతాయి. దీన్ని ప్రోత్సహిస్తూ ప్రతి రైతుకు సహాయం చేస్తూ వస్తున్నాం. గత ప్రభుత్వం 39.07 లక్షల మంది రైతులకు ఎగ్గొట్టిన బకాయిలతో కలిపి 84.67 లక్షల మంది అన్నదాతలకు సున్నా వడ్డీ రాయితీ కింద దాదాపు రూ.2,051 కోట్లు అందించాం.

నాణ్యమైన వ్యవసాయ విద్యుత్తు..

19 లక్షల మంది రైతులకు 9 గంటల పాటు పగటి పూటే నాణ్యమైన ఉచిత విద్యుత్తు ఇచ్చే కార్యక్రమం ఈ 57 నెలల్లోనే జరుగుతోంది. మనం అధికారంలోకి రాకముందు ఇలా పగటిపూటే రైతన్నలకు ఉచిత కరెంట్ ఇచ్చిన పరిస్థితి లేదు. ఎందుకంటే నాడు ఫీడర్లకు ఆ సామర్థ్యమే లేదు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.1,700 కోట్లు ఖర్చు చేసి వ్యవసాయ విద్యుత్తు ఫీడర్ల సామర్థ్యాన్ని పెంచాం. పగటి పూట 9 గంటల పాటు ఉచితంగా నాణ్యమైన విద్యుత్ అందిస్తూ ప్రతి రైతన్నకు రూ.45 వేల వరకు మేలు చేశాం. ఉచిత విద్యుత్ కోసం ఏడాదికి రూ.9 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం.

పెట్టుబడికి భరోసా.. చిన్న రైతుకు 80% ఖర్చులు కవర్

రాష్ట్రంలో అర హెక్టార్ (1.25 ఎకరాలు) లోపు భూమి కలిగిన రైతులు 50% మంది ఉండగా హెక్టార్ (2.50 ఎకరాలు) లోపు విస్తీర్ణం కలిగిన వారు 70% ఉన్నారు. సాగు పెట్టుబడి కోసం తీసుకునే రుణాలపై వడ్డీలు కట్టుకోలేని పరిస్థితి వారిది. ప్రైవేట్ వ్యాపారుల వద్ద అప్పు తీసుకుంటే నడ్డి విరిగే వడ్డీలు చెల్లించాల్సి వచ్చేది. మన ప్రభుత్వం రైతన్నలకు ఆ అవస్థలను తొలగించి రైతు భరోసాతో ఆదుకుంటోంది. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా అందించే సాయంతో అర హెక్టారు లోపు విస్తీర్ణం ఉన్న రైతులకు 80% పెట్టుబడి ఖర్చులు కవర్ అవుతుండగా హెక్టారు లోపు పొలం ఉన్నవారికి 70% ఖర్చులు పథకంతో కవర్ అవుతున్నాయి.

ఉచిత పంటల బీమా..

దేశంలో మరెక్కడా లేని విధంగా గ్రామ స్థాయిలో ఆర్బీకేల వ్యవస్థను తీసుకొచ్చాం. రైతులు పండించే ప్రతి ఎకరాను ఈ– క్రాప్ చేస్తూ నోటిఫై చేసిన ప్రతి పంట, సాగైన ప్రతి ఎకరా ఇన్సూరెన్స్ కవరేజీలోకి తెచ్చాం. రైతన్నల తరపున ప్రీమియం డబ్బులను పూర్తిగా రాష్ట్రమే కడుతున్న ప్రభుత్వం మనదే. ఈ 57 నెలల కాలంలోనే ఇది కూడా జరుగుతోంది. మునుపెన్నడూ ఇలా జరగలేదు. ఇంతకుముందు రైతన్నకు బీమా ప్రీమియం ఉందన్న సంగతి కూడా తెలిసేది కాదు. కొందరు రైతులకు మాత్రమే క్రాప్ లోన్ ఇచ్చిన సమయంలో బ్యాంకులు బీమా ప్రీమియం సొమ్ముని కట్ చేసుకుని వర్తింప చేసిన పరిస్థితి ఉండేది. రైతులు బ్యాంకులకు వెళ్లకుంటే రుణాలు రాని పరిస్థితి. తద్వారా వారికి ఇన్సూరెన్స్ గురించి తెలియక చెల్లించలేకపోయేవారు. అలా వారు నష్టపోతున్న పరిస్థితులకు పూర్తిగా చెక్ పెడుతూ ప్రతి రైతన్న పంట వేసిన వెంటనే ఆటోమేటిక్‌గా గ్రామ సచివాలయంలో ఈ– క్రాప్ ద్వారా పూర్తిగా ఇన్సూరెన్స్ కవరేజ్ కల్పిస్తూ వారి తరపున ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తున్న పరిస్థితి తొలిసారిగా మన ప్రభుత్వ హయాంలోనే మొదలైంది.

ఆక్వాకు తోడుగా.. పాడికి అండగా

గతంలో ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే కరెంట్ ఇచ్చి వారిని ఆదుకున్న పరిస్థితి లేదు. ఆక్వా రైతులకు రూపాయిన్నరకే కరెంట్ అందించి వారిని కూడా చేయిపట్టుకుని నడిపిస్తూ ఆదుకుంటున్న పరిస్థితులు ఈ ప్రభుత్వం వచ్చాకే ఏర్పడ్డాయి. ఆక్వా, పాడి రైతుల కోసం కొత్త చట్టాలు తీసుకొచ్చాం. చివరికి పాలసేకరణలో కూడా గతంలో లేని విధంగా లీటరుకు రూ.10 నుంచి రూ.22 వరకు ఈ 57 నెలల కాలంలోనే సేకరణ ధరలు పెరిగాయి. దీనికి కారణం మనం చేపట్టిన పాలవెల్లువ అనే కార్యక్రమమే. సహకార రంగంలో దేశంలోనే అతి పెద్దదైన అమూల్ లాంటి సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చాం. తద్వారా స్థానికంగా పోటీని సృష్టించాం. అమూల్ రేట్లు పెంచింది కాబట్టి మిగిలిన వారు కూడా పెంచక తప్పని పరిస్థితిని తీసుకొచ్చాం.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం..

దాదాపు 100 ఏళ్ల క్రితం బ్రిటీషర్ల కాలంలో మన భూముల సర్వే జరిగింది. రికార్డులు అప్‌డేట్ కాకపోవడం, సబ్ డివిజన్లు, సర్వేలు జరగకపోవడం వల్ల ప్రతి గ్రామంలోనూ భూ వివాదాలు తలెత్తాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ సమగ్ర భూసర్వే చేపట్టాం. రికార్డులన్నీ అప్‌డేట్ చేసి ఏకంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను గ్రామస్థాయిలో సచివాలయాల పరిధిలోకి తెచ్చిన గొప్ప మార్పు కూడా ఈ 57 నెలల్లోనే సాకారమైంది. దాదాపు 34.72 లక్షల ఎకరాలపై రైతులు, పేదలకు అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు కల్పిస్తూ ఏకంగా చట్టాల్లో మార్పులు తెచ్చాం. ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే గతానికి, ఈ 57 నెలల కాలానికి మధ్య తేడాను గమనించండి. ఇవాళ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రతి ఆర్బీకే మనతో కనెక్ట్ అయి ఉంది. గ్రామాల్లో ఉన్న ప్రతి రైతన్న ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు కాబట్టి వారందరికీ ఈ విషయాలన్నీ తెలియాల్సిన అవసరం ఉంది.

నష్టపోతే అదే సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ

ఈ ఐదేళ్లలో వచ్చిన మరో గొప్ప మార్పు ఏమిటంటే ఎక్కడైనా రైతన్నలకు వరదలు లాంటి ఏ కష్టం వచ్చినా ప్రభుత్వం దాన్ని తన కష్టంగానే భావించింది. ఏ సీజన్‌లో జరిగిన పంట నష్ట పరిహారాన్ని అదే సీజన్ ముగిసేలోగా అందించే కార్యక్రమం కూడా మొట్ట మొదటిసారిగా ఈ 57 నెలలుగా జరుగుతోంది. ఇదో విప్లవాత్మకమైన మార్పు. నష్టపోయిన రైతులు మళ్లీ సీజన్‌లో పంటలు వేసుకునే పరిస్థితుల్లోకి రావాలి. అలా జరగాలంటే ఇన్‌పుట్ సబ్సిడీ డబ్బులు ఆయా సీజన్ ముగిసేలోగా చేతికిస్తేనే పెట్టుబడి కోసం వారికి ఉపయోగపడుతుంది. ఇలా క్రమం తప్పకుండా పెట్టుబడి సాయాన్ని అందిస్తూ వారికి బాసటగా నిలిచిన ప్రభుత్వం మనది. ఇలాంటి ఆలోచనలు మనం ప్రభుత్వంలోనే జరిగాయి.


పంటలకు 'మద్దతు'..

గ్రామ సచివాలయాలకు అనుబంధంగా 10,778 ఆర్బీకేలను నెలకొల్పి పంటలను కొనుగోలు చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేయని పంటలకు సైతం మనం కనీస మద్దతు ధర ప్రకటించాం. మార్కెట్‌లో మద్దతు ధర తగ్గినప్పుడు వెంటనే అప్రమత్తమై ఆర్బీకేల ద్వారా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే కార్యక్రమం జరుగుతున్నది కూడా మన ప్రభుత్వంలోనే.

మాఫీ పేరుతో బాబు మోసాలు..

2014 ఎన్నికల్లో రూ.87,612 కోట్ల రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తానన్న చంద్రబాబు గద్దెనెక్కిన తర్వాత ఎలా మోసగించారో గుర్తు తెచ్చుకోవాలని కోరుతున్నా. బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు సీఎం కావాలని పబ్లిసిటీ చేసి ఆ తరువాత వంచనకు పాల్పడ్డారు. చివరికి ఆ రూ.87,612 కోట్లపై సున్నావడ్డీని కూడా ఎగ్గొట్టాడు. ఐదేళ్లలో దాదాపు రూ.30 వేల కోట్లు ఆ వడ్డీలకే అవుతుంది. ఆయన ఎగ్గొట్టిన సున్నా వడ్డీ బకాయిలను కూడా మనమే ఇచ్చాం. ఐదేళ్లలో ఒక్క వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ పథకం ద్వారానే రైతుల చేతుల్లో రూ.34,288 వేల కోట్లు పెట్టాం. ధాన్యం కొనుగోలు కోసం మరో రూ.65 కోట్లు వెచ్చించాం. ఇలా పథకాల ద్వారా రైతుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వ్యవసాయం కోసం ఐదేళ్లలో రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు చేసిన పరిస్థితి కళ్లెదుటే కనిపిస్తోంది.

ఎమ్మెస్పీ కంటే 30 శాతం అధికంగా



పాలకుడు మంచివాడైతే ప్రకృతి కరుణిస్తుంది. ముఖ్యమంత్రి జగన్ మనసు, పాలన బాగున్నాయి కాబట్టి రాష్ట్రం సుభిక్షంగా ఉంది. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మి ఆచరిస్తున్న సీఎం జగన్ దేశం గర్వించేలా పలు సంస్కరణలు తెచ్చారు. నెల్లూరు, ఒంగోలు జిల్లాల్లో లేట్ ఖరీఫ్, ఎర్లీ రబీ, కోతలు ప్రారంభమయ్యాయి. గతంలో పుట్టి (850 కేజీలు) రూ.18,000 ఉంటే చంద్రబాబు హయాంలో రూ. 12 వేల నుంచి రూ.13 వేలకు పడిపోయింది. కానీ ఇవాళ పుట్టి రూ.23,500 నుంచి రూ.24 వేలు పలుకుతోంది. ఇది ఎమ్మెస్పీ కంటే 30 శాతం అధికం.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖమంత్రి

పంట మాది.. బీమా మీది



నాకు 3.38 ఎకరాలున్నా గతంలో బీడుగా ఉండేది. గత నాలుగేళ్లుగా పంటలు పండిస్తున్నాం. ఐదేళ్లలో రైతు భరోసా కింద రూ.67,500 ఇచ్చారు. మేం పంట వేస్తే మీరు బీమా చెల్లిస్తున్నారు. సున్నా వడ్డీ రాయితీ కూడా ఇస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేసి ఆదుకున్నారు. వ్యవసాయ సలహా మండళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. గతంలో విత్తనాల కోసం మండల కేంద్రాల్లో పడి గాపులు కాశాం. ఇప్పుడు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఆర్బీకేల ద్వారా మా ఇంటికే పంపిస్తున్నారు. గతంలో పాలు కర్ణాటకలో విక్రయించగా ఇప్పుడు మా గ్రామంలోనే అమూల్ కేంద్రంలో మంచి గిట్టుబాటు ధరకు అమ్ముకోగలుగుతున్నాం. మీద్వారా మా కుటుంబం రూ.3,42,152 మేర లబ్ధి పొందింది. మీరు మళ్లీ సీఎం కావాలి.

–ఎన్. బాబు, రైతు, అనంతపురం జిల్లా

రైతుల కోరిక.. మళ్లీ మీరే



నాలుగెకరాల్లో పత్తి, మూడెకరాల్లో వరి, మొక్కజొన్న పండిస్తున్నా. గతంలో ధర్నాలు చేస్తే కానీ విత్తనాలు దొరికేవి కాదు. నేడు ఆర్బీకేల ద్వారా అన్నీ గ్రామంలోనే అందిస్తున్నారు. ఈ–క్రాప్ ద్వారా పంట రుణాలు, వడ్డీ రాయితీ అందిస్తున్నారు. గతంలో కరువుతో ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. పైసా భారం పడకుండా ఉచితంగా ఇన్సూరెన్స్ ఇస్తున్నారు. దేశంలో ఎక్కడా ఈ–క్రాప్ విధానాన్ని చూడలేదు. మన దగ్గర చక్కగా అమలవుతోంది. నేను మూడెకరాల్లో 78 బస్తాల ధాన్యాన్ని పండిస్తే రూ.1,56,000 నేరుగా నా ఖాతాలో జమ చేశారు. పిల్లలకు విద్యాదీవెన అందింది. నా భార్యకు అనారోగ్యం వస్తే వైజాగ్ అపోలో ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం రూ.1,48,000 చెల్లించింది. పైగా కోలుకోవడానికి ఆసరాతో రూ.4,750 జమ చేశారు. మీరు మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నాము.

–వై.శ్రీనివాసరావు, రైతు, గజపతినగరం, విజయనగరం జిల్లా



వ్యవసాయం సుసంపన్నం పుస్తకావిష్కరణ

ఐదేళ్లలో రాష్ట్ర వ్యవసాయ రంగం పురోగతిపై 'వ్యవసాయం సుసంపన్నం–రాష్ట్రానికి సౌభాగ్యం' పేరిట వ్యవసాయ శాఖ రూపొందించిన పుస్తకాన్ని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, వ్యవసాయ, ఉద్యాన శాఖల సలహాదారులు ఐ.తిరుపాల్‌రెడ్డి, పి.శివప్రసాద్‌రెడ్డి, సీఎస్ కె.ఎస్.జవహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ సీనియర్ నేత సూర్యారావు, ఆయన కుమారుడు శ్రీధర్


కండువా కప్పి స్టాలిన్‌బాబును పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ సీనియర్ నేత గొల్లపల్లి

పి.గన్నవరం టీడీపీ నేత నేలపూడి స్టాలిన్ బాబు కూడా..
- చంద్రబాబు, లోకేశ్‌వి దుర్మార్గమైన ఆలోచనలు
- మీడియాతో గొల్లపల్లి సూర్యారావు

సాక్షి, అమరావతి/విజయవాడ స్పోర్ట్స్: టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పి.గన్నవరం టీడీపీ నేత నేలపూడి స్టాలిన్ బాబు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు బుధవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి సీఎం వైఎస్ జగన్ పార్టీ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పి.వి.మిథున్‌రెడ్డి, ఎంపీ కేశినేని నాని తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌లనుద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ పెత్తందార్లకు అనుకూలంగా, దళిత వర్గాలకు, సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉందని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ టీడీపీ నేతలు, కార్యకర్తల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నిబద్ధతతో పనిచేసిన తనను తీవ్రంగా అవమానించారని, చంద్రబాబు మెడపట్టి పార్టీ నుంచి గెంటేశారని వాపోయారు. సీఎం వైఎస్ జగన్ దేవుడి రూపంలో తనను అక్కున చేర్చుకున్నారని తెలిపారు. టీడీపీ పుట్టిన నాటి నుంచి తాను కష్టపడి పనిచేశానని, పదవి ఉన్నా లేకపోయినా, గెలిచినా గెలవకపోయినా పార్టీ కోసం పనిచేశానని చెప్పారు. 2014లో అమలాపురం పార్లమెంట్ ఇస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు ఆ తర్వాత మొండి చేయి చూపించారన్నారు. అయినా క్రమశిక్షణ కలిగిన నేతగా తాను ఎంతో కష్టపడి జిల్లాలో పార్టీని కాపాడుకున్నానని అన్నారు. జనసేన, టీడీపీ పొత్తు పేరు చెప్పి తనకు సీటు లేకుండా చేశారని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ ఉంటే ఉండు పోతే పో అన్నట్లు చూశారని, జీవితంలో ఎప్పుడూ అనుభవించని అవమానం టీడీపీలో ఎదుర్కొన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్ తనకు ధైర్యాన్నిచ్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారని చెప్పారు. లోకేశ్ ముఠా రాష్ట్రాన్ని కబళించాలని చూస్తోందని తెలిపారు. చంద్రబాబు స్వార్థపూరిత ఆలోచనలకు పవన్ బలి అయ్యారని, పొత్తులో మోసం చేసి బాబు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. జనసేన మనుగడ కష్టమేనన్నారు. దేవుడిలాంటి మనిషైన వైఎస్సార్ నన్ను ఎంతో దగ్గరకు తీసి రాజకీయంగా ప్రోత్సహించి మంత్రి పదవి ఇచ్చి గౌరవించారని అన్నారు. ఆ మహానుభావుడి కుమారుడైన సీఎం జగన్ దగ్గరకి చేరటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీఎం జగన్ నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ కోసం శాయశక్తులా పనిచేస్తానని చెప్పారు. తుదిశ్వాస వరకు సీఎం వైఎస్ జగన్ వెంటే ఉంటానని, ఆయన ఏ బాధ్యత ఇచ్చినా నిర్వర్తిస్తానని తెలిపారు.

మిథున్‌రెడ్డి, కేశినేని నానితో చర్చలు

గొల్లపల్లి సూర్యారావు మంగళవారం రాత్రి విజయవాడలోని కేశినేని భవన్‌లో ఎంపీలు కేశినేని నాని, మిథున్‌రెడ్డితో సుదీర్ఘ చర్చలు జరిపారు. అనంతరం టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు సూర్యారావు ప్రకటించారు. చంద్రబాబు ఆలోచనశైలి పెత్తందార్లకు అనుకూలంగా ఉండటంతో ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితుడినయ్యానని తెలిపారు.

కుప్పం ప్రజల నవ్వులపై కుళ్లు రాతలు!

- కృష్ణా జలధారలు కనిపించట్లేదా!
- ఇప్పటికే రెండు చెరువులకు నీళ్లు
- ప్రారంభోత్సవ డెకరేషన్ సామగ్రి మాత్రమే తొలగింపు
- అయినా నిస్సిగ్గుగా కథనం


కృష్ణా జలాలతో నిండిన రామకుప్పం మండలం మద్దికుంట చెరువు

సాక్షి, తిరుపతి: ముప్పైఐదు ఏళ్లుగా తనను ఎన్నుకుంటున్న కుప్పం వాసుల కష్టాలను టీడీపీ అధినేత చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోకపోయినా కరువు సీమలో కనకధారలు కురిపించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. ప్రతిపక్ష నేత ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గానికి కేవలం 57 నెలల కాలంలోనే కృష్ణాజలాలను అందించి అక్కడి ప్రజల పెదవులపై చిరునవ్వులు చిందేలా చేశారు. దీనిని తట్టుకోలేని ఈనాడు రామోజీ కుళ్లు రాతలతో విషం చిమ్మారు. నవ్విపోదురుగాక.. నాకేటి సిగ్గు అన్నట్టు కుప్పం బ్రాంచ్ కాలువలో కృష్ణా జలాలు ప్రవహిస్తున్నా నీరు రాలేదంటూ కథనం ప్రచురించింది. నిస్సిగ్గుగా 'కుప్పం ఫక్కున నవ్వింది' అంటూ ఏడుపుగొట్టు రాతలు రాసి రాక్షసానందం పొందింది.

నాటి లీలలు గుర్తున్నాయా బాబూ అండ్ రామోజీ!

కుప్పానికి కృష్ణాజలాలు అందించే 207.800 కి.మీ కుప్పం బ్రాంచ్ కెనాల్ పుంగనూరు బ్రాంచ్ కెనాల్ మీదుగా 123.641 కి.మీ ప్రవహించి కుప్పం పట్టణం సమీపంలో పరమసముద్రం దగ్గర కలుస్తుంది. ఈ పని అంచనా విలువ రూ.468.53 కోట్లుగా నిర్ణయించారు. రూ.460.881కోట్లతో చేపట్టేలా హైదరాబాద్‌కు చెందిన ఆర్‌కే హెచ్‌ఈఎస్–కోయా సంస్థతో 2016 జనవరి 4న అప్పటి ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆ సంస్థ సీఎం అండ్ సీడీ పనులు చేపట్టకుండానే పనులు పూర్తయినట్టు చేతులు దులుపుకుంది. ప్రశ్నించాల్సిన అప్పటి ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థకు వంతపాడింది. నాడు ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌కు ఎయిర్ రిలీఫ్ వాల్వ్యూమ్‌లు, స్కోర్ ఛాంబర్లు నాసిరకంవి అమర్చారు. 2019 ఫిబ్రవరిలో కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. కానీ ఆ పైప్‌లైన్ పలు చోట్ల పూర్తిగా దెబ్బతినడంతో ప్రభుత్వం నీటి విడుదలను ఆపివేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కెనాల్ డిజైన్, ఎస్ఎల్ఆర్‌బీ, డీఎల్ఆర్‌బీ, పైప్ కల్వర్ట్ క్రాస్ వర్క్‌లు ప్రణాళికాబద్ధంగా చేయడకపోవడమే దీనికి ప్రధాన కారణమని తేలింది. దీంతోపాటు రోడ్డు క్రాసింగ్ వద్ద, డ్రెయినేజీ కాలువల వద్ద పైప్‌లైన్ పనుల్లో నాణ్యతాలోపం వల్ల నీరు కలుషితమైంది. ఇవేమీ గుర్తులేని బాబు, రామోజీ ఇప్పుడు ప్రజా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు.

జగన్ చెబితే చేస్తారంతే..

సీఎం జగన్ 2022 సెప్టెంబర్ 22న కుప్పంలో పర్యటించినప్పుడు బ్రాంచ్ కెనాల్ పనులపై స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీంతో పెండింగ్ పనులు పూర్తిచేసి త్వరలో కృష్ణాజలాలను తీసు కువస్తానని సీఎం మాట ఇచ్చారు. వెంటనే గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్ట్ కంపెనీకి పనులను రద్దు చేసి హైదరా బాద్‌కు చెందిన ప్రముఖ ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి పనులను అప్పగించింది. సాంకేతిక నిపుణుల కమిటీ సూచనల ప్రకారం గతంలో వేసిన నాసిరకం ఎయిర్ రిలీఫ్ వాల్వ్యూమ్‌ల స్థానంలో 500 ఎంఎం సామర్థ్యంగల ఎయిర్ వాల్వ్యూమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించింది. రోడ్డు క్రాసింగ్, డ్రెయి నేజ్, ప్రధాన కాలువలు వద్ద వేసే పైప్‌లైన్ పను లను నాణ్యంగా చేపట్టేలా పర్యవేక్షించి సకాలంలో పనులు పూర్తిచేసింది. శ్రీశైలం నుంచి 676 కి.మీ. పొడువున, 733 మీటర్ల ఎత్తులో 27 ప్రాంతాల్లో లిఫ్టింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

కృష్ణా జలాలతో నిండిన 2 చెరువులు

మూడు రోజుల క్రితం కుప్పంలో పర్యటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రామకుప్పం మండలం రాజుపేట వద్ద గేట్లు ఎత్తి కృష్ణా జలాలను విడుదల చేశారు. మరుసటి రోజు (మంగళవారం) శాంతిపురం మండలం వెంకటేష్‌పురం వద్ద ఉన్న శెట్టికుంట చెరువు నిండింది. అంతకు ముందే అధికారులు ట్రయల్ రన్‌లో భాగంగా నీటిని విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్ వచ్చాక అధికారికంగా నీటిని విడుదల చేశారు. అప్పటికే అధికారులు ట్రయల్ రన్ కోసం విడుదల చేసిన నీరు ఉండటంతో అదే రోజు సాయంత్రానికి రామకుప్పం మండలం దాటి శాంతిపురం మండలంలోకి కృష్ణా జలాలు ప్రవేశించాయి. గుండిశెట్టిపల్లి సమీపంలో ఉన్న వంతెన దాటి నీరు ముందుకు సాగింది. ఆ సమయంలో స్థానికులు పూజలు కూడా చేశారు. వెంకటేష్‌పురం వద్ద శెట్టివానిగుంట చెరువుకు ఉన్న పాయింట్ తెరిచి ఉండటంతో మంగళవారం మధ్యాహ్నానికి చెరువు కృష్ణా జలాలతో నిండిపోయింది. ఈ చెరువు నిండిపోయిందని, నీటిని మళ్లించాలని స్థానికులు అధికారులకు సమాచారమిచ్చారు. ఆ తరువాతే అధికారులు ఆ నీటిని రామకుప్పం మండలం మిట్టపల్లి వద్ద ఉన్న మద్దికుంట చెరువుకు మళ్లించారు. నీటిని మళ్లించటంతో ఆ కాలువపై నీటి ప్రవాహం ఉండదు. దీన్ని టీడీపీ, డ్రామోజీ, ఎల్లో మీడియా బూతద్దంలో చూపించటం ప్రారంభించాయి. కట్టుకథలు వల్లెవేశాయి. దీనిపై కుప్పం ప్రజలు మండిపడుతున్నారు. ఈనాడులో ప్రచురించిన కథనం పూర్తిగా సత్యదూరమని రాష్ట్ర జలవనరులశాఖ పేర్కొంది. సీఎం గేటు ప్రారంభించిన ప్రాంతంలో తాత్కాలికంగా అమర్చిన స్విచ్‌లు, డెకరేషన్‌లనే తొలగించామంది. కృష్ణానీటితో 2 చెరువులు నిండాయని వెల్లడించింది.

సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన పనులు ఇలా..

- పలమనేరు నియోజకవర్గం అప్పినపల్లి వద్ద 0 పాయింట్ నుంచి కుప్పం మండలం పరమసముద్రం వరకు సుమారు 124 కిమీ వరకు హంద్రీనీవా కాలువ తవ్వారు.
- 5.కి.మీ పశు పత్తురు వద్ద లిఫ్ట్ ఏర్పాటు.. 39వ కి.మీ. కృష్ణాపురం వద్ద లిఫ్ట్ ఏర్పాటు
- వి.కోట మండలం ఆదిరేపల్లి 54.కి.మీ. వద్ద లిఫ్టులు
- కుప్పం నియోజకవర్గంలో 110 చెరువులకు నీళ్ళు, 6500 ఎకరాల ఆయకట్టుకు నీళ్లిచ్చేలా పనులు
- 4 లక్షలు జనాభాకు తాగునీరు అందించేందుకు చర్యలు
- అనంతపురం జిల్లా చెర్లోపల్లి రిజర్వాయర్ 300 క్యూసెక్కుల నీరు హంద్రీనీవా కాలువలు ద్వారా తరలింపు

ఇదండీ సంగతి



చక్కెర కర్మాగారాలను పిప్పి చేసింది చంద్రబాబే

చంద్రబాబు హయాంలో పదింటికి తొమ్మిది సహకార చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయి

- వీటిలో లాభాల్లో ఉన్న ఫ్యాక్టరీలూ ఉన్నాయి
- ఆ ప్రభావంతో 15 ప్రైవేటు కర్మాగారాలూ మూతపడ్డాయి
- వేలాది చెరుకు రైతులు, వేలాది కార్మికులు ఉపాధి కోల్పోయారు
- మూతపడిన 4 ఫ్యాక్టరీలను తెరిపించిన వైఎస్సార్
- రైతులు, ఉద్యోగులకు రూ.వందల కోట్లు బకాయి పెట్టిన బాబు
- మూతపడ్డ కర్మాగారాలను తిరిగి వినియోగంలోకి తెస్తున్న సీఎం జగన్
- ఫ్యాక్టరీల పునరుద్ధరణకు ఉపసంఘం
- బాబు ప్రభుత్వం బకాయిపెట్టిన రూ.346.47 కోట్లు రైతులకు చెల్లింపు
- ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిల్లో రూ.72.86 కోట్లు చెల్లింపు
- సామర్థ్యానికి సరిపడా చెరుకు ఉత్పత్తి కాని పరిస్థితి
- ఫ్యాక్టరీలను ప్రాసెసింగ్ యూనిట్లుగా మార్చి రైతులకు మేలు చేస్తున్న ప్రభుత్వం
- వాస్తవాలు తెలుసుకోకుండా 'ఈనాడు' బురద రాతలు



సాక్షి, అమరావతి: ఎవరైనా ఓ మాట చెబితే దానికో హేతుబద్ధత ఉండాలి. కానీ, రామోజీ మాటలకు రోత పద్ధతే తప్ప హేతుబద్ధత ఉండదు. ఇందుకు చక్కెర కర్మాగారాలపై ఈనాడు ప్రచురించిన కథనమే ఇందుకు నిదర్శనం. అసలు రాష్ట్రంలో చక్కెర కర్మాగారాలను నమిలి, పీల్చి పిప్పి చేసిందే రామోజీ ప్రియ మిత్రుడు చంద్రబాబు. ఆయన ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో ఎన్నో ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఎందరో చెరుకు రైతులు కుదేలైపోయారు. వేలాది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి తర్వాత సహకార రంగంలో మూతపడిన చక్కెర కర్మాగారాల పునరుద్ధరణకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చీరాగానే వీటి పునరుద్ధరణకు ఉప సంఘం వేశారు. గత ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిలను రైతులు, ఉద్యోగులకు చెల్లించారు. మూతబడ్డ కర్మాగారాల్లో క్రషింగ్ ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. క్రషింగ్ సామర్థ్యానికి తగినట్టుగా చెరుకు ఉత్పత్తి లేకపోవడంతో స్థానికంగా సాగయ్యే పంట ఉత్పత్తులకు అదనపు విలువ కల్పించడం ద్వారా రైతులకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో ఆహార శుద్ధి పరిశ్రమలు నెలకొల్పాలని సంకల్పించారు. రైతులకు ఇంతలా మంచి జరిగితే తట్టుకోలేని విపక్షాలు కోర్టును ఆశ్రయించి అడ్డుకున్నాయి. ఈ వాస్తవాలను విస్మరించి ఈనాడు పత్రికలో ''తీపి మాటలు చెప్పి పీల్చి పిప్పి' అంటూ రామోజీ మరో రోత కథ అచ్చేశారు. ఈ కథనంలో వాస్తవాలేమిటో ఒక్కసారి పరిశీలిద్దాం..

ఆరోపణ: చక్కెర కర్మాగారాలకు సమాధి కట్టారు

వాస్తవం: సహకార రంగంలో ఉన్న డెయిరీలనే కాదు..చక్కెర కర్మాగారాలను కూడా నిర్వీర్యం చేసిన ఘనత చంద్రబాబుదే. బాబు హయాంలో మూతపడిన చిత్తూరు, రేణుగుంట, కోవూరు, ఎన్వీఆర్ జంపని సహకార చక్కెర కర్మాగారాలను దివంగత మహానేత వైఎస్సార్ అధికారంలోకి వచ్చీరాగానే పునరుద్ధరిస్తే వాటిని మళ్లీ చంద్రబాబు మూతపడేలా చేశారు. లాభాల బాటలో నడుస్తున్న చిత్తూరు, రేణిగుంట, కోవూరు, ఎన్వీఆర్ జంపని చక్కెర కర్మాగారాలను తన అనుయాయులకు కట్టబెట్టే లక్ష్యంతో వాటిని నిర్వీర్యం చేసి 2003–04లోనే మూత పడేలా చేశారు. ఫలితంగా పదింటికి తొమ్మిది మూత పడగా, ఆ ప్రభావంతో 15 ప్రైవేటు కర్మాగారాలు సైతం మూత పడ్డాయి. ప్రస్తుతం ఆంధ్ర, కేసీపీ షుగర్స్‌లో ఒక్కొక్క యూనిట్, శ్రీకాకుళంలోని ఈఐడీ ప్యారీ, చిత్తూరులోని ఎస్ఎన్‌జే షుగర్స్ మాత్రమే పనిచేస్తున్నాయి. అదీ కూడా 45 లక్షల టన్నుల క్రషింగ్ సామర్థ్యం కలిగిన ఈ కర్మాగారాలు కేవలం 19 లక్షల టన్నుల సామర్థ్యంతో పని చేసే స్థాయికి చేరాయి. ఇదంతా బాబు చేసిన పాపాల ఫలితమే.

ఆరోపణ: రైతులను ఆదుకోని వైఎస్సార్‌సీపీ సర్కారు?

వాస్తవం: బాబు ఎగ్గొట్టిన బకాయిలతో సహా ఈ ఐదేళ్లలో రైతులకు రూ.346.47 కోట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది. అలాగే ఉద్యోగులకు బకాయిపెట్టిన రూ. 72.86 కోట్లు చెల్లించింది. మరొక వైపు ఉప సంఘం సిఫార్సుల మేరకు బాబు హయాంలో నిర్వీర్యమైన అనకాపల్లి, తాండవ, ఏటికొప్పాక, విజయ రాయ కర్మాగారాల పునరుద్ధరణ చర్యలు చేపట్టినప్పటికీ, సామర్థ్యానికి తగినట్టుగా చెరుకు దొరకని పరిస్థితి నెలకొంది. సగటున రోజుకు 17,750 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో ఈ కర్మాగారాలకు కనీసం 4 నెలలకు 23.09 లక్షల టన్నుల చెరుకు అవసరం కాగా, రూ.2.80 లక్షల టన్నులకు మించి లభించడంలేదు. పైగా వీటిలోని యంత్ర పరికరాలన్నీ మూలపడి శిథిలావస్థకు చేరుకున్నాయి. ముడి సరుకు లేకుండా వందల కోట్లు ఖర్చుపెట్టి ఆధునికీకరించడం వలన ఫలితమేమిటో రామోజీకే తెలియాలి.

ఆరోపణ: చెరుకు రైతులకు ప్రోత్సాహం కరువు

వాస్తవం: వైఎస్ జగన్ ప్రభుత్వం చెరుకు సాగు చేసే ప్రతి రైతుకు అవసరమైన ఆర్థిక చేయూత అందిస్తోంది. ఓ వైపు రాయితీలు, ప్రోత్సాహకాలతో పాటు.. వైఎస్సార్ రైతు భరోసా కింద చెరుకు రైతులకు సైతం ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తోంది. పంట నష్ట పరిహారంతో పాటు సున్నా వడ్డీ రాయితీ, పైసా భారం పడకుండా పంటల బీమా అమలు చేస్తోంది. కూలీల కొరత, పెరిగిన పెట్టుబడి ఖర్చులకు తోడు గత ప్రభుత్వాల నిర్వాకం వల్ల మెజార్టీ రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లారు. ఫలితంగా ఒకప్పుడు లక్ష హెక్టార్లకు పైగా సాగైన చెరుకు.. ప్రస్తుతం (2023–24)లో 41 వేల హెక్టార్లకు పడిపోయి, 23.65 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది.

ఆరోపణ: రూ.2 వేల కోట్ల ఆస్తులు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం?

వాస్తవం: సామర్థ్యానికి సరిపడా చెరుకు లేక క్రషింగ్ నిలిచిన ఈ కర్మాగారాలను ఆహార శుద్ధి పరిశ్రమలుగా మార్చాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. స్థానికంగా లభించే పంట ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేయడం ద్వారా వాటికి అదనపు విలువ చేకూర్చి తద్వారా రైతులకు అదనపు లబ్ధి చేకూర్చాలన్నది వైఎస్ జగన్ ప్రభుత్వ సంకల్పం. పైగా ఈ పరిశ్రమలన్నీ ప్రభుత్వమే స్వయంగా నిర్మించి లీజు పద్ధతిన వాటి నిర్వహణను మాత్రమే ఆసక్తి గల సంస్థలకు అప్పగించాలని భావించింది. కర్మాగారాల ఆస్తులు, స్థలాలపై లీజుకు తీసుకునే సంస్థలకు ఎలాంటి హక్కులు ఉండవన్నది సుస్పష్టం. అయితే, మూతపడిన చక్కెర కర్మాగారాల వ్యవహారంపై కోర్టులో స్టే ఉన్నందున ప్రభుత్వ ప్రయత్నం కార్యరూపం దాల్చలేదు. అలాంటప్పుడు వేల కోట్ల విలువైన వీటిని ప్రైవేటు వ్యక్తులకు ఎలా ధారాదత్తం చేస్తారో రామోజీనే చెప్పాలి.



వధూవరులకు సీఎం జగన్ ఆశీస్సులు

వైఎస్సార్‌సీపీ నాయకుడు గుణ్ణం నర్సింహ నాగేంద్రరావు (నాగబాబు), రాజరాజేశ్వరి దంపతుల కుమారుడి వివాహ వేడుకకు సీఎం వైఎస్ జగన్ హాజరయ్యారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొని నూతన వధూవరులు సుభాష్, విజయదీప్తిలకు శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందజేశారు. - భీమవరం

ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలలకు ప్రభుత్వం వరం

- బోధనా మాధ్యమాన్ని మార్చుకునే వీలు
- 886 ఎయిడెడ్ స్కూళ్లకు అవకాశం

సాక్షి, విశాఖపట్నం: భవిష్యత్తు తరాలకు అందించే విలువైన ఆస్తిగా విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో వరాన్ని అందించారు. రాష్ట్రంలోని ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలలు బోధనా మాధ్యమాన్ని మార్చుకునే వీలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లు మాధ్యమాన్ని మార్చుకునే అవకాశాన్ని కల్పించాలని పలుమార్లు విద్యాశాఖ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. తల్లిదండ్రులు, విద్యార్థులకు మేలు జరిగేలా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో జీవో నం.16ని పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ప్రస్తుతం ఏ మీడియంలోనైనా విద్యాబోధన చేస్తున్న ఎయిడెడ్ పాఠశాలలు ఇంగ్లిష్ మీడియం బోధనలోకి మార్చుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలు 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఇంగ్లిష్ మీడియంలో బోధించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వుల్లో తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోతో రాష్ట్రంలోని 886 ప్రైవేటు ఎయిడెడ్ ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, అరబిక్, తమిళ, ఒరియా పాఠశాలలు బోధనా మాధ్యమాన్ని మార్చుకోవచ్చు. దీనివల్ల వాటిలో విద్యనభ్యసిస్తున్న 98 వేల మంది విద్యార్థులకు మేలు కలుగుతుంది. ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతో పాటు ద్విభాష పాఠ్యపుస్తకాలతో బోధించే అవకాశం కల్పించడం పట్ల ఎయిడెడ్ స్కూళ్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర్వులు జారీ చేసిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు.


బాబు పథకాలపై 11కు పైగా ప్రశ్నలు

- 2018 గ్రూప్–2 నిర్వహణ తీరు ఇదీ
- ఇప్పుడు మెంటల్ ఎబిలిటీలో ఒక్క పదం
- నానా యాగీ చేస్తున్న ఎల్లో మీడియా

సాక్షి, అమరావతి

1. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పోర్టల్ 'పేదరికంపై గెలుపు' ఈ క్రింది వానిలో సాధారణ వేదిక?
2. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 'ఎన్టీఆర్ విదేశీ విద్య ఆదరణ' పథకం ఈ క్రింది వారిలో ఏ వర్గపు విద్యార్థులకు ఉద్దేశించబడింది?
3. చేతివృత్తుల వారికోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిన పథకం పేరు?
4. 'పసుపు కుంకుమ' పథకం ఈ క్రింది వారిలో ఏ వర్గానికి ఒకసారి ఆర్థిక తోడ్పాటు అందించడానికి ఉద్దేశించబడింది?
5. చంద్రన్న పెళ్లి కానుక పథకం క్రింద కులాంతర వివాహం చేసుకున్న జంటలో ఒకరు షెడ్యూల్డ్ కులానికి చెందినవారైతే ఆ జంటకు ఇచ్చే ప్రోత్సాహక బహుమతి (రూ.లలో)...

ఏంటి ఈ ప్రశ్నలు అనుకుంటున్నారా? గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2018లో నిర్వహించిన గ్రూప్–2లో అడిగిన ప్రశ్నలు. ఈ ఐదు ప్రశ్నలే కాదు నాటి గ్రూప్–2 పరీక్షలో ప్రభుత్వ పథకాలపై మొత్తం 11 ప్రశ్నలు ఇచ్చారు. ముఖ్యంగా 137 నుంచి 142 వరకు వరుసగా ప్రభుత్వ పథకాలపై ప్రశ్నలు అడిగారు. చివరకు చంద్రబాబు తెచ్చిన అట్టర్ ఫ్లాప్ పథకం పసుపు–కుంకుమపైన కూడా ప్రశ్న ఇచ్చారు. అయితే ప్రభుత్వ పథకాలపై గ్రూప్స్ పరీక్షల్లో ప్రశ్నలు ఇవ్వడమేంటి అని నాడు ఎల్లో మీడియా ప్రశ్నిస్తే ఒట్టు. ఎందుకంటే నాడు అధికారంలో ఉంది.. ఎల్లో మీడియాకు కావాల్సిన చంద్రబాబు. దీంతో గ్రూప్–2లో 11 ప్రశ్నలు ఇచ్చినా ఎల్లో మీడియా ఇదేంటి అని నిలదీసింది లేదు. ఇక ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాజాగా నిర్వహించిన గ్రూప్–2లో ఒక పదం మాత్రమే ఇస్తే అది ఎల్లో మీడియాకు పెద్ద పాపంలా కనిపించింది. అందుకే గ్రూప్స్‌లో జగనన్న భజనేనా అంటూ విష కథనాన్ని అచ్చేసింది.



2018లో జరిగిన గ్రూప్–2 పేపర్‌లో టీడీపీ ప్రభుత్వ పథకాలపై ప్రశ్నలు

ఒక్క పదానికే ఎల్లో మీడియా రచ్చరచ్చ

తాజాగా ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్–2 ప్రిలిమ్స్‌లో 'మెంటల్ ఎబిలిటీ' విభాగంలో ఒక సమస్యను పరిష్కరించేందుకు ఓ పేరాను ఇచ్చారు. అందులో 'ఆడుదాం ఆంధ్ర' అనే పదం మాత్రమే పేర్కొన్నారు. సదరు పేరాను చదివి 123–125 వరకు ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. అంతకుమించి 'ఈ పథకం ఎప్పుడు పెట్టారు?, ఈ పథకం ఏ తేదీన ప్రారంభించారు?' అనే ప్రశ్నలు లేవు. అయినా సరే 'ఆడుదాం ఆంధ్ర' అనే ఒక్క పదమే ఎల్లో మీడియాకు తప్పుగా కనిపించింది. అలాగే 108వ ప్రశ్న.. 'ఈ క్రింది వాటిలో ఏది తప్పుగా జతచేయబడింది?'లో భాగంగా ఇచ్చిన 'చేదోడు' పదం కూడా ఎల్లో మీడియాకు తప్పుగా కనిపించింది. దీంతో తట్టుకోలేక గ్రూప్–2 పరీక్షలోనూ జగనన్న భజన చేస్తున్నారంటూ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. కాగా ఏపీపీఎస్సీ చరిత్రలోనే అత్యధిక మంది అభ్యర్థులు రాసిన పరీక్షగా గ్రూప్–2 ప్రిలిమ్స్ చరిత్ర సృష్టించింది. మంచి స్టాండర్డ్స్‌తో పరీక్ష నిర్వహించిందనే ప్రశంసలు ఏపీపీఎస్సీకి దక్కాయి. దీన్ని తట్టుకోలేక ఎల్లో మీడియా చివరకు గ్రూప్–2 పరీక్షపైన కూడా విషం చిమ్మడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

ఒంగోలు లోక్‌సభ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా చెవిరెడ్డి



కిలారి రోశయ్య

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో రెండు పార్లమెంటు స్థానాలకు, మూడు శాసన సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను నియమిస్తూ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పార్టీ సమన్వయకర్తల ఎనిమిదో జాబితాలో ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గానికి చెవిరెడ్డి భాస్కర రెడ్డిని, గుంటూరు లోక్‌సభ నియోజకవర్గానికి కిలారి రోశయ్యను నియమించారు. పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా అంబటి మురళి, కందుకూరుకు బుర్రా మధుసూదన్ యాదవ్, గంగాధర నెల్లూరుకు కళ్లత్తూర్ కృపాలక్ష్మిని నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేసింది.

సీనియర్ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ వీఆర్ఎస్



సాక్షి, అమరావతి: సీనియర్ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్ స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు. ఇందుకు అనుమతి ఇవ్వాలని ఆయన దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఆయన్ను సర్వీస్ నుంచి రిటైర్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలపనుంది. ఇంతియాజ్ సెర్ప్ సీఈఓ, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

క్లుప్తంగా...

పామర్రులో రేపు సీఎం జగన్ పర్యటన

సాక్షి,అమరావతి: సీఎం జగన్ మార్చి 1న శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రులో పర్యటించనున్నారు. జగనన్న విద్యా దీవెన పథకానికి సంబంధించిన నిధులను ఆయన బటన్ నొక్కి లబ్ధిదారులకు జమ చేయనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి పామర్రు చేరుకుని అక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం నిధులను విడుదల చేసి మధ్యాహ్నం తాడేపల్లికి చేరుకుంటారు.

ధాన్యం సేకరణలో ఏపీ భేష్

జాతీయ స్థాయి సదస్సులో కేంద్రం ప్రశంస

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం సేకరణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కేంద్రం ప్రశంసించింది. బుధవారం ఢిల్లీలో జాతీయ స్థాయి ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ కార్యదర్శుల సమావేశంలో ఏపీ కొనుగోలు విధానాన్ని కొనియాడింది. దేశంలోనే ఈ–క్రాప్ ప్రామాణికంగా, సీసీఆర్సీ కార్డుల ద్వారా కౌలు రైతుల నుంచి కూడా ధాన్యం సేకరణ చేపట్టిన ఏకైక రాష్ట్రంగా ఏపీని అభివర్ణించింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ హెచ్.అరుణ్‌కుమార్ 'సాక్షి'తో మాట్లాడుతూ..రబీ సీజన్‌లో ప్రాథమికంగా 25 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతులు వచ్చినట్లు చెప్పారు. చిరుధాన్యాల పంపిణీలో భాగంగా ఇప్పటికే 9,000 టన్నుల జొన్నలు కొనుగోలు చేయగా మరో 20,000 టన్నుల సేకరణకు కేంద్రం అనుమతించిందన్నారు. చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహకంగా కనీస మద్దతు ధరతో పాటు ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించినట్లు వెల్లడించారు.

టెట్, టీఆర్‌టీ పరీక్షలపై ముగిసిన వాదనలు

నిర్ణయం వాయిదా వేసిన న్యాయస్థానం

సాక్షి, అమరావతి: ఏపీ ఉపాధ్యాయ భర్తీ పరీక్ష (టీఆర్‌టీ), ఏపీ టీచర్ అర్హత పరీక్ష (టెట్)ల మధ్య తగిన సమయం ఉండేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంలో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న హైకోర్టు తన నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీఆర్‌టీ, టెట్ పరీక్షల మధ్య తగిన సమయం ఉండేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం.పెద్దిరాజు మరో నలుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత నోటిఫికేషన్లను రద్దు చేసి, రెండు పరీక్షల మధ్య తగిన సమయం ఇస్తూ తిరిగి నోటిఫికేషన్లు జారీ చేసేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరించారు. తుది విచారణ నిమిత్తం పిటిషన్‌ను ఈ నెల 28కి వాయిదా వేసిన సంగతి తెలిసిందే. బుధవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా పిటిషనర్ తరఫున శరత్‌చంద్ర, ప్రభుత్వం తరఫున వీకే నాయుడు వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తన నిర్ణయాన్ని వాయిదా వేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద బ్రీత్ ఎనలైజర్లపై ముగిసిన వాదనలు

నిర్ణయం వాయిదా వేసిన ధర్మాసనం

సాక్షి, అమరావతి: ఎన్నికల సందర్భంగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బ్రీత్ ఎనలైజర్లను ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ జనవాహిని పార్టీ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై బుధవారం వాదనలు ముగిశాయి. వాదనలు విన్న హైకోర్టు నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. జనవాహిని పార్టీ తరఫు న్యాయవాది డీఎస్ఎన్వీ ప్రసాద్ బాబు వాదనలు వినిపించారు. ప్రజాప్రాతినిధ్య చట్ట నిబంధనల ప్రకారం చిత్తభ్రమణం (అన్ సౌండ్ మైండ్) ఉన్న వారు ఓటు వేయడానికి వీల్లేదని, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అధికారం మద్యం సేవించి ఓటు వేసే వారికి ఇవ్వకూడదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

ఖైదీలకు వారానికి మూడు ఫోన్ కాల్స్

ఆరిలోవ (విశాఖ తూర్పు): కారాగారాల్లోని ఖైదీలకు ఇంటి వద్ద ఉన్న కుటుంబ సభ్యులతో ఫోన్‌లో వారానికి మూడుసార్లు మాట్లాడుకునేలా తాజాగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పటివరకూ వారంలో రెండుసార్లు మాత్రమే ఖైదీలు వారి కుటుంబ సభ్యులతో జైలు నుంచి ఫోన్‌లో మాట్లాడుకొనే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ సంఖ్యను ప్రభుత్వం మూడుసార్లకు పెంచింది. ఇందులో భాగంగా విశాఖ కేంద్ర కారాగారంలో వారం రోజులుగా ఈ అవకాశం ఖైదీలకు అందుబాటులోకి వచ్చింది. సాధారణంగా ఖైదీలకు వారంలో రెండుసార్లు ములాఖత్ ఉంటుంది. ములాఖత్‌లో జైల్ వద్దకు వెళ్లి ఖైదీలతో వారి బంధువులు మాట్లాడుకోవచ్చు. దీంతో పాటు మరో మూడుసార్లు ఇంటి వద్ద ఉన్న తమ కుటుంబ సభ్యులతో ఖైదీలు ఫోన్‌లో ఐదు నిమిషాలు చొప్పున మాట్లాడుకోవచ్చు. ఖైదీలు కాల్ చేసే నంబరు ముందుగానే జైలు అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందనీ, ఆ నంబరుకు మాత్రమే వారంలో మూడుసార్లు ఫోన్ చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

టీడీపీలో రాజీనామా ప్రకంపనలు

మాజీ మంత్రి గొల్లపల్లి రాజీనామాతో కోనసీమ టీడీపీలో కష్టాలు

- పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్న ఉండి శివరామరాజు
- అదే దారిలో పయనించనున్న మండలి బుద్ధప్రసాద్
- ప్రత్యామ్నాయం చూసుకుంటున్న బూరగడ్డ వేదవ్యాస్
- తుది నిర్ణయం తీసుకుంటానన్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని
- ఐవీఆర్ఎస్ సర్వేపై అనంతలో వెల్లువెత్తిన నిరసనలు
- ఫలించని చంద్రబాబు బుజ్జగింపులు

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, అనంతపురం/మడకశిర/ఉదయగిరి: టీడీపీ అధినేత చంద్రబాబుకు సొంత పార్టీలోనే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలపై సీనియర్లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇప్పటికే ముఖ్య నాయకులు ఆ పార్టీని వీడిపోగా మరికొందరు అదే బాటలో ఉన్నారు. అన్ని జిల్లాల్లోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. అనంతపురంలో తొమ్మిది నియోజకవర్గాల్లో ప్రకటించిన అభ్యర్థులపై వ్యతిరేకత వ్యక్తమవడంతో మిగిలిన స్థానాల్లో అభ్యర్థిత్వాలకోసం చేపడుతున్న ఐవీఆర్ఎస్ సర్వే పార్టీలో మంటలు రేపుతున్నాయి.

కోనసీమలో గొల్లపల్లి రాజీనామా ప్రభావం

టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆ పార్టీకి రాజీనామా చేసి బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. చంద్రబాబు తనను అవమానించారని, రాజోలు సీటు ఇవ్వకుండా మోసం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ప్రభావం రాబోయే ఎన్నికల్లో కోనసీమ ప్రాంతంలో కీలక ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు (కలవపూడి శివ) కూడా కొద్దిరోజులుగా అధినేతపై తీవ్రంగా మండిపడుతున్నారు. పార్టీ కోసం ఏళ్ల తరబడి పని చేసిన తనను ఇబ్బంది పెడుతున్నారని, తనకు కాకుండా సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజుకి సీటు ఇవ్వడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. తానేంటో ఈ ఎన్నికల్లో టీడీపీకి చూపిస్తానని, ప్రజాక్షేత్రంలో తన సత్తా చూపిస్తానని ఇప్పటికే ప్రకటించారు. త్వరలో ఆయన టీడీపీని వీడేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం.


పార్టీ వీడనున్న ముఖ్యనేతలు

కృష్ణా జిల్లా అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించాలని నిర్ణయించడంతో మాజీ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తొలి జాబితాలో తన పేరు కనిపించకపోవడం చాలా సంతోషంగా ఉందంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. పార్టీని వదిలేయాలని ఆయనపై కార్యకర్తలు ఒత్తిడి చేస్తున్నారు. ఆయన కూడా అందుకు సిద్ధమవుతున్నారు. ఇక పెడన సీటును కాగిత కృష్ణప్రసాద్‌కి కేటాయించడంతో టీడీపీ ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయన కూడా టీడీపీకి దూరమవుతారనే ప్రచారం జరుగుతోంది. విజయనగరం జిల్లా గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ తమకు సీట్లు దక్కకపోవడంతో తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు వారిని బుజ్జగించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికే విజయవాడ ఎంపీ కేశినేని నాని, తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరగా, నూజివీడు టీడీపీ ఇన్‌ఛార్జిగా పనిచేసిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కూడా అదే బాటలో ఉన్నారు.



'సర్వే' అస్త్రం... బాబు తత్వం...

ఏళ్ల తరబడి జెండాలు మోసేవారికి... కష్టకాలంలో అంటిపెట్టుకుని ఉన్నవారికి తెలుగుదేశం పార్టీలో ప్రాధాన్యం దక్కడం లేదన్నది ఆ పార్టీ నేతల ఆవేదన. అభ్యర్థిత్వాలను ఖరారు చేసేటపుడు నచ్చనివారిని తప్పించేందుకు సీనియర్లని కూడా చూడకుండా ఐవీఆర్ఎస్(ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం) పేరుతో గందరగోళానికి గురిచేస్తున్నారనీ... డబ్బు పెట్టగలిగే కాంట్రాక్టర్లను ఖరారు చేసే విషయంలో ఇదేమీ పట్టించుకోవడంలేదని వారంతా వాపోతున్నారు. మొన్నటి వరకూ వ్యూహకర్త రాబిన్‌శర్మ రిపోర్టులో మీ పరిస్థితి బాగో లేదని చెబుతూ వచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు ఐవీఆర్ఎస్ పేరుతో తమను తప్పించేందుకు కుయుక్తులు పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో తొమ్మిది చోట్ల ప్రకటించిన టీడీపీ అభ్యర్థుల విషయంలో వ్యతిరేకత రావడంతో మిగిలిన ఐదు స్థానాల్లో ఇప్పటికిప్పుడు సర్వే పేరుతో హడావుడి చేస్తున్నారు. గుంతకల్లులో గుమ్మనూరు జయరాం కావాలా, బి.కె.పార్థసారథి కావాలా అని అడిగారు. పుట్టపర్తిలో పల్లె రఘునాథ రెడ్డి కావాలా, వేణుగోపాల్ కావాలా అని అడిగారు. ఈ వాయిస్ రెస్పాన్స్ సిస్టం సర్వేలో వచ్చిన మెజారిటీని బట్టి అభ్యర్థులను నిర్ణయిస్తారని చెబుతున్నారు. దీనిపై ఆ పార్టీ నేతల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కల్యాణదుర్గంలో అమిలినేని సురేంద్ర బాబుకు ఇచ్చినపుడు ఏ సర్వే నిర్వహించారని వారు నిలదీస్తున్నారు. డబ్బున్న వారికే ప్రాధాన్యం ఇస్తామంటే ఇక పార్టీ ఎందుకు? ప్రజలు ఎందుకు? అంటూ కొంతమంది నేతలు తమ అనుచరుల ద్వారా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిస్తుండటం చూస్తే ఇక్కడ వ్యతిరేకత ఎంతలా ఉందో అర్థమవుతోంది.




మడకశిరలో విలేకరులతో మాట్లాడుతున్న గుండుమల వర్గీయులు

సునీల్ మాకొద్దు 'బాబో'య్

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు డాక్టర్ సునీల్‌కుమార్‌కు కేటాయించడాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి వర్గీయులు వ్యతిరేకిస్తున్నారు. బుధవారం మడకశిరలో ఆ వర్గానికి చెందిన ముఖ్య నాయకులంతా విలేకరుల సమావేశం నిర్వహించి సునీల్ కుమార్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించబోమని తేల్చి చెప్పారు. ఆయన్ను మార్చకుంటే పార్టీకి రాజీనామా చేస్తామన్నారు.

రాజీనామాపై నేడు బొల్లినేని నిర్ణయం

టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు రాజీనామా బాటలో పయనిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో పలుకుబడిన కలిగిన ఆయన చంద్రబాబు చిక్కుల్లో ఉన్నప్పుడు ఎంతగానో సహాయపడ్డారు. ఉదయగిరిలో 2012లో బొల్లినేని ఉదయగిరి టీడీపీలోకి వచ్చి 2012 ఉప ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసినా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిపై పోటీచేసి పరాజయం చెందారు. 2014 ఎన్నికల్లో గెలిచినప్పటికీ ఆర్థికంగా దెబ్బతిన్నారు. తాను టీడీపీలో చేరకముందు మహారాష్ట్రలో చేసిన పలు కాంట్రాక్టు పనులకు సంబంధించి అవినీతి కేసుల్లో ఇరుక్కున్నా.. అధినేత తనకు సహాయపడలేదని పలుమార్లు అనుచరుల వద్ద వాపోయారు. 2019 ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసినా అధినేత మాట కాదనలేక పోటీచేసి పరాజయం చెందారు. తీరా ఈసారి టికెట్టు ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్‌కు ఇవ్వడంతో ఆయన తీవ్ర మనస్తాపం చెందారు. బొల్లినేనికి చెక్‌పెట్టే ఆలోచనలో చంద్రబాబు, లోకేశ్ ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు ముందుగా పార్టీ వద్ద రూ.30 కోట్లు డిపాజిట్ చేయాలని షరతు పెట్టినట్లు సమాచారం. నగదు డిపాజిట్ చేయడంలో ఆలస్యం జరగడంతో కాకర్లకు టికెట్ ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అధినేత వైఖరికి తీవ్ర మనస్తాపం చెందిన బొల్లినేని కలిగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్య అనుచరులతో అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో అనుచరుల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది.



ప్రతి చర్యకూ తనదైన సంతోషాలు, మూల్యాలూ ఉంటాయి.
- సోక్రటీస్

సాక్షి
గురువారం, 29 ఫిబ్రవరి 2024

చిన్న బుద్ధుల పెద్ద ఎన్నిక

అసెంబ్లీలో పార్టీలకు స్పష్టమైన సంఖ్యాబలం ఉన్నచోట రాజ్యసభ ఎన్నికలనేవి అంతా సజావుగా సాగిపోయే మామూలు తంతు. కానీ, పార్టీ ఏదైనా సరే పాలకపక్షంతో అంటకాగడానికీ, జెండా కన్నా సొంత అజెండాకు పెద్ద పీట వేయడానికీ ప్రజాప్రతినిధులు దిగజారితే, పెద్దల సభకు ఎన్నికలు సైతం చిన్న బుద్ధులకు వేదిక అనిపించక మానవు. ఫిబ్రవరి 27న యూపీ (10 సీట్లు), కర్ణాటక (4 సీట్లు), హిమాచల్ ప్రదేశ్ (1)లలో ఎగువసభ ఎన్నికలు అలానే సాగాయి. హిమాచల్‌లో అధికార కాంగ్రెస్ సభ్యులు ఆరుగురు, యూపీలో ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు ఏడుగురు క్రాస్ ఓటింగ్‌కు దిగడంతో ఆ పార్టీలు చెరొక స్థానాన్ని బీజేపీకి కోల్పోయాయి. ఒక బీజేపీ ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు ఓటేసిన కర్ణాటకలో మాత్రం కాంగ్రెస్ నాలుగింట తనకు దక్కాల్సిన 3 స్థానాల్ని నిలబెట్టుకుంది.

మంగళవారం 15 రాజ్యసభ సీట్లకు ఎన్నికలు జరిగితే, బీజేపీ తన బలంతో గెలవగలిగిన వాటి కన్నా రెండు సీట్లు ఎక్కువగా 10 సొంతం చేసుకుంటే, కాంగ్రెస్, ఎస్పీలు తమ సంఖ్యాబలం కన్నా చెరొకటి తక్కువగా వరుసగా 3, 2 సీట్లే దక్కించుకోవడం గమనార్హం. ప్రజాప్రతినిధుల్ని రకరకాలుగా ప్రలోభపెట్టి, క్రాస్ ఓటింగ్‌కు దిగజార్చే దుష్టసంస్కృతి పూర్తి స్థాయిలో స్థిరపడినట్టు మరోసారి రుజువైంది. రాజ్యసభ ఎన్నికలకు విప్‌ల జారీ కుదరదు కానీ, తమ పార్టీ నియమించిన ఏజెంట్‌కు లెజిస్లేటర్లు తమ బ్యాలెట్ పేపర్లు చూపాలి. అయినా సరే, ఎమ్మెల్యేలు తాము న్న పార్టీ వైఖరికి భిన్నంగా ఓటేయడం వర్తమాన రాజకీయాలలో విలువల పతనానికి విషాద నిదర్శనం. చిత్రమేమంటే, హిమాచల్‌లో రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు మనుగడనే బీజేపీ ప్రశ్నార్థకం చేసింది.

ఉత్తరాదిన కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గత ఏడాదే గెలిచి, హస్తం పార్టీ అక్కడ అధికారంలోకి వచ్చింది. ఆ రాష్ట్రం నుంచి తమ అభ్యర్థి గెలుపునకు కావాల్సిన బలం కన్నా ఎక్కువ ఎమ్మెల్యేలే తమకున్నారని అధికార కాంగ్రెస్ పెద్దలు ఏమరుపాటుగా ఉంటే, అదను కోసం చూస్తున్న ప్రతిపక్ష బీజేపీ తమ 'ఆపరేషన్ కమల్'కు పదును పెట్టింది. ఫలితంగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు తిరుగుబాటు చేసి, రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటేశారు. ఫలితంగా, మెజారిటీతో ఇట్టే గెలవాల్సిన కాంగ్రెస్ అభ్యర్థి – ప్రముఖ లాయర్ అభిషేక్ మను సింఘ్వీకి కాస్తా ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థితో సమానంగా మాత్రమే ఓట్లొచ్చిన పరిస్థితి. లాటరీలోనూ అదృష్టం బీజేపీ పక్షాన నిలిచేసరికి, ఆ రాజ్యసభా స్థానం కాంగ్రెస్ చేజారింది.

హిమాచల్‌లో కొద్దినెలలుగా కుతకుతలాడుతున్న అసంతృప్తిని అలక్ష్యం చేసి, బీజేపీ 'ఆకర్షణ మంత్రాన్ని' తక్కువగా అంచనా వేసి, కాంగ్రెస్ చేజేతులా ఈ ఓటమి కొనితెచ్చుకుంది. చివరకు అసెంబ్లీలో బడ్జెట్ ఆమోదం పొందాల్సినవేళ సభలో మెజారిటీ కోల్పోయిన కాంగ్రెస్ సర్కార్ కూలిపోయే దుఃస్థితి తలెత్తింది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్ఠానం ఆలస్యంగానైనా బరిలోకి దిగి, పరిస్థితిని చక్కదిద్దే పనిలో పడింది. సీనియర్ నేతలు డీకే శివకుమార్, భూపిందర్ సింగ్ హూడా తదితరుల్ని హిమాచల్ పంపింది. సుఖూ ప్రభుత్వంలో తమకు తగిన ప్రాధాన్యం లభించడం లేదన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు. ఈ విషయంపై వారు పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధిష్ఠానం తాజా బుజ్జగింపులతో అంతా సద్దుమణుగుతుందా అన్నది చూడాలి.

'నేను పోరాట యోధుణ్ణి, రాజీనామా ప్రసక్తే లేదు' అని సీఎం సుఖూ బింకంగా చెబుతున్నా, సభలో మెజారిటీ ఆయనకుందా, సొంత ఎమ్మెల్యేల్లోనే తీవ్ర అసంతృప్తి ఉన్నందున ఆయన అధికారంలో కొనసాగగలరా అన్నది అనుమానమే. మొత్తం 68 మంది సభ్యుల హిమాచల్ అసెంబ్లీలో కాంగ్రెస్ బలగం 40 మంది. ఆరుగురి క్రాస్ ఓటింగ్‌తో దాని బలం 34కు పడిపోయింది. ఇక, బీజేపీకి 25 మంది ఉంటే, ఇండిపెండెంట్లు ముగ్గురున్నారు. బీజేపీ పాలిత హర్యానాలో పంచకులాలో మకాం వేసిన కాంగ్రెస్ రెబెల్స్‌తో కలుపుకొంటే కాషాయ బలమూ 34కు చేరింది. సభలో మెజారిటీ మార్కు 35. ఇంకా పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమను సంప్రతిస్తున్నారని బీజేపీ అంటున్నందున ఏమైనా జరగవచ్చు. ఈ నేపథ్యంలో నాటకీయత పెంచుతూ బుధవారం 15 మంది బీజేపీ ఎమ్మెల్యేల్ని అసెంబ్లీ నుంచి స్పీకర్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌తో ఇప్పటికి గండం గట్టెక్కాలన్నది తాపత్రయం. అదే జరిగినా, సుఖూను వ్యతిరేకిస్తూ, సీఎం పీఠానికై విక్రమాదిత్య సింగ్ సహా ముగ్గురు కాంగ్రెస్ నేతలు పోటీ పడుతుండడం గమనార్హం. మాజీ సీఎం వీరభద్ర సింగ్ కుమారుడైన విక్రమాదిత్య మంత్రి పదవికి రాజీనామా ఇస్తున్నట్టు ప్రకటించడం కథలో కీలక మలుపు.

ఎన్నికల్లో మెజారిటీ ఏ పార్టీకి దక్కినా, ప్రభుత్వం ఎవరు ఏర్పాటు చేసినా, ఆఖరుకు అక్కడ బీజేపీయే అధికార చక్రం తిప్పడం కొన్నేళ్ళుగా పెరుగుతున్న ధోరణి. సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించి ప్రతి రాష్ట్రంలోనూ ప్రత్యర్థి పార్టీ నేతల్ని తమ వైపు తిప్పుకోవడంలో బీజేపీది ఇప్పుడు తిరుగులేని రికార్డు. 2019లో కర్ణాటకలో జేడీ–ఎస్ నేత కుమారస్వామి ప్రభుత్వం, 2020లో మధ్యప్రదేశ్‌లో కమలనాథ్ సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్, 2022లో మహారాష్ట్రలోని శివసేన ఉద్ధవ్ ఠాక్రే గవర్నమెంట్... ఇలా గత నాలుగేళ్ళలో కాషాయపార్టీ పాలబడినవి ఎన్నో. తాజాగా హిమాచల్‌లోని సుఖూ సారథ్య కాంగ్రెస్ సర్కార్ ఆ జాబితాలో చేరేలా కనిపిస్తోంది. సుఖూ పట్ల పార్టీలో వ్యతిరేకతను సర్దుబాటు చేసుకోవాల్సింది కాంగ్రెస్. కానీ, ఒక పార్టీ అంతర్గత విభేదాల కుంపటిలో మరొక పార్టీ చలి కాచుకొని, అధికారం చేజిక్కించుకోవాలని ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమే. సంతలో ప్రజాప్రతినిధులను కొని, ప్రజాతీర్పు తమ వైపు ఉందని ఏ పార్టీ భావించినా అది అవివేకం. ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉంటారు. సమయం చూసి సమాధానం చెబుతారు.

రైతులకు ఉపగ్రహ ఊతం

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

ఉత్తర భారతదేశ రైతులు ఒకవైపు దేశ రాజధానిలో కనీస మద్దతు ధరతో పాటు ఇతర హక్కుల సాధన కోసం పోరు కొనసాగిస్తున్నారు. ఇంకోవైపు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్ర శాస్త్రవేత్తలు వాతావరణాన్ని మరింత మెరుగ్గా అంచనా వేసేందుకు ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించారు. ఈ ఉపగ్రహం వాన రాకడ, పోకడలతోపాటు వాతావరణానికి సంబంధించి మరింత కచ్చితమైన అంచనాలను రూపొందించేందుకు ఉద్దేశించినది. రైతులతోపాటు, మత్స్యకారులకూ ఉపయోగపడుతుంది. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఈ రెండు వర్గాలు పలు సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ వర్గాలకు సకాలంలో అందే హెచ్చరికలు, దీర్ఘకాలిక అంచనాలు ఎంతో ఉపయోగపడతాయి.

వాతావరణ మార్పుల ప్రభావం వల్ల 2050 నాటికి గోధుమ, వరి దిగుబడుల్లో గణనీయమైన తగ్గుదల ఉంటుందని శాస్త్రవేత్తలు ఇప్పటికే హెచ్చరించారు. ఇన్‌శాట్–3డీఎస్ ప్రయోగం దేశంలోనే అతి పురాతనమైన ఉపగ్రహ ప్రయోగ కార్యక్రమం తాలూకూ పరిణతికి నిదర్శనం. ఇండియన్ నేషనల్ శాటిలైట్ (ఇన్‌శాట్) కార్యక్రమానికి యాభై ఏళ్ల క్రితమే బీజం పడింది. 1975లో ఇన్‌శాట్ శ్రేణి ఉపగ్రహాల ప్రయోగాలకు అనుమతులు లభించాయి. 1982లో తొలి ఉపగ్రహం (ఇన్‌శాట్–1ఏ) ప్రయోగం జరిగింది. మొదట్లో ఈ ఉపగ్రహాల్లో అత్యధికం ఫోర్డ్ ఏరోస్పేస్ అండ్ కమ్యూనికేషన్స్ కార్పొరేషన్ నుంచి కొనుగోలు చేసి, ఫ్లోరిడా(యూఎస్)లోని కేప్ కానవెరల్ నుంచి ప్రయోగించేవారు. ఇన్‌శాట్–1 శ్రేణి ఉపగ్రహాల కారణంగా భారతీయ వాతావరణ విభాగం ఉపగ్రహ ఆధారిత వాతావరణ అంచనాల రంగంలోకి అడుగుపెట్టింది. తుపానులు, ఈదురుగాలులతోపాటు అల్పపీడనాలను కూడా ఉపగ్రహాల సాయంతో పరిశీలించడం మొదలైంది.

1992లో ప్రయోగించిన ఇన్‌శాట్–2 శ్రేణి ఉపగ్రహాలు మునుపటి వాటి కంటే సాంకేతికంగా ఎంతో పురోగతి సాధించినవి కావడం గమనార్హం. దేశీయంగా తయారు చేసిన చాలా హై రెజొల్యూషన్ రేడియో మీటర్లను ఇందులో ఉపయోగించారు. ఫలితంగా రోజువారీ వాతావరణ అంచనాలు, ముందస్తు అంచనాలు, మేఘాల ఛాయాచిత్రాల సేకరణ సులువు అయ్యింది.

సమాచార వినిమయానికి కూడా...

ఇన్‌శాట్–1, ఇన్‌శాట్– 2 శ్రేణి ఉపగ్రహాలు అటు వాతావరణ అంచనాలతోపాటు ఇటు సమాచార వినిమయం, బ్రాడ్‌కాస్టింగ్ రంగాలకూ ఎంతో ఉపయోగపడ్డాయి. ఇన్‌శాట్–2 శ్రేణిలోని కొన్ని ఉపగ్రహాల్లో వాతావరణ సంబంధిత పేలోడ్‌లు అసలు లేకపోవడం గమనార్హం. కొన్ని రకాల సమాచారాన్ని సేకరించేందుకు (తుపానుల మధ్య భాగం వంటివి) భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అమెరికా రక్షణ శాఖ ఉపగ్రహాలపై ఆధారపడింది. ఈ సమస్యను అధిగమించే లక్ష్యంతో ఐఎండీ 2002లో మెట్‌శాట్‌ను ప్రయోగించింది. తరువాతి కాలంలో దీని పేరును కల్పన–1గా మార్చారు. కర్నాల్ (హరియాణా)లో పుట్టి, 'నాసా' వ్యోమగామిగా ఎదిగి 2002లో స్పేస్‌షటిల్ ప్రమాదంలో మరణించిన కల్పనా చావ్లా స్మరణార్థమన్న మాట!

ఈ సమయంలోనే వాతావరణ పరిశోధనలకు ప్రత్యేకంగా ఒక ఉపగ్రహం ఉంటే బాగుంటుందన్న అభిప్రాయాన్ని ఐఎండీ వ్యక్తం చేసింది. ఫలితంగానే 2013లో ఇన్‌శాట్–3డీ శ్రేణి మూడోతరం వాతావరణ ఉపగ్రహ ప్రయోగం జరిగింది. 2016లో ఇదే శ్రేణిలో ఇంకో ఉపగ్రహాన్ని కూడా విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి –17న ప్రయోగించిన ఉపగ్రహం ఇన్‌శాట్–3డీ శ్రేణిలో తాజాది. కేంద్ర భూశాస్త్ర మంత్రిత్వ శాఖ ఈ ఉపగ్రహానికి



నిధులు సమకూర్చింది. ఐఎండీతోపాటు నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ (నోయిడా), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (పూణే) వంటి సంస్థలు ఈ ఉపగ్రహం అందించే సమాచారాన్ని ఉపయోగించుకుంటాయి.

వాతావరణం, సముద్ర సంబంధిత సమగ్ర సమాచారాన్ని ఇన్‌శాట్–3డీఎస్ ద్వారా అందుకోవచ్చు. దీంట్లోని పరికరాలు ఆరు రకాల పౌనఃపున్యాలలో ఛాయాచిత్రాలు తీయగలవు. నేల నుంచి మొదలుపెట్టి అంతరిక్షం వరకూ వేర్వేరు ప్రాంతాలకు సంబంధించిన ఉష్ణోగ్రతలు, తేమశాతం వంటి వివరాలూ సేకరించగలవు. సముద్ర, భూ ఉపరితల ఉష్ణోగ్రతలు, మేఘాల లక్షణాలు, పొగమంచు, వాన, మంచు ఆవరించిన ప్రాంతం, పడిన మంచు మందం, కార్చిచ్చులు, వాతావరణంలోని కాలుష్యకారక కణాలు, టోటల్ ఓజోన్ వంటి వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు సేకరించేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడుతుంది.

ఈ దశలో ఒక వైపు ఉపగ్రహ నిర్మాణంలో దేశీ టెక్నాలజీల వాడకం పెంచుకుంటూనే ఇంకోవైపున ఉపగ్రహ సమాచారాన్ని అందుకునేందుకు, విశ్లేషించేందుకు అవసరమైన భూతల సామర్థ్యాన్ని కూడా భారత్ పెంచుకుంది. వాతావరణ ఉపగ్రహాల నుంచి సమాచారం అందుకునేందుకు ఐఎండీ కొత్త కొత్త ఎర్త్ స్టేషన్స్ నిర్మాణాన్ని చేపట్టింది. సమాచారాన్ని అప్పటికప్పుడు విశ్లేషించేందుకు కంప్యూటింగ్ సామర్థ్యాన్ని కూడా పెంచుకుంది. వాతావరణ మోడలింగ్ కోసం సూపర్ కంప్యూటర్‌ను ఇచ్చేందుకు అమెరికా నిరాకరించిన 1980లలో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ–డాక్)ను ఏర్పాటు చేసి, దేశీయంగానే హై స్పీడ్ కంప్యూటింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేసే పనిలో పడింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ భారత్ వాతావరణ సంబంధిత సూపర్ కంప్యూటింగ్ వ్యవస్థల నిర్మాణంలో అగ్రగామి దేశంగా నిలిచింది. తాజాగా అంటే గత ఏడాది మరింత అత్యాధునిక వాతావరణ పరిశోధనల కోసం కేంద్ర భూపరిశోధన మంత్రిత్వ శాఖ రెండు సూపర్ కంప్యూటర్ల నిర్మాణానికి సిద్ధమైంది. ఫ్రెంచ్ కంపెనీ సాయంతో పది కోట్ల డాలర్ల ఖర్చుతో వీటిని నిర్మించనున్నారు. నోయిడా, పూణెల్లోని కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

టెక్నాలజీతోపాటు మారుతూ...

వాతావరణ అంచనాల ఫలితాలను సామాన్యులకు చేర్చేందుకు ఐఎండీ టెక్నాలజీతోపాటుగా మారుతూ వచ్చింది. అడ్వయిజరీస్, ఎర్లీ వార్నింగ్, షార్ట్ – మీడియం రేంజ్ స్థానిక అంచనాల వంటివి అందించే వ్యవస్థలను కూడా కాలక్రమంలో ఏర్పాటు చేసుకుంది. ఒకప్పుడు వాతావరణ సమాచారాన్ని టెక్స్ట్ ఎస్ఎంఎస్ రూపంలో పంపితే, మొబైల్ ఫోన్ల కాలంలో వేర్వేరు భాషల్లో సమాచారాన్ని అందించే వీలేర్పడింది. అయితే వీటి ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం రైతులకు ఎంతవరకూ ఆచరణ సాధ్యమన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. వాట్సప్, సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌ల వంటి అనేకానేక సమాచార మాధ్యమాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఈ ప్రశ్నకు మరింత ప్రాధాన్యమూ ఏర్పడుతోంది. నకిలీ, తప్పుడు వార్తలు విచ్చలవిడిగా ప్రవహిస్తున్న ఈ కాలంలో విశ్వసనీయమైన సమాచారం అందించేందుకు భారత వాతావరణ విభాగం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరముంది.

ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలన్న భారత ప్రయత్నాల్లో ఇన్‌శాట్–3డీఎస్ ఒక కీలకమైన మైలురాయి అని చెప్పాలి. విదేశాల నుంచి ఉపగ్రహాల కొనుగోళ్లు, ప్రయోగాలు నిర్వహించే స్థితి నుంచి మనం సొంతంగా వాతావరణ ఉపగ్రహాల తయారీ, ప్రయోగాలను చేపట్టే స్థితికి చేరాము. అది కూడా భారతీయ రాకెట్ల సాయంతో మనకు కావాల్సిన కక్ష్యలో ప్రవేశపెట్టగలుగుతున్నాము. సాంకేతిక పరిజ్ఞాన లభ్యతలో ఉన్న అంతరాలను జాగ్రత్తగా గుర్తించడం, విదేశీ టెక్నాలజీలను ఔపోసన పట్టడం, వ్యవస్థలు–ఉప వ్యవస్థల నిర్మాణానికి తగిన కార్యక్రమాలను అమల్లోకి తేవడం, ఇండియన్ స్పేస్ ఆర్గనైజేషన్, ఐఎండీ, ఇతర శాస్త్రీయ సంస్థలతో సన్నిహితంగా పనిచేయడం వంటి అనేకానేక చర్యల వల్ల ఈ అభివృద్ధి సాధ్యమైంది. ఇటీవలి కాలంలో దేశీ టెక్నాలజీ పరిశ్రమల ముఖచిత్రంలో గణనీయమైన మార్పులు వస్తున్నాయి. మైక్రో ఉపగ్రహ సమూహాల ప్రయోగంలో ప్రైవేట్ సంస్థలు బిజీగా ఉంటున్నాయి. వేగంగా ముంచుకొస్తున్న వాతావరణ మార్పులను దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వం కూడా సాంకేతిక పరిజ్ఞాన రంగంలో స్వావలంబనకు, మరీ ముఖ్యంగా అత్యాధునిక టెక్నాలజీల విషయంలో మరిన్ని ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వాళ్లదే రాజ్యం



రాజ్యసభ ఎన్నికల్లో ఎప్పుడు క్రాస్ ఓటింగ్ జరిగినా దానికి కారణాలు – డబ్బు, కండబలం. ఎందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సీఆర్‌పీఎఫ్, హరియాణా పోలీసులు కిడ్నాప్ చేస్తున్నారు? ఇది అప్రజాస్వామికం. దీనంతటికీ కారణం బీజేపీయే.

– షమా మహమ్మద్, కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి

అంతటా అదే!



మొత్తం 2024 లోక్ సభ సీట్లన్నీ – కాంగ్రెస్ మిత్ర పక్షాలవి, కాంగ్రెస్ పాత మిత్రులవి, కాంగ్రెస్ భవిష్యత్ మిత్రులవి, కాంగ్రెస్ మాజీ సభ్యులవి, కాంగ్రెస్‌తో విభేదించి పుట్టిన ప్రాంతీయ పార్టీలవి అయివుంటాయి. నిజంగా కాంగ్రెస్ ముక్త్ భారతే (కాంగ్రెస్ లేని భారతమే)!

– కుణాల్ కామ్రా, స్టాండప్ కమెడియన్

సొంతంగా ఆలోచించాలి!



స్కూళ్లు, కాలేజీల్లో ప్రాక్టికల్ సైన్సు ల్యాబులు ఉత్త ఫార్సు! విద్యార్థులు గుడ్డిగా తమ పాఠ్యపుస్తకాల్లో ఉన్న స్టెప్స్ ఫాలో అవుతారు. వాళ్లకు వాళ్లు ఎంతమాత్రమూ ఆలోచించరు – ప్రతిది ముందే నిర్ణయమైనట్టుగా బోరుగా జరిగిపోతుంది.

– అనిరుద్ధ మాల్‌పానీ, విద్యావేత్త

అదరగొట్టండి!



పరీక్షలు ఎవరికైతే జరుగుతున్నాయో అందరికీ... ఆల్ ద బెస్ట్! బాగా రాయండి. మొత్తం పాజిటివ్ ఎనర్జీ అంతా పంపుతున్నాను. బిగ్ హగ్స్.

– రష్మికా మందన్నా, నటి

ఏమైనా అనొచ్చు...



భారతదేశ ప్రధాన మంత్రి ఎంతటి నియంత అంటే – ఆయన్ని ఎవరైనా సరే ఫాసిస్ట్ డిక్టేటర్ అని అనవచ్చు; దానికి పరిణామాలు ఏమీ లేకుండానే!

– సోనమ్ మహాజన్, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

పరీక్షలకు ఎలా సిద్ధం కావాలంటే...

విద్యార్థులు ఏటా పరీక్షలు ఎదుర్కోవడం సహజం. ఈ క్రమంలో కొందరు ఒత్తిడికి గురవుతుంటారు. మంచి మార్కులు సాధించగలనా? ఎలాంటి ప్రశ్నలు వస్తాయో? సరైన సమాధానాలు రాయగలనా? ఆశించిన మార్కులు రాకపోయినట్లయితే పరిస్థితి ఏమిటి?... లాంటి ప్రశ్నలు మెదళ్లలో కదలాడుతుంటాయి. ప్రణాళిక ప్రకారం చదవడంతో పాటుగా చిన్నచిన్న చిట్కాలు పరీక్ష ఫలితాలను శాసించవచ్చు.

ఎంత బాగా చదివినా, ఎంత గుర్తున్నా, వ్రాసే విధానం తెలియకపోతే మంచి మార్కులు సాధించడం కష్టం. చేతి రాత బాగుండాలి. నిర్వచనం ఉంటే యధాతథంగా రాసే ప్రయత్నం చేయాలి. చిన్న ప్రశ్నలకు రాసే సమాధానాలలో ముఖ్యమైన విషయాలు వదలకుండా రాయాలి. జవాబులో నిర్వచనం ఉంటే ముందుగా రాయాలి. ముఖ్యమైన సైడ్ హెడ్డింగ్స్‌కు అండర్ లైన్ చేయాలి. అవసరమైన చోట చిత్రపటాలను గీచి, భాగాలు గుర్తించాలి. పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉండాలి.

ఇక పరీక్షలకు ఎలా చదవాలి అన్నదీ ముఖ్యమే. సబ్జెక్టులన్నింటికీ సమయం కేటాయించి ప్రణాళికతో చదవాలి. ఉదయం 4 గంటల నుండి 6 గంటల మధ్య చదివితే మంచి ఫలితం ఉంటుంది. కష్టమైన, ఇష్టం లేని సబ్జెక్ట్‌లకు ఎక్కువ సమయం కేటాయించాలి. ప్రతిరోజూ అవసరమైనంత నిద్ర పోవాలి. ఆహారం విషయంలో శ్రద్ధ వహించాలి. చల్లని పదార్థాలు తినడం, త్రాగడం మంచిది కాదు.

పరీక్షలకు రెండు రోజుల ముందు మొదటి పరీక్ష కోసమే చదవాలి. గతంలో చదివినంతవరకు మాత్రమే రివిజన్ చేయాలి, కొత్తవి నేర్చుకోవాలని ప్రయత్నించకూడదు. పరీక్ష రోజున పరీక్ష సమయానికి కనీసం గంట ముందు చదవడం ఆపాలి. పరీక్ష రాయడానికి కావలిసినవి సిద్ధం చేసుకోవాలి. పరీక్షా కేంద్రానికి అర గంట ముందుగా చేరాలి.

పరీక్ష హాలులో 2 నుండి 5 నిముషాలు కళ్ళు మూసుకొని ప్రశాంతంగా కూర్చోవాలి. ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు శ్రద్ధగా విని పాటించాలి. పరీక్షకు సంబంధించిన సబ్జెక్ట్ మెటీరియల్, ఇతరములు చిన్నముక్క కూడా దగ్గర ఉంచుకోకూడదు. ప్రశ్నపత్రంపై గానీ, బెంచ్‌పై గానీ, ప్యాడ్‌లపై గానీ ఏమీ రాయకూడదు. తనిఖీ బృందాలు డిబార్ చేస్తాయి. ప్రశ్నపత్రం శ్రద్ధగా చదవాలి. తేలికగా ఉన్న ప్రశ్నకు సమాధానం మొదటగా రాయాలి. మొదటి పేజీ అందంగా రాసే ప్రయత్నం చేయాలి. ప్రశ్నల నంబర్లు జవాబు పత్రాల్లో కరెక్టుగా రాసిందీ లేనిదీ చివర్లో చెక్ చేసుకోవాలి. ఈ అన్ని సూచనలూ పాటిస్తే తప్పనిసరిగా మంచి ఫలితాలు వస్తాయి.

– డా॥ అట్ల శ్రీనివాస్ రెడ్డి; స్పెషల్ ఎడ్యుకేటర్, రిహ్యాబిలిటేషన్ సైకాలజిస్ట్

స్వతంత్ర ప్రతిపత్తి పెరిగితే మరింత ముందుకు!

సందర్భం



పి. సతీష్

గత దశాబ్ద కాలంగా అనేక ప్రతికూలతల మధ్య ఎల్ఐసీ గణనీయమైన పురోగతి సాధించడం అటు పాలసీదారులకూ, ఇటు ఉద్యోగులూ, ఏజెంట్లకు సంతోషదాయకం. ఈ మధ్య రాజ్యసభలో జరిగిన చర్చలో ప్రధాని నరేంద్రమోదీ ఎల్ఐసీ షేర్ విలువ పెరగడం పట్ల, సంస్థ సాధిస్తున్న పురోగతి పట్ల హర్షం వ్యక్తం చేయడం ఈ సందర్భంగా గమనార్హం.

2023 డిసెంబర్ చివరినాటికి ఎల్ఐసీ అద్భుతమైన ప్రదర్శన నమోదు చేసింది. గ్రూప్ వ్యాపారంలో అనేక రెట్లు వృద్ధి కారణంగా ఎల్ఐసీ ప్రీమియంలు 93.8 శాతం పెరిగి రూ. 11,858.5 కోట్ల నుంచి రూ. 22,981.3 కోట్లకు చేరాయి. 260 లిస్టెడ్ కంపెనీలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఎల్ఐసీ ఆర్జించిన లాభాలు ఒక సంవత్సరంలో రూ. 2.3 లక్షల కోట్లు పెరిగాయి. ఎల్ఐసీ అప్రతిహతమైన పురోగతిలో ప్రజల, పాలసీదారుల, అన్ని తరగతుల ఉద్యోగుల, ఏజెంట్ల పాత్ర నిరుపమానం. 68 ఏళ్ల జీవిత బీమా సంస్థ ప్రస్థానంలో ప్రభుత్వాల పాత్రకన్నా, సంస్థ పై అచంచలమైన విశ్వాసం ఉంచిన పాలసీదారుల, ప్రజల పాత్ర తిరుగులేనిది.

అదాని గ్రూప్ సంస్థలపై అమెరికన్ షార్ట్ సెల్లర్ 'హిండన్ బర్గ్' తీవ్ర విమర్శలతో ఒక నివేదికను 2023 జనవరిలో ప్రచురించినప్పటి నుండి, అదాని సంస్థల్లో ఎల్ఐసీకి భారీగా పెట్టుబడులు ఉన్నాయనీ, మధ్యతరగతి పొదుపు మొత్తాలకు దానివల్ల ముప్పు ఉందన్న కోణంలో చాలామంది వ్యక్తుల నుంచీ, రాజకీయ పార్టీల నుంచీ ఆందోళన వ్యక్తమైంది. ఇందువల్ల ఎల్ఐసీ వ్యాపారంపై ప్రతికూల ప్రభావం పడింది. అదాని గ్రూప్‌లో ఎల్ఐసీ పెట్టుబడులపై, ఎల్ఐసీకి నష్టం వచ్చిందని జరిగిన ప్రచారంపై ఎల్ఐసీ సంస్థ, ఏఐఐఈఏ (అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం), ఇతర ఉద్యోగ, ఏజంట్ల సంఘాలు బాధ్యతాయుతంగా స్పందించాయి. ఈ ప్రచారం ఊహాత్మకమైనదే తప్ప, నిజమైనది కాదని వీరంతా ఊరూ వాడా నిర్వహించిన ప్రచార కార్యక్రమాల వల్ల ఎల్ఐసీ జైత్రయాత్ర తిరిగి కొనసాగుతోంది.

'ప్రజల సొమ్ము –ప్రజా సంక్షేమం కోసమే' అనే నినాదంతో పని చేస్తూ, 2024 జనవరి 19 నాటికి 68 ఏళ్ళు పూర్తి చేసుకుని దేశీయ బీమా రంగంలో ఎల్ఐసీ అగ్రగామిగా ముందుకు సాగుతోంది. 2023 మార్చి31 నాటికి ఎల్ఐసీ మన దేశ ఆర్థిక వ్యవస్థలో రూ. 43,97,204.59 కోట్ల పెట్టుబడులు పెట్టింది. 1956లో కేవలం రూ. 5 కోట్ల మూలధనంతో ప్రారంభమైన ఎల్ఐసీ, నేడు దాదాపు రూ. 50 లక్షల కోట్ల ఆస్తులను సమకూర్చుకుంది. ప్రపంచంలో 99 శాతం పైబడి క్లైములను పరిష్కరిస్తూ, నేటికీ నెంబర్ 1 స్థానంలో ఎల్ఐసీ ఉంది.

ఐఆర్‌డీఏ నివేదిక 2022–23 ప్రకారం, గత 23 సంవత్సరాల కాలంలో, ఇప్పటిదాకా ఎఫ్‌డీఐ రూపేణా దేశ జీవిత బీమా రంగంలోకి వచ్చిన పెట్టుబడుల విలువ కేవలం 12 వేల కోట్లు మాత్రమే. దీనిలో అధిక భాగం స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడానికి వినియోగించబడింది తప్ప దేశంలో మౌలిక వసతుల కల్పన కోసం ఈ పెట్టుబడి ఏమాత్రం ఉపయోగపడలేదు. బీమారంగంలో ఎఫ్‌డీఐని 74 శాతానికి పెంచడం, విదేశీ యాజమాన్యాన్ని అనుమతించడం వంటి చర్యలు భారతదేశంలోని ప్రజల విలువైన పొదుపుపై విదేశీ శక్తులకు పట్టు పెంచుతాయి తప్ప, దేశీయ ప్రయోజనాలు నెరవేరవు.



గత ఏడాది ఎల్ఐసీ షేర్ విలువ పడిపోయిందని మీడియాలో హడావుడి జరిగినా, నేడు ఎల్ఐసీ షేర్ విలువ పెరుగుతుండడంతో విమర్శకుల నోళ్ళకు తాళం పడింది. ఎల్ఐసీ వ్యాపార ప్రదర్శనకు, స్టాక్ మార్కెట్‌లో ఎల్ఐసీ షేర్ ధరకు ఎలాంటి సంబంధం లేదు. ఎల్ఐసీ నిజ విలువ, స్టాక్ మార్కెట్‌లో లెక్క కడుతున్న మార్కెట్ కాపిటలైజేషన్ కంటే అనేక రెట్లు ఎక్కువ.

ఎల్ఐసీ వ్యక్తి కాదు, అది ఆర్థికంగా ఒక బలీయమైన శక్తి. అది స్టాక్ మార్కెట్‌లో ఒక దీర్ఘ కాలిక ఇన్వెస్టర్. స్టాక్ మార్కెట్ ఎప్పుడు ఇబ్బందుల్లో పడ్డా, ఎల్ఐసీనే ఆదుకుంది. అదెప్పుడూ ఏ స్టాక్ అయినా తక్కువ ధరలో వున్నప్పుడు కొంటుంది. సమయం కోసం ఎంతకాలమైనా వేచి చూసి మంచి విలువకు స్టాక్స్ అమ్ముతుంది. తెలివిగా, బాధ్యతగా ఉంటూ దేశ ఆర్థిక పరిణామాల పట్ల మంచి అవగాహన కలిగిన ఇన్వెస్ట్ మెంట్ విభాగం ఎల్ఐసీ సొంతం. నష్టాల్లో ఉన్న ఐడీబీఐ బ్యాంకులో 51 శాతం వాటాలు కొని, దాన్ని లాభాల బాట పట్టించింది. తాజాగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లో 9.9 శాతం వాటాలు కొని, ఆ బ్యాంక్ షేర్ విలువ పడిపోకుండా కాపాడింది. గత 68 ఏళ్లుగా, లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెడుతున్నా, అవినీతి ఆరోపణల మరకలు లేని సంస్థగా ఎల్ఐసీ కితాబు తెచ్చుకుంది. ఇది అనితర సాధ్యం.


ఎల్ఐసీ ప్రతి ఏడాదీ దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల పాలసీ దారుల సొమ్మును సమీకరించి, దాన్ని ఇన్వెస్టబుల్ సర్‌ప్లస్ రూపంలో కేంద్ర ప్రభుత్వానికి అందిస్తుంది. ఈ మొత్తం ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన కర్ణాటక రాష్ట్ర బడ్జెట్‌కు రెండు రెట్లు ఎక్కువ. బీమా రంగంలో కేవలం ఎల్ఐసీ సంస్థకే 'సావరిన్ గ్యారంటీ', అంటే కేంద్ర ప్రభుత్వ గ్యారంటీ ఉంది. ఏ ఇతర ప్రయివేటు బీమా సంస్థకూ ప్రభుత్వ గ్యారంటీ లేదు.

ప్రభుత్వం చెప్తున్న 'ఆత్మ నిర్భర భారత్' సాకారం కావాలన్నా, ఎల్ఐసీ వ్యాపారం మరింత మేర అభివృద్ధి అవ్వాలన్నా ఆర్థిక పొదుపు ఇబ్బడిముబ్బడిగా పెరగాలి. స్టాక్ మార్కెట్లు, బంగారం వైపు కాకుండా, దేశీయ పొదుపు వైపు ప్రజలు ఆకర్షించబడేలా ప్రభుత్వ చర్యలు ఉండాలి. ప్రజల ఆదాయాలు, నికర పొదుపు పెరగాలి. బీమా రంగం ద్వారా చేసే పొదుపుకు ప్రోత్సాహం ఉండాలి. బీమా ప్రీమియంపై జీఎస్టీ భారాన్ని తొలగించాలి. ఎల్ఐసీ సంస్థకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలి. అలా చేస్తే దేశ ఆర్థిక స్వావలంబనకు బలం చేకూరడమే గాక, కుటుంబాల దీర్ఘకాలిక అవసరాలు నెరవేరుతాయి.

వ్యాసకర్త ఏఐఐఈఏ ఉపాధ్యక్షులు । 94417 97900

సత్సంగమం

పూర్వజన్మ పాపపుణ్యాల మేరకు ఈ జన్మలో ఫలితాలు అనుభవించక తప్పదని హిందువుల విశ్వాసం. ఈ జన్మలో మనం చేసే కార్యాలకు, మనకు లభించే ఫలితాలకూ గత జన్మలోని పాపపుణ్యాలతో సంబంధం ఉంటుందని దీని అర్థం. ఈ జన్మలో మనకు సమకూరే భూమి, ఇల్లు, భార్య, సంతతి, విద్య, బుద్ధి, మంచి వారితో పయనించడం వంటి వన్నీ గత జన్మ పాపపుణ్యాల మీదే ఆధారపడి ఉంటాయని హిందూ ధర్మశాస్త్రాలూ, ఇతిహాస పురాణాలూ



చెబుతున్నాయి. ఈ బోధనలన్నీ ఈ జన్మలో మనుషులు సమాజ నియమాలు దాటి అధర్మ మార్గంలో పయనించకుండా ఉండటానికి ఉపకరిస్తున్నాయి. సత్సంగమం ఎప్పుడూ మనకు మేలే చేస్తుందనీ, సాధువులను దర్శించాలనీ, విజ్ఞులతో సహవాసం చేయాలనీ మన పూర్వులు చెప్పిన మాటలు అనుభవపూర్వకంగా చెప్పినవే తప్ప ఏదో చెప్పాలని చెప్పినవి కావు. సర్వసంగ పరిత్యాగులైన సాధుజనులు భగవంతుని మాత్రమే ధ్యానిస్తూ ఇహలోక సుఖాలను పట్టించుకోకపోవడానికి కారణం దైవ భక్తి వారికిస్తున్న అమితమైన ఆనందమే. వారి బోధనలు వినడం, వారిలాంటి వారితో తిరగడం వల్ల మనకు మంచే జరుగుతుంది కానీ కీడు సంభవించదు.

మనమెంత చెడ్డవాళ్లమైనా మనకున్న మంచి పరిచయాలూ, సత్సంగమాల వల్ల కొంత కాలానికి మనలోనూ మార్పువస్తుంది. అయితే ఇందుకు ఎంత సమయం పడుతుందనేది చెప్పలేం. మనలో ఉండే మంచిని గ్రహించే అణకువ, సామర్థ్యాలే మనం త్వరగా సన్మార్గంలోకి మారడానికి హేతువులవుతాయి. దేవునియందు భయ, భక్తులు కలిగినవారు సమాజ హితానికీ, ధర్మానికీ వ్యతిరేకంగా పయనించలేరు. కాబట్టి దేవునిపై భక్తికలిగి ఉంటే ఆయనే మనల్ని నడిపిస్తాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.పంచమి రా.2.24 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** చిత్త ఉ.7.34 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ప.1.34 నుండి 3.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.15 నుండి 11.04 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.42 వరకు, **అమృత ఘడియలు:** రా.11.53 నుండి 1.34 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.24, **సూర్యాస్తమయం:** 6.02.

సీలేరు పంప్డ్ స్టోరేజీ నిర్మాణానికి అనుమతి



ప్రాజెక్టు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏపీజెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్మించనున్న పంప్డ్ స్టోరేజ్‌కు సంబంధించి మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు జెన్‌కో సంస్థ అనుమతులు ఇచ్చినట్లు చీఫ్ ఇంజనీరు కోటేశ్వరరావు తెలిపారు. సీలేరు సమీప పార్వతీనగర్ వద్ద రూ.11 వేల కోట్లతో తొమ్మిది యూనిట్ల ద్వారా 1350 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల ప్రాజెక్టుకు సంబంధించి అన్ని సర్వేలు శరవేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం అటవీశాఖతో కలిసి స్థలం బదలాయింపు ప్రక్రియ జరుగుతోందని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన పార్వతీనగర్, శాండుకోరి, జొన్నమామిడి తదితర ప్రాంతాలను అటవీశాఖ అధికారులతో కలిసి సంయుక్తంగా బుధవారం పరిశీలించినట్లు చెప్పారు. ఇటీవల సందర్శించిన ఈ ప్రాంతంలో అటవీశాఖ సీసీఎఫ్ కొన్ని సూచనలు చేశారన్నారు. ఈ మేరకు పరిశీలన జరిపామని, శాండుకోరి వద్ద ఇప్పటికే సర్వే చేసిన అటవీ భూమిలో కొంత, సీలేరు జెన్‌కో కాలనీలో మరికొంత రెవెన్యూ భూములు గుర్తించినట్టు చెప్పారు. దీనివల్ల ఎవరికి ఎటువంటి నష్టం కలగదని ఆ ప్రాంతంలో అంతా భూమి అడుగుభాగంలోనే నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు గురువారం తెలియజేస్తామన్నారు. ఎస్ఈలు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, ఈఈ ప్రభాకర్, ఏడీఈ మధు, ఫారెస్టు రేంజ్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుండెపోటుతో 'సాక్షి' విలేకరి మృతి



తిరుపాల్‌రెడ్డి(ఫైల్)

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు రూరల్ సాక్షి విలేకరి వై. తిరుపాల్ రెడ్డి బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ఇంట్లో ఉండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురికావడంతో నెల్లూరు నగరంలోని బొల్లినేని ఆసుపత్రికి తరలించగా అక్కడ తుదిశ్వాస విడిచారు. తిరుపాల్‌రెడ్డి సీనియర్ జర్నలిస్టుగా వివిధ దినపత్రికల్లో సేవలు అందించారు. ఆయన ఆకస్మిక మృతికి జిల్లాలోని పలువురు సీనియర్ జర్నలిస్టులు సంతాపం తెలిపారు.

పల్లె ముంగిట కొత్త 'పద్దు'



- గ్రామస్థాయిలోనే పకడ్బందీగా బడ్జెట్
- రాబడి, అభివృద్ధి పనుల ప్రణాళికల రూపకల్పన
- ప్రణాళికా పనులకు మాత్రమే 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు
- సర్పంచులకు వెసులుబాటుతో కూడిన అధికారాలు
- పద్దుల తయారీలో సలహాలకు ఆరుగురు మండల స్థాయి అధికారులతో కమిటీలు
- 2024-25 సంవత్సరానికి గ్రామాలవారీ బడ్జెట్‌ల కోసం కసరత్తు
- 11,403 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే అంచనాల తయారీ పూర్తి

సాక్షి, అమరావతి: కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌ల తరహాలోనే పంచాయతీల స్థాయిలోనూ గ్రామ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) పేరుతో బడ్జెట్‌లను పకడ్బందీగా రూపొందించే ప్రక్రియ మొదలైంది. ఈమేరకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని మొత్తం 13,326 గ్రామ పంచాయతీల్లో అంచనాల తయారీ ప్రారంభమైంది. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సూచనల మేరకు ఇక పంచాయతీలకు అందే 15వ ఆర్థిక సంఘం నిధులు పూర్తిగా ఆ గ్రామ జీపీడీపీలో పేర్కొన్న పనులకే కేటాయించాల్సి రావడంతో ఈ బడ్జెట్‌లకు ప్రాధాన్యం ఏర్పడింది. ఫలితంగా గ్రామస్థాయిలో పాలకవర్గం గుర్తించిన పనులను బడ్జెట్‌లో పొందుపరుచుకునే వెసులుబాటు లభించింది. సప్లిమెంటరీ ప్రణాళిక పేరుతో సవరణ చేసుకునే అవకాశమూ లభించింది. వచ్చే 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని 1,3326 గ్రామ పంచాయతీలతోపాటు 660 మండల పరిషత్‌లు, 13 ఉమ్మడి జిల్లాల పరిషత్‌లకు కలిపి మొత్తంగా రూ.2,152 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. వీటిని గ్రామ బడ్జెట్‌లో పెట్టిన పనులకే వాడుకోవాలి. ఏడాది మొదట్లో గానీ లేదంటే మధ్యలో సప్లిమెంటరీగాగానీ ఆ గ్రామ బడ్జెట్‌లో పేర్కొనని పనులకు ఆర్థిక సంఘ నిధులను వాడుకునే అవకాశమే ఉండదు. ఇంటి పన్ను రూపంలో అందజేసే జనరల్ ఫండ్స్ తదితర ఇతర నిధులను మాత్రం బడ్జెట్ ప్రకారం ఖర్చుపెట్టాలన్న నియమేమీ లేదు. అయితే వీలైనంత మేర బడ్జెట్ ప్రణాళికల ఆధారంగానే ఖర్చు చేసేలా ప్రోత్సహించాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ఉద్దేశం. మరోవైపు 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపు ప్రక్రియలో సర్పంచులకు గతంలో కంటే ఇప్పుడు మెరుగైన వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది.

కార్యదర్శులకు మండలస్థాయి అధికారుల సహకారం

గ్రామ బడ్జెట్ రూపకల్పన, అమలులో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సలహాలు, సూచనలు అందించేందుకు ప్రతి మండలంలో ఆరుగురు మండల స్థాయి అధికారులతో కమిటీలను ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీలకు అందుబాటులో ఉండే నిధులకు, ఇతర పథకాల వచ్చే నిధులనూ అవసరమైన మేర అనుసంధానం చేసుకునేలా ఈ ఆరుగురు మండల స్థాయి అధికారులు తోడ్పాటు అందిస్తారని వివరించారు. కమిటీల్లో ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీ, పంచాయతీరాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఉపాధి పథకం ఏపీఓ, సెర్ప్ ఏపీఎంలు ఉంటారు.

మూడొంతుల పంచాయతీల్లో పూర్తి

ఇప్పటికే దాదాపు మూడొంతులకుపైగా అంటే 11,403 గ్రామ పంచాయతీల్లో 2024-25 సంవత్సరపు గ్రామ బడ్జెట్ ప్రణాళికల రూపకల్పన పూర్తయినట్టు పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఫిబ్రవరి నెలాఖరులోగా అన్ని పంచాయతీల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత రాష్ట్రంలోని 660 మండలాలు, 13 ఉమ్మడి జిల్లాల స్థాయిలోనూ మండల, జిల్లా పరిషత్‌ల వారీగా బడ్జెట్ ప్రణాళికలను మార్చి నెలలో రూపొందించే ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు వివరించారు.

పెత్తందారులకు రోజులు దగ్గరపడ్డాయి

1,249వ రోజు రిలే నిరాహార దీక్షలలో బహుజన పరిరక్షణ సమితి నేతలు



తాడికొండ: పేదలపై పెత్తందారుల ఆధిపత్యానికి చెక్ పెట్టే రోజులు దగ్గర పడ్డాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,249వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో బుధవారం పలువురు ముఖ్య అతిథులు పాల్గొని ప్రసంగించారు. రెండు శాతం ఓటు బ్యాంకు ఉన్న ఓ సామాజిక వర్గం రాష్ట్రంలో 85 శాతం ఓటు బ్యాంకు ఉన్న బహుజనులపై ఆధిపత్యం ప్రదర్శించేందుకు చేస్తున్న ఎత్తుగడలు ఇక సాగనివ్వేది లేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నేరుగా ప్రజల ఖాతాలకు, ఇంటి వద్దకు చేర్చిన సీఎం వైఎస్ జగన్‌కే పేదల మద్దతు ఉంటుందన్నారు. బాబుకు రాజకీయ సన్యాసం తప్పదని, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం అన్ని ప్రాంతాల ప్రజలను మోసం చేసిన బాబు చివరకు భూములిచ్చిన రైతులను సైతం నట్టేట ముంచి తాను మాత్రం పక్క రాష్ట్రంలో విలాసవంతంగా బతుకుతున్నాడని మండిపడ్డారు. నిజమైన అభివృద్ధి అంటే ఏంటో ప్రతి కుటుంబానికి చాటిచెప్పిన సీఎం వైఎస్ జగన్‌ని 175 సీట్లలో గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, పల్లె బాబు, బోదాల సౌమ్య, కొమరవల్లి కిషోర్ బాబు, పులి దాసు, బోదాల సలోమీ, బొలిమేర శామ్యూల్, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష

ఒంగోలు: పోక్సో కేసులో ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష, రూ.4 వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు..ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన బాధిత బాలిక పాలిటెక్నిక్ కోర్సును అభ్యసించింది. ఆ సమయంలో ఆమెను సూదనగుంట ప్రదీప్‌కుమార్ వెంబడించేవాడు. 2017 ఆగస్ట్ 20న మధ్యాహ్నం నీటి కోసం బిందెతో వెళుతున్న బాలికను ప్రదీప్‌కుమార్ బలవంతంగా ఇంట్లోకి లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడి ఫొటోలు తీసుకుని, వాయిస్‌ను రికార్డు చేశాడు. తరువాత ఆమెకు ఫోన్‌చేసి విషయాన్ని బయటకు చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాడు. తీసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ చేస్తానని బెదిరించి ఆమెను బలవంతంగా కొత్తపట్నం బీచ్‌కు తీసుకెళ్లి మళ్లీ ఫొటోలు తీశాడు. తరువాత ఆమెకు చీరాలకు చెందిన యువకునితో నిశ్చితార్థం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న నిందితుడు శంకర్ అనే పేరుతో ఫేస్‌బుక్ అకౌంట్ క్రియేట్ చేసి ఆమె గురించి చెడుగా మాట్లాడి బాధితురాలితో సన్నిహితంగా ఉన్న ఫొటోలను వరుడికి పంపాడు. దీంతో వివాహం రద్దయింది. మళ్లీ నిందితుడు బాలికకు ఫోన్ చేసి బెదిరించడంతో ఆమె కొత్తపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. బాలికపై లైంగిక దాడి చేసినట్లు కోర్టులో నిరూపణ కావడంతో ప్రదీప్‌కు పై విధంగా శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ యనమల వెంకటేశ్వర్లు కేసు వాదించారు.

ఒడిశాలో రాజశ్యామల అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



జార్సుగూడ ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న స్వరూపానందేంద్ర

పెందుర్తి: ఒడిశా రాష్ట్రం జార్సుగూడలో దివంగత నేత నభా కిషోర్ దాస్ కుటుంబం నిర్మించిన రాజశ్యామల అమ్మవారి దేవాలయంలో విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి చేతుల మీదుగా బుధవారం విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజుల పాటు జరిగిన ప్రతిష్ఠాపన ఉత్సవాల ముగింపు సందర్భంగా పూర్ణాహుతి జరిపారు. జార్సుగూడ ఎమ్మెల్యే దీపాలి ఆధ్వర్యంలో, శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో ఆలయ నిర్మాణం చేశారు.

శ్రీశారదాపీఠాధిపతికి శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల ఆహ్వానం

శివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానం నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిలను దేవస్థానం ప్రతినిధులు ఆహ్వానించారు. బుధవారం చినముషిడివాడలోని పీఠంలో స్వామిజీని కలిసి ఆహ్వానపత్రికను అందించారు. మార్చి 3 నుంచి 16 వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. స్వామీజీ చేతుల మీదుగా ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. శ్రీకాళహస్తి దేవస్థానం ప్రధాన అర్చకుడు సంబంధం గురుకుల్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌వీ వర్సిటీలో నుంచి రహదారులు వద్దు

హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: తిరుమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం తిరుపతిలోని ఎస్వీ వర్సిటీలో నుంచి రహదారులు నిర్మాణం చేపట్టేందుకు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ ప్రతిపాదించడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. వర్సిటీలో నుంచి రోడ్ల ఏర్పాటుకు అభ్యంతరం లేదని వీసీ చెప్పడాన్ని తప్పుబట్టింది. వర్సిటీలో నుంచి రహదారి నిర్మాణాలను చేపట్టవద్దని ఆదేశిస్తూ ఇలాంటి విషయానికి అంగీకారం తెలిపే ముందు విద్యార్థుల ప్రయోజనాల గురించి ఆలోచించాలని వీసీకి హితవు పలికింది. తిరుమల వెళ్లే వారి కోసం వర్సిటీలో నుంచి రోడ్డు వేయడం సరికాదని పేర్కొంటూ ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది.

చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

శ్రీకాకుళం జిల్లా సింగుపురం పంచాయతీ పరిధిలోని చెరువును స్థానిక సర్పంచ్ కబ్జా చేసి పూడ్చేస్తున్నారంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకుని, దీనిపై పూర్తి వివరాలను తమ ముందుంచాలని కలెక్టర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. సింగుపురంలోని చెరువును సర్పంచ్ ఆదిత్య నాయుడు కబ్జా చేసి పూడ్చేస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సింగుపురం ఎంపీటీసీ బగ్గు అప్పారావు హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

నెల రోజుల్లో రూ.8వేల కోట్లను జమ చేస్తా

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరించబోమని కేంద్రం ప్రకటిస్తే పలువురు బిలీనియర్లతో పాటు తన వంతు కింద నెల రోజుల్లో రూ.8 వేల కోట్లను జమ చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టుకు నివేదించారు. విదేశాల నుంచి నిధులు స్వీకరించేందుకు వీలుగా ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేటరీ యాక్ట్ కింద ప్రత్యేక ఖాతాను కేంద్రం అనుమతిస్తే, ఆ నిధులను అందులో జమ చేస్తానన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి చెందిన భూములను విక్రయించకుండా స్టే ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న జస్టిస్ గుహనాథన్ నరేందర్, న్యాపతి విజయ్‌ల ధర్మాసనం తదుపరి విచారణను వాయిదా వేసింది. ఇదే అంశానికి సంబంధించిన దాఖలైన పిల్‌లను పాల్ వ్యాజ్యంతో జత చేసే విషయంలో సీజే నుంచి పాలనాపరమైన ఆదేశాలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

యంత్ర సామగ్రిని జప్తు చేయండి

విశాఖ జిల్లా భీమునిపట్నం సముద్ర తీరం సమీపంలో చేపడుతోన్న నిర్మాణాలను తక్షణమే నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిలో చేపడుతోన్న ఈ నిర్మాణాలకు ఎలా అనుమతులిస్తారని అధికారులను ప్రశ్నించింది. అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేపడుతుంటే అవి అక్రమ నిర్మాణాలవుతాయని, నిర్మాణ ప్రదేశంలో ఉన్న యంత్ర సామాగ్రిని తక్షణమే జప్తు చేయాలని ఆదేశించింది. తీసుకున్న చర్యలపై నివేదికివ్వాలని ఆదేశించింది. విచారణను 4 వారాలకు వాయిదా వేస్తూ సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది.

వైభవంగా అహోబిలేశుని పార్వేట ఉత్సవం

రుద్రవరం: అహోబిలేశుని పార్వేట ఉత్సవం వైభవంగా కొనసాగుతోంది. నంద్యాల జిల్లా రుద్రవరం ప్రధాన రహదారిలో కొల్లం వారి తెలుపై కొలువైన ఉత్సవ మూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వాములను బుధవారం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు విజయేంద్ర సరస్వతి స్వామి దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, గద్వాల జిల్లా జోగులాంబ దేవస్థానం కార్యనిర్వహణాధికారి పురంధర్‌కుమార్ తదితరులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అతిథులను ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. అహోబిల ఆలయ జీపీఏ సంపత్ కుమార్, ప్రధాన అర్చకులు రమేషయ్య, అర్చకులు మధు, మణియార్ సౌమ్యనారాయణన్, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి పాల్గొన్నారు.



మాతృత్వానికి దూరం.. దూరం!

దక్షిణ కొరియాలో వింత పరిస్థితి

- నానాటికీ తగ్గుతున్న జననాల రేటు
- పిల్లల్ని కనేందుకు స్త్రీల విముఖత
- కెరీర్, లింగవివక్షే ప్రధాన కారణాలు

ఆమె పేరు యెజిన్. టీవీ యాంకర్. ఓ సాయం వేళ స్నేహితురాళ్లతో సరదాగా గడుపుతుండగా మొబైల్‌లో ఓ పాపులర్ మీమ్ ప్రత్యక్షమైంది. 'మాలా మీరూ అంతరించిపోకముందే జాగ్రత్త పడండి' అని ఓ కార్టూన్ డైనోసార్ హితబోధ చేయడం దాని సారాంశం. దాంతో వారందరి మొహాల్లోనూ విషాద వీచికలు. 30 ఏళ్లు దాటుతున్నా వారెవరికీ ఇంకా పిల్లల్లేరు మరి! వారే కాదు, దక్షిణ కొరియాలో చాలామంది మహిళలు పిల్లల్ని కనడం లేదు. మాతృత్వానికి దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకుంటున్నారు. అక్కడి సమాజంలోని సంక్లిష్టతే ఇందుకు ప్రధాన కారణం...! మహిళల అక్షరాస్యతలో దక్షిణ కొరియా చాలా ముందుంది. దాంతో ఆడవాళ్లలో అత్యధికులు ఉద్యోగులే. ఇంటిపట్టున ఉండేవారు చాలా తక్కువ. అయితే అక్కడ ఏ రంగంలోనైనా పని ఒత్తిళ్లు విపరీతంగా ఉంటాయి. సుదీర్ఘ పనిగంటలు. పైగా తరచూ ఓవర్ టైమ్ చేయడం తప్పనిసరి. నిరాకరిస్తే ఆ ప్రభావం ప్రమోషన్లతో పాటు చాలారకాలుగా పడుతుంది. దాంతో విపరీతంగా అలసిపోయి ఇంటికొచ్చే భర్తలు పిల్లల బాధ్యతలను అస్సలు పంచుకోరు. పైగా వేతనాలతో పాటు చాలా అంశాల్లో మితిమీరిన లింగ వివక్ష. దీనికి తోడు గర్భం దాల్చే ఉద్యోగినులను రాజీనామా చేసేలా కంపెనీలు ఒత్తిడి చేయడం సర్వసాధారణం. దాంతో పిల్లల్ని కనే క్రమంలో కెరీర్ ఒకసారి వెనకబడితే తిరిగి కోలుకోవడం చాలా కష్టం. అదీగాక దక్షిణ కొరియాలో జీవన వ్యయం చాలా ఎక్కువ. ఒక్కరి సంపాదనతో ఇల్లు గడవడం కష్టం. ఇన్ని ప్రతికూలతల మధ్య పిల్లల్ని కని, సజావుగా పెంచేందుకు కావాల్సిన సమయం, ఓపిక, కుటుంబ మద్దతు మహిళలకు ఏ మాత్రమూ ఉండటం లేదు. పిల్లలు, కెరీర్‌లో ఏదో ఒక్కదాన్నే ఎంచుకోక తప్పని అనివార్య పరిస్థితి. అత్యధికులు రెండో ఆప్షన్‌కే ఓటేస్తున్నారు. అలా మొత్తంగా మాతృత్వానికే దూరమవుతున్నారు!

అట్టడుగుకు జననాల రేటు

ప్రపంచవ్యాప్తంగా సంపన్న దేశాలన్నింట్లోనూ చాలాకాలంగా జనాభా క్రమంగా తగ్గుతూ వస్తోంది. కానీ దక్షిణ కొరియాలో ఈ ధోరణి మరీ ప్రమాదకరంగా ఉంది. నిజానికి అతి తక్కువ జననాల రేటు విషయంలో 20 ఏళ్లుగా ఆ దేశానిదే ప్రపంచ రికార్డు! పైగా అది ఏటికేడు మరింతగా తగ్గుతూ వస్తోంది. తాజాగా బుధవారం విడుదలైన గణాంకాలైతే ప్రమాద ఘంటికలే మోగిస్తున్నాయి. 2023లో అక్కడ జననాల రేటు (ఒక మహిళ జీవిత కాలంలో కనే పిల్లల సంఖ్య) 8 శాతం తగ్గి కేవలం 0.73గా నమోదైంది. ఇదిలాగే కొనసాగితే 2100 నాటికి దేశ జనాభా సగానికి సగం తగ్గిపోనుంది. దాంతో ఈ పరిణామాన్ని జాతీయ ఎమర్జెన్సీగా ప్రభుత్వం ప్రకటించింది!

ఫలించని ప్రోత్సాహకాలు...

పిల్లల్ని కనేలా జనాలను ప్రోత్సహించేందుకు దక్షిణ కొరియాలో ప్రభుత్వాలు చేయని ప్రయత్నాల్లేవు. నగదు ప్రోత్సాహకం, ఇంటి కొనుగోలుపై సబ్సిడీ, పిల్లలను చూసుకునేందుకు ఉచితంగా ఆయా సదుపాయం వంటివెన్ని ప్రకటించినా లాభముండటం లేదు. మహిళలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను పరిష్కరించనంత కాలం ఇటువంటి పథకాలు ఎన్ని తెచ్చినా ఒరిగేదేమీ ఉండబోదని సామాజికవేత్తలు అంటున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ప్రభుత్వ ప్రకటనల్లో చైనా జెండానా?

మన దేశాన్ని, మన అంతరిక్ష పరిశోధకులను డీఎంకే ప్రభుత్వం అవమానించింది

- మన జాతీయ జెండాను ముద్రించడానికి వారికి మనసు రాలేదు
- ఇండియా ఘనతలను ప్రపంచానికి చాటడం డీఎంకేకు ఇష్టం లేదు
- కేంద్ర ప్రభుత్వ పథకాలపై సొంత ముద్రలు వేసుకుంటోంది
- తమిళనాడులో డీఎంకే సర్కారుపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం

సాక్షి, చెన్నై: మన దేశాన్ని, దేశభక్తులైన మన అంతరిక్ష పరిశోధకులను తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం ఘోరంగా అవమానించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. తమిళనాడులోని కులశేఖరపట్నంలో 'ఇస్రో' రాకెట్ లాంచ్‌ప్యాడ్ నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా పత్రికల్లో డీఎంకే ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రకటనలో రాకెట్‌పై చైనా జాతీయ జెండాను ముద్రించడాన్ని ఆయన తప్పుపట్టారు. డీఎంకే ప్రభుత్వం ప్రజల కోసం చేసిందేమీ లేదని, కేంద్ర ప్రభుత్వ పథకాలపై సొంత ముద్రలు వేసుకుంటోందని ఆరోపించారు. పనులేవీ చేయకున్నా తప్పుడు దారుల్లో క్రెడిట్ కొట్టేయాలని చూస్తోందని విమర్శించారు. డీఎంకే నేతలు హద్దులు దాటారని, ఇస్రో లాంచ్‌ప్యాడ్‌ను తమిళనాడుకు తామే తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకోవడానికి ఆరాటపడుతున్నారని విమర్శించారు. భారత జాతీయ జెండాను ముద్రించడానికి వారికి మనసొప్పలేదని ఆక్షేపించారు. ప్రజల సొమ్ముతో ఇచ్చిన ప్రకటనల్లో చైనా జెండా ముద్రించడం ఏమిటని మండిపడ్డారు.

పదేళ్ల ట్రాక్ రికార్డు.. వచ్చే ఐదేళ్ల విజన్



అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసే విషయంలో డీఎంకే సర్కారు కేంద్ర ప్రభుత్వానికి సహకరించడం లేదని మోదీ విమర్శించారు. అయోధ్య రామమందిర అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరిగినప్పుడు డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారని అన్నారు. ప్రజల విశ్వాసాలంటే ఆ పార్టీ ద్వేషమని మరోసారి రుజువైనట్లు చెప్పారు. తమిళనాడు అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. తమిళనాడుకు చెందిన ఎల్.మురుగన్‌ను కేంద్ర మంత్రిగా నియమించామని, హిందీ రాష్ట్రమైన మధ్యప్రదేశ్ నుంచి ఆయనను రాజ్యసభకు పంపించామని గుర్తుచేశారు. కాంగ్రెస్, డీఎంకే పార్టీలకు ప్రజల కంటే వారసత్వ రాజకీయాలే ముఖ్యమని విమర్శించారు. ఆ పార్టీల నేతలు సొంత పిల్లల అభివృద్ధి గురించి ఆరాటపడతుంటే తాము మాత్రం ప్రజలందరి పిల్లలకు ఉజ్వలమైన భవిష్యత్తు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. 'వికసిత్ భారత్' నిర్మాణమే తమ ధ్యేయమని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. పరిపాలనలో తనకు పదేళ్ల ట్రాక్ రికార్డు ఉందని, రాబోయే ఐదేళ్లకు అవసరమైన విజన్ ఉందని వ్యాఖ్యానించారు.



వివాదానికి దారి తీసిన డీఎంకే ప్రభుత్వ ప్రకటన

దేశ ప్రగతిని, అంతరిక్ష రంగంలో ఇండియా సాధించిన విజయాలను ప్రశంసించడానికి డీఎంకే సిద్ధంగా లేదని అన్నారు. ఇండియా ఘనతలను ప్రశంసించడం, ప్రపంచానికి చాటడం డీఎంకేకు ఎంతమాత్రం ఇష్టం లేదని ధ్వజమెత్తారు. డీఎంకేను తమిళనాడు ప్రజలు కచ్చితంగా శిక్షిస్తారన్నారు. ప్రధాని మోదీ బుధవారం తమిళనాడులో పర్యటించారు. తూత్తుకుడిలో రూ.17,300 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మరికొన్నింటిని జాతికి అంకితం చేశారు. కులశేఖరపట్నంలో రూ.986 కోట్ల ఇస్రో లాంచ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం తిరునల్వేలిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ కొత్త ప్రాజెక్టులు 'అభివృద్ధి చెందిన భారత్' రోడ్‌మ్యాప్‌లో ఒక ముఖ్య భాగమని అన్నారు. అభివృద్ధిలో తమిళనాడు నూతన అధ్యాయాలను లిఖిస్తోందని చెప్పారు. కేంద్రం చేపట్టిన చర్యలతో రాష్ట్రంలో ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు.

దేశంలోనే తొలి గ్రీన్ హైడ్రోజన్ వాటర్ క్రాఫ్ట్

దేశంలోనే తొలి గ్రీన్ హైడ్రోజన్ ఇంధన సెల్ దేశీయ వాటర్ క్రాఫ్ట్‌ను తూత్తుకుడి వేదికగా ప్రధాని మోదీ జెండా ఊపి ప్రారంభించారు. వీఓ చిదంబరనార్ ఓడరేవు ఔటర్ పోర్ట్ కార్గో టెర్మినల్‌కు శంకుస్థాపన చేశారు. 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 75 లైట్‌హౌస్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. తమిళనాడు ప్రజలు చూపుతున్న ప్రేమ, ఆప్యాయతలు తనను ఆకట్టుకున్నాయని, ఈ రాష్ట్రానికి సేవకుడిగా వచ్చానని, ఈ సేవ కొనసాగుతుందని 'ఎక్స్'లో మోదీ పోస్టు చేశారు.



నేడు అఖిలేశ్‌ను ప్రశ్నించనున్న సీబీఐ

న్యూఢిల్లీ/లక్నో: ఉత్తరప్రదేశ్‌లో అక్రమ గనుల కేటాయింపుల కేసుల్లో విచారణ నిమిత్తం గురువారం తమ ఆఫీస్‌కు రావాలని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఆయనకు సమన్లు జారీచేసింది. సాక్షిగా హాజరైతే వాంగ్మూలం నమోదుచేసుకుంటామని ఆ సమన్లతో పేర్కొంది. ఈ-టెండర్ ప్రక్రియను పూర్తిగా ఉల్లంఘించారని, ప్రభుత్వ అధికారులు ఈ మైనింగ్ లీజుల కేటాయింపుల్లో పాలుపంచుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో సీబీఐ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తునకు అలహాబాద్ హైకోర్టు గతంలో ఆదేశించింది. అఖిలేశ్ యాదవ్ ముఖ్యమంత్రిగా ఉన్న 2012–16కాలంలోనే జాతీయ హరిత ట్రిబ్యునల్ నిషేధించినా ఈ అక్రమ మైనింగ్‌కు తెరలేపారని సీబీఐ పేర్కొంది. 2019లో నమోదైన కేసులో భాగంగా అఖిలేశ్‌కు సమన్లు పంపామని, ఆయన ఈ కేసులో నిందితుడు కాదని, సాక్షి మాత్రమేనని సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. సీబీఐ సమన్లపై అఖిలేశ్ స్పందించారు. ''ఎన్నికలొచ్చినప్పుడల్లా నాకు నోటీసులొస్తాయి. 2019 లోక్‌సభ ఎన్నికల వేళా ఇలాగే జరిగింది. బీజేపీ ఎక్కువగా లక్ష్యంగా చేసుకున్నది మా పార్టీనే. గత పదేళ్లలో కేంద్రంలో అధికారంలో ఉంటూ ఎంతో అభివృద్ధిచేశామని చెబుతుంటారు. అలాంటపుడు సమాజ్‌వాదీ పార్టీ అంటే బీజేపీకి ఎందుకంత కంగారు?. యూపీలో ఎక్స్‌ప్రెస్‌వేపై హెర్క్యులెస్ రకం విమానంలో మోదీ దిగారు. కానీ ఆ ఎక్స్‌ప్రెస్‌వేలను కట్టింది ఎస్పీ సర్కార్. అలాంటి జాతీయ రహదారులను మీరు వేరే రాష్ట్రాల్లో ఎందుకు కట్టలేకపోయారు?'' అంటూ బీజేపీపై అఖిలేశ్ నిప్పులు చెరిగారు.

ఏమిటీ కేసులు?

హమీర్‌పూర్ జిల్లా గనుల్లో తక్కువ విలువైన ఖనిజాలను లీజుకిచ్చి లీజు హక్కుదారుల నుంచి ప్రభుత్వ అధికారులు ముడుపులు తీసుకున్నారని సీబీఐ ఏడు కేసులు నమోదుచేసింది. 2012–17లో అఖిలేశ్ సీఎంగా ఉంటూనే 2012–13లో గనుల శాఖ మంత్రిగా కొనసాగారు. అప్పుడే 2013 ఫిబ్రవరి 17న ఒకేరోజు 13 ప్రాజెక్టులకు సీఎం ఈ-టెండర్లను పక్కనబెట్టి పచ్చజెండా ఊపారని సీబీఐ ఆరోపిస్తోంది. ఈ కేసుల్లో నాటి హమీర్‌పూర్ జిల్లా మేజిస్ట్రేట్, ఐఏఎస్ అధికారిణి బి.చంద్రకళ, సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్సీ రమేశ్‌కుమార్ సహా 11 మందిపై సీబీఐ కేసులు వేసింది.

పాకిస్తాన్ అనుకూల నినాదాలపై రగడ

కర్ణాటక అసెంబ్లీలో బీజేపీ ఆందోళన

బెంగళూరు: కర్ణాటకలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సయ్యద్ నసీర్ హుస్సేన్ గెలుపొందిన తర్వాత ఆయన అనుచరులు పాకిస్తాన్‌కు అనుకూలంగా నినాదాలు చేయడం పట్ల రాష్ట్ర అసెంబ్లీ బుధవారం అట్టుడికిపోయింది. విపక్ష బీజేపీ సభ్యుల ఆందోళనలతో సభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేసిన వారిని అరెస్టు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ సభ్యులు మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వెల్‌లోకి దూసుకొచ్చి బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. దీంతో అధికార కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. అరుపులు కేకలతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. పాకిస్తాన్ అనుకూల నినాదాల వ్యవహారంపై హోంమంత్రి జి.పరమేశ్వర అసెంబ్లీలో మాట్లాడారు. దర్యాప్తు కొనసాగుతోందని, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నివేదిక కోసం పోలీసులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తున్న వీడియో అసలైందో కాదో తేలుతుందని అన్నారు. ఇది నిజంగా జరిగినట్లు బయటపడితే దోషులను గుర్తించి, చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని ప్రకటించారు. మంగళవారం రాజ్యసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. సయ్యద్ నసీర్ హుస్సేన్ గెలిచిన తర్వాత ఆయన అనుచరులు పాకిస్తాన్‌కు మద్దతుగా నినాదాలు చేశారంటూ ఓ వీడియో బయటకు వచ్చింది. దాన్ని చానళ్లు ప్రసారం చేశాయి.


నావల్నీ అంత్యక్రియలకు చర్చిలు నిరాకరించిన వేళ..

మాస్కో: ఇటీవల అనుమానాస్పదంగా జైలులో మరణించిన రష్యా విపక్ష నేత అలెక్సీ నావల్నీ అంత్యక్రియల నిర్వహణకు చర్చిలేవీ స్వచ్ఛందంగా ముందుకు రావడ లేదు. అధ్యక్షుడు పుతిన్ ఆగ్రహిస్తారన్న భయమే ఇందుకు కారణమని నావల్నీ సంస్థ అధికార ప్రతినిధి ఆరోపించారు. ''నావల్నీ పేరు చెప్పగానే ఇప్పటికే బుకింగ్ అయిపోయాయంటూ చాలా చర్చిల నిర్వాహకులు తప్పించుకున్నారు. ఎట్టకేలకు మాస్కో శివార్లలోని మేరీనో పట్టణంలో ఉన్న మదర్ ఆఫ్ గాడ్ క్వెంచ్ మై సారోస్ చర్చి నావల్నీ అంత్యక్రియల నిర్వహణకు ముందుకొచ్చింది'' అని ఆమె 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'వాస్తవానికి గురువారమే అంత్యక్రియలు పూర్తిచేద్దామనుకున్నాం. కానీ పార్లమెంట్‌ను ఉద్దేశిస్తూ పుతిన్ ప్రసంగం ఉండటంతో ఆ రోజు అంత్యక్రియలకు చర్చిలేవీ ముందుకు రాలేదు. అందుకే శుక్రవారం మధ్యాహ్నం ఖననం చేయనున్నాం' అని చెప్పారు.

టార్గెట్ హిమాచల్‌ప్రదేశ్?

- ప్రభుత్వాన్ని కూల్చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం
- బీజేపీ వైపు మొగుతున్న పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- రంగంలోకి దిగిన కాంగ్రెస్ పరిశీలకులు
- ప్రభుత్వాన్ని కాపాడుకుంటామని కాంగ్రెస్ స్పష్టీకరణ
- ప్రజా పనుల శాఖ మంత్రి విక్రమాదిత్య సింగ్ రాజీనామా

సిమ్లా/న్యూఢిల్లీ: హిమాచల్‌ప్రదేశ్ రాజకీయ పరిణామాలు రసకందాయంలో పడ్డాయి. రాజ్యసభ ఎన్నికల్లో అనూహ్య ఓటమితో కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడపై సందేహాలు మొదలయ్యాయి. ప్రభుత్వంపై శాసనసభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ప్రతిపక్ష బీజేపీ సిద్ధమవుతున్నట్లు ప్రచారం మొదలైంది. లోక్‌సభ ఎన్నికల ముందు చోటుచేసుకున్న ఈ పరిణామాలు కాంగ్రెస్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. నష్ట నివారణ కోసం ఆ పార్టీ అధిష్టానం రంగంలోకి దిగింది. ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని సంకేతాలిచ్చింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముగ్గురు సీనియర్ నేతలు భూపేష్ బఘేల్, భూపీందర్ సింగ్ హుడా, డీకే శివకుమార్‌ను పార్టీ పరిశీలకులుగా హిమాచల్‌ప్రదేశ్‌కు పంపించారు. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో మొత్తం 68 స్థానాలుండగా, కాంగ్రెస్‌కు 40 మంది, బీజేపీకి 25 మంది, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఉన్నారు. ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ పట్ల అసంతృప్తితో ఉన్న పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతోపాటు ముగ్గురు స్వతంత్ర సభ్యులు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. హిమాచల్‌ప్రదేశ్‌లోని ఒక రాజ్యసభ స్థానానికి మంగళవారం జరిగిన ఎన్నికలో బీజేపీ అభ్యర్థి విజయం సాధించిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్‌కు తగిన బలం ఉన్నప్పటికీ క్రాస్ ఓటింగ్ జరగడంతో ఆ పార్టీ అభ్యర్థి అభిషేక్ మనూ సింఘ్వీ ఓడిపోయారు. ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థికి ఓటువేశారు. ఈ 9 మంది ఎమ్మెల్యేలు బుధవారం అసెంబ్లీకి వచ్చారు. 'జైశ్రీరామ్, బస్ గయా కామ్' అని నినదిస్తూ బీజేపీ సభ్యులు వారికి స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా, హిమాచల్‌ప్రదేశ్ ప్రజా పనుల శాఖ మంత్రి విక్రమాదిత్య సింగ్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ముఖ్యమంత్రికి, గవర్నర్‌కు సమర్పించానని చెప్పారు. ప్రభుత్వంలో తనకు, తన కుటుంబానికి అవమానాలు ఎదురయ్యాయని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నానని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో అసలు ఏం జరుగుతోందో అధిష్టానం తెలుసుకోవాలని కోరారు. తన అనుచరులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయించుకుంటానని వెల్లడించారు.



సీఎం సుఖు

బీజేపీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు

హిమాచల్‌ప్రదేశ్ శాసనసభలో బుధవారం అనూహ్య పరిణామం చేసుకుంది. 15 మంది ప్రతిపక్ష బీజేపీ ఎమ్మెల్యేలపై స్పీకర్ కులదీప్ సింగ్ పఠానియా సస్పెన్షన్ వేటు వేశారు. వీరిలో ప్రతిపక్ష నేత జైరామ్ ఠాకూర్ కూడా ఉన్నారు. బీజేపీ సభ్యులు సభలో స్పీకర్‌ను అగౌరవపరుస్తున్నారని, ఇతరులతో అనుచితంగా ప్రవర్తిస్తున్నారని, సభ సజావుగా సాగాలంటే వారిని సస్పెండ్ చేయాలని కోరుతూ మంత్రి హర్షవర్ధన్ చౌహాన్ ప్రవేశపెట్టిన తీర్మానం అసెంబ్లీలో ఆమోదం పొందింది. బడ్జెట్‌ను ఆమోదింపజేసుకోవడానికే తమను సస్పెండ్ చేశారని జైరామ్ ఠాకూర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలో పడిందని, ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ రాజీనామా చేయాలని జైరామ్ ఠాకూర్ అన్నారు. బీజేపీ సభ్యుల సస్పెన్షన్ అనంతరం అసెంబ్లీలో బడ్జెట్ ఆమోదం పొందింది.

ప్రజా తీర్పును కాపాడుకుంటాం

హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రజా తీర్పును కాలరాచే ప్రయత్నాలను సహించబోమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ చెప్పారు. రాష్ట్రంలోని పార్టీ ఎమ్మెల్యేలందరితో మాట్లాడి, త్వరలో సమగ్ర నివేదిక సమర్పించాలని కాంగ్రెస్ పరిశీలకులను ఖర్గే ఆదేశించారని తెలిపారు. వ్యక్తుల కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని, అదే సమయంలో ప్రజలు ఇచ్చిన తీర్పును కాపాడుకోవడం ముఖ్యమని తేల్చిచెప్పారు. హిమాచల్‌లో అధికారంలోకి రావడానికి బీజేపీ తప్పుడు మార్గాలు వెతుకుతోందని ఆరోపించారు.

అరేబియన్ సముద్ర జలాల్లో 3,300 కేజీల డ్రగ్స్ స్వాధీనం

పోలీసుల అదుపులో ఐదుగురు

సాక్షి, విశాఖపట్నం: అరేబియా సముద్ర జలాల్లో భారీ మొత్తంలో మత్తుపదార్థాలను భారత నౌకాదళం స్వాధీనం చేసుకుంది. సముద్రజలాలపై ఇంత భారీ స్థాయిలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోవడం ఇదే మొదటిసారి. ఇరాన్‌లోని ఛబహర్ నౌకాశ్రయం నుంచి బయల్దేరి మంగళవారం ఉదయం అరేబియా సముద్రంలో అంతర్జాతీయ సముద్రజలాల సరిహద్దు(ఐఎంబీఎల్)కు 60 నాటికల్ మైళ్ల దూరంలో భారత్ వైపు వస్తున్న ఒక అనుమానిత చేపల పడవను భారత నావికాదళ నిఘా విమానం కనిపెట్టి వెంటనే ప్రధాన కార్యాలయానికి సమాచారం చేరవేసింది. అక్కడి నుంచి నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)కి సమాచారం అందింది. వెంటనే నేవీ, ఎన్‌సీబీ, గుజరాత్ పోలీసులు సంయుక్తంగా రంగంలోకి దిగారు. పీ8ఐ నేవీ విమానం, యుద్ధనౌక, హెలికాప్టర్లు ఆ పడవను చుట్టుముట్టి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. నౌకను ఎన్‌సీబీ అధికారులు తనిఖీచేయగా దాదాపు 3,300 కేజీల మాదకద్రవ్యాలున్న ప్యాకెట్లు బయటపడ్డాయి. ఈ ప్యాకెట్లలో 3,110 కేజీల ఛరస్/హషిష్, 158.3 కేజీల స్ఫటిక రూప మెథామ్‌ఫెటమైన్, 24.6 కేజీల హెరాయిన్ ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో వీటి మొత్తం విలువ గరిష్టంగా రూ.2,000 ఉండొచ్చని ఢిల్లీలో ఎన్‌సీబీఐ డైరెక్టర్ జనరల్ ఎస్ఎన్ ప్రధాన్ అంచనావేశారు. ఆ ప్యాకెట్ల మీద 'రాస్ అవద్ గూడ్స్ కంపెనీ, పాకిస్తాన్ తయారీ' అని రాసి ఉంది. మత్తుపదార్థాల ప్యాకెట్లతోపాటు పడవలో ఉన్న ఐదుగురు విదేశీయులను అరెస్ట్‌చేశారు. వీరి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. వీరిని పాక్ లేదా ఇరాన్ దేశస్తులుగా భావిస్తున్నారు. వీరి నుంచి ఒక శాటిలైట్ ఫోన్, నాలుగు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 'భారత నావికాదళం, ఎన్‌సీబీ, గుజరాత్ పోలీసులు సాధించిన ఈ విజయం మత్తుపదార్థాల రహిత భారత్ కోసం కేంద్రం చేస్తున్న కృషికి నిదర్శనం'' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. సముద్ర జలాల్లో ఇన్ని కేజీల డ్రగ్స్ పట్టివేత ఇదే తొలిసారి. అంతకుముందు 2023 మేలో కేరళ తీరంలో 2,500 కేజీల మత్తుపదార్థాలను ఎన్‌సీబీ, నేవీ పట్టుకున్నాయి.

అమెరికాలో కార్చిచ్చు

టెక్సాస్ రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో అడవి దహనం

కనాడియన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో అడవికి నిప్పంటుకుని లక్షల ఎకరాల్లో పచ్చదనం మటుమాయమైంది. చెట్లు కాలిబూడిదయ్యాయి. సమీప ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం హుటాహుటిన సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. ఇప్పటికే 2,00,000 ఎకరాల విస్తీర్ణంలో అటవీప్రాంతాన్ని కాల్చేసిన కార్చిచ్చు మరింత పెద్దదవుతూ అక్కడి ప్రజలు, ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా పరిణమించింది. దీంతో టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబోట్ దాదాపు 60 గ్రామాల్లో విపత్తుగా ప్రకటించి సహాయక చర్యలను ముమ్మరంచేశారు. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను ఆర్పేందుకు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు.

అణ్వాయుధాల కేంద్రం బంద్

ఈ ప్రాంతంలో సంభవించే అతి పెద్ద కార్చిచ్చులకు ది స్మోక్‌హౌజ్ క్రీక్‌ఫైర్‌గా పిలుస్తుంటారు. భయంకరమైన ఎండ, వేడి, పొడి వాతావరణం కారణంగా ఉత్తర టెక్సాస్ అడవిలో కార్చిచ్చు అంటుకుంది. సోమవారం మొదలైన ఈ కార్చిచ్చు టెక్సాస్ రాష్ట్ర చరిత్రలో ఇంతవరకు సంభవించిన అతిపెద్ద కార్చిచ్చు ఘటనల్లో ఐదోది కావడం గమనార్హం. ఈ కార్చిచ్చు దెబ్బకు ఆమరిల్లో పట్టణంలో దశాబ్దాలుగా సేవలందిస్తున్న అమెరికా అణ్వాయుధాల కేంద్రంలో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపేసినట్లు ప్యాన్‌టెక్స్ సంస్థ వెల్లడించింది. జాతీయ రహదారుల వెంట చెట్లకు సైతం మంటలు అంటుకోవడంతో ఆయా హైవేలపై వాహనాల రాకపోకలను నిలిపేశారు. ఓక్లహామా రాష్ట్ర సరిహద్దుల్లోని హెమ్‌ఫిల్, హచిన్‌సన్ కౌంటీల్లోనూ కార్చిచ్చు వ్యాపించింది. మియామీ, కనాడియన్ పట్టణాల్లో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సెనేటర్ కెవిన్ స్పార్క్స్ స్థానికులకు విజ్ఞప్తిచేశారు. కనాడియన్ పట్టణాన్ని కార్చిచ్చు దాదాపు చుట్టేసింది. స్కెలీటౌన్, వీలర్, అలీసన్, బ్రిస్కో పట్టణాల నుంచీ స్థానికులు వేరే చోట్లకు వెళ్లిపోయారు. కార్చిచ్చు ఘటనల కారణంగా టెక్సాస్ రాష్ట్రంలో మొత్తంగా కోటి 10 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా అమెరికాను కార్చిచ్చులు నిత్యం వణికిస్తున్నాయి.

చట్టపరమైన అధికారం ఒక్కటే సరిపోదు

- జడ్జిలకు సమస్యల పరిష్కార నైపుణ్యం ఉండాలి: సీజేఐ

న్యూఢిల్లీ: న్యాయమూర్తిగా రాణించాలంటే చట్టపరమైన అధికారం ఒక్కటే సరిపోదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. మానవ జీవితాన్ని, మనుషుల సమస్యలను అర్థంచేసుకొని, పరిష్కరించే నేర్పు అలవర్చుకోవాలని, వారికి అదే అతిపెద్ద సాధనమని పేర్కొన్నారు. బుధవారం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొత్తగా నియమితులైన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సతీష్‌చంద్రశర్మ, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసి, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ప్రసన్న బి.వరాలేను సత్కరించారు. నూతన న్యాయమూర్తు నియామకంతో సుప్రీంకోర్టులో జడ్జిల సంఖ్య గరిష్టంగా 34కు చేరిందని జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. వారి అనుభవంతో సుప్రీంకోర్టుకు మంచి పేరు వస్తుందని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను పరిష్కరించే నైపుణ్యమే మనల్ని గొప్ప న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా మారుస్తుందని స్పష్టం చేశారు.

కేరళలో 16 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ

తిరువనంతపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేరళలో విపక్షాల యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్(యూడీఎఫ్) కూటమి తరఫున అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ బరిలో దిగనుంది. కేరళలో 20 లోక్‌సభ స్థానాలు ఉండగా మా పార్టీ 16 చోట్ల పోటీ సిద్ధమవుతోందని కాంగ్రెస్ పార్టీ బుధవారం ప్రకటించింది. యూడీఎఫ్ కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు వ్యవహారం ఒక కొలిక్కి వచ్చింది. సీట్లపంపకాల వివరాలను కాంగ్రెస్ కేరళ చీఫ్ కె.సుధాకరన్, యూడీఎఫ్ చైర్మన్ వీడీ సతీశన్ మీడియాకు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ 16 చోట్ల, యూడీఎఫ్ కూటమి పార్టీ అయిన యునియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్) రెండు చోట్ల, కేరళ కాంగ్రెస్(జాకబ్) పార్టీ, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ చెరో ఒక స్థానంలో పోటీకి నిలుస్తాయని కేరళ అసెంబ్లీలో విపక్ష నేత సతీషన్ చెప్పారు. కూటమి తరఫున ఎక్కువ స్థానాల్లో పోటీచేస్తున్నందుకు బదులుగా కేరళలో వచ్చే దఫాలో ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానం నుంచి ఐయూఎంఎల్‌కు కాంగ్రెస్ మద్దతు పలకనుంది. రాష్ట్రంలోని అన్ని సీట్లను గెలవడమే లక్ష్యంగా విపక్షాల 'ఇండియా' కూటమికి మద్దతివ్వాలని యూడీఎఫ్ నిర్ణయించుకుంది.

మిట్టల్‌కు నైట్‌హుడ్ పురస్కారం



లండన్/న్యూఢిల్లీ: భారతీయ టెలికం రంగ దిగ్గజ పారిశ్రామికవేత్త సునీల్ భారతీ మిట్టల్‌ను బ్రిటన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక నైట్‌హుడ్ కమాండర్ పురస్కారంతో సత్కరించింది. ఎలిజబెత్ రాణి మరణం తర్వాత బ్రిటన్ రాజసింహాసనాన్ని అధిరోహించిన చార్లెస్–3 నుంచి ఈ అవార్డ్‌ను అందుకున్న తొలి భారతీయుడిగా సునీల్ మిట్టల్ రికార్డు సృష్టించారు. బ్రిటన్, భారత్ వాణిజ్య సంబంధాల బలోపేతానికి చేసిన కృషికిగాను యూకే ప్రభుత్వం నైట్‌హుడ్(కేబీఈ) అవార్డ్‌తో మిట్టల్‌ను గౌరవించింది. భారత్‌లో రెండో అతిపెద్ద టెలికం సంస్థ ఎయిర్‌టెల్‌కు 66 ఏళ్ల మిట్టల్ వ్యవస్థాపక చైర్మన్‌గా కొనసాగుతున్నారు. బ్రిటన్ ఇచ్చే అత్యున్నత పౌర పురస్కారాల్లో నైట్ కమాండర్ కూడా ఒకటి. గౌరవార్థం విదేశీయులకూ దీనిని ప్రకటిస్తారు.

రాజీవ్‌గాంధీ హత్యకేసు దోషి శంతన్ మృతి

సాక్షి, చెన్నై: మాజీ ప్రధానమంత్రి, దివంగత రాజీవ్‌గాంధీ హత్యకేసులో దోషిగా తేలి జీవితఖైదు తర్వాత విడుదలైన 55 ఏళ్ల టి.శంతన్ అలియాస్ సుథేందిరరాజా బుధవారం గుండెపోటుతో మరణించారు. ఆయన శ్రీలంక దేశస్తుడు. 1991లో రాజీవ్ గాంధీ హత్యోదంతం తర్వాత జరిగిన కేసు విచారణలో అరెస్టయిన శంతన్‌సహా ఏడుగురు దోషులుగా తేలి దాదాపు రెండు దశాబ్దాలపాటు జైలు శిక్ష అనుభవించారు. తర్వాత కోర్టులో పెట్టుకున్న పిటిషన్లను పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం 2022లో శంతన్‌సహా ఏడుగురికి శిక్ష నుంచి విముక్తి కల్పించి విడుదలచేసింది. శంతన్ జనవరిలో లివర్ వైఫల్యంతో ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మరణించారని ఆస్పత్రి డీన్ తేరనీరజన్ చెప్పారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం । 29 । ఫిబ్రవరి । 2024




దుర్గమ్మ సేవలో స్పీకర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మను శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు బుధవారం దర్శించుకున్నారు.



ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ పి.రాజాబాబు పరిశీలించారు. ఓట్ల లెక్కింపుపై తీసుకోవాల్సిన చర్యల గురించి మాట్లాడారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 516.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

మైలవరం నియోజకవర్గ పరిశీలకుడిగా కిరణ్‌కుమార్‌రెడ్డి



జి.కొండూరు: వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ పరిశీలకుడిగా అప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం బుధవారం నియామక పత్రాన్ని విడుదల చేసింది. ఈ క్రమంలో కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావు, రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కర్‌రెడ్డి, విజయవాడ ఎంపీ కేశినేని నాని ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

దుర్గమ్మకు కానుకగా బంగారు నెక్లెస్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు తెనాలికి చెందిన భక్తులు బుధవారం బంగారు నెక్లెస్‌ను కానుకగా సమర్పించారు. తెనాలికి చెందిన విజయలక్ష్మి, అన్నపురెడ్డి గోపాలకృష్ణారెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. సుమారు రూ. 2 లక్షల విలువ చేసే 35 గ్రాముల బంగారంతో తయారు చేయించిన రాళ్ల నెక్లెస్‌ను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబుకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ చైర్మన్ రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, అందించారు. ఆలయ ప్రత్యేక ఆహ్వానితులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్ పరీక్షల నిర్వహణ



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో టెట్–2024 పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా జరిగాయి. బుధవారం ఉదయం నిర్వహించిన పరీక్షలో 1808 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 1527 మంది వచ్చారు. 281 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షలో 1809 మంది హాజరుకావాల్సి ఉండగా 1523 మంది రాశారు. 286 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరిశీలకులు కె.శ్రీనివాసరెడ్డి కానూరులోని అయాన్ డిజిటల్ ఇనిస్టిట్యూట్, శైలేష్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం నందమూరులోని వాసవీ ఇంజినీరింగ్ కళాశాలను పరిశీలించింది. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

ఆరుగురు ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి జరగబోయే ప్రమాదాలను నివారించడంలో విశేషంగా కృషి చేసిన విజయవాడ రైల్వే డివిజన్‌కు చెందిన ఆరుగురు ఉద్యోగులు జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డులు అందుకున్నారు. సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో జీఎం అరుణ్ కుమార్ జైన్ విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్‌ల డీఆర్ఎంలతో వర్చువల్ సమావేశంలో సేఫ్టీ అవార్డులను ప్రకటించారు.
ముందుగా రైళ్ల సమయపాలన, భద్రత చర్యలపై సమీక్షించారు. భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ సేఫ్టీ డ్రైవ్‌లు, రాత్రిళ్లు సెక్షన్‌లలో తనిఖీలు చేపట్టాలని తెలిపారు. వ్యవస్థలో లోపాలను గమనించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాకినాడలోని అసిస్టెంట్ గ్యారేజ్ అండ్ వ్యాగన్ ఉద్యోగులు కె. రమేష్ నాయుడు, డీఎస్‌వీఎస్ కోటేశ్వరరావు, మెకానికల్ విభాగంలోని టెక్నీషియన్‌లు బాబులాల్ మీనా, జి.వెంకటరత్నం, లోకో పైలట్ కె.ఎల్ సత్యప్రసాద్, కావలిలోని ట్రాలిమెన్ ఎం.మురళీమోహన్‌లకు జీఎం చేతుల మీదుగా అవార్డులు అందించారు. డీఆర్ఎం నరేంద్ర అభినందించారు.

సర్కారు దవాఖానా.. సేవల నజరానా

వైద్య రంగంలో చరిత్రాత్మక విప్లవం

- ప్రభుత్వాస్పత్రుల్లో రెండు రెట్లు పెరిగిన రోగుల సంఖ్య
- బెజవాడలో సూపర్‌స్పెషాలిటీ బ్లాక్, బందరులో వైద్య కళాశాల ఏర్పాటు
- నాడు–నేడుతో పీహెచ్‌సీల ఆధునికీకరణతో ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్
- ఉమ్మడి కృష్ణాలో వైద్యరంగంలో విశేష అభివృద్ధి



విజయవాడ ఏపీఐఐసీ కాలనీలో అధునాతనంగా నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చేసింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనాస్పత్రుల వరకూ సకల వసతుల కల్పనతో వాటి రూపురేఖలు మారిపోయాయి. వైద్యులు, వైద్య సిబ్బంది నియామకం, అత్యాధునిక సౌకర్యాల కల్పనతో ప్రభుత్వాస్పత్రికి వెళ్తే నాణ్యమైన వైద్యం ఉచితంగా అందుతుందన్న భరోసా ప్రజలకు లభించింది. ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య రెండు రెట్లు పెరగడమే ఇందుకు నిదర్శనం. విజయవాడ జీజీహెచ్‌లో 2019లో రోజుకు 1200 మంది రోగులు రాగా, 2024లో 3,300 మంది రోగులు వైద్యం కోసం వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంపై సీనియర్ వైద్యులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విజయవాడలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్

టీడీపీ హయాంలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌కు నిధులు ఇవ్వకుండా చంద్రబాబు నాలుగేళ్లు జాప్యం చేస్తే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వారంలోనే రూ.30 కోట్లు మంజూరు చేశారు. దీంతో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణం పూర్తయింది. ఎంఆర్ఐ స్కాన్, క్యాథ్‌ల్యాబ్, అడ్వాన్స్‌డ్ సీటీ స్కాన్ వంటి యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కార్డియాలజీ, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరోసర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ వంటి విభాగాల్లో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. గుండె ఆపరేషన్లు సైతం జరుగుతున్నాయి. ఆయా విభాగాల్లో వైద్యుల పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేశారు.

మేజర్ అభివృద్ధి ఇలా..

వివరం	ఖర్చు
బందరులో వైద్య కళాశాల నిర్మాణం :	రూ.550 కోట్లు
విజయవాడ ఎస్ఎస్ బ్లాక్ ఏర్పాటు :	రూ.30 కోట్లు
సిద్ధార్థ వైద్య కళాశాల్లో నాడు-నేడు పనులు :	రూ.170 కోట్లు
పీహెచ్‌సీల ఆధునికీకరణ:	రూ.120 కోట్లు
యూపీహెచ్‌సీ నూతన భవనాలకు :	రూ.25 కోట్లు

ఉమ్మడి కృష్ణాలో నియామకాలు

సిబ్బంది	సంఖ్య
స్పెషలిస్టు వైద్యులు	118
సివిల్ అసిస్టెంట్ సర్జన్లు	136
మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు	750
స్టాఫ్ నర్సులు	550
పారామెడికల్ సిబ్బంది	625
ఇతర సిబ్బంది	900

రూ.550 కోట్లతో వైద్య కళాశాల

ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గానికి ఒక వైద్య కళాశాల ఏర్పాటులో భాగంగా మచిలీపట్నంలో రూ.550 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మించారు. ఈ ఏడాది 150 ఎంబీబీఎస్ సీట్లకు అడ్మిషన్లు ఇచ్చారు. అక్కడి జిల్లా ఆస్పత్రిని బోధనాస్పత్రిగా మార్చి పెద్ద ఎత్తున సౌకర్యాలు కల్పించి, వైద్యులు, సిబ్బందిని నియమించారు. ఇప్పుడు సమగ్ర వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.



యూపీహెచ్‌సీలో పూర్తిస్థాయి వ్యాధి నిర్ధారణ పరికరాలు



జగ్గయ్యపేట మండలం బండిపాలెంలో విలేజ్ క్లినిక్

నాడు–నేడుతో ఆధునికీకరణ

ఉమ్మడి జిల్లాలోని 80కిపైగా పీహెచ్‌సీలు, 8 సీహెచ్‌సీలను నాడు–నేడుతో ఆధునికీకరించారు. మందులు పూర్తి స్థాయిలో ఉంచి, పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండేలా నియామకాలు చేపట్టారు. నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నందుకు ఉమ్మడి కృష్ణాలో 40 పీహెచ్‌సీలకు నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ సర్టిఫికేషన్లు లభించాయి. పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకున్నారు.

ప్రతి రోగికీ అత్యుత్తమ వైద్యం



ప్రతి రోగికీ అత్యుత్తమ వైద్యం అందిస్తున్నాం. సూపర్‌స్పెషాలిటీ విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. పూర్తిస్థాయి గుండె వైద్యం ప్రజలకు చేరువ చేశాం. గతంలో కంటే రోగులు బాగా పెరిగారు. కార్డియోథోరాసిక్ సర్జరీలు చేస్తున్నాం. ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ వంటి విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందిస్తున్నాం. ప్రస్తుతం జీజీహెచ్‌కు రోజుకు మూడు వేల మందికి పైగా పేషెంట్లు వస్తున్నారు.

– డాక్టర్ డి.వెంకటేష్, సూపరింటెండెంట్, విజయవాడ జీజీహెచ్

గ్రామీణ వైద్యం పటిష్టం



జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాలకే స్పెషాలిటీ వైద్యులు వెళ్లి సేవలు అందిస్తున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఒక మెగా వైద్య మేళా నిర్వహిస్తున్నారు. కుటుంబ డాక్టర్ విధానంలో జీవనశైలి వ్యాధులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మాతా శిశు వైద్యం మెరుగైంది. పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. హై రిస్క్ గర్భిణులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్ఓ, ఎన్టీఆర్‌జిల్లా

యూపీహెచ్‌సీలకు ఆధునిక హంగులు

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 63 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. 19 యూపీహెచ్‌సీలకు రూ.కోటి చొప్పున వెచ్చించి నూతన భవనాలను నిర్మించారు. అన్ని యూపీహెచ్‌సీల్లో ఆధునిక వ్యాధి నిర్ధారణ పరికరాలను అందుబాటులోకి తెచ్చి, సిబ్బందిని నియమించారు. ఒక్కో యూపీహెచ్‌సీలో వైద్యుడితో పాటు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ ఆపరేటర్, ఫార్మసిస్టు, లాస్ట్‌గ్రేడ్ ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నారు. వాటిలో 63 రకాల పరీక్షలు, 172 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

నూతన ఆవిష్కరణలతో దేశాభివృద్ధి

అప్‌కాస్ట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ అపర్ణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): నూతన ఆవిష్కరణల ద్వారా విద్యార్థులు దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అప్‌కాస్ట్) మెంబర్ సెక్రటరీ డాక్టర్ వై. అపర్ణ తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని భవానీపురంలోని అప్ కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ సర్ సీవీ రామన్ వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. సైన్స్ సిటీ సీఈవో డాక్టర్ కె.జయరామిరెడ్డి మాట్లాడుతూ ఇన్‌స్పైర్, బాలల సైన్స్ కాంగ్రెస్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లు వారిలో సైన్స్ రంగంపై ఉన్న ఆసక్తిని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. నేటి బాలబాలికలే రేపటి బాల శాస్త్రవేత్తలని చెప్పారు. వంటింటి దగ్గర నుంచి సమాజంలో నిత్యం జరిగే ఘటనలే పరిశోధనలకు మూలాలని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యువి సుబ్బారావు మాట్లాడుతూ భవిష్యత్ తరం ప్రజల అవసరాలను తీర్చే విధంగా విద్యార్థుల ఆవిష్కరణలు ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రాజెక్ట్‌ల ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను డాక్టర్ అపర్ణ, జయరామిరెడ్డి అభినందించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ మోడల్స్‌కు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

అన్నదాతకు ఆసరాగా విప్లవాత్మక పథకాలు

- వైఎస్సార్ రైతు భరోసా ద్వారా లబ్ధి పొందిన రైతులు : 1,42,011 మంది
- ఈ ఏడాది అందిన సాయం : రూ. 28.73 కోట్లు
- సున్నా వడ్డీ రాయితీ అందిన రైతులు : 30,405 మంది

రాయితీ మొత్తం : రూ. 7.72 కోట్లు



రైతులకు వైఎస్సార్ రైతు భరోసా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతకు ఆసరాగా నిలిచేందుకు విప్లవాత్మక పథకాలను అమలుచేస్తోందని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. వరుసగా అయిదో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ సాయంతో పాటు పంట రుణాలకు సంబంధించి సున్నా వడ్డీ రాయితీని రైతుల ఖాతాల్లో నేరుగా జమచేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజారెడ్డి, బెల్లం దుర్గ, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్‌కే ఆసిఫ్, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డి.దామోదర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అన్ని విధాల అండగా ఉందని చెప్పారు. వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు పథకాలు అందిస్తుందని పేర్కొన్నారు. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద అయిదో ఏడాది మూడో విడతలో 1,42,011 మంది రైతులకు రూ. 28.73 కోట్ల లబ్ధి చేకూరినట్లు వెల్లడించారు. అదే విధంగా 30,405 మంది రైతులకు రూ. 7.72 కోట్ల సున్నా వడ్డీ రాయితీ ప్రభుత్వం అందించిందని వివరించారు. రబీ (2021-22), ఖరీఫ్ (2022)లో పంట రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీని నేరుగా ఖాతాల్లో జమచేస్తామని స్పష్టం చేశారు. సొంత భూమి సాగుచేసుకుంటున్న రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులు, ఆర్వోఎఫ్ఆర్ రైతులకు కూడా ఈ పథకం కింద సాయం అందుతోందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సహాయాలను సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించి మెరుగైన ఆదాయాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యాన అధికారులు ఎస్.నాగమణెమ్మ, పి.బాలాజీ కుమార్, డీఏఏబీ సభ్యులు, వివిధ ప్రాంతాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిని వరించిన అకాడమీ అవార్డులు



డాక్టర్ సేతురామ్



మద్దాలి ఉషా గాయత్రి



ఎం.సురేంద్రనాథ్

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి సంప్రదాయ నాట్యంలో నిష్ణాతులైన ముగ్గురికి కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డులు వరించాయి. ఈ విషయాన్ని అకాడమీ కార్యదర్శి రాజుదాస్ ప్రకటించారు. దీనిపై కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు, పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠం ప్రిన్సిపాల్ వేదాంతం రామలింగ శాస్త్రి బుధవారం స్థానిక విలేకర్లకు వెల్లడించారు. కూచిపూడి నాట్యానికి విశేష సేవలు అందించి దేశ విదేశాల్లో ప్రాచుర్యం పొందిన డాక్టర్ భాగవతుల సేతురామ్, మద్దాలి ఉషా గాయత్రిలకు సంగీత నాటక అకాడమీ అవార్డులు, ఎం.సురేంద్రనాథ్‌కు బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం 2023 సంవత్సరానికి ఎంపిక కావటంతో కూచిపూడి కళా కుటుంబంలో పండుగ వాతావరణం చోటు చేసుకుంది.

- డాక్టర్ భాగవతుల సేతురామ్ హైదరాబాదులోని పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కూచిపూడి నాట్య విభాగానికి కులపతిగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు. అలనాటి నాట్యాచార్యులు భాగవతుల రామకోటయ్య (కూచిపూడి) కుమారుడైన సేతురామ్ ఆయన వద్ద శిష్యరికం చేశారు.
- మద్దాలి ఉషా గాయత్రి కూచిపూడి నాట్యాచార్యులైన వేదాంతం జగన్నాథ శర్మ, పద్మశ్రీ డాక్టర్ వేదాంతం సత్యనారాయణ శర్మ, పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన సత్యం వద్ద శిష్యరికం చేశారు.

సురేంద్రనాథ్‌కు బిస్మిల్లా ఖాన్ పురస్కారం

యువ నాట్యాచార్యులు ఎం.సురేంద్రనాథ్ కూచిపూడి నాట్య కళాపీఠంలో డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి వద్ద నాట్యాన్ని అభ్యసించారు. కూచిపూడి గ్రామానికి అనుబంధం ఉన్న ఈ కళాకారులకు అవార్డులు వరించటంపై నాట్యాచార్యులు కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, పసుమర్తి రత్తయ్య శర్మ, డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాస రావుతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

నేడు ఉయ్యూరులో శిడిబండి మహోత్సవం



ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్ల వైభవంగా కొనసాగుతోంది. బుధవారం సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన ఘట్టమైన శిడి బండి ఉత్సవం గురువారం జరగనుంది. ఉత్సవానికి శిడి బండిని ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నారు. సంప్రదాయం ప్రకారం దళితవాడ నుంచి పెళ్లికి సిద్ధంగా ఉన్న యువకుడిని పెళ్లి కొడుకులా ముస్తాబు చేసి ఊరేగింపుగా తీసుకొచ్చి తిరునాళ్ల 11వ రోజున శిడి బండి ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు హాజరవుతారు. ఆలయం ముందు శిడి బండిని నిలిపి మూడు సార్లు శిడి ఆడించటంతో శిడి బండి ఉత్సవం ముగుస్తుంది. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకిస్తారు. జోడు పొట్లేళ్ల ప్రభ బండ్లతో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లిస్తారు. ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ జయసూర్య తెలిపారు.

ఉమా వర్సెస్ వసంత

- మైలవరం టీడీపీ కేడర్‌లో గందరగోళం
- శవరాజకీయాలు మొదలుపెట్టిన మాజీ మంత్రి దేవినేని
- ఉమాపై పోస్టింగ్‌ల దాడి చేస్తున్న వసంత వర్గీయులు
- వసంతకు సహకరించేది లేదంటున్న ఉమా అనుచరులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: మైలవరం టీడీపీ రాజకీయాలు గందరగోళంగా మారాయి. టిక్కెట్టు లేదని దేవినేని ఉమాకు చంద్రబాబు స్పష్టంగా చెప్పారు. అయినప్పటికీ ఆయనకు మైలవరం నియోజకవర్గం టిక్కెట్టుపై ఆశలు మాత్రం చావలేదు. ఏదో పని కల్పించుకొని మైలవరం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఏదో అనారోగ్యంతో సాధారణంగా చనిపోయిన, దేవినేని ఉమాకు టిక్కెట్ రాకపోవడంతో బాధతో గుండె ఆగిపోయిందని ప్రచారం చేసుకొనే స్థాయికి ఆయన దిగజారారు. మొదటి నుంచి శవ రాజకీయాలు చేయడంలో స్పెషలిస్టుగా పేరున్న దేవినేని ఉమా చివరి యత్నంగా శవరాజకీయ అస్త్రాన్ని బయటికి తీశారు. ఇది నియోజక వర్గంలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. దేవినేని ఉమా చీప్ ట్రిక్స్ చూసి, నియోజక వర్గ ప్రజలు సైతం నవ్వుకొంటున్నారు.

వసంత వర్గంలో కల్లోలం....

అధిష్టానం పిలిచి మాట్లాడినప్పటికీ దేవినేని ఉమా పోకడలో ఎటువంటి మార్పు లేకపోవడంతో వసంత వెంకటకృష్ణప్రసాద్ కోటరీలో కల్లోలం మొదలైంది. దేవినేనికి మైలవరం ఎమ్మెల్యే సీటు లేదంటూ గత ఆదివారం న్యూస్ వైరల్ అయిన రోజున మైలవరం మండలం, చంద్రగూడెంకు చెందిన టీడీపీ కార్యకర్త పుల్లారావు, సోమవారం ఇబ్రహీంపట్నంకు చెందిన నూతక్కి సురేష్‌లు అనారోగ్యంతో మృతి చెందారు. అయితే ఈ ఇద్దరు టీడీపీ కార్యకర్తలు దేవినేని ఉమాకి సీటు రానందుకే మృతి చెందారని చిత్రీకరించి వీరిద్దరి కుటుంబాలను దేవినేని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఉమా అనుచరులు వసంత డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ ఘటన వైరల్ కావడంతో కల్లోలానికి గురైన వసంత వెంకటకృష్ణప్రసాద్ తన అనుచరుల చేత ఉమా శవరాజకీయాలు చేస్తున్నాడంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించారు. చంద్రగూడెంకు చెందిన పుల్లారావు అనారోగ్యంతోనే మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు మాట్లాడుకుంటున్న ఆడియోలను సైతం వైరల్ చేశారు. అంతటితో ఆగకుండా ఉమ కుటుంబ చరిత్రను సైతం టచ్ చేసి ఆయన సోదరుడు రమణ మరణానంతరం వదిన ప్రణీతను చంపింది ఉమానేనంటూ, ఇటీవల మృతి చెందిన ఉమా సోదరుడు చంద్రశేఖర్ మృతికి సైతం పరోక్ష కారణం ఉమానే అంటూ సోషల్ మీడియాలో వసంత వర్గీయులు పోస్టులు పెట్టడం కలకలం రేపింది.

ఆది నుంచి రాజకీయ శత్రువులే..

మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, దేవినేని ఉమా కుటుంబాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. గత కొన్నేళ్లుగా ఈ రెండు కుటుంబాల మధ్య అధిపత్యపోరు నడుస్తోంది. ఈ నేపథ్యంలో దేవినేని ఉమానుకాదని, వసంత కృష్ణ ప్రసాద్‌కు సీటు కేటాయించడం అక్కడ టీడీపీ క్యాడర్‌ను గందరగోళంలోకి నెట్టింది. ఎన్నికల్లో వసంతకృష్ణ ప్రసాద్, దేవినేని ఉమాతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నా, దేవినేని ఉమా మాత్రం సహకరించేందుకు సిద్ధంగా లేడన్న భావన టీడీపీ క్యాడర్లో నెలకొంది. మాటల యుద్ధం చూస్తుంటే టీడీపీ పుట్టి మునగడం ఖాయమని భావిస్తున్నారు.

యార్డులో 1,39,349 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,16,503 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,39,349 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 20,500 వరకు పలికింది. తేజ, బాడిగ, దేవనూరు ధర రూ.8 వేల నుంచి 21,000 వరకు ఉంది.

సచివాలయాలతో సుపరిపాలన

రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు(పెనమలూరు): సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని షాదీఖానాలో మునిసిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రమేష్ మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి గాంధీజీ కన్న కలలు సాకారం చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజల చెంతకు చేర్చారని పేర్కొన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటికే సేవలు అందిస్తున్నామని వివరించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు మరింత బాధ్యతతో ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగుతూ మంచి పేరు తీసుకురావాలని కోరారు. సచివాలయాల్లో ఉద్యోగ కల్పనతో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారన్నారు. వలంటీర్లకు సమాజంలో గుర్తింపు ఇచ్చారన్నారు. మళ్లీ జగనన్న సీఎం అయితేనే ఉద్యోగులకు, ప్రజలకు మంచి జరుగుతుందని స్పష్టంచేశారు. మన ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలని కోరారు.

పార్టీ ఫిరాయింపుదారులకు చుక్కలే..

కన్నతల్లి వంటి పార్టీకి ద్రోహం చేసిన వారికి చుక్కలు కనబడతాయని మంత్రి రమేష్ అన్నారు. ఎందుకు పార్టీ మారి వెళ్లామా? అని బాధపడే పరిస్థితులు వస్తాయన్నారు. పార్టీ ధిక్కార చర్యలు చేపట్టి బెదిరింపులకు పాల్పడే నాయకుల భరతం పడతామని హెచ్చరించారు. భవిష్యత్తులో జరిగే మునిసిపల్ ఎన్నికల్లో మంచిగా పనిచేసే వలంటీర్లను గుర్తించి కౌన్సిలర్లు చేస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, కౌన్సిలర్లు డాక్టర్ జంపాన పూర్ణిమ, ఊర శ్రీవాణి, లక్ష్మి, గోన మదన్, గుంజా సుధాకర్, ఎంఏ బేగ్, చిన్ని, కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సద్దాం, షాదీఖానా చైర్మన్ అహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి



మైలవరం: త్వరలో జరిగే సాధారణ ఎన్నికలను జవాబుదారీతనంతో, అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా రిటర్నింగ్ అధికారి సంపత్‌కుమార్ సంబంధిత సిబ్బందికి సూచించారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని లోటస్ సెమినార్ హాల్‌లో ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులు, సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికలు జరిగేందుకు అధికారులు, సిబ్బంది సహకరించాలని పేర్కొన్నారు. ఓటర్లను గమనిస్తూ వారికి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. పోలింగ్ సమయంలో పోలింగ్ బూత్‌లకు సమీపంలో ఓటర్లు మినహా ఇతరులు రాకుండా పోలీస్ శాఖ జాగ్రతలు తీసుకోవాలని ఆదేశించారు. అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారులు, సెక్టార్ అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

2న బీసీల ఆత్మీయ సమావేశం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): గాంధీనగర్‌లోని శ్రీరామ ఫంక్షన్ హాలులో మార్చి రెండో తేదీన 139 బీసీ కులాల ఆత్మీయ సమావేశం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ గణేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీల ఆత్మీయ సమావేశం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడిగా నియమితుడైన డాక్టర్ ఎస్.మారేష్‌ను సన్మానిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి జోగి రమేష్, విజయవాడ ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌తో పాటుగా బీసీ సంఘం సభ్యులు పాల్గొంటారని తెలిపారు. బీసీలందరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయంతం చేయాలని గణేష్ కోరారు.

దుర్గా... నువ్వే కాదా శాకంబరీదేవి..

సాహితీ పద విన్యాసాలతో రంజింపజేసిన అవధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ



డాక్టర్ మాడుగల నాగఫణిశర్మను సత్కరిస్తున్న దేవదాయ కమిషనర్ సత్యనారాయణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దుర్గా.. నువ్వే కాదా శాకంబరీదేవి.. అంటూ ప్రఖ్యాత ద్విసహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ తన అవధానంతో దుర్గమ్మను కీర్తిస్తూ సాహితీ కుసుమలతో అమ్మవారిని స్తుతించారు. రాష్ట్రం నలు మూలల నుంచి తరలివచ్చిన సాహితీవేత్తలు పృచ్ఛకులుగా తమ సాహితీ పటిమను ప్రదర్శిస్తే వారికి డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ దీటైన సాహితీ పద విన్యాసాలతో అలరించారు. ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మదాయ శాఖ, దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీ దుర్గా సౌందర్యలహరి మహాశతావధానం బుధవారం మూడో రోజుకు చేరింది. 30 దత్తపదులు, 30 సమస్యలు, 30 వర్ణనలు, ఆశువులు, అప్రస్తుత ప్రసంగాలను నాగఫణి శర్మ అలవోకగా పూరించి ప్రశంసలు అందుకున్నారు. ప్రజలందరూ ఆరోగ్యవంతులై, చక్కని పాడిపంటలతో తులతూగాలనే అర్థం వచ్చే రీతిలో పృచ్ఛకులు అడిగిన వివిధ అంశాలకు పలు పద్యాలను ఆలపించి ఆకట్టుకున్నారు. తెలుగు, సంస్కృత భాషల్లోనే నెలవైన అవధాన ప్రక్రియ భారతీయుల గొప్ప వారసత్వ సంపద అని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య బేతవోలు రామబ్రహ్మం అన్నారు. ఆ వారసత్వ సంపదను కాపాడి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఆలయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అతిథిగా హాజరై సాహితీవేత్తలను సత్కరించారు. డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, జి.వి.రంగాచార్యులు, కవయిత్రి మొల్ల సాహితీ పీఠం అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగ పెంట హనుమంతరావు, పంతుల వెంకటేశ్వరరావు, సురభి శంకరశర్మ, హరికథకులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామారావు పర్యవేక్షించారు.

పేరంటాలమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం



రామవరప్పాడు(గన్నవరం): విజయవాడ రూరల్ మండలంలోని రామవరప్పాడులో వేంచేసిన శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయానికి బుధవారం ప్రసాదంపాడు గ్రామానికి చెందిన విన్నకోట నాగ వెంకట సాయి హర్షిణి రూ.1,00,116 విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరికి సాయిహర్షిణి, ఆమె కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్వరి మాట్లాడుతూ.. ప్రసాదంపాడు గ్రామానికి చెందిన కొన నాగేశ్వరరావు మనవరాలు సాయిహర్షిణి ఆలయ అభివృద్ధికి ఈ విరాళాన్ని అందజేశారని తెలిపారు. గతంలో వారి కుటుంబం నుంచి రెండు సార్లు దేవస్థానానికి విరాళం అందిందని పేర్కొన్నారు. అనంతరం దాతలను ఆలయ అర్చకులు ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

గోరా టెక్నో హబ్‌తో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం

- నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించే వేదిక
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



ప్రసంగిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, వేదికపై డాక్టర్ సమరం తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, వారిని నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించే లక్ష్యంతో గోరా టెక్నో హబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని నాస్తిక కేంద్రంలో డాక్టర్ జి.సమరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోరా టెక్నో హబ్‌ను కలెక్టర్ ఢిల్లీరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంతో గొప్ప ఉద్దేశంతో, సేవాభావంతో, దార్శనికతతో సమరం టెక్నో హబ్ ఏర్పాటు చేశారన్నారు. రోబోటిక్స్, కృత్రిమ మేధ, క్వాంటం కంప్యూటింగ్, సూపర్ కండక్టర్స్ తదితర ఆధునిక సాంకేతికతలకు సంబంధించి శాస్త్రీయ అవగాహనను పెంపొందించేలా ఈ టెక్నో హబ్ ఉందన్నారు. దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడంలో యువతను భాగస్వామ్యం చేసే ఉద్దేశంతో ఈ హబ్‌ను ఏర్పాటు చేసినందుకు డాక్టర్ సమరంనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం డాక్టర్ జి.సమరం మాట్లాడుతూ.. దేశీయ శాస్త్రసాంకేతికతల ద్వారా వికసిత్ భారత్‌ను సాకారం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మీదేవి, ప్రొఫెసర్ నరేష్, మారు, రష్మీ సమరం తదితరులు పాల్గొన్నారు.

భట్టరాజుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కోటంరాజు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రవ్యాప్తంగా భట్టరాజు సామాజిక వర్గీయుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని ఏపీ రాష్ట్ర భట్టరాజు సంఘం అధ్యక్షుడు కూరపాటి కోటంరాజు తెలిపారు. సంఘం 98వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటంరాజు మాట్లాడుతూ.. 1927లో ఇదే నెల ఇదే రోజున స్థాపించిన సంఘం తొలి సమావేశం తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకా అనపర్తిలో బళ్ల సీతారామరాజు అధ్యక్షతన జరిగిందని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకు క్రమం తప్పకుండా వార్షికోత్సవాలు జరుపుతూ అనేక తీర్మానాలు చేసి, వాటిని అమలు చేస్తున్నామని వివరించారు. అంతిమంగా భట్టరాజు సామాజికవర్గం మొత్తం ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపీ భట్టరాజు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి దేవి, కవి శ్రీకంఠస్ఫూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘీయులంతా కలిసికట్టుగా ఒకరికొకరు సహాయ, సహకారాలు అందించుకుని వారి అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి భట్టు మనోహర కుమార్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, కార్యదర్శి వై.రామరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ పోరంకి పద్మావతి, సంఘ సభ్యులు చక్రవర్తి, చిన కోటంరాజు, చలంరాజు, శివాజి రాజు, పరమేశ్వరరాజు, నాగ శేషుకుమారి లక్ష్మి, సనస్వతి దేవి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రానున్న సాధారణ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ, జాబితా నిరంతర నవీకరణ, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియ తదితర అంశాలపై నగరంలోని కలెక్టరేట్లో కలెక్టర్ ఢిల్లీరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తుది ఓటర్ల జాబితాలో నమోదవుతున్న అభ్యంతరాలను విచారణ చేసిన అనంతరం పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు నమోదైన ఫారం 6,7,8 దరఖాస్తులు పరిశీలించిన తీరును రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఫారం-6 దరఖాస్తులు నామినేషన్ల తుది గడువు వరకు స్వీకరిస్తామన్నారు. జిల్లాలో 1,781 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ఎన్నికల నిర్వహణకు 169 సెక్టార్ అధికారులు, 169 సెక్టార్ పోలీస్ అధికారులు, 800 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో గత సాధారణ ఎన్నికల్లో నమోదైన వివరాలతో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి జాబితా రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి వచ్చిన సమస్యాత్మక స్టేషన్ల వివరాలను అందజేయాలని కోరారు. గతంలో జరిగిన ఎన్నికల్లో నమోదైన ఓటింగ్ శాతం ఆధారంగా ఏడు రకాల పారా మీటర్లతో పోలింగ్ స్టేషన్లు గుర్తిస్తామన్నారు. ఇప్పటి వరకు వివిధ వార్తా పత్రికల్లో ప్రచురితమైన 164 ప్రతికూల వార్తలకు సంబంధించిన విచారణ పరిష్కార నివేదికను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సమావేశంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా ఆర్చరీ పోటీలు



ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణాజిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్షుడు వేణుగోపాలరావు

విజయవాడస్పోర్ట్స్: ఖేలో ఇండియా ఎన్టీపీసీ విజయవాడ సిటీ లెవల్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు విజయవాడ మహానాడు రోడ్డులోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో బుధవారం ఉత్కంఠభరితంగా సాగాయి. అండర్-9 కిడ్స్, మినీ సబ్‌జూనియర్, సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ స్త్రీ,పురుషుల విభాగాల్లో జరిగిన ఈ పోటీలకు పలు ప్రాంతాల నుంచి 90 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. తొలుత ఈ పోటీలను కృష్ణాజిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.వేణుగోపాలరావు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ, కృష్ణా జిల్లా సంఘం కార్యదర్శి కృష్ణకుమారి, ప్రతినిధులు ప్రేమ్‌కుమార్ పోటీలను పర్యవేక్షించారు. విజేతలుగా నిలిచిన 54 మందికి ట్రోఫీలు, సర్టిఫికెట్‌లు, పతకాలు అందజేశారు.

ఉంగుటూరు ఇన్‌చార్జి ఎంఈఓపై విచారణ

ఉంగుటూరు(గన్నవరం): ఉపాధ్యాయులు, సిబ్బందిని ఇన్‌చార్జి ఎంఈఓ-1 జి.వెంకటేశ్వరరావు పలు రకాలుగా వేధిస్తున్నారనే ఫిర్యాదుపై ఉయ్యూరు డీవైఈఓ ఐ.పద్మారాణి బుధవారం విచారణ జరిపారు. తోట్లవల్లూరు ఎంఈఓ వెంకటేశ్వరరావు ఉంగుటూరు ఇన్‌చార్జ్ ఎంఈఓ-1గా మూడేళ్లుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తరచూ పాఠశాలల సందర్శన, తనిఖీల పేరుతో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలను, ఎంఈఓ కార్యాలయ సిబ్బందిని పరుష పదజాలంతో మాట్లాడటంతో పాటు సహ ఉద్యోగి ఎంఈఓ-2ను సభల్లో చులకనగా మాట్లాడేవారని ఆరోపణలు ఉన్నాయి. అతని వేధింపులను భరించలేక ఉపాధ్యాయులు, సీఆర్పీలు, కార్యాలయ సిబ్బంది ఆర్జేడీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వంశీ స్పందించి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డీఈఓను కోరారు. ఈ నేపథ్యంలో డీఈఓ తాహెరా సుల్తానా ఉయ్యూరు డీవైఈఓ పద్మారాణిని విచారణ అధికారిగా నియమించారు. డీవైఈఓ పద్మారాణి విచారణ చేపట్టి ఇందుపల్లి ఎంపీపీ పాఠశాల, మానికొండ కొత్తపేట ప్రాథమిక పాఠశాల, పెద అవుటపల్లి శివారు రామకృష్ణాపురం ఎంపీపీ పాఠశాల, ఉంగుటూరు, తేలప్రోలు, మానికొండ కాంప్లెక్స్ సీఆర్పీలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అటెండర్, ఎంఈవో-2 నుంచి వివరాలు సేకరించారు. తమను ఎంఈఓ వెంకటేశ్వరరావు ఏ విధంగా వేధించేవారో లిఖితపూర్వకంగా వారు వివరించారు. అనంతరం ఎంఈఓ-1 వెంకటేశ్వరరావును డీవైఈఓ కూడా విచారించారు. తన విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తానని డీవైఈఓ పద్మారాణి తెలిపారు.

మద్దతుగా వచ్చిన టీచర్లకు మందలింపు

ఎంఈఓ-1పై డీవైఈఓ విచారణ చేస్తున్న సంగతి తెలుసుకున్న పలు గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు ఎంఈఓ కార్యాలయానికి ఆయనకు మద్దతుగా వచ్చారు. పాఠశాల వేళల్లో ఎంఈఓ కార్యాలయానికి ఎందుకు వాచ్చరని డీవైఈఓ వారిని ప్రశ్నించారు. పాఠశాల పనివేళల్లో బయట తిరగడం సరికాదని మందలించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చిట్టినగర్ సారంగం రోడ్డులోని సాధుజాన్ వీధిలో పుంగ్రోతి విజయ్‌కుమార్, నాగలక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆటో నడుపుతూ జీవనం సాగించే విజయ్‌కుమార్ కొంత కాలంగా ఆర్థిక సమస్యల కారణంగా అప్పులు చేశాడు. మంగళవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో విజయ్‌కుమార్ భార్య నాగలక్ష్మికి ఫోన్ చేసి అప్పుల బాధతట్టుకోలేక పురుగుల మందు తాగానని చెప్పాడు. దీంతో వెంటనే రోడ్డుపైకి వచ్చిన ఆమె భర్త విజయ్‌కుమార్‌ను హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో విజయ్‌కుమార్ మృతిచెందాడని వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు



నిందితులతో డీఎస్పీ జయసూర్య తదితరులు

ఉయ్యూరు(పెనమలూరు): హత్యాయత్నం కేసులో నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామని గన్నవరం డీఎస్పీ జయసూర్య తెలిపారు. స్థానిక పట్టణ పోలీసుస్టేషన్‌లో బుధవారం నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. డీఎస్పీ జయసూర్య కథనం మేరకు.. వీరమ్మతల్లి తిరునాళ్లలో ఈ నెల 25వ తేదీ రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పెనమలూరు మండలం కానూరులోని సనత్‌నగర్‌కు చెందిన పాము, విజయవాడకు చెందిన ఉజ్వల్ మొక్కులు తీర్చుకుని ఆలయ సమీపంలోని ఒకే ప్రాంతంలో భోజనాలకు ఏర్పాట్లు చేసుకున్నారు. పాము తరఫు వచ్చిన కొండూరు మణికంఠ (కేటీఎం పండు), కళింగపట్నం మనోహర్ బబ్లూ, పాంచాల సాయి సిద్ధు ఖాళీప్రదేశంలో కూర్చుని మద్యం తాగుతుండగా, ఉజ్వల్ ఏర్పాటు చేసిన భోజనానికి వచ్చిన కృష్ణలంక ప్రాంతానికి చెందిన రాజు వారి వద్దకు వచ్చాడు. సిగరెట్ వెలిగించేందుకు మనోహర్‌ను నిప్పు అడగ్గా, సాయిసిద్ధు ఇచ్చాడు. అయితే రాజును ఉద్దేశించి గంజాయి బ్యాచ్ అంటూ వారు హేళన చేశారు. దీంతో మనోహర్‌పై ఉజ్వల్ తరఫున వచ్చిన సంతోష్ దాడిచేసి గాయపరిచాడు. అనంతరం కేటీఎం పండు తన చేతిలో ఉన్న బీరుబాటిల్‌తో సంతోష్‌పై దాడిచేసి గాయపరిచాడు. సంతోష్ ఫిర్యాదు మేరకు కేటీఎం పండు, మనోహర్, సాయిసిద్ధులపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కేటీఎం పండుపై పెనమలూరు పోలీసుస్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది. సమావేశంలో సీఐలు హబీబ్ బాషా, వి.శ్రీనివాసరావు, పట్టణ ఎస్ఐ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

యూజీసీ ప్రతిపాదనలను తిరస్కరించండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రిజర్వేషన్లపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చేసిన దుర్మార్గపు ప్రతిపాదనలను తక్షణమే తిరస్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. కేంద్ర విద్యా సంస్థల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్లలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు లేరనే సాకు చూపి, ఆ ఖాళీలను డీరిజర్వ్ చేసి, వాటిని తిరిగి జనరల్ అభ్యర్థులతో భర్తీ చేయాలనే ఆలోచన సరికాదని స్పష్టంచేశారు. ఈ మేరకు యూజీసీ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి, అన్ని యూనివర్సిటీలకు, కేంద్ర విద్యా సంస్థలకు, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ అధికార వర్గానికి అధికారికంగా సిఫార్సులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సిఫార్సుల అసలు లక్ష్యం రిజర్వేషన్లను ఎత్తేసే కుట్రగా భావిస్తున్నామని తెలిపారు. ఈ ఆలోచనలు తక్షణమే రద్దు చేయకుంటే దేశంలో పెద్ద ఎత్తున బీసీ ఉద్యమం చెలరేగుతుందని, తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఇలాంటి తప్పుడు ప్రతిపాదనల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ సమాజానికి భారత రాజ్యాంగం విద్య, ఉద్యోగ రంగాల్లో కల్పించిన రిజర్వేషన్లను దూరం చేసి, ఉన్నత విద్యారంగంలో ఎదగనీయకుండా, వారి అభివృద్ధిని అడ్డుకోవాలనే కుట్రలు ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారి ఆటలను సాగనీయబోమని కేసన శంకరరావు స్పష్టంచేశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ లయోలా గార్డెన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరానగర్‌లోని 1, 2, 3 అంతర్గత రహదారులు, స్పెన్సర్ సూపర్‌మార్కెట్ సైడు రోడ్డు, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, సెంటినీ హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఈఎన్‌టీ వైద్యుల సంఘం నూతన కమిటీ ఎన్నిక


డాక్టర్ దేవినేని ప్రదీప్, అధ్యక్షుడు


డాక్టర్ కేఎస్ భార్గవ్, ప్రధాన కార్యదర్శి

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారతీయ ఈఎన్‌టీ వైద్యుల సంఘం విజయవాడ శాఖ నూతన కార్యవర్గన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో బుధవారం జరిగిన సమావేశంలో 2024 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ దేవినేని ప్రదీప్, ఉపాధ్యక్షునిగా డాక్టర్ ఆర్.పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ భార్గవ్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ తన్వీర్ అఫ్రోజ్, కోశాధికారి డాక్టర్ కె.వినీషాలను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా వైద్యులు పి.సుధ, అనూష, గోపీనాయక్, కె.స్పందనలను నియమించారు.

ఎఫ్టానిక్స్‌కు సీఐఐ గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవార్డు



లబ్బీపేట(విజయవాడతూర్పు): మంగళగిరిలోని ఎఫ్టానిక్స్ సంస్థకు సీఐఐ(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అవార్డు లభించినట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి రామకృష్ణ తెలిపారు. నగరంలోని తమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న న్యూఢిల్లీలో జరిగిన సీఐఐ సమావేశంలో ఉత్తమ టెక్నాలజీ రూపొందిస్తున్న తమ సంస్థకు అవార్డు లభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెయింటెనెన్స్ సిస్టమ్ రంగాల్లో తమ సంస్థ అత్యుత్తమ సేవలను అందించినందుకు గాను అవార్డు లభించిందన్నారు. ఐబీఎం మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ చేతుల మీదుగా తమ సంస్థ ఆర్ అండ్‌డీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భవానీ శంకర్, మార్కెటింగ్ మేనేజర్ మార్కండేయ వెంకట్ అవార్డును అందుకున్నారని తెలిపారు. దేశంలోని వివిధ ఐఐటీలు, పరిశ్రమలకు చెందిన ప్రముఖ నిపుణులతో కూడిన స్వతంత్ర జ్యూరీ సంస్థ రెండు దశల వారీగా 100కు పైగా కంపెనీలు సొల్యూషన్స్‌ను పరిశీలించి ఎఫ్టానిక్స్ సంస్థను అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు. ఇటీవల భద్రత, సమయపాలన, కార్యకలాపాల ప్రణాళికలను మెరుగుపరచడానికి భారతీయ రైల్వే ఎక్కువ దృష్టి కేంద్రీకరించిందని, దీనికి గాను తమ సంస్థ రియల్ టైమ్ డేటాను విశ్లేషించి, సొల్యూషన్స్‌ను అందించినట్లు ఆయన తెలిపారు. అవార్డు రావడం పట్ల కంపెనీ సిబ్బందిని అభినందించారు.

ఘనంగా టైలర్స్ డే



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నవ్యాంధ్ర విజయవాడ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 36వ టైలర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన ఈ వేడుకలకు అసోసియేషన్ సెక్రటరీ పిల్లి అనిల్‌కుమార్ అధ్యక్షతన కార్యక్రమంలో తొలుత అసోసియేషన్ ప్రతినిధులు కుట్టు మిషన్ ఆవిష్కర్త హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పిల్లి అనిల్ కుమార్ మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏటా టైలర్స్ ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు(దత్తా) మాట్లాడుతూ హోవే ఆవిష్కరించిన కుట్టు మిషన్ నేడు ఎందరికో ఉపాధి కల్పిస్తోందన్నారు. సమాజానికి టైలర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిల్వెస్టర్ మిమిక్రీ ప్రదర్శన, లావణ్య బృందం భరత నాట్య ప్రదర్శన, కేవీ భాస్కర్ బృందం హాస్య వల్లరి సభికులను అలరింపజేసింది. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారు కొండేటి కృష్ణ, స్టీరింగ్ కమిటీ చైర్మన్ కూరపాటి రాఘవరాజు, ప్రెసిడెంట్ జె.డి. కళ్యాణ్, వైస్ ప్రెసిడెంట్ ఎండీ షఫీవుల్లా, జాయింట్ సెక్రటరీ షేక్ అస్లాం, కోశాధికారి జె.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల సేవలు భేష్

- తూర్పులో 100 వార్డు సచివాలయాలు
- సంక్షేమ పథకాల అమలులో కీలకం
- ఇంటి సమీపంలోనే అన్ని రకాల సేవలు
- వాటి పరిధిలో 1,190 మంది వలంటీర్ల సేవలు
- తూర్పులో రూ.900 కోట్లతో సంక్షేమ పథకాలు


89వ సచివాలయంలో ప్రజలకు సేవలు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఒకప్పుడు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. తమ ఇంటి సమీపంలోని వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే నిర్దేశిత కాల వ్యవధిలో సర్టిఫికెట్ మంజూరవుతుంది. మళ్లీ వెళ్లి సచివాలయంలో సర్టిఫికెట్ పొందవచ్చు.

దేశ చరిత్రలోనే తొలిసారిగా..

ఒకప్పుడు ఆధార్‌లో పేరు సవరించాలన్నా, అప్‌డేట్ చేయాలన్నా ఆధార్ కేంద్రాల వద్దకు వెళ్లి బారులు తీరి క్యూలో ఉండాల్సి వచ్చేది. ప్రస్తుతం ఎంపిక చేసిన సచివాలయాల్లో ఆధార్ సేవలను సైతం అందుబాటులోకి తెచ్చారు. దీంతో తమకు కుదిరిన సమయంలో వెళ్లి సేవలు పొందగలుగుతున్నారు. ఇలా ఈ రెండు సేవలే కాదు ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుతో పాటు, మీ సేవలో అందించే సేవలు, కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్సీ) ద్వారా అందించే 60 రకాల సేవలను ఈ వార్డు సచివాలయం ద్వారా అందజేస్తున్నారు. దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తొలిసారిగా వార్డు సచివాలయాలు ఏర్పాటు ద్వారా ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చారు. అంతేకాదు తూర్పు నియోజకవర్గంలో రూ.900 కోట్ల సంక్షేమ పథకాలు అందించడంతో కీలకంగా వ్యవహరించాయి.


సచివాలయంలో అందించిన పథకాలతో కూడిన పోస్టర్

పూర్తి స్థాయిలో ఉద్యోగులు

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 100 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వాటిలో అడ్మిన్, వెల్ఫేర్, డిజిటల్, శానిటేషన్(ఎన్విరాన్‌మెంట్), హెల్త్, ప్లానింగ్, వర్క్ సెక్రటరీ, మహిళా పోలీసులు పనిచేస్తున్నారు. ఈ సెక్రటరీలు ఆయా విభాగాలకు సంబంధించి సేవలు అందిస్తుంటారు. అంతేకాదు వీరికి అనుసంధానంలో ఒక్కో సచివాలయం పరిధిలో 10 నుంచి 13 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సచివాలయ సెక్రటరీలను ఇచ్చిన సమాచారాన్ని సేకరించడం, అప్‌డేట్ చేయడం చేస్తున్నారు.

సేవల్లో కీలకంగా..

ప్రస్తుతం వార్డు సచివాలయాలు అన్ని రకాల ప్రభుత్వ సేవల్లో కీలకంగా మారాయి. ముఖ్యంగా నవరత్నాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా లబ్ధిదారులకు గుర్తించి, పథకాలు పంపిణీలో సచివాలయ కార్యదర్శుల పాత్ర కీలకంగా మారింది. అంతేకాదు ఇంటి నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్స్ దరఖాస్తులు, రేషన్ కార్డులు మంజూరు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీ, పన్నులు చెల్లింపులు, పన్నుల్లో పేర్లు మార్పులు, పారిశుద్ధ్య నిర్వాహణ వంటి అనేక రకాల సేవలను సచివాలయాల్లో అందిస్తున్నారు. అంతేకాదు తాజాగా ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు సైతం సచివాలయాల్లో అందుబాటులోకి తెచ్చింది. రోడ్లు, డ్రెయినేజీ, వీధిలైట్లు వంటి నిర్వహణను సచివాలయ కార్యదర్శులు చూస్తుంటారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రతి నెలా మొదటి తేదీనే పెన్షన్‌లు అందించడంలో కీలకంగా మారాయి.

సచివాలయంలో సేవలు ఇలా..	
వార్డు సచివాలయం నంబర్ :	089
ఏరియా :	బాడవపేట
సచివాయల పరిధిలోని ఇళ్లు :	1,310
సచివాలయ పరిధిలో జనాభా :	3,700
డీబీటీ ద్వారా అందించిన నగదు :	రూ. 9.53 కోట్లు
డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా అందించిన నగదు :	రూ.13.20 కోట్లు

కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదు..



వార్డు సచివాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా ఏ పని ఉన్నా అక్కడకు వెళ్లి చేయించుకోలుగుతున్నాం. కుల ధ్రువీకరణ పత్రాల కోసం మండల రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు. సచివాలయంలోనే ఇచ్చేస్తున్నారు. రేషన్ కార్డు, పన్నుల చెల్లింపులు తదితర అన్ని సేవలు ఇక్కడే అందుతున్నాయి. సేవలు బాగున్నాయి.

– నాగ రమేష్, ఫకీరుగూడెం

అన్ని రకాల సేవలు అందుతున్నాయి..



వార్డు సచివాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా వాటిలో అన్ని రకాల సేవలు అందుతున్నాయి. ఏ పని కావాలన్నా అక్కడకు వెళితే పని అయిపోతుంది. అన్ని శాఖల సమన్వయంతో ఇక్కడ సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా ఇంటి సమీపంలోనే సచివాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే పాలనను తీసుకు వచ్చారు.

– సయ్యద్ అలీం, లబ్బీపేట

నిబంధనలు అతిక్రమిస్తే పీడీ యాక్ట్ అమలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీసీపీ కృష్ణకాంత్ పటేల్

కృష్ణలంక(విజయవాడతూర్పు): నిబంధనలు అతిక్రమించి అసాంఘిక, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని డీసీపీ కృష్ణకాంత్ పటేల్ హెచ్చరించారు. సీపీ కాంతిరాణా టాటా ఆదేశాల మేరకు బుధవారం కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఆవరణంలో సౌత్ డివిజన్ పరిధిలోని కృష్ణలంక, గవర్నర్‌పేట, సూర్యారావుపేట పోలీస్ స్టేషన్లకు సంబంధించిన గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్, యాక్టివ్ రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ కృష్ణకాంత్ పటేల్ మాట్లాడుతూ.. గంజాయి సేవించినా, అమ్మినా, సరఫరా చేసినా అటువంటి వారిపై కేసు నమోదు చేయడమే కాకుండా నగర బహిష్కరణకు వెనుకాడబోమన్నారు. గంజాయి మత్తులో నేరాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. చిన్న పిల్లలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళ్ల ముందు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సౌత్ డివిజన్ ఏసీపీ రత్నరాజు, కృష్ణలంక, గవర్నర్‌పేట, సూర్యారావుపేట సీఐలు ఏ.మురళీకృష్ణ, దుర్గారావు, డి.వి.రమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మినీ జాబ్‌మేళా

పెనమలూరు: పోరంకిలో మినీ జాబ్ మేళాను గురువారం నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. పోరంకి శ్రీనివాసానగర్‌లోని హ్యాపీ మైండ్స్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం ఉదయం 9.30 గంటల నుంచి జాబ్‌మేళా ఉంటుందన్నారు. ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుకున్న యువత జాబ్‌మేళాకు రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96666 15539లో సంప్రదించాలని సూచించారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల మంజూరు

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను మంజూరు చేస్తున్నామని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. కృష్ణలంక 22వ డివిజన్‌లోని గంగానమ్మ గుడి రోడ్డు, సతీష్‌కుమార్ రోడ్డు, బైరెడ్డి వారి వీధిల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నాలుగేళ్ల ఎనిమిది నెలల కాలంలో జగనన్న ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మీ అవినాష్ అన్న హామీ పేరుతో ముద్రించిన మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం 2024లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని హామీలు నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు.

రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు

అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో అవినాష్ మాట్లాడుతూ.. డివిజన్‌లో సుమారు రూ.7 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. వైఎస్సార్ పేద ప్రజల సంక్షేమం కోసం ఒక అడుగు వేస్తే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 10 అడుగులు ముందుకు వేసే దమ్మున్న ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. కృష్ణలంక, భ్రమరాంబపురం ప్రాంతవాసుల చిరకాల కోరికైన ఇళ్ల పట్టాల సమస్య త్వరలో పరిష్కారం కానుందని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 98 శాతానికి పైగా హామీలు అమలు చేసిన దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రాబోయే ఎన్నికలకు మేము సిద్ధంగా ఉన్నామని వైఎస్ జగన్ బొమ్మే మమ్మల్ని గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కానీ ప్రతిపక్ష పార్టీలు ఇంతవరకు అభ్యర్థులను కూడా ప్రకటించుకోలేని దీన స్థితిలో ఉన్నాయని ఎద్దేవా చేశారు. నయవంచనకు మారుపేరు అయిన చంద్రబాబునాయుడు నేడు మరలా పవన్‌కళ్యాణ్‌ను నిట్టనిలువునా ముంచారని ఆ పార్టీ నాయకులే రగిలిపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ దుర్గ, కార్పొరేటర్ కొండారెడ్డి


18వ డివిజన్‌లో పథకాలను వివరిస్తున్న అవినాష్, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ

18వ డివిజన్‌లో..

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోట, 18వ డివిజన్‌లోని మాదంశెట్టి సీతయ్య వీధి ప్రాంతంలో దేవినేని అవినాష్ గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం సాయంత్రం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే 2024లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలతో ముద్రించిన మీ అవినాష్ అన్న హామీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్పొరేటర్, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, డెప్యూటీ మేయర్ దుర్గ, నాయకులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ పార్క్ పనులు త్వరగా పూర్తి చేయండి


పార్క్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పెంచే రిటైనింగ్ వాల్ పార్క్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు ఆదేశించారు. ఆయన నగర పర్యటనలో భాగంగా కృష్ణానది ఫేస్–2 రిటైనింగ్ వాల్ వెంబడి కనకదుర్గ వారధి నుంచి పోలీస్ కాలనీ డీపీ స్టేషన్ వరకు నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పార్కును బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పేపర్ బ్లాక్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో అవసరమైతే బ్యాచులను పెంచి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాత్‌వేను పరిశీలించి మలుపులు అత్యంత సుందరంగా ఉండాలన్నారు. ప్రత్యేక మొక్కలను ఏర్పాటు చేసి గ్రీనరీ వర్క్ వెంటనే మొదలు పెట్టాలని ఆదేశించారు. ఏడీ మహేష్, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, డెప్యూటీ ఇంజినీర్ పార్క్స్ పురుషోత్తం పాల్గొన్నారు.

రాష్ట్రంలో దేవాలయాలకు పునర్‌వైభవం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే విష్ణు


కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే విష్ణు, నాయకులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): హిందూ ధర్మ పరిరక్షణకు, వైదిక ధర్మాన్ని కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో రూ.70 లక్షల సీజీఎఫ్(కామన్ గుడ్ ఫండ్)తో నిర్మించిన నూతన భవనాన్ని స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానానికి 90 ఏళ్ల ఘన చరిత్ర ఉందన్నారు. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన ఆలయ అభివృద్ధిని గత పాలకులు పూర్తిగా విస్మరించారని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పురాతన, శిథిలావస్థకు చేరుకున్న ఆలయాలకు సీజీఎఫ్ ఫండ్‌తో పునర్‌వైభవం తీసుకువస్తున్నామని తెలిపారు. కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.70 లక్షల నిధులు కేటాయించడం ఆలయ చరిత్రలో తొలిసారని విష్ణు చెప్పారు. అదే విధంగా రూ.95 లక్షలతో గవర్నర్‌పేటలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం, రూ.18 లక్షలతో తుమ్మలపల్లి కళాక్షేత్రం వెనుకనున్న శ్రీ వీరబాబుస్వామి ఆలయాన్ని ఆధునికీకరిస్తామన్నారు. దేవాలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దైవబలం తోడైందన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుతూ, దేవాలయాల వ్యవస్థను ఎల్లవేళలా పరిరక్షిస్తూ ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముక్కంటి దేవతల ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి నిధులు ఇచ్చిన దాతలను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.సుపద్మాదేవి, ఆలయ చైర్మన్ కొల్లూరు రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు, నాయకులు దోనేపూడి శ్రీనివాస్, కనపర్తి కొండా, సుధీర్ పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేలా తీర్చిదిద్దండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ సుబ్బారావు, ఇతర ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థి దశ నుంచే పరిశోధనలపై దృష్టి సారించి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు తెలిపారు. డెమొక్రటిక్ పీఆర్టీయూ ఆంధ్రప్రదేశ్ శాఖ, ఉపాధ్యాయ సేవాదల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జాతీయ సైన్స్ డే వేడుకలను నిర్వహించారు. ఆయా సంఘాల అధ్యక్షుడు డి.శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో డీఈఓ సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతరత్న, నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ స్ఫూర్తితో ప్రపంచ విజ్ఞాన శాస్త్ర వినువీధుల్లో భారతీయ వైజ్ఞానిక పతాకాన్ని రెపరెపలాగించే శాస్త్రవేత్తలుగా మన విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అనంతరం డి.శ్రీను మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల చక్కటి అభిరుచిని కల్పించేందుకు ఉపాధ్యాయ సేవాదళ్ అనేక వినూత్న కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో విజయవాడ, నందిగామ డీవైఈఓలు కేఎస్ కుమార్, ఎం.వెంకటప్పయ్య, ఎంఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరత్నం, రాంబాబు నాయక్, మత్రి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

ఆవిష్కరణలపై అవగాహన పెంపొందించుకోవాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మనం చేసే ప్రతి పని వెనుక సైన్స్ దాగి ఉందని, విద్యార్థులు శాస్త్రీయ జ్ఞానం, ఆవిష్కరణలపై అవగాహన పెంపొందించుకోవాలని శ్రీ చైతన్య కృష్ణలంక శాఖ ప్రధానోపాధ్యాయురాలు కె.మహాలక్ష్మి అన్నారు. కృష్ణలంకలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఆవరణంలో బుధవారం నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని సైన్స్ ఎక్స్ పో నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో కాంతి పరిక్షేపణపై అపారమైన పరిశోధనలు చేసిన వ్యక్తి సీవీ రామన్ అని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు ఆకర్షణీయంగా నిలిచాయి. కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్లు మహిత, హిమబిందు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మడోన్న పాఠశాలలో..

గుణదల(విజయవాడతూర్పు): విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని మడోన్న బధిర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ మరియ అన్నారు. జాతీయ సైన్స్ డే సందర్భంగా గుణదలలోని మడోన్న పాఠశాలలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమం బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. తమ కళాశాలలో చదువుతున్న బధిర విద్యార్థులు ఇతర విద్యార్థులతో పోటీపడుతున్నారని తెలిపారు. అంగవైకల్యాన్ని అధిగమించి చదువులో, ఆట పాటల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు తమ పాఠశాలలో పలు సాంస్కృతిక, వైజ్ఞానిక ప్రదర్శనలు, పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిట్స్ విద్యార్థుల ప్రతిభను చాటి చెప్పే విధంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థులు

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న యువకుడిని కొత్తపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సెక్టార్ ఎస్ఐ దేవసుధ బుధవారం తెల్లవారుజామున ఎర్రకట్ట, పాత రాజరాజేశ్వరి పేట ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా ఎస్ఐ దేవసుధ విచారించారు. పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన షేక్.ఖాజాగా గుర్తించి అతని వద్ద ఉన్న సంచిని పరిశీలించారు. అందులో 9 మద్యం బాటిల్స్, 9 బీర్ బాటిల్స్‌ను గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

డాక్యుమెంట్స్ పోయినవి

N.T.R. జిల్లా, విజయవాడ, లబ్బీపేట, వాస్తవ్యులు నా భర్తగారైన కూనల హరిసత్యనారాయణరావు S/o. పూర్ణచంద్రరావు గారి యొక్క విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 19-03-1980 తేదీన నెం. 1861/1980గా రిజిస్టరు కాబడిన పార్టీషన్ దస్తావేజు ది. 02-02-2024 తేదీన జిరాక్స్‌కు వెళ్ళుచుండగా పటమట హైస్కూల్ రోడ్డులో జిప్ బ్యాగ్‌తో ఉన్నవి పోయినవి. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబరు సంప్రదించవలసినదిగా కోరుచున్నాను.
కూనల సుబ్బలక్ష్మి, సెల్: 94908 60118

క్లుప్తంగా...

టీడీపీకి ఊడిగం చేయలేం

రాష్ట్ర కాపు యువసేన అధ్యక్షుడు కర్జా శ్రీనివాసరావు

శావల్యాపురం: టీడీపీకి ఊడిగం చేస్తూ.. వారిని ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోబెట్టేందుకు కాపులు సిద్ధంగా లేరని ఆంధ్రప్రదేశ్ కాపు యువసేన అధ్యక్షులు కర్జా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బుధవారం ఆయన పల్నాడు జిల్లా శావల్యాపురం మండలంలోని గంటావారిపాలెంలో మాట్లాడారు. 2014 ఎన్నికల్లో కాపుల ఓట్లు వేయించుకుని.. కాపులకు చంద్రబాబు ఇస్తానన్న రిజర్వేషన్లు అడిగినందుకు కాపు యువకులపై అక్రమ కేసులు బనాయించిన విషయాన్ని మరువలేమని చెప్పారు. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం, ఆయన కుటుంబ సభ్యులను నడిరోడ్డుపై ఈడ్చుకెళ్లిన ఘటనను కాపు జాతి ఎప్పటికీ క్షమించబోదని తెలిపారు. టీడీపీ ఎన్ని పొత్తులు పెట్టుకున్నా.. చంద్రబాబు అండ్‌కో మోసపూరిత మాటలు నమ్మే పరిస్థితిలో కాపులు లేరన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కాపులు, ప్రజలంతా అఖండ మెజారిటీతో గెలిపించడం ఖాయమని స్పష్టం చేశారు. కాపు కురువృద్ధుడు తెలంప్రోలు రాఘవేంద్రరావు, కాపు యువసేన నాయకులు వడ్రాణం నాగేశ్వరరావు, తెలంప్రోలు రవికుమార్, మరిశెట్టి నరేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్ అవమానించారు

- వైఎస్సార్ సీపీలో చేరుతా..
- ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి

వేంపల్లె : మూడు దశాబ్దాలుగా టీడీపీకి ఎనలేని సేవలు చేసినా ఫలితం దక్కలేదని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్వీ సతీష్‌కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాను నమ్మిన టీడీపీ అధినేత చంద్రబాబు, కుమారుడు లోకేశ్ వైఎస్ కుటుంబంతో లాలూచీ పడ్డానని తనను ఘోరంగా అవమానించారన్నారు. దీంతో ఆ పార్టీకి రాజీనామా చేసి, నాలుగేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉన్నానని తెలిపారు. కొంతమంది టీడీపీ నేతల చెప్పుడు మాటలు విని.. టీడీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు ఛీత్కారాలు ఎదుర్కొన్నానన్నారు. పార్టీలో నేతల కుట్రలు, కుతంత్రాలకు విసిగిపోయి కొన్నేళ్లు దూరంగా ఉండాల్సి వచ్చిందని చెప్పారు. అయితే తన అనుచరులు, కార్యకర్తలు తిరిగి రాజకీయ ప్రవేశం చేయాలన్నారని, ఎవరితో పోరాటం చేశానో అలాంటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనకు స్నేహహస్తం అందించారని, ఇది ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఆహ్వానం మేరకు తను వైఎస్సార్‌సీపీలోకి చేరేందుకు నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

రెడ్ డైరీ కేసు విచారణ 11కు వాయిదా

సాక్షి, అమరావతి: రెడ్ డైరీ కేసులో నారా లోకేశ్ తరఫు న్యాయవాదులు మరోసారి గడువు పేరుతో విచారణను సాగదీసేందుకే ప్రాధాన్యతనిచ్చారు. టీడీపీ హయాంలో స్కిల్ స్కాం కేసులో సాక్షులను బెదిరిస్తూ దర్యాప్తును ప్రభావితం చేసేందుకు యత్నించిన లోకేశ్‌పై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆయన్ని అరెస్ట్ చేసేందుకు అనుమతి కోరుతూ న్యాయస్థానంలో సీఐడీ పిటిషన్ వేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలన్న న్యాయస్థానం ఆదేశాలపై ఇప్పటికే లోకేశ్ తరఫు న్యాయవాదులు పలుమార్లు గడువు కోరారు. బుధవారం విచారణ సందర్భంగా మరోసారి ఆయన తరఫు న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కోరడంతో కేసును న్యాయస్థానం మార్చి 11కు వాయిదా వేసింది.

లక్ష్మీ నారాయణ పిటిషన్‌పై 5న విచారణ

స్కిల్ స్కామ్ కేసులో అప్రూవర్ పిటిషన్‌లో దాఖలు చేసిన పత్రాలు కావాలని కోరుతూ ఆ కేసులో నిందితుడు(ఏ2)గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీ నారాయణ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణను విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం మార్చి 5కు వాయిదా వేసింది. చంద్రబాబు ఆదేశాలతోనే బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించానని ఈ కేసులో ఏ22గా ఉన్న ఎంసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్ షా న్యాయస్థానానికి వివరించారు. తాను అప్రూవర్‌గా మారేందుకు అనుమతి కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. కాగా ఆయన సమర్పించిన పత్రాలు కావాలని లక్ష్మీ నారాయణ న్యాయస్థానాన్ని కోరుతూ అంతవరకు అప్రూవర్ వాంగ్మూలం నమోదు చేయకూడదని వాదించారు. ఆయన కోరిన పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదని విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో విచారణ సందర్భంగా వాదనలు వినిపించారు. వాదనల అనంతరం కోర్టు విచారణను వాయిదా వేసింది.

రైతుల్ని పశువుల్లా చూస్తున్న కేంద్రం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సాక్షి, న్యూఢిల్లీ: దేశ సరిహద్దుల్లో తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తున్న రైతులను బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పశువులు కంటే హీనంగా చూస్తున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నారాయణ మీడియాతో మాట్లాడారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కలిసి ఉంటే ప్రధాని మోదీకి కడుపు మంట దేనికన్నారు. ఎన్డీఏ కూటమి బలహీనపడుతూ, ఇండియా కూటమి బలపడడమే ఇందుకు కారణమన్నారు.

చందాదారుల ఆస్తులు కొల్లగొడుతున్న

గజదొంగ రామోజీ

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఓ బందిపోటు సంస్థ

- పేదలు, మధ్యతరగతివర్గాలను వేధిస్తోంది
- కాల్‌మనీ రాకెట్‌లా ఇళ్లపైకి దాడులు చేస్తోంది
- చిట్టీల ఉచ్చులో బిగించి ఆస్తులు గుంజుకుంటోంది
- ప్రైజ్‌మనీ ఇవ్వకుండా రశీదు డిపాజిట్లుగా అట్టిపెట్టుకుంటోంది
- గట్టిగా అడిగితే లక్షల్లో చిట్టీలు కడితే వందలు చేతిలో పెడుతోంది
- రామోజీ అక్రమాలకు వ్యతిరేకంగా సమష్టి పోరాటం
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం స్పష్టీకరణ
- విజయవాడలో బాధితుల సమావేశం.. పెద్ద ఎత్తున తరలివచ్చిన చందాదారులు
- తామెలా మోసపోయామో వివరించిన బాధితులు

సాక్షి, అమరావతి: 'మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఓ బందిపోటు సంస్థ. పేదలు, మధ్య తరగతివర్గాల ఆస్తులు కొల్లగొడుతున్న గజదొంగ రామోజీరావు' అని మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం ధ్వజమెత్తింది. 'ష్యూరిటీలు ఇచ్చినా కొర్రీలు వేస్తోంది. చిట్టీల ఉచ్చులో బిగించి మా ఆస్తులు కొల్లగొడుతోంది. ప్రైజ్‌మనీ ఇవ్వకుండా మా అనుమతి లేకుండానే రశీదు డిపాజిట్లుగా అట్టిపెట్టుకుంటోంది. గట్టిగా అడిగితే లక్షల్లో చిట్టీలు కడితే వందలు చేతిలో పెడుతోంది' అని దుయ్యబట్టింది. 'మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను ఇక సహించేది లేదు. సంఘటితంగా పోరాడతాం. సీఐడీ దర్యాప్తునకు సహకరిస్తాం. రాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటాం. రామోజీరావు అక్రమాలపై ఉమ్మడిగా న్యాయ పోరాటం చేస్తాం' అని స్పష్టం చేసింది.

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలకు వ్యతిరేకంగా బాధితులు బుధవారం విజయవాడలో సంఘటితమయ్యారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఈ సమావేశానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో చందాదారులు తరలివచ్చారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చిట్టీ కట్టి మోసపోయిన విధానం, తాము పడుతున్న ఇబ్బందులు, పోగొట్టుకున్న ఆస్తులను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలు, మధ్యతరగతివర్గాల ఆదాయ వనరులను పరిగణనలోకి తీసుకోకుండా తలకు మించి చిట్టీలు కట్టిస్తూ రామోజీరావు వారిని చిట్టీల ఊబిలోకి నెట్టివేసి, వారి ఆస్తులు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం ష్యూరిటీలు సమర్పించినవారికి కూడా చిట్టీ ప్రైజ్‌మనీ ఇవ్వకుండా అక్రమ డిపాజిట్లుగా మళ్లిస్తున్నారన్నారు. రామోజీరావు అక్రమాలతో సామాన్యులు ఆస్తులు కూడా అమ్ముకుంటున్నారని, అయినా అప్పులు తీరక మానసిక క్షోభ అనుభవిస్తున్నారని తెలిపారు. విజయవాడలో ఓ ట్యాక్సీ డ్రైవర్‌తో రూ.20 లక్షల చిట్టీ కట్టించి వేధిస్తున్నారన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ గూండాలు ఇంటిపైకి వచ్చి వేధింపులకు గురిచేయడంతో కర్నూలులో ఒకరు తీవ్ర మానసిక క్షోభతో పక్షవాతం బారిన పడ్డారని తెలిపారు. రామోజీరావు ఉద్దేశపూర్వకంగానే పేద, మధ్య తరగతి వర్గాల వారిని ఒక చిట్టీతో మొదలు పెట్టి అయిదు.., పది.., ఇరవై వరకు చిట్టీల్లో సభ్యులుగా చేర్పించి వారు అప్పులు, వాయిదాల ఉచ్చు నుంచి బయటకు రాలేని దుస్థితి కల్పిస్తున్నారని వివరించారు. ఒక చిట్టీ ప్రైజ్‌మనీని మరో చిట్టీలోకి సర్దుబాటు చేస్తూ చందాదారులకు చేతికి మాత్రం చిల్లిగవ్వ ఇవ్వడంలేదని తెలిపారు.

చందాదారులందరినీ సంఘటితం చేసేందుకే ఈ సంఘం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు కొన్ని వేల మంది ఉన్నారని, వారందరినీ సంఘటితం చేసేందుకు ఈ సంఘాన్ని ఏర్పాటు చేశామని శ్రీనివాస్ చెప్పారు. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టంలోని సెక్షన్ 22, 66 ప్రకారం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బాధితులకు న్యాయం చేసేందుకు సమష్టిగా పోరాడతామన్నారు. అందుకు సీఐడీ, రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తున్నాయని చెప్పారు.

కాల్‌మనీ రాకెట్‌ను తలదన్నేలా రామోజీ అక్రమాలు



సంఘం ఉపాధ్యక్షుడు సాంబశివరావు మాట్లాడుతూ కాల్‌మనీ రాకెట్‌ను తలదన్నే రీతిలో రామోజీరావు అరాచకాలకు పాల్పడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. చందాదారుల సంతకాలను కూడా ఫోర్జరీ చేసి ఎన్నో చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేర్పిస్తూ వారిని శాశ్వతంగా రుణగ్రస్తులుగా ఉండేట్టు కుట్ర పన్నుతున్నారన్నారు. తమ కుటుంబం రెండు చిట్టీలతో మొదలు పెడితే.. తరువాత ఏకంగా 40 చిట్టీల వరకు చేర్పించి మోసం చేశారన్నారు. రూ.80 లక్షల చిట్టీ పాట పాడితే రూ.215 మాత్రమే ఇచ్చారని, రూ.40 లక్షలు, రూ.20 లక్షలు, రూ.10 లక్షలు చిట్టీలు పాడినా ఒక్క దానికి కూడా రూ.200కు మించి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర చిట్‌ఫండ్ చట్టం చందాదారులకు కల్పిస్తున్న రక్షణ పట్ల చాలా మందికి అవగాహన లేకపోవడాన్ని రామోజీరావు తన దుర్మార్గాలకు అనుకూలంగా మలచుకుంటున్నారని అన్నారు. అందుకే చందాదారుల్లో చైతన్యం తీసుకొచ్చి మార్గదర్శి చిట్‌ఫండ్స్ దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఈ సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులకు అండగా నిలుస్తామని చెప్పారు.

– సంఘం ఉపాధ్యక్షుడు సాంబశివరావు



విజయవాడ ప్రెస్ క్లబ్ లో మార్గదర్శి బాధితులతో కలిసి వారి సమస్యలను తెలియజేస్తున్న అడ్వకేట్ ముప్పి శ్రీనివాస్

ఇళ్లపై పడి వేధిస్తున్నారు.. ఆస్తులు గుంజుకున్నారు



'మా సంతకాలు ఫోర్జరీ చేసి కొత్త చిట్టీ గ్రూపుల్లో చేర్పించారు. మాకు తెలియకుండానే పాట పాడి ఆ మొత్తాన్ని అప్పుల కింద జమ చేసుకున్నామని చెప్పారు. 90 చిట్టీల్లో చేర్పించి మమ్మల్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారు. అవి తీర్చడం కోసం మా ఇల్లు, స్థలాలు తీసుకున్నారు. విదేశాల్లో ఉన్న మా అమ్మాయి సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి ఆమెను కూడా చందాదారుగా చేర్పించారు. ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేసి ప్రైజ్‌మనీ డబ్బును వాళ్లే తీసుకున్నారు. ఇదెక్కడి అన్యాయం అని ప్రశ్నిస్తే ఇంటి మీదకు గూండాలను పంపించి తీవ్రంగా వేధిస్తున్నారు' అని సంఘం కార్యదర్శి అన్నపూర్ణాదేవి ఆవేదనతో చెప్పారు.

– సంఘం కార్యదర్శి అన్నపూర్ణాదేవి

నా అనుమతి లేకుండానే నా డబ్బు డిపాజిట్ చేసేశారు



నేను చిట్టీ పాడి నిబంధనల ప్రకారం నలుగురు ప్రభుత్వ ఉద్యోగులతో ష్యూరిటీలు ఇప్పించాను. అయినా ప్రైజ్‌మనీ ఇవ్వడంలేదు. నా అనుమతి లేకుండానే డిపాజిట్‌గా జమ చేసేశారు. అలా ఎందుకు చేశారు అని గట్టిగా అడిగితే భవిష్యత్ చందాల కోసం డిపాజిట్ చేశామని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. అలా ప్రతి ఆరు నెలలకు వాళ్లే డిపాజిట్లను రెన్యూవల్ చేస్తూ రెండేళ్లుగా ప్రైజ్‌మనీ ఇవ్వకుండా వేధిస్తున్నారు. నాలా వేలాదిమంది మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– విశ్వప్రసాద్, బాధితుడు

ష్యూరిటీలు ఇచ్చినా వేధిస్తున్నారు



మేము చిట్టీ పాడితే, ఆ ప్రైజ్ మనీ ఇవ్వడానికి నలుగురు ప్రభుత్వ ఉద్యోగులతో ష్యూరిటీలు కావాలని చెప్పారు. నేను నలుగురితో ష్యూరిటీలు ఇప్పించాను. అయినా చాలదు అన్నారు. ఆరుగురు.. తరువాత ఎనిమిది మంది ప్రభుత్వ ఉద్యోగులతో ష్యూరిటీలు ఇప్పించినా మా ప్రైజ్‌మనీ మాత్రం ఇవ్వలేదు. పైగా ష్యూరిటీ ఇచ్చిన వారిని వేధిస్తున్నారు. దీనిపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. న్యాయం కోసం ఈ సంఘంలో సభ్యునిగా చేరాను.

– నందిగం వరప్రసాద్, హైదరాబాద్

'మార్గదర్శి'పై కఠిన చర్యలు తీసుకోండి

హోం శాఖ, సీఐడీకి బాధితుల విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: చందాదారులను మోసగిస్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆ సంస్థ మోసాలకు అడ్డుకట్ట వేసి చందాదారులకు న్యాయం చేయాలని మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వి.సాంబశివరావు, కార్యదర్శి వి.అన్నపూర్ణమ్మ, ఇతర ప్రతినిధులు హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా, సీఐడీ అదనపు డీజీ సంజయ్‌కు బుధవారం విడివిడిగా వినతిపత్రాలు సమర్పించారు. ష్యూరిటీలు సమర్పించినా చందాదారులను ఇబ్బంది పెడుతున్నారని వివరించారు. చందాదారుల సొమ్మును రామోజీరావు సొంత వ్యాపారాల్లో పెట్టుబడులుగా మళ్లిస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టంలోని సెక్షన్లు 22, 64 ప్రకారం మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కఠిన చర్యలు తీసుకుని చందాదారులకు అండగా నిలవాలని కోరారు.


హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా కు వినతి పత్రం సమర్పిస్తున్న బాధితులు


సీఐడి అదనపు డీజీ సంజయ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మార్గదర్శి చిట్ ఫండ్స్ బాధితులు

బాబు గ్రాఫిక్స్ పెట్టుబడులు.. జగన్ రియల్ పెట్టుబడులు

కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల్లో బట్టబయలైన బాబు గ్రాఫిక్స్ మాటల బురిడీ

చంద్రబాబు పాలన

ఓ కంప్యూటర్.. అందులో పెద్ద పెద్ద కంపెనీల పేర్లు, లోగోలు.. వాటి గ్రాఫిక్స్.. ఓ వంద అంకెలు, నలభై గీతలు.. వంద అబద్ధాలు. అన్నీ భూతద్దంలో చూపిస్తారు. వినడానికి, గ్రాఫిక్స్ చూడటానికి అబ్బో అనిపిస్తాయి. వాస్తవంగా వచ్చే పెట్టుబడులు సున్నా. పెట్టుబడులన్నీ కాగితాలకు, కంప్యూటర్లకే పరిమితం.

సీఎం వైఎస్ జగన్ పాలన

చంద్రబాబు గ్రాఫిక్స్ లాంటి టక్కుటమారాలేమీ ఉండవు. అంతా వాస్తవికత. వచ్చే పెట్టుబడులే కాగితాల్లో కనిపిస్తాయి. అవే ప్రజలకు చేరతాయి. వాస్తవంగా నూరు శాతం పెట్టుబడులతో రాష్ట్రంలో పరిశ్రమలు వస్తాయి. కాగితాల్లో ఉన్న పెట్టుబడులే పరిశ్రమలుగా రూపుదిద్దుకొని ప్రజల ముందు నిలుస్తాయి.

– సాక్షి, అమరావతి



అందుకే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రికార్డు స్థాయిలో పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వస్తున్నాయి. గత చంద్రబాబు ప్రభుత్వంతో పోలిస్తే గడిచిన నాలుగున్నర ఏళ్లలో పెట్టుబడులు మూడు రెట్లు పెరిగాయి. ఈ విషయం వెల్లడించింది స్వయానా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ. ఆ శాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఫర్ ఇండ్రస్టీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) వెల్లడించిన వివరాల ప్రకారం.. 2014–18 మధ్య కాలంలో (చంద్రబాబు పాలన) రాష్ట్రంలోకి వాస్తవంగా వచ్చిన పెట్టుబడులతో పోలిస్తే 2019 నుంచి 2023 జూన్ వరకు (వైఎస్ జగన్ పాలన) వచ్చిన పెట్టుబడులు 226.9 శాతం అధికంగా వచ్చాయి. 2014–18 క్యాలండర్ ఇయర్ ప్రకారం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వాస్తవ రూపంలోకి వచ్చి ఉత్పత్తిని ప్రారంభించిన పరిశ్రమల పెట్టుబడులు కేవలం రూ.32,803 కోట్లు మాత్రమే. ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రూ.1,00,103 కోట్ల పెట్టుబడులు వాస్తవరూపం దాల్చాయి. చంద్రబాబు నాయుడు పెట్టుబడుల సదస్సు పేరుతో ప్రతి ఏటా హడావుడి చేసి లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేశాయని చెప్పిన వార్తల్లో వాస్తవం ఏమాత్రం లేదని ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. చంద్రబాబు హయాంలో వివిధ పెట్టుబడుల సదస్సుల ద్వారా రూ.18.87 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ఉత్తుత్తి ఒప్పందాలు కుదుర్చుకున్నారన్న విషయం సుస్పష్టమైంది.

తరలి వస్తున్న దిగ్గజ సంస్థలు

చంద్రబాబుకు భిన్నంగా వైఎస్ జగన్ ఎటువంటి ప్రచార ఆర్భాటాలు చేయకుండా పరిశ్రమలకు అన్ని విధాలా చేయూతనిస్తున్నారు. సీఎం జగన్ సహకారం అందించడంతో రిలయన్స్, అదానీ, టాటా, బిర్లా, హెచ్‌యూఎల్, బ్లూస్టార్, డైకిన్, ఇన్ఫోసిస్ వంటి అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. సాధారణంగా దేశంలో పెట్టుబడుల సదస్సులో జరిగే ఒప్పందాల్లో 16 నుంచి 17 శాతం మాత్రమే వాస్తవ రూపంలోకి వస్తాయి. కానీ విశాఖ పెట్టుబడుల సదస్సు జరిగి ఏడాది కాకుండానే 19 శాతం పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చేశాయి. జీఐఎస్‌లో మొత్తం రూ.13.11 లక్షల కోట్ల విలువైన 386 ఒప్పందాలు జరగ్గా రూ.2.46 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన పరిశ్రమల పనులు వేర్వేరు దశల్లో ఉన్నాయి. ఇదంతా వైఎస్ జగన్ ప్రభుత్వ కృషికి నిదర్శనమని పారిశ్రామికవర్గాలు వెల్లడించాయి.

ఇళ్ల పట్టాలు ఇవ్వకూడదంటే ఎలా?

- ఇళ్ల పట్టాలివ్వడం తప్పెలా అవుతుంది
- పిటిషనర్‌ను ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: ఒంగోలు మునిసిపాలిటీ పరిధిలో ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు ఖాళీగా ఉన్నాయన్న కారణంతో తిరిగి ఇళ్ల పట్టాలు ఇవ్వకూడదంటే ఎలా అని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. అలా ఇవ్వడం తప్పెలా అవుతుందని కూడా నిలదీసింది. ఏ చట్ట నిబంధనలకు ఇది విరుద్ధమో చెప్పాలని ఆదేశించింది. అలాగే ఇప్పటికే పట్టాలు పొంది.. తిరిగి మరోసారి పట్టాలు పొందుతున్న వారి జాబితాను తమ ముందుంచాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పూర్వాపరాలివీ

ఒంగోలు పట్టణంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పట్టాల పథకం కింద 22,620 మందికి పట్టాలు ఇచ్చేందుకు వీలుగా రూ.210 కోట్లను విడుదల చేస్తూ జారీ చేసిన జీవోను సవాల్ చేస్తూ టీడీపీ మద్దతుదారు సింగరాజు రాంబాబు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై సీజే నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్.రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యాజ్యం దాఖలు చేసిన వెంటనే ప్రభుత్వం ఒంగోలు మునిసిపాలిటీ పరిధిలో 22,620 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని నిర్ణయించి ఆ మేర కొందరికి పట్టాలు ఇచ్చిందని తెలిపారు. ఇందుకోసం రూ.210 కోట్లు మంజూరు చేసిందని, అందులో రూ.30 కోట్లు ఖర్చు చేసిందని, మరో రూ.180 కోట్లు విడుదల చేయాల్సి ఉందని వివరించారు. ఒంగోలు మునిసిపాలిటీ పరిధిలో 7 వేల టిడ్కో ఇళ్లు, పలు స్థలాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. టిడ్కో ఇళ్లు, స్థలాలు ఖాళీగా ఉంటే తిరిగి పట్టాలు ఇవ్వకూడదా? అని ప్రశ్నించింది. అలా ఇవ్వడం ఏ చట్ట నిబంధనలకు విరుద్ధమో చెప్పాలంది. అలా ఇవ్వడం ఎలా ప్రజా ప్రయోజనాలకు విఘాతమో చెప్పాలంది. గతంలో పట్టాలు పొందిన వారే తిరిగి పట్టాలు పొందుతున్నారని, సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించకుండా పట్టాలు ఇస్తున్నారని రవిప్రసాద్ తెలిపారు. ఆ వివరాలను తమ ముందుంచాలని పిటిషనర్‌ను ధర్మాసనం ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

చంద్రబాబు కూల్చిన ఆలయాల్లో

నేడు విగ్రహ ప్రతిష్ట


కనకదుర్గ ఆలయ మెట్ల వద్ద నిర్మించిన ఆలయం కలశ స్థాపనకు ఏర్పాట్లు


పూజా కార్యక్రమాల్లో కనకదుర్గ ఆలయ ఈవో కేఎస్ రామారావు

- 2016లో విజయవాడలో పుష్కరాల పేరిట ఏడు దేవాలయాలను కూల్చిన చంద్రబాబు
- ఆ ఆలయాలను తిరిగి పునర్నిర్మించిన సీఎం వైఎస్ జగన్
- 2021 జనవరి 8న శంకుస్థాపన
- రూ.2.5 కోట్లు ఖర్చుతో నిర్మాణం
- గతేడాది సీఎం చేతుల మీదుగా ప్రారంభం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): గత చంద్రబాబు ప్రభుత్వం కూల్చిన ఏడు ఆలయాల్లో గురువారం ప్రాణప్రతిష్టను నిర్వహించనున్నారు. ఉదయం 11.24 గంటలకు దుర్గగుడి ఆలయ అర్చకులు, వేద పండితుల వేద మంత్రోచ్చారణ మధ్య దేవతామూర్తులకు ప్రాణప్రతిష్ట, కలశస్థాపన జరగనుంది. ప్రాణ, శిఖర ప్రతిష్టలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ఏడు ఆలయాలను ఏకంగా రూ.2.5 కోట్లతో పునర్నిర్మించింది. 2016లో కృష్ణా పుష్కరాల పేరిట చంద్రబాబు ప్రభుత్వం విజయవాడలో ఏడు ఆలయాలను కూల్చివేసిన సంగతి తెలిసిందే. టీడీపీ ప్రభుత్వం కూల్చిన ఈ ఆలయాల పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు నిధులు కేటాయించారు. అంతేకాకుండా 2021 జనవరి 8న ఆయా ఆలయాల పునర్నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆలయాల నిర్మాణం శరవేగంగా జరిగేలా నాటి దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ప్రస్తుత మంత్రి కొట్టు సత్యనారాయణతోపాటు దేవాదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. గతేడాది డిసెంబర్ 7న దుర్గగుడి మాస్టర్‌ప్లాన్‌తో పాటు పునర్నిర్మించిన ఆలయాలను సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు.

దేవతామూర్తులకు ధాన్య, పూజాధివాసాలు

కాగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం పాత మెట్ల మార్గంలోని వినాయక, ఆంజనేయ స్వామి వారి ఆలయాల పున ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆయా దేవతామూర్తుల విగ్రహాలతోపాటు సీతమ్మ వారి పాదాల సమీపంలోని దక్షిణాముఖ ఆంజనేయ స్వామి వారి పునఃప్రతిష్ట జరుగుతుంది. ఈ నేపథ్యంలో బుధవారం స్థానాచార్య శివప్రసాద్‌శర్మ పర్యవేక్షణలో వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య పలు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. దేవతామూర్తుల విగ్రహాలకు జలాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాదివాసం, శయనాధివాసం చేపట్టారు. ఆలయ అర్చకులు, వేద పండితులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రాణప్రతిష్ట జరిగే ఆలయాలివే..

- శ్రీ దక్షిణాముఖ ఆంజనేయస్వామి వారి ఆలయం – వ్యయం రూ.45 లక్షలు
- సీతమ్మ వారి పాదాలు – వ్యయం రూ.10 లక్షలు
- శ్రీ సీతారామ లక్ష్మణ సమేత శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవస్థానం –కృష్ణలంక – వ్యయం రూ.15 లక్షలు
- వీరబాబు దేవస్థానం (తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద) – వ్యయం రూ.15 లక్షలు
- వేణుగోపాలస్వామి వారి దేవాలయం (విజయవాడ గోశాల వద్ద) – వ్యయం రూ.68 లక్షలు
- బొడ్డు బొమ్మ (రథం సెంటర్) – వ్యయం రూ.23 లక్షలు
- శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయం, అమ్మవారి తొలి మెట్లు –ఇంద్రకీలాద్రి – వ్యయం రూ.29 లక్షలు

టీజే ఫ్లాప్ షో!

తుస్సుమన్న టీడీపీ-జనసేన (టీజే) తొలి బహిరంగ సభ


సభకు అరకొరగా హాజరైన టీడీపీ-జనసేన కార్యకర్తలు, నాయకులు

- 6 లక్షల మంది వస్తారని ఊదరగొట్టిన నేతలు
- కిందా మీదా పడి 40-50 వేల మందికే పరిమితం
- పొత్తుకు తమ మద్దతు లేదని స్పష్టం చేసిన ఇరు పార్టీల కేడర్
- రెండు పార్టీలకు పట్టున్న జిల్లాలో సభ పెట్టినా నిరాశే
- తక్కువ స్థలంలో జనం కిక్కిరిసేలా చేసి పోటెత్తినట్లు చూపాలని వ్యూహం
- ఆ మేరకు కూడా ఆయా పార్టీల శ్రేణులు రాక బెడిసిన స్కెచ్
- ఖాళీగా కనిపించిన సగం గ్యాలరీలు.. బాబు ప్రసంగానికి స్పందన కరువు

ఆరు లక్షల మందన్నారు.. సిద్ధం సభలను మించి జనం కదిలివస్తారని ఊదరగొట్టారు.. ఈ సభకు హాజరయ్యే జనసందోహంతో అధికార పార్టీ దిమ్మ తిరిగిపోతుందని పగటి కలలుగన్నారు.. అందుకే రెండు పార్టీలకు పట్టున్న ప్రాంతంలో ఉమ్మడిగా సభ పెట్టారు.. ఎంత చేసినా జనం రారని తెలుసుకాబట్టే తక్కువ స్థలంలో ఏర్పాట్లు చేశారు.. ఆ స్థలం కిక్కిరిస్తే.. దానినే కొండంతలు చేసి చూపిస్తూ చంకలు గుద్దుకోవాలని స్కెచ్ వేశారు.. తీరా 40-50 వేలు కూడా దాటక పోవడంతో బిక్క మొహం వేయడం బాబు, పవన్‌ల వంతు అయితే.. ఇలాగైతే ఈ ఎన్నికల్లోనూ ఏడిసినట్లే అనుకోవడం ఇతర నేతలు, కార్యకర్తల వంతు అయింది. 'అనుకున్నదొక్కటి.. అయినదొక్కటి.. బోల్తా కొట్టిందిరో టీ-జే మీటింగ్' అని పాడుకోవాల్సిన తరుణమిది.

సాక్షి ప్రతినిధి, ఏలూరు/ సాక్షి, భీమవరం : జనాదరణ లేక టీడీపీ-జనసేన (టీజే) తొలి బహిరంగ సభ తుస్సుమంది. అంతా.. ఇంతా.. నభూతో.. అన్నట్లు నాలుగైదు రోజులుగా ఊదరగొట్టిన ఎల్లో మీడియా ఇప్పుడు ఈ సభకు వచ్చిన జనం మాటెత్తడం లేదు. టీడీపీ-జనసేన పొత్తుకు జనం మద్దతును ఈ సభతో చాటిచెబుతామంటూ ఇరు పార్టీల అధినేతలు హడావుడి చేశారు. కేడర్ నిరసనల్ని, మనోభావాల్ని లెక్కచేయకుండా చంద్రబాబు, పవన్‌ల వ్యక్తిగత అ'జెండా'తో నిర్వహించిన సభకు రాష్ట్రం నలుమూలల నుంచి ఆరు లక్షల మంది తరలివస్తారంటూ ఎల్లో మీడియాలో మోత మోగించారు. తాడేపల్లిగూడెం సమీపంలో 22 ఎకరాల ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేసుకుంటే.. తీరా టీడీపీ-జనసేన పార్టీల కేడర్ నిరాదరణతో కాస్తా ఫ్లాప్ షోగా మిగిలింది. ఈ పొత్తు తమకు అంగీకారం కాదని స్పష్టం చేస్తూ నాయకులు, కింది స్థాయి కేడర్ సభను తుస్సుమనిపించారు. ప్రజలు పొత్తుకు బ్రహ్మరథం పడతారని చంద్రబాబు, పవన్‌లు ఎన్నో ఆశలు పెట్టుకుంటే.. టీడీపీ-జనసేన సంయుక్తంగా నిర్వహించిన తొలి బహిరంగ జెండా సభకు వారి లక్ష్యంలో పది శాతం మంది కూడా రాకపోవడం ఆ పార్టీల భవితవ్యాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది. రాష్ట్ర వ్యాప్తంగా తరలి రావాలని ఫోన్లలో సమాచారం అందించినా, ఆ సభకు హాజరైన వారి సంఖ్య చూసి ఆ పార్టీల అగ్ర నేతలు విస్తుపోయారు. కార్యకర్తల కోసం కేటాయించిన గ్యాలరీల్లో సగం పైగా కుర్చీలు ఖాళీగా కనిపించడంతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కంగుతిన్నారు.

టీ-జే పార్టీ నేతల్లో నైరాశ్యం

పొత్తు ముసుగు తొలగిపోయి జనసేన 24 సీట్లకే పరిమితమైన నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై రెండు పార్టీల్లో విభేదాలు భగ్గుమంటున్నాయి. 'సిద్ధం' సభలు ఒకవైపు ప్రకంపనలు సృష్టిస్తుండగా మరోవైపు టీడీపీ - జనసేనలో భగ్గుమన్న విభేదాలతో క్యాడర్ చెల్లాచెదురైంది. ఈ నేపథ్యంలో టీడీపీ-జనసేన నిర్వహిస్తున్న తొలి ఉమ్మడి సభకు తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారి బైపాస్ పక్కనే ఉన్న 22 ఎకరాల మైదానాన్ని ఎంచుకున్నారు. 175 నియోజకవర్గాల నుంచి వచ్చే రెండు పార్టీల నేతలు సుమారు 500 మంది కూర్చోవడానికి వీలుగా వేదికతోపాటు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు వేర్వేరుగా హెలికాప్టర్‌లలో రానుండటంతో అక్కడకు సమీపంలో రెండు హెలీప్యాడ్‌లు ఏర్పాటు చేశారు. వేదిక, హెలి ప్యాడ్‌లు, వీవీఐపీల రెస్ట్ రూమ్‌లు, పార్కింగ్‌కు ఏడు ఎకరాలు పోగా మిగిలిన 15 ఎకరాల్లో కార్యకర్తల కోసం 22 గ్యాలరీలు సిద్ధం చేశారు. ఒక్కో గ్యాలరీలో 1,500 కుర్చీల చొప్పున 22 గ్యాలరీల్లో 33 వేల కుర్చీలు వేశారు. మొత్తం కుర్చీలన్నీ నిండిపోయి 15 ఎకరాల ప్రాంగణం కిక్కిరిసిపోతే దాదాపు 60 వేల మంది హాజరైనట్లు లెక్క. అయితే సభ ప్రారంభం నుంచి చివరిదాకా సగం గ్యాలరీలు ఖాళీగానే ఉన్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభమవుతుందని ప్రకటించారు. రెండు గంటలు ఆలస్యంగా 5.30 గంటలకు మొదలైంది. మొత్తం 22 గ్యాలరీలు ఏర్పాటుచేసి ప్రముఖులు, మీడియా, మహిళల కోసం ఆరు గ్యాలరీలు, మిగిలినవి కార్యకర్తలకు కేటాయించారు. పట్టుమని 11 గ్యాలరీలు కూడా నిండలేదు. మిగిలిన గ్యాలరీలన్నీ సగం ఖాళీగానే కనిపించాయి. సాయంత్రం 5 గంటలకు కూడా సగం గ్యాలరీలు నిండలేదు. వాస్తవానికి ఆరు లక్షల మంది జనం వస్తారని టీడీపీ-జనసేన నేతలు చెప్పారు. అయితే అది సాధ్యం కాదని వారికీ తెలుసు. అందుకే తక్కువ స్థలం ఉన్న చోట సభ నిర్వహించి, జనం కిక్కిరిసిపోతే.. దానినే కొండంతలు చేసి చూపాలన్న టీడీపీ, జనసేన అగ్రనేతల పన్నాగం బెడిసికొట్టింది. మొత్తంగా 40-50 వేల మంది కూడా హాజరు కాకపోవడం ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది.

ప్రసంగాలకు స్పందన నిల్

➡ సినీ నటుడు బాలకృష్ణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో సహా పలువురు టీడీపీ, జనసేన నేతలు ప్రసంగించారు. ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని టార్గెట్ చేస్తూ వ్యక్తిగత విమర్శలు చేసేవారికే ప్రసంగించే అవకాశం ఇచ్చారు. కేడర్ నుంచి మాత్రం వారి ప్రసంగాలకు స్పందన రాలేదు. చంద్రబాబునాయుడు ప్రసంగాన్ని రెండు పార్టీల కేడర్ తేలిగ్గా తీసుకున్నారు. ఆయన ప్రసంగిస్తుండగానే అనేక మంది తిరుగుముఖం పట్టారు. పవన్‌కళ్యాణ్ ప్రసంగించే సమయానికి జనం మరింత పల్చబడ్డారు.

➡ ఈ సభలో అన్నీ వెరైటీలే. సభా ఏర్పాట్ల నుంచి అన్ని వన్ బై టూ ఫార్ములాలోనే కొనసాగాయి. జనసేన, టీడీపీ కేడర్ కూడా ఏర్పాట్లు చూసి విచిత్రంగా అనిపించి నవ్వుకున్నారు. గ్యాలరీల్లో ప్రతి కుర్చీలో టీడీపీ, జనసేన జెండాలు పెట్టారు. ఏ పార్టీ నాయకుడు మాట్లాడితే ఆ పార్టీ జెండా ఊపుతూ ఈలలు వేసేలా ఏర్పాటు చేశారు. గ్యాలరీలు నిండక, జనాలు రాక, రెండు జెండాలు పట్టుకోవడానికి కేడర్ ఇష్టపడక పోవడంతో అసలు ప్లాన్ వర్కవుట్ కాలేదు.

➡ ఈ సభకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఇద్దరూ చెరో హెలికాప్టర్‌లో చేరుకున్నారు. తర్వాత ఒకే బస్సులో ముప్పావు గంటకు పైగా భేటీ అయ్యారు. అక్కడి నుంచి ఇద్దరూ కలిసి వేదికపైకి వచ్చి మొత్తం కలియదిరిగి కార్యకర్తలకు అభివాదం చేశారు. ఇద్దరూ కరచాలనం చేస్తూ హడావుడి చేశారు. ఆ తర్వాత చంద్రబాబు టీడీపీ జెండాను, పవన్ కళ్యాణ్ జనసేన జెండాను ఊపి, తర్వాత జెండాలు మార్చుకున్నారు. వేదికపై చంద్రబాబుకు కుడివైపున టీడీపీ నేతలు ఒక గ్రూపుగా, పవన్‌కళ్యాణ్‌కు ఎడమ వైపున జనసేన నేతలు మరొక గ్రూపుగా కూర్చున్నారు.

➡ ఇది ప్రజల పొత్తు, చారిత్రక అవసరమంటూ చంద్రబాబు ముగించగా, 24 సీట్లు ఏమీ తక్కువ కాదు.. నన్ను అభిమానించే వాళ్లెవరూ ప్రశ్నించవద్దంటూ పొత్తుల ప్రస్తావనకు పవన్ ఫుల్‌స్టాప్ పెట్టారు. బూత్ స్థాయిలో బలం లేని మనం ఎక్కువ సీట్లు ఎలా అడగాలంటూ జనసేన కార్యకర్తల్ని పవన్ తీవ్రంగా నిరాశపరిచారు. టీడీపీ నేత నారా లోకేశ్ తొలి ఉమ్మడి సభకు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.

సభలంటే అలా పెట్టాలి

టీడీపీ-జనసేన ఉమ్మడి సభకు హాజరైన పలువురు కార్యకర్తలు.. వైఎస్సార్‌సీపీ 'సిద్ధం' సభల గురించి మాట్లాడుకున్నారు. ఆ స్థాయిలో ఈ సభ ఉంటుందనుకున్నామని, ఇలా పేలవంగా జరుగుతుందనుకోలేదని నిట్టూర్చారు. సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్ సీపీ శ్రేణులను సన్నద్ధం చేస్తూ భీమిలిలో గత నెల 27వ తేదీన సిద్ధం తొలి సభను నిర్వహించారు. ఈ సభకు ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల నుంచి నాలుగు లక్షల మందికిపైగా కార్యకర్తలు, అభిమానులు పోటెత్తారు. సిద్ధం రెండో సభను ఈనెల 3న ఏలూరు సమీపంలో దెందులూరు వద్ద 110 ఎకరాల మైదానంలో నిర్వహించారు. ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన 50 నియోజకవర్గాల నుంచి 6-7 లక్షల మందికిపైగా జనం తరలివచ్చారు. రాప్తాడులో 18న నిర్వహించిన 'సిద్ధం' మూడో సభకు వేదికపోనూ ప్రజల కోసం ఏకంగా 250 ఎకరాల సువిశాల మైదానంలో ఏర్పాట్లు చేశారు. ఈ సభకు రాయలసీమలోని ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలోని 52 నియోజకవర్గాల నుంచి 10 నుంచి 11 లక్షల మంది హాజరయ్యారు.

క్లుప్తంగా...

చంద్రబాబుకు పేదల కన్నీళ్లు తుడిచే అలవాటు లేదు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం రూరల్: రాజధాని పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన చంద్రబాబుకు పేదల కష్టాలు, కన్నీళ్లు తుడిచే అలవాటు లేదని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. ప్రతిపక్ష నేతకు కళ్లు, చెవులు రెండూ పనిచేయవన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని ఇప్పిలి గ్రామంలో బుధవారం మంత్రి మాట్లాడారు. పొరపాటున చంద్రబాబుకు అధికారం కట్టబెడితే అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటారు తప్ప ప్రజల గురించి ఆలోచించరన్నారు. బాబు దృష్టిలో అభివృద్ధి అంటే 25 అంతస్తుల బిల్డింగులు కట్టడమే తప్ప ప్రజల జీవన ప్రమాణాలు, స్థితిగతులను మార్చాలన్న ఆలోచన ఆయనకు ఉండదన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో శ్రీకాకుళం జిల్లాకు ఏ ప్రాజెక్టు తీసుకొచ్చారో చెప్పాలని డిమాండ్ చేసారు. మరో 20 ఏళ్లు జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా కొనసాగితే రాష్ట్రం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. సర్కారు బడుల ఆధునికీకరణ, పేదలకు ఇంటికే వెళ్లి వైద్యసేవలు అందించడం, సచివాలయ వ్యవస్థ.. ఇవన్నీ అభివృద్ధి, సంక్షేమం కాదా అని ప్రశ్నించారు.

ఎదురొచ్చిన వారిని సైకిల్‌తో తొక్కేయండి

అరకులో భువనేశ్వరి వ్యాఖ్యలు



సాక్షి, పాడేరు, అరకులోయ టౌన్, జి.మాడుగుల (అల్లూరి సీతారామరాజు జిల్లా): 'రానున్న ఎన్నికల్లో ఎదురొచ్చిన అధికార పార్టీ వారిని సైకిల్‌తో తొక్కుకుంటూ పొండి. ఎంత ఖర్చయినా పర్వాలేదు.. ఓటర్లను ఆటోల్లో తీసుకువెళ్లి ఓట్లు వేయించండి' అంటూ టీడీపీ అధ్యక్షుడు బాబు సతీమణి నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు. చంద్రబాబు జైలుకు వెళ్లిన సమయంలో మృతి చెందిన ముగ్గురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించేందుకు బుధవారం అరకులోయ, పాడేరు, ఈ కార్యక్రమానికి స్థానిక చింతలవీధి పంచాయతీ నుంచి గిరిజనుల స్పందన తక్కువగా ఉండడంతో పాడేరు, జి.మాడుగుల మండలాల్లోని టీడీపీ నేతలు, కార్యకర్తలను వాహనాల్లో తెచ్చారు. దీంతో ఈ పరామర్శ ఎన్నికల సభలా మారింది. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ గిరిజనులంటే చంద్రబాబుకు ఎంతో ఇష్టమని, అరకు కాఫీని విదేశాల్లో ప్రమోట్ చేసింది చంద్రబాబేనని చెప్పారు. అనంతరం పాడేరులోని మోదకొండమ్మ తల్లిని భువనేశ్వరి దర్శించుకున్నారు.

'పశ్చిమ' జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడికి యత్నం

పెదపాడు/ఏలూరు టౌన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీపై దాడి చేసేందుకు ఆగంతకులు ప్రయత్నించారు. టీడీపీ జెండాలు కట్టుకుని రెండు కార్లతో జెడ్పీ చైర్‌పర్సన్ కారును వెంబడించడం సంచలనంగా మారింది. వివరాల ప్రకారం పెదపాడు మండలంలోని సత్యవోలులో చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు మంగళవారం రాత్రి ఒక పరామర్శ కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి వస్తుండగా పెదపాడు పెట్రోల్ బంకు వద్ద టీడీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. ఆ సమయంలో వారిని దాటుకుని జెడ్పీ చైర్‌పర్సన్ దంపతుల కాన్వాయ్ ముందుకు వెళ్లింది. వారు పెదపాడు బళ్లరేవు తూము సెంటర్‌కు వెళ్లే సరికి టీడీపీ జెండాలు కట్టుకున్న రెండు కార్లతో చైర్‌పర్సన్ కాన్వాయ్‌ను ఆగంతకులు వెంబడించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కాన్వాయ్‌లోని కార్లను ఢీకొట్టేందుకు ప్రయత్నించడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించాడు. ఈ పరిణామంతో ఒక్కసారిగా చైర్‌పర్సన్ దంపతులు, సీసీ, సిబ్బంది భయభ్రాంతులకు గురై తప్పించుకున్నారు. ఈ సంఘటనపై వెంటనే జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, పెదవేగి సీఐ శ్రీనివాసరావుకు వారు ఫిర్యాదు చేశారు. బుధవారం పెదపాడు ఎస్సై శుభోశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోటీ చేయలేక దాడులు: ఘంటా పద్మశ్రీ

టీడీపీ నేతలు, కార్యకర్తల అరాచకాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ధ్వజమెత్తారు. ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ పోరాటం చేయలేక ఇలా దాడులకు తెగబడుతోందన్నారు. రాజకీయ కక్షలతో ఇలా దాడులకు తెగబడటం టీడీపీ నేతలకు కొత్త కాదన్నారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ఈఘటనపై విచారణ చేపట్టి, నిందితులపై చర్యలు చేపట్టాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీకి ఏపీలో బలం లేదు: షర్మిల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బలం లేదని.. ఆ విషయం తెలిసే ఆ పార్టీలో చేరానని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చెప్పారు. విజయవాడలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. '2019లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు 1.18 శాతం మాత్రమే. అయినా విభజన హామీల సాధన కోసమే ఆ పార్టీలో చేరాను. కాంగ్రెస్‌కు బలం లేదని తెలిసి కూడా.. బలమైన నిర్ణయం తీసుకున్నా. మార్చి 1న ప్రత్యేక హోదాపై తిరుపతి వేదికగా డిక్లరేషన్ చేస్తాం. ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాటు ప్రత్యేక హోదా అంటే.. బీజేపీ వాళ్లు పదేళ్లు ఇస్తామన్నారు. చంద్రబాబు 15 ఏళ్లు కావాలని అడిగారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత హోదా విషయం పక్కన పెట్టేశారు' అని షర్మిల విమర్శించారు.

అందరికీ సీట్లు ఇవ్వలేం

- నాయకులు ఇగోకు పోకూడదు
- అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ఉమ్మడి మేనిఫెస్టో
- టీడీపీ-జనసేన ఉమ్మడి బహిరంగ సభలో టీడీపీ అధ్యక్షుడు బాబు
- నా మద్దతుదారులైతే నన్ను ప్రశ్నించకండి : పవన్ కళ్యాణ్
- అన్నీ ఆలోచించే పొత్తు పెట్టుకున్నాం


చంద్రబాబు, పవన్ వచ్చిన సమయంలో ఖాళీగా దర్శనమిస్తున్న సభాప్రాంగణం

సాక్షి, భీమవరం/తాడేపల్లిగూడెం: కోరుకున్న వారందరికీ సీట్లు ఇవ్వలేమని, నాయకులు ఎవరూ ఇగోలకు పోవద్దని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆ పార్టీ నేతలతో పాటు జనసేన నేతలకూ హితబోధ చేశారు. బుధవారం పెంటపాడు మండలం ప్రత్తిపాడు జాతీయ రహదారి బైపాస్ పక్కన జరిగిన టీడీపీ, జనసేన పార్టీల తొలి ఉమ్మడి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి రెండు పార్టీలు కలిసి నిర్వహించిన ఈ మొదటి సభ రాష్ట్రం దిశను మార్చబోతోందన్నారు. ఇప్పటికి 99 సీట్లు ప్రకటించామని, మిగిలినవి త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. 1.3 కోట్ల మంది ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేయడం ద్వారా అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. అందువల్ల కోరుకున్న వారందరికీ సీట్లు రావని స్పష్టం చేశారు. ప్రజల్లో ఉండే వాళ్లనే గుర్తించి అభ్యర్థులుగా ప్రకటిస్తున్నామన్నారు. తమ అభ్యర్థులు విద్యావంతులు, పేరున్న వాళ్లని.. జగన్ అభ్యర్థులు రౌడీలు, స్మగ్లర్లని ఆరోపించారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన పాలకుల్ని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తాడేపల్లిగూడెం సభతో తాడేపల్లి ప్యాలెస్ కంపించిపోతోందన్నారు. తాము అధికారం కోసం చేతులు కలపలేదని, రాష్ట్రం కోసం చేతులు కలిపామని తెలిపారు. ఈ ముఖ్యమంత్రి కుప్పానికి నీళ్లు అని చెప్పి ట్యాంకర్లతో నీరు కాల్వలో పోసి గేట్లు తీసుకుపోయారన్నారు. కుప్పంలో తనకు లక్ష మెజార్టీ వస్తుందని జోస్యం చెప్పారు. జనసేన-తెలుగుదేశం పొత్తు సూపర్ హిట్ అయ్యిందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా చూస్తామని, బీసీ, ఎస్సీ డిక్లరేషన్ ప్రకటనతో పాటు ఎస్టీలు, మహిళలు, ఉద్యోగులు, రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ మేరకు త్వరలో ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

నాకు సలహాలివ్వొద్దు

తాను 24 స్థానాలు తీసుకుంటే ఇంతేనా అని కొందరు అంటున్నారని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేనకు సలహాలు, సూచనలు ఇచ్చే వాళ్లు అవసరం లేదని స్పష్టం చేశారు. యుద్ధం చేసే వాళ్లు కావాలని అన్నారు. 2014లో పార్టీని ప్రారంభించినప్పుడు పోటీ చేయకుండా రాష్ట్రం కోసం టీడీపీ, బీజేపీ కూటమికి మద్దతు ఇచ్చామని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకే పోరాటం చేస్తున్నానని చెప్పుకొచ్చారు. గతంలో పోటీ చేసిన రెండు చోట్ల ఓడిపోయి మానసికంగా కుంగిపోయానని, దక్షిణాఫ్రికాలో గాంధీజీని గెంటివేసిన సందర్భాన్ని గుర్తు చేసుకుని స్ఫూర్తి పొందానని తెలిపారు. సంస్థాగతంగా పాతుకుపోయిన తెలుగుదేశం పార్టీతో పోటీ పడలేమని, తన వ్యూహాన్ని ఎవరూ తప్పు పట్టవద్దన్నారు. జగన్‌ను ఆయన వెనుక ఉన్న సమూహం ప్రశ్నించదని, మీరు నన్నెందుకు ప్రశ్నిస్తున్నారంటూ జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులను ప్రశ్నించారు. తనతో నడిచే వాళ్లే తన వాళ్లని, నిజంగా తన మద్దతు దారులైతే తనను ప్రశ్నించొద్దని ఆదేశించారు. తనకు తెలుగుదేశం పార్టీలా బూత్‌లెవల్ వరకు పనిచేసే బలమైన నెట్‌వర్క్ లేదన్నారు. కోట్ల రూపాయల అక్రమ సంపాదన లేదన్నారు. 24 సీట్లతోనే ప్రభంజనం సృష్టించి తాడేపల్లి ప్యాలెస్‌ను బద్దలు కొడతామని చెప్పారు. యువతకు 10 కిలోల బియ్యం, రూ.5 వేలు ఇవ్వడం కాదని, వారికి 25 ఏళ్ల భవిష్యత్తు ఇస్తామన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే పొత్తులు పెట్టుకున్నానని తెలిపారు. ఇదిలా ఉండగా సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రసంగం అయోమయానికి గురిచేసింది. ఆయన ఏం మాట్లాడుతున్నారో ఎవరికీ అర్థం కాలేదు. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం ఎంపీ పదవికి రాజీనామా చేసిన కనుమూరి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. టీడీపీ- జనసేన కూటమి నుంచి నర్సాపురం పార్లమెంట్ సభ్యునిగా పోటీ చేస్తానని తనంతకు తానుగా ప్రకటించుకున్నారు. ఈ సభకు కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు గైర్హాజరయ్యారు.

వినకపోతే వారి ఖర్మ: హరిరామ జోగయ్య

సాక్షి, అమరావతి: ఒకరి మంచి కోసం సలహాలు ఇస్తే వాటిని పట్టించుకోకపోతే అది వారి ఖర్మ అంటూ పార్లమెంటు మాజీ సభ్యుడు హరిరామజోగయ్య అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. తెలుగుదేశం, జనసేన పార్టీల బాగు కోసం తాను ఇస్తున్న సలహాలు ఆ పార్టీల అధినేతలకు నచ్చుతున్నట్లు లేదన్నారు. అది వారి ఖర్మ.. ఇక తాను చేసేదేమీ లేదని చెప్పారు.

మీ పాలన చూసి ఓట్లేయమని అడగండి!

- చంద్రబాబు, పవన్‌కు పేర్ని నాని సవాల్
- పవన్ అనే రబ్బర్ టైగర్‌తో మేము యుద్ధం చేయాలా?
- బాబును అధికారంలోకి తేవాలనేదే పవన్ తాపత్రయం



సాక్షి, అమరావతి: చంద్రబాబు, పవన్‌కు దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో గెలిస్తే మళ్లీ 2014-19 నాటి పాలన తీసుకొస్తామని, ఆ పాలన చూసి ఓట్లేయాలని ప్రజలకు చెప్పాలని మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని) సవాల్ చేశారు. బుధవారం ఆయన ఓ టీవీ చానెల్ చర్చలో మాట్లాడుతూ.. తాడేపల్లిగూడెం సభలో సినిమా డైలాగులు చెప్పిన రబ్బరు టైగర్ పవన్‌తో మేం యుద్ధం చేయాలా అని ప్రశ్నించారు. గతంలో మామకు వెన్నుపోటు పొడిచి టీడీపీని చంద్రబాబు లాక్కున్నారని విమర్శించిన పవన్.. ఇప్పుడు చంద్రబాబు నడపలేని సైకిల్ వెనక కూర్చుని తమపై నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చేతనైతే చంద్రబాబు సొంత పార్టీ పెట్టి గెలవాలని ఒకప్పుడు సలహా ఇచ్చిన పవన్.. ఇప్పుడు అదే చంద్రబాబుకు జనసేనను ఎందుకు తాకట్టు పెట్టుకున్నారని ప్రశ్నించారు. పవన్ ఊసరవెల్లికి మించి రోజుకో రూపం మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

సీఎం జగన్ చరిత్ర బయట పెట్టండి చూద్దాం

14 ఏళ్లు చంద్రబాబు అధికారంలో ఉండి వాళ్ల నాన్న కిస్మిస్‌నాయుడు డబ్బులతో పాలన చేశారా? కేవలం చంద్రబాబును అధికారంలోకి తేవాలనే పవన్ దిగజారిపోతున్నారు. పవన్‌తో సినిమాలు తీసిన ప్రొడ్యూసర్లు, రాజకీయాల్లో నమ్మి వెంట నడిచిన వాళ్లు అడ్రస్ లేకుండా పోయారు. పవన్ ఒక్క చంద్రబాబుకు తప్ప వేరెవ్వరికీ ఉపయోగపడలేదు. 2019లో జగన్ సీఎం కాలేడు, కానివ్వను.. ఇది శాసనం అన్నారు. అది జరిగిందా? ఈరోజు తాడేపల్లిగూడెం సభలోనూ అవే సినిమా డైలాగ్‌లే చెప్పారు. సోనియా, బాబు కుట్రలతో అన్యాయంగా జైలుకు వెళ్లొచ్చిన తర్వాత వైఎస్ జగన్ ప్రజాక్షేత్రంలో ఉవ్వెత్తున ఎగిసి ఒంటి చేత్తో పార్టీని స్థాపించి, అనతికాలంలోనే అధికారంలోకి తెచ్చారు. మరోపక్క పవన్ కూడా పార్టీ పెట్టి, ఆ పార్టీని, కార్యకర్తలను ఎక్కడ ముంచుతున్నారో చూస్తున్నాం. మీ ఇళ్లలో మంచి జరిగితేనే మాకు ఓటు వేయండంటూ సీఎం జగన్ సిద్ధం సభల్లో స్పష్టంగా కోరుతున్నారు. అలాగే 2014 -19 మధ్య వారు చేసిన మంచి పనులేమైనా ఉంటే వాటినే తిరిగి చేస్తామని బాబు, పవన్ చెప్పి ఓట్లు అడగగలరా? సీఎం జగన్ కుటుంబ సభ్యులను ప్రస్తావిస్తూ పవన్ చేసినవి వ్యక్తిగత విమర్శలు కావా? పవన్ తల్లి ఎవరి దగ్గర ఉందో ప్రజలకు తెలియదా? ఇంటిలో ఆడబిడ్డ నచ్చిన వ్యక్తిని ప్రేమిస్తే తుపాకీ చేత పట్టుకొని తిరిగిన పవన్ ప్రజాస్వామ్యవాదా? ధైర్యం ఉంటే మీ దగ్గర ఉందంటున్న సీఎం జగన్ చరిత్ర బయటపెట్టండి చూద్దాం. టీడీపీ హయాంలో రోడ్లు గుంతలమయం అవడం ప్రజలు చూడలేదా? సీఎం జగన్ అధికారంలోకి రాగానే రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు ఇస్తే.. ఉచ్చం, నీచం లేకుండా పవన్ మాట్లాడటం సిగ్గుచేటు. లోకేశ్‌ను దగా కోరుగా తిట్టిన వ్యక్తి ఇప్పుడు సోదరుడంటూ మాట్లాడటం సిగ్గుచేటే.

23మందిని లాక్కుంటే ఏం చేశావు?

గత టీడీపీ-జనసేన ప్రభుత్వంలో చంద్రబాబు 23 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను లాక్కొంటే నోరెత్తి ప్రశ్నించని పవన్ నీతులు చెప్పడం సిగ్గుచేటు. బాబు ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో 21 మంది కమ్మ సామాజికవర్గం వారే ఉన్నారు. కాపులకు ఎన్ని సీట్లు ఇచ్చారో పవన్ లెక్కేసి చెప్పాలి. కులాన్ని అడ్డుపెట్టుకుని వ్యాపారం చేస్తున్న వ్యక్తిగా పవన్ చరిత్రలో మిగిలిపోతాడు. మా ప్రభుత్వంలో లబ్ధి పొందిన వారే మాకు స్టార్ క్యాంపెయినర్లు. మేము కులాల రాజ్యం తెస్తామనట్లేదు. మా నినాదం రాజన్న రాజ్యం. ఇప్పటికే చేసి చూపించాం.

తొ'లెక్క'డ పెట్టుకోవాలన్నా!

పవన్ తిక్కపై కార్యకర్తల ఆవేదన

- సోషల్ మీడియాలో వ్యంగ్యాస్త్రాలు
- పవన్ ఎంపీ సీట్ల లెక్కపై విస్తుపోతున్న జనం

పెందుర్తి/ఏలూరు (టూటౌన్): జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీరుపై ఆ పార్టీ కార్యకర్తలే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన తిక్కతో విసిగిపోయి సోషల్ మీడియా వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. టీడీపీ ముష్టి విసిరినట్టు కేవలం 24 సీట్లు విదిల్చడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. తలెక్కడ పెట్టుకోవాలంటూ అవమానభారంతో కుమిలిపోతున్నారు. టీడీపీకి ఊడిగం చేయాలా అంటూ మండిపడుతున్నారు. బహిరంగంగా మాట్లాడకపోయినా పవన్ తీరు ప్యాకేజీ మహిమే అని నిర్ధారణకు వచ్చేసినట్టు వారి పోస్టులు ఉన్నాయి. జనసేన క్యాడర్‌లో నెలకొన్న నైరాశ్యానికి అవి అద్దం పడుతున్నాయి. టికెట్ల ప్రకటన సందర్భంగా ఎంపీ సీట్లలోని అసెంబ్లీ స్థానాలనూ కలిపి పవన్ చెప్పిన వింత లెక్కపైనా విస్మయం వ్యక్తమవుతోంది. పెందుర్తి సీటు టీడీపీకి కేటాయిస్తారని జరుగుతున్న ప్రచారంపైనా జనసేన క్యాడర్ అసంతృప్తిగా ఉంది. ఎట్టిపరిస్థితుల్లోనూ తెలుగుదేశం పార్టీకి సహకరించబోమని స్పష్టం చేస్తోంది.

ఏలూరులో నిరసన

ఏలూరు అసెంబ్లీ సీటును జనసేన పార్టీకి కేటాయించాలని కోరుతూ ఆ పార్టీ ఏలూరు కార్యాలయంలో బుధవారం కార్యకర్తలు ధర్నాకు దిగారు. పార్టీ నగర అధ్యక్షుడు కె.నరేష్ మాట్లాడుతూ జనసేన తరఫున రెడ్డి అప్పలనాయుడికి టికెట్ ఇవ్వాలని, ఏలూరు సీటుపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెంలో బుధవారం నిర్వహించిన టీడీపీ, జనసేన ఉమ్మడి బహిరంగ సభను తాము బహిష్కరించినట్టు వివరించారు.


ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో బైఠాయించి నిరసన తెలుపుతున్న పార్టీ శ్రేణులు

జనసైనికులు పెట్టిన కొన్ని పోస్టులివీ..

లాగిపెట్టి కొట్టినట్టయింది

'మాకు 24 ఎమ్మెల్యే స్థానాలు మాత్రమే బాబు ఇచ్చాడు. అయితే మా అధినేత పవన్ అన్నట్లు మూడు ఎంపీ స్థానాల్లో ఉన్న 21 (ఎంపీ స్థానానికి ఏడు చొప్పున) అసెంబ్లీ స్థానాలను కలుపుకుంటే 45 సీట్లలో మా పార్టీ పోటీ చేస్తుందని ఓ టీడీపీ మిత్రుడి దగ్గర అన్నాను. వెంటనే ఆ టీడీపీ కార్యకర్త 'మా పార్టీ 151 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుంది. పవన్ చెప్పినట్లు మిగిలిన 22 ఎంపీ స్థానాలతో కలిపితే అవి మరో 154 అసెంబ్లీ స్థానాలు అవుతాయి. అంటే మేం 305 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు' కదా అన్నాడు. దెబ్బకు లాగిపెట్టి కొట్టినట్లయింది.'

– ఫేస్‌బుక్‌లో పెందుర్తికి చెందిన ఓ జనసైనికుడి ఆక్రోశం

ముద్ద దిగట్లేదన్నా

'జనసేన ప్రభుత్వం స్థాపిస్తాం అన్నారు. టీడీపీ సీట్లు ఇవ్వడం కాదు. మేమే తీసుకుంటాం అన్నారు. తీరా 24 సీట్లు ఇస్తే సూపర్ డూపర్ అంటున్నారు. మనం చెప్పే డైలాగులకు.. మనకు పడేసిన సీట్లకు ఏమైనా సంబంధం ఉందా పవనన్నా'. 'అంతన్నావ్ ఇంతన్నావ్.. చివరకు 24తో సరిపెట్టావ్. 'పవనన్నా నువ్వు చేసిన పనికి ముద్ద దిగడం లేదన్నా'

– మరికొందరు కార్యకర్తల ఆక్రందన

రాజారెడ్డి, రాధారెడ్డిలకు 'అకాడమి రత్న' అవార్డు

మరో 92 మందికి అకాడమి పురస్కారాలు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ కూచిపూడి కళాకారులు రాజా, రాధారెడ్డి దంపతులకు నాటక రంగంలో ప్రతిష్టాత్మకమైన 'అకాడమి రత్న' పురస్కారం ప్రకటించారు. కేంద్ర సాంస్కృతిక శాఖ సంగీత నాటక అకాడమి బుధవారం ఈ అవార్డులను ప్రకటించింది. రాజా, రాధారెడ్డితో పాటు వినాయక్ ఖేడేకర్, ఆర్.విశ్వేశ్వరన్, సునయన హజారిలాల్, దులాల్ రాయ్, డీపీ సిన్హాలకు అకాడమి రత్న అవార్డులు వరించాయి. 2022, 2023 సంవత్సరాలకు మరో 92 మందికి 'అకాడమి పురస్కార్', 80 మంది యువ కళాకారులకు 'ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్'లను ప్రకటించారు. అకాడమి రత్న అవార్డు గ్రహీతలకు రూ.3 లక్షలతో పాటు తామ్రపత్రం, అంగవస్త్రాన్ని అందజేస్తారు. రాష్ట్రపతితో ఈ అవార్డులను ప్రత్యేక వేడుకల్లో బహూకరించనున్నట్టు కేంద్ర సాంస్కృతిక శాఖ వెల్లడించింది.

కోవిడ్‌కు ముందున్న చార్జీల పునరుద్ధరణ

- లాక్‌డౌన్ ముగిసిన ఇన్నేళ్లకు ప్యాసింజర్ రైళ్లకు మోక్షం
- కనీస చార్జి రూ.30 నుంచి రూ.10కి తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల జేబులు కొల్లగొట్టి కోవిడ్ నష్టాలను భర్తీ చేసుకునే యత్నంలో ప్యాసింజర్ రైలు సర్వీసులు పక్కకు పెట్టిన రైల్వే శాఖ ఎట్టకేలకు తీరు మార్చుకుంది. తిరిగి ప్యాసింజర్ రైలు చార్జీలను అందుబాటులోకి తెచ్చింది. ఇంతకాలం ఎక్స్‌ప్రెస్ చార్జీలతో తిరిగిన ఈ రైళ్లు ఇక ఆర్డినరీ సెకండ్ క్లాస్ చార్జీలతో దిగిరానున్నాయి. ప్రస్తుతం ఈ రైళ్లలో రూ.30గా ఉన్న కనీస చార్జి రూ.10కి తగ్గింది. కోవిడ్‌కు ముందు ఇదే చార్జి అమల్లో ఉండేది. ఇటీవల జరిగిన రైల్వే బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయం ఆధారంగా దాన్ని అమలులోకి తెచ్చారు. ఈమేరకు రైల్వే బోర్డు నుంచి దక్షిణ మధ్య రైల్వేకి బుధవారం లిఖిత పూర్వక ఆదేశాలు అందాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కోవిడ్ కంటే ముందు 220 ప్యాసింజర్ రైళ్లు నడిచేవి. వీటిలో డెము/మెము సర్వీసులు కూడా ఉన్నాయి. కోవిడ్ తర్వాత దశలవారీగా వాటిలో 180 రైళ్లను మాత్రమే ప్రారంభించారు. వాటి నంబర్లను మార్చి ఎక్స్‌ప్రెస్ చార్జీలతో తిప్పుతూ వస్తున్నారు.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

పోతుందనుకున్న ప్రాణం నిలబడింది

మాది రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో సెలూన్ షాపు నడుపుకుంటున్నా. నాకు భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. జీవితం సాఫీగా సాగిపోతున్న తరుణంలో నాలుగేళ్ల కిందట ఉదర సంబంధిత అనారోగ్యంతో మంచం పట్టాను. చికిత్స చేయించుకుందామంటే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అలాంటి దీన పరిస్థితిలో జగనన్న ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 2,64,626 విలువైన కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించి ప్రాణం నిలబెట్టింది. శస్త్రచికిత్స అనంతరం మందుల ఖర్చులు, రవాణా ఖర్చులకు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా రూ.28,900 నేరుగా నా బ్యాంకు ఖాతాలో జమ చేసింది. సెలూన్ షాపు ఉండటంతో జగనన్న చేదోడు కింద ఏటా రూ.10,000 వంతున అందింది. షాపునకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. నా



భార్యకు వైఎస్సార్ ఆసరా కింద రూ.20,848, పెద్ద కొడుకు పవన్‌సాయికి విద్యా దీవెన కింద రూ.12,000, చిన్న కొడుకు ఆదిత్యసాయికి అమ్మఒడి కింద రూ.30,000 వచ్చాయి. టీడీపీ ప్రభుత్వ పాలనలో మాకు ఎలాంటి లబ్ధి కలగ లేదు. నా ప్రాణం నిలబెట్టిన, మా కుటుంబ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– అజ్జాడ సింహాచలం, కురుపాం
(కె.చంద్రమౌళి, విలేకరి, కురుపాం)

సర్కారు సాయంతో హాయిగా జీవనం

నాకు ఐదుగురు సంతానం. అందరికీ వివాహాలు చేశా. ఎవరి బతుకులు వాళ్లు బతుకున్నారు. నా భర్త చనిపోయి నాలుగేళ్లయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా బిడ్డలపై ఆధారపడకుండా ధైర్యంగా బతుకుతున్నా. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పశివేదల గ్రామంలో జీవిస్తున్నా. ఒంటరిగా బతుకుతున్నానన్న బాధ ఏ రోజూ కలగలేదు. ప్రతినెలా వితంతు పింఛన్ అందుకుంటున్నా. ఈ సొమ్ము నా నెలవారీ ఖర్చుకు సరిపోతుంది. వైఎస్సార్ ఆసరా కింద రూ.30,144 రుణమాఫీ సొమ్మును నా ఖాతాలో జమ చేశారు. వైఎస్సార్ చేయూత పథకం కింద ఏడాదికి రూ.18,750 వంతున అందింది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం



ద్వారా రూ.4,898 జమయ్యింది. చిత్తశుద్ధితో నాలాంటి కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాను.

– కాకరపర్తి మంగాయమ్మ, పశివేదల
(జి.వి.వి.సత్యనారాయణ,విలేకరి, కొవ్వూరు)

ఒంటరి బతుక్కి ప్రభుత్వం అండ

భర్తను కోల్పోయి, పిల్లలతో దిక్కుతోచని స్థితిలో ఉన్న నాకు జగనన్న ప్రభుత్వం అడుగడుగునా చేదోడుగా నిలిచింది. నా భర్త సుబ్బారావు పదేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. వైఎస్సార్ జిల్లా సిద్దవటం గ్రామంలో టైలరింగ్ వృత్తి చేసుకుంటూ ఆడ పిల్లలిద్దర్ని పెంచి, పెద్దచేసి పెళ్లి చేశా. కొడుకు పృథ్విని పీజీ వరకు చదివించా. నాకు వితంతు పింఛన్ మంజూరైంది. అప్పుడు రూ.200 ఇచ్చేవారు. తర్వాత రూ.2 వేలకు పెంచారు. గత ప్రభుత్వంలో పింఛన్ డబ్బులు తీసుకోవాలంటే పనులు మానేసి, పంచాయతీ ఆఫీసు వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. పింఛన్ కోసం కూలి పనుల్ని వదులుకున్న రోజులూ ఉన్నాయి. జగనన్న ప్రభుత్వం వచ్చాక పింఛన్ రూ.3 వేలకు పెరిగింది. వలంటీర్ ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికొచ్చి మరీ పింఛన్ డబ్బులు అందిస్తున్నారు. మా అబ్బాయికి ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో రూ.15 వేలు లబ్ధి



కలిగింది. టైలర్లకు ప్రభుత్వం ప్రకటించిన జగనన్న చేదోడు పథకం ద్వారా ఏటా రూ.10 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాలో జమవుతోంది. వైఎస్సార్ ఆసరా ద్వారా ఏటా రూ.3 వేలు చొప్పున అందింది. ప్రభుత్వం అందిస్తున్న సాయం, కుట్టు మిషన్ ద్వారా వస్తున్న ఆదాయంతో ఆనందంగా బతుకుతున్నా. మాలాంటి పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్న జగనన్న రుణం ఎప్పటికీ తీర్చుకోలేం.

– మేరువ బుజ్జమ్మ, సిద్దవటం
(పాలెం శ్రీనివాసబాబు, విలేకరి, సిద్దవటం)

గురివింద ప్రయాసే

బీమా రక్షణతో భద్రంగా ప్రవాసాంధ్రులు

- 2.55 లక్షల మందికి ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ సేవలు
- కరోనా, ఉక్రెయిన్ యుద్ధం వేళ తక్షణమే స్పందన
- మాతృభూమికి సురక్షితంగా ప్రవాసుల తరలింపు
- 50 వేల మంది వలస కార్మికులు క్షేమంగా రాష్ట్రానికి


సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టను మసకబారృడమే లక్ష్యంగా పొరుగు రాష్ట్రం నుంచి రాళ్లేస్తున్న రాజ గురివింద ప్రవాసాంధ్రులకు బీమా రక్షణ కరువైందంటూ కన్నీళ్లు పెట్టారు! చంద్రబాబు సర్కారు ఐదేళ్లలో బీమా క్లెయిమ్‌గా నలుగురు బాధిత కుటుంబాలకు చెల్లించిన మొత్తం రెండంటే రెండు లక్షల లోపే ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక 28 లక్షల మందికి రూ.42 లక్షలకుపైగా క్లెయిమ్ పరిహారం అందచేసింది. మరో రూ.25 లక్షల మొత్తానికి సంబంధించిన క్లెయిమ్‌లు ప్రాసెసింగ్‌లో ఉన్నాయి. ప్రవాసుల భద్రత, డబ్బు విషయంలో వెనుకాడే ప్రభుత్వమైతే సొంత ఖర్చులతో విపత్తు వేళ ఆగమేఘాలపై వారిని స్వస్థలాలకు తరలిస్తుందా? బీమా ప్రీమియం స్వల్ప మొత్తంలోనే రూ.ఐదారు వందలు లోపే ఉంటుంది. అయితే ప్రవాసాంధ్రుల్లో చాలా మంది విదేశాల్లో తాము పని చేస్తున్న చోట్ల బీమా కవరేజీని పొందుతున్నందున ప్రవాసాంధ్ర బీమా భరోసాను తీసుకోవడంపై అంతగా ఆసక్తి చూపడం లేదు. అది కూడా రాష్ట్ర ప్రభుత్వ తప్పిదమే అనే రీతిలో రోత కథనాలను అచ్చేసి రామోజీ పైశాచిక ఆనందాన్ని పొందడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

2.5 లక్షల మందికి ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ సేవలు



ఏపీ ఎన్ఆర్‌టీఎస్ గత నాలుగేళ్లలో 2,55,000 మంది ప్రవాసాంధ్రులకు వివిధ సేవలతో సాయాన్ని అందించింది. 24/7 ద్వారా ప్రవాసాంధ్రులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రవాసాంధ్రుల బీమా పథకం క్లెయిమ్ కింద కేవలం నలుగురికి రూ.2 లక్షల లోపే అందించగా ఇప్పుడు గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం 28 మందికి పరిహారంగా రూ.42,05,604 చెల్లించింది. రూ.25,53,700 విలువైన మరో పది క్లెయిమ్‌లు పురోగతిలో ఉన్నాయి. బీమానే కాకుండా అంబులెన్సు, ఎక్స్‌గ్రేషియా, రీ పాట్రియేషన్ ద్వారా అధిక సంఖ్యలో వలస కార్మికులు లబ్ధి పొందారు. అనారోగ్య బాధితులతో పాటు మృతుల భౌతిక కాయాలను విమానాశ్రయాల నుంచి స్వస్థలాలకు తరలించేందుకు 1,077 అంబులెన్సులను ప్రభుత్వం సమకూర్చింది. ఇందుకోసం రూ.1.93 కోట్లకు పైగా వెచ్చించింది. ప్రమాదవశాత్తు విదేశాల్లో మరణించిన 489 మంది కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కింద రూ.2.44 కోట్లకుపైగా చెల్లించింది. వివిధ కారణాలతో విదేశాల్లో చిక్కుకుపోయి ఇబ్బంది పడుతున్న 4,622 మందిని రీపాట్రియేషన్‌తో స్వస్థలాలకు క్షేమంగా తరలించింది.

– వెంకట్ మేడపాటి, ఏపీ ఎన్ఆర్‌టీఎస్ ప్రెసిడెంట్



- దాదాపు 20 లక్షల మంది ప్రవాసాంధ్రుల్లో గత సర్కారు కేవలం 16,713 మందికి (ఒక్క శాతం) మాత్రమే బీమా కల్పిస్తే అది చాలా గొప్పంటూ డప్పు కొట్టిన రామోజీకి కరోనా విపత్తులో వేల మంది ప్రవాసులను ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సురక్షితంగా మాతృభూమికి తరలించిన విషయం తెలుసా? ఉక్రెయిన్ యుద్ధం లాంటి సందర్భాల్లో ప్రభుత్వం సత్వరమే స్పందించి డబ్బుకు వెనుకాడకుండా ప్రవాసులను క్షేమంగా స్వదేశానికి తీసుకొచ్చింది. ఇమ్మిగ్రేషన్ అధికారులతో సంప్రదించి 50 వేల మంది వలస కార్మికులను రాష్ట్రానికి క్షేమంగా తరలించింది.
- కోవిడ్ విపత్తు, రష్యా - ఉక్రెయిన్ యుద్ధం సమయంలో లక్షల మంది ప్రవాసాంధ్రులు వెనక్కి వచ్చేశారు. బీమా సౌకర్యం లేని వారిని గుర్తించి పథకం ప్రయోజనాలు వివరిస్తూ అందులో చేర్చేందుకు ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ పెద్ద ఎత్తున కృషి చేస్తోంది. తద్వారా గత ప్రభుత్వ హయాం కంటే మెరుగ్గా 33,596 మందికిపైగా బీమా ప్రయోజనాన్ని పొందారు. విదేశాలకు వలస వెళ్లే కార్మికులకు మూడేళ్లకు కేవలం రూ.550 ప్రీమియం అంటే రోజుకు సుమారు 50 పైసలకే అందిస్తున్నా అది కూడా భారమే అంటూ రాగాలు తీయడం వారిని అవమానించడం కాదా?
- బీమా రక్షణ అనేది స్వచ్ఛందం. అవగాహన కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. అవసరమైన వారు ముందుకొచ్చి తీసుకుంటారు. అమెరికా, కెనడా, యూకే, ఐరోపా, ఆస్ట్రేలియా తదితర చోట్ల తాము పని చేస్తున్న సంస్థల్లో బీమా ప్రయోజనాలు అందుతున్నందున ప్రవాసులు ప్రభుత్వ పథకంలో చేరడానికి అంతగా ఆసక్తి చూపడం లేదు. మరి ఇది కూడా ప్రభుత్వ తప్పిదమేనా రామోజీ?
- ఎలా చూసినా గత సర్కారు రెండేళ్లలో ప్రవాసాంధ్రులకు అందించిన ప్రయోజనం కంటే గత నాలుగేళ్లుగా చేకూరిన లబ్ధి 10 రెట్లు అధికంగా ఉంది.

175 స్థానాల్లో గెలుపే లక్ష్యం

ప్రజల నుంచి మంచి స్పందన ఉంది

- 3న జరగాల్సిన సిద్ధం సభ 10కి మార్పు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి

మేదరమెట్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో విజయం సాధిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పి.గుడిపాడు వద్ద వచ్చే నెలలో నిర్వహించే సిద్ధం సభ కోసం ఏర్పాటు చేస్తున్న సభా ప్రాంగణాన్ని ఆయన పార్టీ నేతలతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ మార్చి 3న జరగాల్సిన సిద్ధం సభను 10వ తేదీకి మార్చామన్నారు. సిద్ధం సభలు ఎక్కడ జరిగినా ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. ఈసారి సభకు 15 లక్షల మంది హాజరయ్యేలా వంద ఎకరాల్లో సభా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. మరో వంద ఎకరాలు కూడా సభాప్రాంగణానికి ఆనుకుని అందుబాటులో ఉన్నాయన్నారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు చెందిన ప్రజలు ఈ సభకు హాజరవుతారని వెల్లడించారు. మార్చి 10న సిద్ధం సభకు మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హాజరై ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగన్ ప్రభుత్వం పాలన చేస్తోందని కొనియాడారు. ప్రజల స్పందన చూస్తుంటే రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపొందడం ఖాయమని తెలుస్తోందన్నారు. మేనిఫెస్టోపై కసరత్తు జరుగుతోందని.. అతి త్వరలోనే ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రకటించకుండా ఉన్న నియోజకవర్గాల్లో అభ్యర్థులను సిద్ధం సభలో సీఎం వైఎస్ జగన్ ప్రకటిస్తారని చెప్పారు. ఎంతమంది పొత్తులతో వచ్చినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆదిమూలపు సురేశ్, మేరుగు నాగార్జున, ఎంపీలు నందిగం సురేష్, మోపిదేవి వెంకట రమణారావు, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు పానెం చిన హనిమిరెడ్డి, కరణం వెంకటేశ్, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిద్ధం సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

ఏప్రిల్ 17న శ్రీ సీతారాముల కల్యాణం

భద్రాచలం టౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి క్షేత్రంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఏప్రిల్ 9న ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 17న శ్రీ సీతారాముల కల్యాణం(శ్రీరామనవమి), 18న స్వామివారికి మహా పట్టాభిషేకం ఉంటాయని ఆలయ ఈఓ రమాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 9 నుంచి 13వ తేదీ వరకు స్వామివారికి ప్రత్యేక పూజలుజరుగుతాయని పేర్కొన్నారు. 14న గరుడ ధ్వజపటలేఖనం, 15న అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, భేరీపూజ, దేవతాహోన్వం,బలిసమర్పణ, హనుమంత వాహనసేవ, 16న గరుడ వాహనసేవ, ఎదుర్కోలు వేడుకలు ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 9 నుంచి 23 వరకు స్వామివారి నిత్య కల్యాణం, దర్బార్, పవళింపు సేవలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

తెలంగాణ

రుద్రేశ్వరాలయం గర్వకారణం

హన్మకొండ కల్చరల్: ప్రాచీన త్రికూటాలయమైన శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల ఆలయం వరంగల్‌లో ఉండడం ఇక్కడి ప్రజలకు గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం శాఖామంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం హనుమకొండలోని వేయిస్తంభాల గుడిని మంత్రి రోజా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, వేదపండితులు రోజాను అలయమర్యాదలతో స్వాగతించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ఉత్తిష్ఠ గణపతికి పూజలు, శ్రీరుద్రేశ్వరస్వామి వారికి లఘున్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం జరిపారు. అనంతరం ఆమెకు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు. మంత్రి రోజా దేవాలయంలోని శిల్పకళను పరిశీలించి, ఆలయ చరిత్రను, జిట్టెడు ఆంజనేయస్వామి గురించి తెలుసుకున్నారు.

గ్రావెల్ తవ్వకాలపై నివేదిక ఇవ్వండి

గనుల శాఖకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం పరిధిలోని 60 ఎకరాల్లో సాగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలపై వాస్తవాలను తేల్చేందుకు ఓ బృందాన్ని పంపి సర్వే చేయించాలని హైకోర్టు గనుల శాఖ అధికారులను బుధవారం ఆదేశించింది. తవ్వకాలకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలంది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. వీరనాయకునిపాలెంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయంటూ అదే గ్రామానికి చెందిన ఎం.ప్రభుదాస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు స్పందిస్తూ.. అసైన్డ్ భూముల్లో తవ్వకాలకు అనుమతులు ఇవ్వడానికి వీల్లేదన్నారు. అసైన్డ్‌దారులు పేద ఎస్సీ, ఎస్టీ రైతులని, వారిని తమ భూముల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. 2.86 ఎకరాల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు తీసుకుని ఏకంగా 60 ఎకరాల్లో తవ్వకాలు చేపడుతున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్న వారిపై ఇప్పటి వరకు ఏం చర్యలు తీసుకున్నారు? ఏం చర్యలు తీసుకోబోతున్నారో స్పష్టంగా చెప్పాలని అధికారులను ఆదేశించింది. ఓ బృందాన్ని పంపి గ్రావెల్ తవ్వకాలపై సర్వే చేయించాలని ఆదేశించింది. తవ్వకాలపై నివేదిక ఇవ్వాలంటూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఐఐటీ హైదరాబాద్‌కు 'గోదావరి' బాధ్యత

- బేసిన్ నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేయనున్న సంస్థ
- ప్రణాళిక రూపకల్పనలో పాలు పంచుకోనున్న ఎన్ఈఈఆర్ఐ నాగ్‌పూర్
- ఎన్ఐటీ వరంగల్, ఎన్ఐటీ సూరత్‌కల్‌కు కృష్ణా బేసిన్ బాధ్యత

సాక్షి, న్యూఢిల్లీ: గోదావరి, కృష్ణా నది సహా ఆరు నదుల బేసిన్ నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేసే పనిని కేంద్ర జలశక్తి శాఖ పలు ప్రతిష్టాత్మక విద్యా సంస్థలకు అప్పగించింది. గోదావరి బేసిన్ నిర్వహణ ప్రణాళిక బాధ్యతను ఐఐటీ హైదరాబాద్, ఎన్ఈఈఆర్ఐ నాగ్‌పూర్‌కు అప్పగించింది. అదేవిధంగా కృష్ణా నదీ బేసిన్ నిర్వహణ ప్రణాళిక బాధ్యతను ఎన్ఐటీ వరంగల్, ఎన్ఐటీ సూరత్‌కల్‌కు అప్పగించింది. ఇలా దేశంలోని 6 ప్రధాన నదులు నర్మదా, గోదావరి, కృష్ణా, కావేరి, పెరియార్, మహానది బేసిన్ నిర్వహణ ప్రణాళికను రూపొందించే బాధ్యతను 12 సాంకేతిక సంస్థలు తీసుకోనున్నాయి. ఈ మేరకు బుధవారం 12 విద్యా సంస్థలు, నేషనల్ రివర్ కన్జర్వేషన్ డైరెక్టరేట్, జలశక్తి మంత్రిత్వ శాఖ మధ్య ఒప్పందం కుదిరింది. ఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, శాఖ సహాయ మంత్రులు రాజీవ్ చంద్రశేఖర్, బిశ్వేశ్వర్ తుడులతో పాటు 12 విద్యా సంస్థల డైరెక్టర్లు హాజరయ్యారు. ఇప్పటికే దేశంలోని అతిపెద్ద నది అయిన గంగా బేసిన్ నిర్వహణ ప్రణాళికను ఐఐటీ కాన్పూర్ నేతృత్వంలోని ఏడు ఐఐటీల కన్సార్టియం విజయవంతంగా పూర్తి చేసిందని జలశక్తి శాఖ ప్రకటించింది.

నేడు రుషికొండ రీ–డెవలప్‌మెంట్ టూరిజం ప్రాజెక్టు ప్రారంభం

- హాజరుకానున్న మంత్రి రోజా
- రూ.450 కోట్లతో అభివృద్ధి చేసిన ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన రుషికొండ రీ డెవలప్‌మెంట్ రిసార్ట్ ప్రాజెక్టు గురువారం ప్రారంభం కానుంది. రూ.451.67 కోట్లతో పూర్తి చేసిన ప్రాజెక్టును రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా సెల్వమణి చేతుల మీదుగా ప్రారంభించేందుకు పర్యాటక శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా ప్రధాన నిర్మాణాలతో పాటు



గ్రీనరీ గార్డెనింగ్ అభివృద్ధి చేశారు. పాత భవనాల స్థానంలో అత్యాధునిక నిర్మాణాలు చేపట్టారు. పర్యావరణానికి విఘాతం కలగకుండా.. పచ్చదనం హరించకుండా.. ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేశారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎంపీలు, టూరిజం అధికారులు హాజరుకానున్నారు.

ఏపీలో విద్యా విధానం భేష్

- ఐబీ సిలబస్ అంతర్జాతీయ ప్రతినిధులు
- చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన బృందం

మధురవాడ (భీమిలి): ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా విధానం, పాఠ్య ప్రణాళిక (కరికులమ్)బాగున్నాయని ఐబీ సిలబస్ అంతర్జాతీయ ప్రతినిధులు యూఎస్ఏకి చెందిన సీనియర్ కరికులమ్ డిజైన్ మేనేజర్ ఆర్డర్, యూకేకి చెందిన అసోసియేట్ మేనేజర్ మైఖేల్ ప్రశంసలు కురిపించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో ఐబీ సిలబస్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో నార్త్ డివిజన్‌లో 10 రోజుల పర్యటనలో భాగంగా విశాఖ మహానగరంలోని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం సందర్శించారు. ఇక్కడ కరికులమ్, కంప్యూటర్ విద్య, వసతులను పరిశీలించారు. ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారు, విద్యార్థులు పాఠాలను ఎలా అర్థం చేసుకుంటున్నారనే తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఐఎఫ్‌పీ ప్యానల్స్, ట్యాబ్స్ ఉపయోగం, పిల్లల టాలెంట్స్‌ను పరిశీలించారు. బైలింగ్యువల్ టెక్స్ట్‌బుక్స్ పిల్లలకు ఎలా ఉపయోగపడుతున్నాయనే విషయాలతోపాటు బోధన తీరును కూడా పరిశీలించారు. సైన్స్‌డేని పురస్కరించుకుని విద్యార్థులు తయారు చేసిన మోడల్స్, వాటి గురించి వివరిస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఈఆర్‌టీ ఆచార్యులు శ్రీనివాసరావు, డీఈఓ ఎల్.చంద్రకళ మాట్లాడుతూ.. ఐబీ సిలబస్ ప్రతినిధులు ఇక్కడి విద్యావిధానం బాగుందని చెప్పారన్నారు. రాష్ట్రంలో విద్యా విధానాన్ని పరిశీలించి ఆకళింపు చేసుకున్న ఐబీ ప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చినట్టు చెప్పారు. ఇందులో భాగంగా వేర్వేరు పాఠశాలలు, తరగతులను పరిశీలిస్తున్నారన్నారు.



చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ నమూనాలను పరిశీలిస్తున్న ఐబీ బృందం

బార్ కౌన్సిల్ నిధులపై వ్యాజ్యాన్ని కొట్టేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో నిధుల దుర్వినియోగం జరిగిందని, దీనిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ కడపకు చెందిన న్యాయవాది మూలి వెంకటబాలిరెడ్డి దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఎదుట పిటిషనర్ బాలిరెడ్డి వాదనలు వినిపిస్తూ.. రూ.100 స్టాంపులకు సంబంధించిన నిధుల దుర్వినియోగం జరిగిందని తెలిపారు. వాస్తవ మొత్తానికి, బార్ కౌన్సిల్ చూపుతున్న మొత్తాలకు తేడా ఉందన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్టాంపుల కొనుగోలుకు సంబంధించిన వ్యవస్థ గురించి ప్రశ్నించింది. అయితే ధర్మాసనం ప్రశ్నలకు బాలిరెడ్డి సమాధానం చెప్పలేకపోయారు.

బార్ కౌన్సిల్‌కి వచ్చేది రూ.86

బార్ కౌన్సిల్ తరఫున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి స్పందిస్తూ.. పిటిషనర్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని తెలిపారు. బార్ కౌన్సిల్ రూ.100 స్టాంపులను ముద్రిస్తుందన్నారు. రూ.100లో రూ.86 బార్ కౌన్సిల్‌కు వెళుతుందని, మిగిలిన మొత్తం హైకోర్టు న్యాయవాదుల సంఘానికి, క్లర్కుల సంక్షేమ సంఘానికి వెళుతుందని వివరించారు. పిటిషనర్ రూ.100 బార్ కౌన్సిల్‌కే వస్తుందని లెక్కవేసి మిగిలిన మొత్తం దుర్వినియోగం జరిగిందన్న తప్పుడు అభిప్రాయంతో ఉన్నారని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమ చట్ట నిబంధనలకు అనుగుణంగానే ఈ మొత్తాలను వినియోగిస్తుందని వివరించారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. అసలు ఈ చట్టం గురించి మీకు తెలుసా అని పిటిషనర్ బాలిరెడ్డిని ప్రశ్నించింది. తెలియదని చెప్పడంతో చట్టం గురించి తెలియకుండా ఎలా పిల్ వేస్తారని ధర్మాసనం నిలదీసింది. దీనిని నాన్ సీరియస్ వ్యాజ్యంగా రూ.50 వేల ఖర్చులతో కొట్టేస్తున్నట్టు వెల్లడించింది. తాను కింది కోర్టు న్యాయవాదినని, ఖర్చులు చెల్లించలేనని చెప్పడంతో ధర్మాసనం ఖర్చులను తొలగించింది. పిటిషన్‌ను కొట్టేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేసింది.

27.20 కోట్ల పనిదినాల పాటు పేదలకు 'ఉపాధి'

సాక్షి, అమరావతి: రానున్న వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో పనులు కోరుకునే వారందరికీ సొంత ఊరిలో ఉపాధి హామీ పథకం ద్వారా పెద్దఎత్తున పనులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏప్రిల్ 1నుంచి మొదలయ్యే నూతన ఆర్థిక సంవత్సరంలో మొత్తం 27.20 కోట్ల పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు తుది ఆమోదం పొందేందుకు గురువారం ఢిల్లీలో కేంద్ర–రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల ఉమ్మడి సమావేశం జరగనుంది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, కమిషనర్ సూర్యకుమారి ఈ సమావేశంలో పాల్గొననున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు కేంద్రం పూర్తి స్థాయిలో ఆమోదం తెలిపితే ప్రస్తుతం అమల్లో ఉన్న ఉపాధి హామీ పథకం కూలీ రేట్ల ప్రకారం పేదలు కూలీ రూపంలో గరిష్ఠంగా రూ.7,398 కోట్లు ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

నేతన్నలకు ప్రభుత్వం అండ

ఢిల్లీలోని ఎక్స్‌పోలో ఏపీ స్టాల్స్‌ను సందర్శించిన మంత్రి బుగ్గన



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఎక్కడా లేనివిధంగా వైఎస్ జగన్ ప్రభుత్వం చేనేత రంగానికి పెద్దపీట వేసిందని ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహిస్తున్న ఎక్స్‌పోలో ఏపీకి చెందిన 11 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ ఎక్స్‌పోను మంత్రి బుగ్గన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన ఏపీ స్టాల్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. పొందూరు, ఉప్పాడ, మంగళగిరి తదితర ప్రదేశాల్లోని చేనేత పరిశ్రమలు ఆయా ప్రాంతాలకు వన్నె తెచ్చాయన్నారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు సునీత, ఎంఎం నాయక్ పాల్గొన్నారు.



న్యూస్‌మేకర్



క్రికెట్ ఫీల్డ్‌లోని ఒక్కొక్క రంగంలో నెమ్మదిగా మహిళా కేతనం ఎగురుతోంది. గతంలో మొదటి మహిళా క్రికెట్ అంపైర్ వృందా రతి, మొదటి ఐసీసీ మహిళా మ్యాచ్ రిఫరీగా జి.ఎస్.లక్ష్మి చరిత్ర సృష్టిస్తే ఇప్పుడు దేశంలోనే మొదటి మహిళా పిచ్ క్యూరేటర్‌గా **జసింత కల్యాణ్** ఘనత సాధించింది. బెంగళూరులో జరుగుతున్న విమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో పిచ్ క్యూరేటర్‌గా జసింత తన బాధ్యతను నిర్వర్తిస్తోంది. ఆమె పరిచయం.

తొలి మహిళా క్యూరేటర్ జసింత

క్రికెట్ అంటే సచిన్, ద్రవిడ్, గంగూలి అనేవారు ఒకప్పుడు. మిథాలీ రాజ్, హర్మన్ ప్రీత్ కౌర్, స్మృతి మంధాన అంటున్నారు ఇప్పుడు. క్రికెట్ కామెంటేటర్స్ అంటే హర్ష భోగ్లే, సునీల్ గవాస్కర్ అనేవారు మొన్న. ఫీమేల్ క్రికెట్ యాంకర్స్‌గా మందిరా బేడీ, సంజనా గణేశన్ పేరు గడించారు ఇవాళ. మహిళా అంపైర్లు ఇదివరకే రంగంలోకి వచ్చారు. వారి వరుసలో చేరింది జసింత కల్యాణ్. ఈమె భారతదేశంలో తొలి మహిళా పిచ్ క్యూరేటర్.

1980ల నుంచి

మనదేశంలో పిచ్ క్యూరేటర్లు 1980 వరకూ లేరు. స్టేడియంలో గడ్డి పెంచే మాలీలే పిచ్‌ను కూడా తయారు చేసేవారు, తెలిసినంతలో చూసుకునేవారు. కాని వాన పడితే పిచ్‌ను తడవడానికి వదిలేయడం, స్టంప్స్ వదిలేసి పోవడం జరిగేది. దానివల్ల మ్యాచ్ కొనసాగే సమయంలో పిచ్ అనూహ్యంగా మారేది. అలా కాకుండా స్టేడియంలోని మట్టిని బట్టి, రుతువులను బట్టి, ఆట సమయానికి పిచ్‌ను శాస్త్రీయంగా తయారు చేసేందుకు ‘పిచ్ క్యూరేటర్లు’ రంగం మీదకు వచ్చారు. వీరు పిచ్‌ను తీర్చిదిద్దుతారు. రకరకాల వాతావరణ పరిస్థితుల నుంచి కాపాడి పిచ్‌ను ఎప్పుడూ ఆటకు వీలుగా ఉంచుతారు. అయితే ఈ నలభై ఏళ్ల నుంచి కూడా పురుషులే పిచ్ క్యూరేటర్లుగా ఉన్నారు. ఒక స్టేడియంలోని పిచ్‌లను స్త్రీలకు అప్పజెప్పడం ఎప్పుడూ లేదు. మొదటిసారి అలా బాధ్యత తీసుకున్న మహిళ జసింత కల్యాణ్.

బెంగళూరులో జసింత

బెంగుళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరుగుతోన్న డబ్ల్యూపీఎల్ కోసం పిచ్‌ను తయారు చేసే బాధ్యతను అందుకున్నారు జసింత కల్యాణ్. బెంగళూరు నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న హరొబెలె అనే ఊరిలో జన్మించిన జసింత తండ్రి వరి రైతు. చిన్నప్పుడు ఆర్థిక కష్టాలు పడిన జసింత బెంగళూరు చేరుకుని ‘కర్నాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్’లో రిసెప్షనిస్ట్‌గా చేరింది. ఆ తర్వాత అడ్మినిస్ట్రేటర్‌గా ప్రమోట్ అయ్యింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆమె ఆఫీసు ఉన్నా మ్యాచ్‌లు చూసేది కాదు. సిక్సర్లు, ఫోర్లు విని పిస్తే తప్ప. అయితే ఆమెకు స్టేడియంలోని పచ్చ గడ్డి అంటే ఇష్టం. అది గమనించిన అసోసియేషన్ సెక్రటరీ బ్రిజేష్ 2014లో స్టేడియంలో పని చేసే మాలీలపై అజమాయిషీని అప్పజెప్పాడు. ఆ తర్వాత ఆ స్టేడియంకు చెందిన పిచ్ క్యూరేటర్ ప్రశాంత్ రావు ఆమెకు పిచ్‌లు తయారు చేయడంలో మెళకువలు నేర్పాడు. దాంతో ఆమె పూర్తిగా అనుభవం గడించింది. ఆ అనుభవం నేడు ఆమెను మన దేశ తొలి మహిళా పిచ్ క్యూరేటర్‌గా నిలిపింది. బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో ప్రస్తుతం జరుగుతున్న విమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో పిచ్‌లను ఆమె అజమాయిషీ చేస్తోంది. క్యూరేటర్‌గా జసింత నియామకం గురించి తెలిశాక క్రికెట్ రంగం నుంచి, అభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతుంటే బీసీసీఐ సెక్రటరీ జై షా కూడా సోషల్ మీడియా వేదికగా ఆమెను కొనియాడుతూ పోస్ట్ చేశారు. తన పనితీరుకు మెచ్చుకుంటూ ప్రశంసలతో ముంచెత్తారు.


మల్టీ టాలెంట్

విశ్రాంత సమయాన

అవిశ్రాంత కృషి

‘అపర్ణ మేడం పాఠం ఒక్కసారి వింటే ప్రతి చెట్టు, ప్రతి పువ్వుతో స్నేహం చేయాలనిపిస్తుంది’ ‘అపర్ణ స్వరపరిచిన పాటలు వింటే అద్భుతం అనిపిస్తుంది’ ‘అపర్ణ వినిపించే వీణ స్వరాలు అపురూపం’ ‘అపర్ణ రాసిన పుస్తకాలు శాస్త్రీయ విషయాలను సైతం చాలా సులభంగా అర్థమయ్యేలా చెబుతాయి’... ఇలాంటి కామెంట్స్ అపర్ణ గురించి తరచుగా వినిపిస్తుంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే **డా. అపర్ణ బుజర్ బారువా** బహుముఖ ప్రజ్ఞాశాలి. విశ్రాంత జీవితానికి కొత్త అర్థం ఇచ్చిన ప్రతిభావంతురాలు. కోల్‌కతాలో జరిగిన ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆమె తీసిన ‘దూలియ కల్చర్ ఆఫ్ వోల్డ్ కామ్‌రూప్’ బెస్ట్ డాక్యుమెంటరీ అవార్డ్‌ను అందుకుంది...





సాంస్కృతిక వైభవానికి అద్దం పట్టే అస్సాంలోని తేజ్‌పూర్‌లో పుట్టిపెరిగింది అపర్ణ. గువహటిలోని కాటన్ కాలేజీలో బాటనీ లెక్చరర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని 1969లో ప్రారంభించిన అపర్ణ ఒక వైపు విద్యార్థులకు బాటనీ పాఠాలు బోధిస్తూనే మరోవైపు విద్యార్థిగా మ్యూజిక్ కాలేజీలో చేరి సంగీత పాఠాలు నేర్చుకునేది. సంగీత విద్యాపీఠ్ నుంచి సితార్‌లో విశారద్ డిగ్రీ పొందింది.

ఎంతోమంది కవుల పాటలకు స్వరాలు సమకూర్చింది. ఆ పాటలు ఆల్ ఇండియా రేడియోలో ప్రసారమై ఆదరణ పొందాయి. వందపాటలకు పైగా స్వరాలు అందించిన అపర్ణ ఏఐఆర్ గువహటి ఫస్ట్ ఉమెన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా అరుదైన ఘనతను దక్కించుకుంది.

2003లో హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ హోదాలో పదవీ విరమణ చేసిన అపర్ణ ‘ఇది విశ్రాంతి సమయం’ అనుకోలేదు. ‘ఎన్నో విషయాలు నేర్చుకోవడానికి చాలా సమయం దొరికింది’ అనుకుంది. తన సాంస్కృతిక మూలాలను వెదుక్కుంటూ వెళ్లింది. కొత్త సంగీత ధోరణులను అధ్యయనం చేసింది. సంస్కృతి, సాహిత్యం, శాస్త్రీయ రంగాలకు సంబంధించి ఎన్నో పుస్తకాలు రాసింది.

గువహటిలోని గీతానగర్‌లో తన భర్త నాగేంద్రనాథ్ బుజర్ బారువా పేరు మీద చక్కటి లైబ్రరీ ఏర్పాటు చేసింది.

కాలంతో పాటు నడుస్తూ షార్ట్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీలు తీయడం నేర్చుకుంది.

26 నిమిషాల నిడివి ఉన్న ‘దూలియ కల్చర్ ఆఫ్ వోల్డ్ కామ్‌రూప్’ డాక్యుమెంటరీ అపర్ణకు అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చింది. ‘దూలియ సంస్కృతి గత, వర్తమానాలకు అద్దం పట్టేలా ఈ డాక్యుమెంటరీని రూపొందించాను. దూలియా లాంటి ప్రత్యేక సంస్కృతిని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది’ అంటుంది అపర్ణ.

> **నా వయసు జస్ట్ 78 ప్లస్**
> బెస్ట్ డాక్యుమెంటరీ అవార్డ్‌ను అందుకోవడానికి వేదికపైకి వచ్చినప్పుడు యాంకర్ నన్ను ఆశ్చర్యంగా చూసి ‘మీ వయసు ఎంత?’ అని అడిగారు. 78 ప్లస్ అని చెప్పగానే ‘మీరు నిజంగా ఈ తరానికి స్ఫూర్తి’ అన్నారు. ఇది విని ప్రేక్షకులు పెద్ద ఎత్తున చప్పట్లు కొట్టారు. ఈ చప్పట్లను కూడా నాకు వచ్చిన అపురూపమైన అవార్డ్‌గానే భావిస్తున్నాను. మొదటి డాక్యుమెంటరీకే నాకు పెద్ద పేరు రావడం అదృష్టంగా భావిస్తున్నాను.
> – డా.అపర్ణ బుజర్ బారువా

దూలియ అనేది పురాతన కళారూపం. దూలియ సంస్కృతి వైభవం గాయకుల పాటల్లో, ఆటల్లో, తోలుబొమ్మలాటలో కనిపిస్తుంది. గానం, నటన, హాస్యప్రదర్శన, డప్పులు వాయించడం... ఎన్నో కళల సమాహారంగా దూలియ సంస్కృతి ఉండేది. ఈ పురాతన కళారూపం గురించి ఊరూ వాడా తిరిగి లోతైన పరిశోధన చేసింది అపర్ణ. తాను తెలుసుకున్న విషయాలకు డాక్యుమెంటరీ రూపాన్ని ఇచ్చింది. దూలియ సంస్కృతికి తన జీవితాన్ని అంకితం చేసిన డ్రమ్మర్, నటుడు మోహన్ చంద్ బర్మన్ కృషిని ఈ డాక్యుమెంటరీ హైలెట్ చేస్తుంది.

దూలియ సంస్కృతిపై అపర్ణకు ఆసక్తి, అనురక్తి ఎలా పెరిగింది అనే విషయానికి వస్తే....


కొన్ని సంవత్సరాల క్రితం గువహటిలోని గీతానగర్ రాస్ ఫెస్టివల్‌లో కామ్‌రూపియా ప్రదర్శనను ప్రారంభించడానికి అపర్ణను ఆహ్వానించారు నిర్వాహకులు. ఈ ప్రదర్శను చూసి అపర్ణ మంత్రముగ్ధురాలైంది. ఈ ఆనందం ఒక కోణం అయితే కళాకారుల ఆర్థిక కష్టాలు తెలుసుకొని బాధ పడడం మరో కోణం. ఇక ఆరోజు నుంచి కామ్‌రూప్ కళాకారుల కోసం తన వంతుగా ఏదైనా చేయాలని తపించి పోయింది. ఈ గొప్ప కళారూపాన్ని ప్రపంచానికి తెలిసేలా చేస్తే, సహాయం చేసే ద్వారాలు తెరుచుకుంటాయని నిర్ణయించుకొని తన నిర్మాణ, దర్శకత్వంలో డాక్యుమెంటరీ ప్రారంభించింది.

ఏ లక్ష్యంతో అయితే ఈ డాక్యుమెంటరీ నిర్మాణానికి అపర్ణ పూనుకుందో అది నెరవేరే సమయం వేగవంతం అయింది. దూలియ సంస్కృతి గురించి ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ పురాతన కళారూపాన్ని తమ భుజాల మీద మోస్తున్న అరుదైన కళాకారులకు సహాయం అందడమే ఇక తరువాయి. ఏ పని మొదలుపెట్టినా ‘అంతా మంచే జరుగుతుంది’ అనుకోవడం అపర్ణ సెంటిమెంట్. కళాకారులకు సహాయం అందే విషయంలో కూడా ఆమె సెంటిమెంట్ నెరవేరాలని ఆశిద్దాం.

‘ఆశ్రయం కోరి వచ్చిన ప్రాణిని ఆదరించు... అని చెప్పింది అమ్మ. ఒక మూగజీవి గాయాలతో రోదిస్తుంటే చూస్తూ ఊరుకోలేను. ఒక ప్రాణి కడుపులో కాళ్లు పెట్టుకుని ముడుచుకుని పడుకుంటే దాని ఆకలి తీర్చకుండా నా దారిన నేను వెళ్లలేను. ఒక రోజు గాయపడిన ఓ కుక్కపిల్ల ఏడుపు నాలోని తల్లి మనసును కదిలించింది. దాని బాధ చూసిన తర్వాత మనసు కలచి వేసింది. ఆ కుక్కపిల్ల ఆరోగ్యం కుదుటపడే వరకు మా ఇంట్లోనే పెట్టుకున్నాను. అలా మొదలైన ఈ సేవ ఇప్పుడు దాదాపు నాలుగు వందల కుక్కలతో సాగుతోంది’ అన్నారు 58 ఏళ్ల **సారా అయ్యర్.**



పెట్ పేరెంట్



మూగ జీవుల సేవలో...

చెన్నైకి చెందిన సారా అయ్యర్ స్పెషల్ ఎడ్యుకేటర్. స్పెషల్ చిల్డ్రన్‌ని సమాజంలో సాధారణ పౌరుల్లా తీర్చిదిద్దడంలో దాదాపు పాతికేళ్లు పని చేశారు. ఐదేళ్ల కిందట మూగజీవుల సేవ వైపు మలుపు తీసుకుందామె జీవితం. ఏ మాత్రం ముందస్తు ప్రణాళిక లేకుండా జరిగిపోయిన మార్పులను ఇలా చెప్పారామె...

“మా అమ్మాయి పై చదువుల కోసం అమెరికా వెళ్లింది. ఆ పనుల కోసం నేను టీచింగ్ నుంచి కొంత విరామం తీసుకోవాల్సి వచ్చింది. పిల్లలు దూరంగా వెళ్లిన తర్వాత ఇంట్లో ఏర్పడే వెలితి. ఎంప్టీనెస్ట్ సిండ్రోమ్ అనేటంత పెద్ద పదం చెప్పను కానీ కొంత మానసికమైన ఖాళీ ఏర్పడిందనే చెప్పాలి. జనవరి ఒకటో తేదీన నేను, నా భర్త గెర్రీ ఇద్దరం వీకే సినిమాకి వెళ్లి వస్తున్నాం. దాదాపుగా ఇంటికి దగ్గరకు వచ్చేశాం. ఎక్కడి నుంచో చిన్న కుక్కపిల్ల అరుపు వినిపిస్తోంది. క్షణాల్లోనే తెలిసింది అది అరుపు కాదు ఏడుపు అని. ఎవరో పెంచుకోవడానికి కుక్కపిల్లను తెచ్చుకున్నారు, అది బెంగతో ఏడుస్తుందేమో అనుకున్నాను. అది నిస్సహాయంగా ఏడుస్తోందని కొద్ది నిమిషాల్లోనే తెలిసిపోయింది. ఇక ఊరుకోలేకపోయాను. దాని గొంతు వినవస్తున్న దిశగా వెళ్లాను. అది పార్కు చేసిన కారుకి గోడకు మధ్య ఇరుక్కుపోయి ఉంది. తీవ్రంగా గాయపడింది. బయటకు తీయడానికి దగ్గరకు వెళ్తున్నా రానివ్వలేదు. నేను దానిని ఊరడిస్తూ ఉంటే మా వారు మరో వైపు నుంచి వెళ్లి దానిని బయటకు తీశారు. అయితే... కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా క్లినిక్‌లన్నీ మూసేసి ఉన్నాయి. ఇంటికి తీసుకువెళ్లి మాకు చేతనైన చికిత్స చేసి ఆ మరునాడు దానికి వైద్యం చేయించాం. ఆ కుక్కపిల్ల మామూలయ్యే వరకు మాతోనే ఉంది. ఆ తర్వాత కూడా మాతోనే ఉండిపోయింది. అలా మొదలైన సేవ ఇది.

ఓ రోజు... ఒక ఇండియన్ బ్రీడ్ కుక్క నాలుగు పిల్లలను పెట్టి అలసటతో ఉంది. ఆ దారిన ఓ వ్యక్తి లాబ్రిడార్‌ను వాకింగ్‌కు తీసుకు వెళ్తున్నాడు. వాళ్లను చూసి ఈ కుక్క అరవసాగింది. ఆ వ్యక్తికి కోపం ఎందుకు వచ్చిందో తెలియదు కానీ తన చేతిలో ఉన్న కర్ర ఎత్తాడు. అతడు ఆ కుక్క నడవలేనంత తీవ్రంగా గాయపరిచాడని ఆ మరునాడు తెలిసింది. అప్పుడు ఆ కుక్కను, పిల్లలను ఇంటికి తెచ్చాను. నేను మా వారు ఇద్దరమూ వాటికి ఆహారం పెట్టడం, గాయపడిన వాటికి వైద్యం చేయడం, ఫిజియోథెరపీ చేయడం అన్నీ నేర్చుకున్నాం. మాకు తెలిసిన అందరినీ ఒక వాట్సాప్ గ్రూప్‌లో చేర్చి ‘కుక్కలు, కుక్క పిల్లలు గాయపడి నిరాశ్రయంగా ఉన్నట్లు మీ దృష్టికి వస్తే మాకు తెచ్చివ్వండి, లేదా సమాచారం ఇవ్వండి, మేము సంరక్షిస్తాం’ అని మెసేజ్ పెట్టాం. మద్రాస్ యానిమల్ రెస్క్యూ సొసైటీ అలా ఏర్పడింది. ఇప్పుడు మా దగ్గర గాయపడినవి, చూపు కోల్పోయినవి, అనారోగ్యాలతో పుట్టినవి, ఆదరించే వాళ్లు లేక ఇక్కడే ఉండిపోయినవి అన్నీ కలిసి నాలుగు వందలకు పైగా ఉన్నాయి. మా సర్వీస్‌కి మెచ్చిన మా అమ్మ, అత్తమ్మ ఇద్దరూ తమ వంతుగా ఈ మూగజీవుల సంరక్షణకు అవసరమైన వస్తువులు, ఇతర అవసరాల కోసం డబ్బు ఇచ్చి అండగా నిలిచారు. ఇప్పుడు వాళ్లిద్దరూ లేరు. ‘ఆశ్రయం కోసం వచ్చిన ఏ ప్రాణినీ నిర్లక్ష్యం చేయవద్దు’ అని వారు మాకు చెప్పిన మాట మాతోనే ఉంది.

మేము స్థాపించిన మద్రాస్ యానిమల్ రెస్క్యూ సొసైటీ... తమిళనాడు యానిమల్ వెల్ఫేర్ బోర్డుతో కలిసి పని చేస్తోంది. ఈ మా ప్రయాణంలో ఇన్ని కుక్కలను సంరక్షించడానికి అవసరమైన విశాలమైన స్థలం పెద్ద సమస్య అయింది. చెన్నై నగర శివారు, మహాబలిపురం రూట్‌లో ఈస్ట్‌కోస్ట్‌రోడ్‌లో మా ఫ్రెండ్‌కి ఓ స్థలం ఖాళీగా ఉంది. దానిని అద్దెకు తీసుకుని కుక్క పిల్లలకు, గాయపడిన వాటికి, అనారోగ్యం పాలైన వాటికి వేరు వేరుగా కెన్నెల్స్ కట్టించి సంరక్షిస్తున్నాం. అవి మమ్మల్ని పేరెంట్స్‌గా ప్రేమిస్తాయి” అంటూ తనను ముద్దాడడానికి వచ్చిన పెట్‌ను ప్రేమగా చేతుల్లోకి తీసుకున్నారు సారా అయ్యర్. తన సంరక్షణలో ఉన్న కుక్కలన్నింటికీ పేర్లు పెట్టారామె. వాటికి రిజిస్టర్ నిర్వహిస్తూ వాటికి ఎప్పుడు ఏ మందులు వేశారు, ఇంకా ఎప్పుడు ఏ ఇంజక్షన్‌లు వేయించాలి... వంటి వివరాలను నమోదు చేస్తారామె.

యంగ్

నవతరం ఆలోచనలు సృజనాత్మకంగానే కాదు జనంతో మమేకం అయ్యే విషయాలపట్ల అవగాహనతోనూ ఉంటున్నాయనడానికి ఉదాహరణ **గౌరీ మినోచా.** ఢిల్లీ వాసి అయిన గౌరి ఆర్ట్ సైకోథెరపీతో భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటున్న వర్ధమాన కళాకారిణి. అభిరుచితో నేర్చుకున్న పెయింటింగ్ ఆర్ట్, చదువుతో ఒంటపట్టించుకున్న సైకాలజీ ఈ రెండింటి కాంబినేషన్‌తో రిలాక్సేషన్ టెక్నిక్స్ కనుక్కుంది. ఈ శైలిలోనే వర్క్‌షాప్స్ నిర్వహిస్తూ స్కూల్, కాలేజీ పిల్లల మానసిక ఒత్తిడులను దూరం చేస్తుంది. ఆర్ట్ సైకోథెరపీతో ప్రజాదరణ పొందుతూ ఈ తరానికి కొత్త స్ఫూర్తిని అందిస్తోంది. తను ఎంచుకున్న మార్గం గురించి ప్రస్తావిస్తూ...



ఆర్ట్ థెరపీ

“కళ-మనస్తత్వ శాస్త్రం రెండూ హృదయానికి దగ్గరగా ఉంటాయి. నేను ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజీలో సైకాలజీ బిఏ ఆనర్స్ ఫైనల్ సెమిస్టర్ చదువుతున్నాను. పన్నెండవ తరగతిలో 99 శాతం మార్కులు రావడంతో సైకాలజీని ఎంచుకున్నాను. ఢిల్లీలో ఆర్ట్ సైకోథెరపీ సెంటర్‌ను ప్రారంభించాలనే లక్ష్యంతో ఉన్నాను.

కళ – మనస్తత్వ శాస్త్రం రెండూ నాకు ఇష్టమైన సబ్జెక్ట్‌లు. ఆర్ట్ సైకోథెరపీలో... డిప్రెషన్, ఆందోళనతో బాధపడుతున్న వ్యక్తులు పెయింటింగ్స్ వేసి వారికి ఇస్తుంటాను. వారి చేత కూడా రంగులతో నచ్చిన అంశాన్ని ఎంచుకొని చిత్రించమని అడుగుతాను. వారికి ఏమీ రాకపోవచ్చు. కానీ ఈ విధానం ద్వారా వారిలో నిరాశ, ఆందోళన స్థాయిలను చెక్ చేస్తాను. ఇదొక రిలాక్సేషన్ టెక్నిక్. విదేశాలలో చాలా ప్రసిద్ధి చెందినప్పటికీ మన దేశంలో ఇప్పటికీ అంత ప్రజాదరణ పొందలేదు. దీనికి కొన్ని స్కూళ్లు, కాలేజీలను ఎంచుకొని ఉచితంగా వర్క్‌షాప్స్ కూడా నిర్వహిస్తుంటాను.

చిన్ననాటి నుంచి... మా అమ్మ ఆర్టిస్ట్. వ్యాపారవేత్త కూడా. ఒక ఆర్ట్ గ్యాలరీని కూడా నడుపుతోంది. ఇందులో అనేకమంది ప్రసిద్ధ కళాకారుల పెయింటింగ్ ప్రదర్శనలు జరుగుతాయి. ఆమె పిల్లలకు, పెద్దలకు పెయింటింగ్ క్లాసులు కూడా తీసుకుంటుంది. రంగులు, చిత్రాలు, కళాకారుల మధ్య నా బాల్యం గడిచింది. అలా నాకు చిత్ర కళ పట్ల అభిరుచి పెరిగింది. ఒకసారి ఎమ్ఎఫ్ హుస్సేన్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ జరిగినప్పుడు అతని గుర్రపు పెయింటింగ్‌ను కాపీ చేశాను. అమ్మ నాలో ఉన్న ఆర్టిస్ట్‌ను గుర్తించి, సహకరించింది. ఈ కళలో ఎన్నో అవార్డులు అందుకున్నాను. కళతోపాటు క్రీడల్లోనూ రాణిస్తున్నాను.

ఒత్తిడి లేకుండా చదువు... నేను క్లాస్‌రూమ్‌లో కంటే ఆర్ట్ రూమ్‌లో ఎక్కువ సమయం గడిపాను. కానీ, నా చదువును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. కాలేజీ స్థాయికి వచ్చాక ఆర్ట్ నీ సీరియస్‌గా తీసుకోవడం మొదలుపెట్టాను. ఎందుకంటే జీవితంలో సమతుల్యతను కాపాడుకోవడం చాలా ముఖ్యం. ప్రతి స్టూడెంట్‌లాగే నేనూ నా కెరియర్ గురించి తీవ్రంగా ఆలోచించాను. గ్రాడ్యుయేషన్ ఆర్ట్స్‌లో చేయాలా, సైకాలజీలో ఏ సబ్జెక్ట్ చేయాలో అర్థం కాక కొన్నిరోజులు మథనపడ్డాను. కానీ, ఆర్ట్ నా అభిరుచి, కెరియర్ సైకాలజీ రెండింటిలో ప్రావీణ్యం సాధించాలనుకున్నాను. పగలు కాలేజీ, రాత్రి సమయంలో ఎంతసేపు వీలుంటే అంత టైమ్ పెయింటింగ్ చేస్తుంటాను.

వ్యాపారంలోనూ నైపుణ్యం... స్కూల్ ఏజ్ నుంచే నా పెయింటింగ్స్‌తో ఎగ్జిబిషన్‌ని ఏర్పాటు చేసే దాన్ని. మొదటి పెయింటింగ్‌కు ఐదు వేల రూపాయలు వచ్చాయి. మొదట్లో నా పెయింటింగ్స్‌ని బంధువులందరికీ పంపాను. తమ ఇంట్లో పెయింటింగ్స్ అలంకరించినప్పుడు వారి ఇళ్లకు వచ్చిన బంధువులు ఆ పెయింటింగ్స్ చూసి తమకూ పంపమని కాల్స్ చేయడం ప్రారంభించారు. విదేశాల్లో ఉన్న బంధువుల నుంచి నా పెయింటింగ్స్ అమెరికా, లండన్, ముంబై, ఢిల్లీ సహా అనేక ప్రాంతాలకు చేరాయి. ఈ రోజు ఢిల్లీని ఆర్ట్ హబ్‌లో నా 12 పెయింటింగ్స్‌లో 9 అమ్మకానికి ఉన్నాయి. ప్రతి కళాకారుడు తన సొంత మార్కెట్ విలువను సృష్టించుకోవడం, ప్రచారం కూడా ముఖ్యం. సృజనాత్మకతతోపాటు వ్యాపారంలో కూడా నైపుణ్యం సాధించాలి” అంటూ నవతరానికి బిజినెస్ టెక్నిక్స్ కూడా చెబుతుంది గౌరి మినోచా.

బ్యూటిప్స్

పాలతో చర్మ సౌందర్యం

చర్మం కాంతిమంతంగా మెరవాలంటే క్రీమ్‌లు లోషన్‌లకు బదులు ఇంట్లో ఉండే పాలతో ప్రయత్నించి చూడండి.

- పచ్చి పాలలో దూదిని ముంచి మెడ, గొంతు, ముఖాన్ని తుడిస్తే చర్మం మీద పట్టేసిన మురికి (సబ్బుతో శుభ్రం చేసినప్పటికీ వదలని మురికి) వదిలిపోతుంది.
- రెండు టీ స్పూన్‌ల పచ్చిపాలలో టీ స్పూన్ శనగపిండి, రెండు చుక్కల తేనె కలిపి ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కొద్దిగా నీటిని చల్లి వలయాకారంగా మసాజ్ చేస్తూ శుభ్రం చేయాలి.



- ముఖం మీద సన్నని గీతలతో చిన్న వయసులోనే వార్ధక్యపు లక్షణాలు కనిపిస్తుంటే రోజూ మిల్క్ ప్యాక్ వేయాలి. ముఖాన్ని సబ్బుతో శుభ్రం చేసిన తర్వాత పచ్చి పాలలో దూదిని ముంచి ముఖం మీద అద్దాలి. పాలు ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేసి పెసరపిండి ప్యాక్ వేయాలి. రెండు టీ స్పూన్‌ల పెసరపిండిలో రెండుచుక్కల తేనె వేసి తగినంత నీటితో కలిపి ముఖానికి పట్టించి ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తుంటే చర్మం నిత్య యవ్వనంతో ఉంటుంది. వార్ధక్య లక్షణాలు దూరమవుతాయి.

ప్రజ్ఞానంద శుభారంభం... వైశాలి ఓటమి



భారత చెస్ సంచలనం ఆర్. ప్రజ్ఞానంద అంతర్జాతీయ వేదికపై తన జోరు కొనసాగిస్తున్నాడు. చెక్ రిపబ్లిక్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక ప్రేగ్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో అతను విజయంతో మొదలు పెట్టాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్ పోరులో ప్రజ్ఞానంద 41 ఎత్తుల్లో జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమర్‌ను ఓడించాడు. ఇటాలియన్ ఓపెనింగ్‌తో మొదలు పెట్టిన భారత జీఎం అటాకింగ్ గేమ్ మొదలు కీమర్ డిఫెన్స్ పని చేయలేదు. ఈ మ్యాచ్ గెలిచే క్రమంలో ప్రజ్ఞానంద 'లైవ్ రేటింగ్'లో విశ్వనాథన్ ఆనంద్‌ను దాటి భారత్ తరఫున అత్యధిక రేటింగ్ నమోదు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇతర భారత ఆటగాళ్లలో రిచర్డ్ ర్యాపో (రొమానియా)తో జరిగిన గేమ్‌ను డి. గుకేశ్...డేవిడ్ నవారా (చెక్ రిపబ్లిక్)తో జరిగిన గేమ్‌ను విదిత్ గుజరాతీ 'డ్రా' చేసుకున్నారు. చాలెంజర్ విభాగంలో అన్‌టోన్ కొరొబొవ్ (ఉక్రెయిన్)తో జరిగిన పోరులో భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి ఓటమిపాలైంది.

యశస్వికి 'డబుల్'... శ్రేయస్, కిషన్ అవుట్

వార్షిక కాంట్రాక్ట్‌లు ప్రకటించిన బీసీసీఐ ● మొహమ్మద్ సిరాజ్‌కు ప్రమోషన్





ప్రతిభకు, మైదానంలో ప్రదర్శనకు బీసీసీఐ పట్టం కట్టింది...టెస్టుల్లో వరుస డబుల్ సెంచరీలతో చెలరేగిన యశస్వి జైస్వాల్‌ను 'డబుల్ ప్రమోషన్'తో గుర్తించిన బోర్డు నిలకడైన ఆటతో సత్తా చాటిన హైదరాబాదీ పేసర్ సిరాజ్‌ను ఒక మెట్టు పైకి ఎక్కించింది. అగ్రశ్రేణి ఆటగాళ్లు తమ స్థాయిని నిలబెట్టుకోగా...క్రమశిక్షణ తప్పితే శిక్ష తప్పదంటూ శ్రేయస్, కిషన్‌లను పక్కన పెట్టింది. 30 మందితో కూడిన బీసీసీఐ కొత్త కాంట్రాక్ట్ జాబితాలో విశేషాలివి.

న్యూఢిల్లీ: అక్టోబర్ 2023– సెప్టెంబర్ 2024 మధ్య కాలానికి సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వార్షిక కాంట్రాక్ట్‌లను ప్రకటించింది. సుదీర్ఘ కాలంగా భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా బీసీసీఐ కాంట్రాక్ట్‌ల జాబితాలో తమ 'ఎ ప్లస్' గ్రేడ్‌లను నిలబెట్టుకున్నారు. ఈ కేటగిరీలో గత ఏడాదితో పోలిస్తే ఎలాంటి మార్పూ జరగలేదు. గ్రేడ్ 'ఎ'లో ఇప్పటికే ఉన్న అశ్విన్, షమీ, హార్దిక్ పాండ్యాలతో పాటు కొత్తగా సిరాజ్, రాహుల్, గిల్ చేరారు. గత ఏడాది కాలంగా వన్డే వరల్డ్ కప్ సహా పలు సిరీస్‌లలో కీలక ప్రదర్శనలతో టీమ్ మేనేజ్‌మెంట్ అంచనాలను అందుకోవడమే ఈ ముగ్గురి ప్రమోషన్‌కు కారణం. టి20ల్లో అద్భుత ప్రదర్శనలతో చెలరేగుతూ వన్డే జట్టులోనూ ఉన్న సూర్యకుమార్ యాదవ్ గ్రేడ్ 'బి'లో తన స్థానం నిలబెట్టుకోగా ఇందులో యశస్వి జైస్వాల్‌కు అవకాశం దక్కడం పెద్ద విశేషం. సాధారణంగా తొలి సారి కాంట్రాక్ట్ ఇస్తూ ఆటగాళ్లను 'సి'లో చేర్చి ఆపై ప్రదర్శనతో ప్రమోషన్‌లు ఇచ్చే బోర్డు యశస్వి అసాధారణ ఆటకు నేరుగా 'బి'లో అవకాశం కల్పించింది. 'సి' జాబితాలో ఉన్నవారిలో కొందరు అప్పుడప్పుడు వన్డేల్లో మెరిసినా...దాదాపు అందరూ టి20 స్పెషలిస్ట్‌లే కావడం విశేషం.

క్రమశిక్షణారాహిత్యంతో...

'వార్షిక కాంట్రాక్ట్‌లలో ఈ సారి శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌ల పేర్లను పరిశీలించడం లేదు' అని బోర్డు అధికారికంగా ప్రకటించింది. ఇటీవలి పరిణామాలే అందుకు కారణం. వీరిద్దరు భారత్‌కు ఆడని సమయంలో రంజీ ట్రోఫీలో తమ రాష్ట్ర జట్ల తరఫున బరిలోకి దిగాలని బీసీసీఐ సూచించినా... దానిని పట్టించుకోలేదు. మానసిక ఆందోళన కారణంగా చూపి దక్షిణాఫ్రికా టూర్ మధ్యలోనే స్వదేశం వచ్చేసిన కిషన్ ఆ తర్వాత దుబాయ్‌లో పార్టీలో పాల్గొంటూ కనిపించాడు. తమ జట్టు జార్ఖండ్ ఒక వైపు రంజీ ఆడుతుంటే అతను నేరుగా ఐపీఎల్ టీమ్ ముంబై ఇండియన్స్ శిక్షణా శిబిరానికి హాజరయ్యాడు. మరో వైపు ఇంగ్లండ్‌తో మూడో టెస్టులో చోటు కోల్పోయిన తర్వాత శ్రేయస్ వెన్ను గాయంతో ముంబై తరఫున రంజీ క్వార్టర్ ఫైనల్ ఆడలేనని చెప్పాడు. అతని గాయంలో నిజం లేదని ఎన్‌సీఏ డాక్టర్లు ధ్రువీకరించినట్లుగా బోర్డు అంతర్గత సమాచారం. ఈ విషయంలో కోచ్ ద్రవిడ్ నివేదిక ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వరల్డ్ కప్‌లో 530 పరుగులతో కీలక పాత్ర పోషించిన అయ్యర్ పట్ల తీవ్రంగా వ్యవహరించి...గాయం తర్వాత అక్టోబర్‌నుంచి ఇప్పటి వరకు అధికారిక టోర్నీ ఆడని హార్దిక్‌కు మాత్రం 'ఎ' గ్రేడ్ కాంట్రాక్ట్ కొనసాగించడం ఆసక్తికరం. జాతీయ జట్టుకు ఆడని సమయంలో కచ్చితంగా దేశవాళీ క్రికెట్ ఆడాలంటూ బీసీసీఐ ఇప్పుడు స్పష్టంగా పేర్కొనడం విశేషం.

కొత్తగా పేసర్లకు...

కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న రిషభ్ పంత్ గత ఏడాది కాలంలో ఎలాంటి క్రికెట్ ఆడకపోయినా...పూర్తిగా పక్కన పెట్టకుండా ఒక గ్రేడ్ తగ్గించి అతడిని కొనసాగించగా...పేలవ ప్రదర్శనతో అక్షర్ స్థాయి కూడా తగ్గింది. భారత్‌లో ఫాస్ట్ బౌలర్లను ప్రత్యేకంగా గుర్తించి ప్రోత్సహించే క్రమంలో ఐదుగురు బౌలర్లకు కొత్తగా 'ఫాస్ట్ బౌలింగ్ కాంట్రాక్ట్'లు ఇవ్వడం విశేషం. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు కాలాన్ని కాంట్రాక్ట్ కోసం పరిగణనలోకి తీసుకున్నారు. బోర్డు నిబంధనల ప్రకారం కనీసం 3 టెస్టులు లేదా 8 వన్డేలు, లేదా 10 టి20లు ఆడాలి. ఇంగ్లండ్‌తో రెండు టెస్టులు ఆడిన సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురేల్ తర్వాతి మ్యాచ్ ఆడితే వారు నేరుగా 'సి' గ్రేడ్‌లోకి వచ్చేస్తారు. జట్టులో స్థానం కోల్పోయిన పుజారా, ఉమేశ్, శిఖర్, చహల్, హుడా సహజంగానే జాబితానుంచి దూరమయ్యారు.



బీసీసీఐ వార్షిక కాంట్రాక్ట్‌ల జాబితా (2023-24)

గ్రేడ్ 'ఎ' ప్లస్ (రూ.7 కోట్లు): రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా
గ్రేడ్ 'ఎ' (రూ. 5 కోట్లు): అశ్విన్, మొహమ్మద్ షమీ, మొహమ్మద్ సిరాజ్, కేఎల్ రాహుల్, శుబ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్యా
గ్రేడ్ 'బి' (రూ. 3 కోట్లు): సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, యశస్వి జైస్వాల్
గ్రేడ్ 'సి'(రూ.1 కోటి): రింకూసింగ్, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, శార్దుల్ ఠాకూర్, శివమ్ దూబే, రవి బిష్ణోయ్, జితేశ్ శర్మ, సుందర్, ముకేశ్ కుమార్, సంజు సామ్సన్, అర్ష్‌దీప్, కేఎస్ భరత్, ప్రసిధ్ కృష్ణ, అవేశ్ ఖాన్, రజత్ పటిదార్ (వీరందరికీ మొదటిసారి కాంట్రాక్ట్ దక్కింది).
కాంట్రాక్ట్‌లు కోల్పోయినవారు: అయ్యర్, ఇషాన్ కిషన్, పుజారా, ఉమేశ్ యాదవ్, శిఖర్ ధావన్, దీపక్ హుడా, యజువేంద్ర చహల్.

- ↑ సిరాజ్, రాహుల్, గిల్ ('బి' నుంచి 'ఎ'కి)
- ↑ కుల్దీప్ 'సి' నుంచి 'బి'కి
- ↓ పంత్, అక్షర్ ('ఎ' నుంచి 'బి' కి)
- ↑↑ యశస్వికి నేరుగా 'బి' గ్రేడ్

ఫాస్ట్ బౌలింగ్ కాంట్రాక్ట్‌లు: ఆకాశ్ దీప్ (బెంగాల్), ఉమ్రాన్ మలిక్ (జమ్మూ కశ్మీర్), యశ్ దయాళ్ (యూపీ), విద్వత్ కావేరప్ప, విజయ్ కుమార్ వైశాక్ (కర్ణాటక).



పుణేరి-పట్నా మ్యాచ్ దృశ్యం



హరియాణా - జైపూర్ మ్యాచ్ దృశ్యం

టైటిల్ పోరుకు పుణేరి, హరియాణా

- సెమీస్‌లో పట్నా, జైపూర్ ఓటమి
- రేపు ప్రొ కబడ్డీ లీగ్ ఫైనల్

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్‌లో కొత్త చాంపియన్ ఖాయమైంది. నిరుటి రన్నరప్ పుణేరి పల్టన్‌తో అమీతుమీకి తొలిసారి ఫైనల్‌కు చేరిన హరియాణా స్టీలర్స్ సిద్ధమైంది. ఇరు జట్ల మధ్య శుక్రవారం హైదరాబాద్‌లోనే ఫైనల్ పోరు జరుగనుంది. సెమీఫైనల్స్‌లో 'హ్యాట్రిక్' టైటిళ్ల విజేత పట్నా పైరేట్స్, రెండు సార్లు చాంపియన్స్‌గా నిలిచిన జైపూర్ పింక్‌పాంథర్స్ ప్రత్యర్థుల చేతుల్లో పరాజయం చవిచూశాయి. తొలి సెమీస్‌లో పుణేరి పల్టన్ ధాటికి 37–21తో టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన పట్నా పైరేట్స్ నిలువలేకపోయింది. పుణేరి తరఫున కెప్టెన్, ఆల్‌రౌండర్ అస్లామ్ ముస్తఫా (7పాయింట్లు), రెయిడర్ పంకజ్ మోహితే (7) అదరగొట్టారు. మిగతా వారిలో మొహమ్మద్ రెజా చియనె 5, మోహిత్ గోయత్ 4, సంకేత్, అభినేశ్ చెరో 3 పాయింట్లు చేసి జట్టు విజయంలో భాగమయ్యారు. పట్నా జట్టులో రెయిడర్ సచిన్ చేసిన 5 పాయింట్లే అత్యధిక స్కోరు! మిగిలిన వారిలో మన్‌జీత్, సుధాకర్ చెరో 4 పాయింట్లు చేశారు. అనంతరం హోరాహోరీగా జరిగిన రెండో సెమీ ఫైనల్లో హరియాణా స్టీలర్స్ 31–27తో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్‌పాంథర్స్‌ను కంగుతినిపించింది. స్టీలర్స్ రెయిడర్ వినయ్ 20 సార్లు కూతకు వెళ్లి 11 పాయింట్లు తెచ్చిపెట్టాడు. శివమ్ పతారే (7) కూడా అదరగొట్టాడు. మిగతావారిలో ఆల్‌రౌండర్ ఆశిష్ 4, డిఫెండర్లు రాహుల్ సేథ్‌పాల్ 3, మోహిత్ 2 పాయింట్లు సాధించారు. జైపూర్ తరఫున రెయిడర్ అర్జున్ దేశ్వాల్ (14) ఒంటరి పోరాటం చేశాడు. డిఫెండర్ రెజా మిర్బగెరి 4, భవానీ రాజ్‌పుత్ 3 పాయింట్లు చేశారు.

ముంబైకి వారియర్స్ చెక్!

- 7 వికెట్లతో యూపీ గెలుపు
- కిరణ్ నవ్‌గిరే ధనాధన్ ఫిఫ్టీ

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను యూపీ వారియర్స్ నిలువరించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ ఓపెనర్ కిరణ్ నవ్‌గిరే (31 బంతుల్లో 57; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపాన్ని ఒంటిచేత్తో మార్చేసింది. దీంతో 7 వికెట్లతో గెలిచిన వారియర్స్ ఈ సీజన్‌లో బోణీకొట్టింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. ఓపెనర్ హేలీ మాథ్యూస్ (47 బంతుల్లో 55; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీ సాధించింది. మరో ఓపెనర్ యస్తిక భాటియా (22 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించింది. కెప్టెన్ నట్‌సీవర్ బ్రంట్ (19; 2 ఫోర్లు), అమెలియా కెర్ (23; 1 ఫోర్, 1 సిక్స్) పెద్దగా మెరిపించలేకపోయారు. అనంతరం యూపీ వారియర్స్ 16.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసింది. ఓపెనర్లు కిరణ్ నవ్‌గిరే, కెప్టెన్ అలిసా హీలీ (29 బంతుల్లో 33; 5 ఫోర్లు) చెలరేగారు. ఇద్దరు తొలి వికెట్‌కు 9 ఓవర్లలోనే 94 పరుగులు జోడించి గెలిచేందుకు అవసరమైన పునాదిని మెరుపు వేగంతో వేశారు. అయితే స్వల్ప వ్యవధిలో కిరణ్‌తో పాటు తాహ్లియా మెక్‌గ్రాత్ (1), కెప్టెన్ హీలీ నిష్క్రమించారు. కానీ తర్వాత వచ్చిన గ్రేస్ హారిస్ (17 బంతుల్లో 38 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), దీప్తిశర్మ (20 బంతుల్లో 27 నాటౌట్; 4 ఫోర్లు) ధాటిగా ఆడి మ్యాచ్‌ను ముగించారు.



కిరణ్ నవ్‌గిరే

ప్రిక్వార్టర్స్‌లో సహజ



న్యూఢిల్లీ: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టెన్నిస్ టోర్నమెంట్‌లో తెలుగు ప్లేయర్లు సహజ యామలపల్లి, భమిడిపాటి శ్రీవల్లి రష్మిక ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన తొలి రౌండ్లో ఐదో సీడ్ సహజ 6–4, 6–2తో జపాన్‌కు చెందిన కొషిషి అయుమిపై గెలుపొందగా, శ్రీవల్లి రష్మిక 6–1, 6–2తో క్వాలిఫయర్ యమజకి ఐకుమి (జపాన్)పై అలవోక విజయం సాధించింది. డబుల్స్ బరిలోనూ దిగిన రష్మిక క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్స్‌లో రష్మిక–వైదేహి చౌదరి జోడీ 6–0, 6–1తో వైల్డ్‌కార్డ్ ఎంట్రీ పొందిన భారత జంట కశిష్ భాటియా–సాహిర సింగ్‌పై గెలిచింది. టాప్‌సీడ్ అంకిత రైనా (భారత్)– కులంబయెవా జిబెక్ (కజకిస్తాన్) జంట 2–6, 6–3, 11–9తో జీల్ దేశాయ్ (భారత్)–ఒకువకి రినాన్ (జపాన్) ద్వయంపై గెలిచింది. మిగతా సింగిల్స్ పోటీల్లో రియా భాటియా 7–6 (7/5), 6–4తో భారత క్వాలిఫయర్ అంజలిని ఓడించింది. హుమేరా బహర్మస్ 1–6, 0–6తో కులంబయెవా జిబెక్ (కజకిస్తాన్) చేతిలో ఓడింది.

సినిమా

విదేశాల్లో శిక్షణ



● కియారా అద్వానీ

ఇంటర్‌నేషనల్ ట్రైనింగ్‌కు రెడీ అవుతున్నారు కియారా అద్వానీ. బాలీవుడ్ 'డాన్' ఫ్రాంచైజీలో వస్తున్న లేటెస్ట్ ఫిల్మ్ 'డాన్ 3'. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించనున్నారు. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వం వహించనున్న 'డాన్ 3'లో కియారా అద్వానీ హీరోయిన్. ఈ చిత్రంలో రణ్‌వీర్, కియారా.. ఇద్దరికీ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉంటాయట. దీంతో అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్స్ పర్యవేక్షణలో ఇద్దరూ స్టంట్స్ నేర్చుకోనున్నారని బాలీవుడ్ టాక్. విదేశాల్లో ఈ శిక్షణ జరుగుతుందని సమాచారం. ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది సెప్టెంబరులో ప్రారంభం కానుందని తెలిసింది.

మార్చి 2న వ్యూహం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ జీవితంలో జరిగిన కొన్ని ఘటనల నేపథ్యంగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'వ్యూహం'. ఈ సినిమాకు కొనసాగింపుగా 'శపథం' ఉంటుంది. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాలను రామధూత క్రియేషన్స్‌పై దాసరి కిరణ్ కుమార్ నిర్మించారు. 'వ్యూహం' మార్చి 2న విడుదల కానుంది. 'పట్టు వదలని విక్రమార్కుణ్ణి.. 'వ్యూహం' మార్చి 2న థియేటర్స్‌లో విడుదలవుతోంది'' అంటూ 'వ్యూహం' సినిమా సెన్సార్ సర్టిఫికెట్ ఉన్న ఫోటోను 'ఎక్స్'లో షేర్ చేశారు రామ్ గోపాల్ వర్మ. ''వ్యూహం', 'శపథం' సినిమాల రిలీజ్‌ల విషయంలో దేవుడు మాకు అన్నీ కలిసొచ్చేలా చేశాడు. ఈ రెండు సినిమాలను తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 500 థియేటర్స్‌లో రిలీజ్ చేయబోతున్నాం. మా 'వ్యూహం' గ్యారెంటీగా సక్సెస్ అవుతుంది. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన మా సినిమా విడుదలకు సెన్సార్ బోర్డ్ అనుమతి ఇచ్చింది. వారికి ధన్యవాదాలు'' అన్నారు దాసరి కిరణ్ కుమార్.



● రామ్‌గోపాల్ వర్మ, అమితాబ్ బచ్చన్, దాసరి కిరణ్

ఆర్‌జీవీ డెన్‌లో అమితాబ్ బచ్చన్

బాలీవుడ్ స్టార్ అమితాబ్‌బచ్చన్ – రామ్ గోపాల్ వర్మ కాంబినేషన్‌లో 2005లో వచ్చిన 'సర్కార్' చిత్రం బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా అమితాబ్‌బచ్చన్–రామ్‌గోపాల్ వర్మ కాంబినేషన్‌లోనే 'సర్కార్ రాజ్' (2008), 'సర్కార్ 3' (2017) సినిమాలు వచ్చాయి. అయితే తాజాగా వీరిద్దరూ హైదరాబాద్‌లో కలుసుకున్నారు. రజనీకాంత్ 'వేట్టయాన్', ప్రభాస్ 'కల్కి 2898ఏడీ' సినిమా చిత్రీకరణల కోసం అమితాబ్ బచ్చన్ హైదరాబాద్ వచ్చారని తెలిసింది. దీంతో అమితాబ్‌ను హైదరాబాద్‌లోని తన డెన్‌లోకి ఆహ్వానించారు వర్మ. ఆ సందర్భంగా అమితాబ్, దాసరి కిరణ్‌లతో కలిసి దిగిన ఫోటోలను 'ఎక్స్'లో షేర్ చేశారు వర్మ.

సెకండ్ షెడ్యూల్ షురూ



● మంచు విష్ణు

విష్ణు మంచు కలల ప్రాజెక్ట్ అయిన 'కన్నప్ప' చిత్రం రెండో షెడ్యూల్ న్యూజిల్యాండ్‌లో ప్రారంభమైంది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌బాబు, మోహన్ లాల్, ప్రభాస్ వంటి వారు నటిస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ బాబు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా నిర్మిస్తున్నారు. రెండో షెడ్యూల్ చిత్రీకరణ కోసం చిత్ర యూనిట్ న్యూజిల్యాండ్ వెళ్లింది. ఈ మేరకు విష్ణు మంచు ఓ వీడియోను షేర్ చేశారు. ఇందులో మోహన్‌బాబు, విష్ణు మంచు కనిపిస్తున్నారు. ''కన్నప్ప' చిత్రం కోసం ఇప్పటికే న్యూజిల్యాండ్‌లో 90 రోజుల పాటు నిర్విరామంగా ఫస్ట్ షెడ్యూల్‌ను పూర్తి చేశాం. ఆ తర్వాత ఇండియా వచ్చి, కాస్త గ్యాప్ తీసుకున్నాం. తాజాగా రెండో షెడ్యూల్‌ను కూడా న్యూజిల్యాండ్‌లోనే ప్రారంభించాం. ఈ షెడ్యూల్‌లో ఒళ్లు గగుర్పొడిచే సన్నివేశాలు చిత్రీకరించనున్నాం. హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ షెల్డన్ చౌ 'కన్నప్ప'కి విజువల్స్ అందిస్తున్నారు'' అన్నారు మేకర్స్.

మూడు వెబ్ సిరీస్‌లకు శ్రీకారం



● ఎస్. శంకర్

'ఎన్‌కౌంటర్, శ్రీరాములయ్య, జయం మనదేరా, ఆయుధం, భద్రాచలం, జై బోలో తెలంగాణ' వంటి హిట్ చిత్రాల దర్శకుడు ఎన్. శంకర్ చారిత్రాత్మక కథాంశాలతో మూడు వెబ్ సిరీస్‌లు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్. శంకర్ టీవీ అండ్ ఫిల్మ్ స్టూడియో బ్యానర్‌లో ఆయన నిర్మాతగా, దర్శకత్వ పర్యవేక్షణలో ఈ వెబ్ సిరీస్‌లు రూపొందనున్నాయి. ఈ సందర్భంగా ఎన్. శంకర్ మాట్లాడుతూ– ''తెలంగాణ సాయిధ పోరాటం నుండి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు మొదటి వెబ్ సిరీస్ నిర్మించనున్నాను. అక్టోబర్‌లో చిత్రీకరణ మొదలవుతుంది. అలాగే మహాత్మ జ్యోతీరావు పూలేగారి స్ఫూర్తితో రెండో వెబ్ సిరీస్ నిర్మిస్తాను. అయితే ఇది ఆయన బయోగ్రఫీ కాదు. జ్యోతీరావు పూలేగారి అనుభవాలు, ఆయన జీవితంలో జరిగిన సంఘటనలు, సంఘర్షణలు వంటివి ఈ వెబ్ సిరీస్‌లో ఉంటాయి. అదే విధంగా బాబా సాహెబ్ అంబేద్కర్‌గారిపై మూడో వెబ్ సిరీస్ ఉంటుంది. అయితే ఇది ఆయన బయోగ్రఫీ కాదు. అంబేద్కర్‌గారు ఇచ్చిన గొప్ప రాజ్యాంగ స్ఫూర్తిని, వ్యక్తి నుండి వ్యవస్థగా మారడానికి మధ్య జరిగిన సంఘర్షణల ఇతివృత్తంగా ఈ సిరీస్ సాగుతుంది. ఈ మూడు వెబ్ సిరీస్‌లను తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తాం. పూర్తి వివరాలు త్వరలో చెబుతాను'' అన్నారు.

మంచి సినిమా చేశాం



● సిద్ధు ముద్ద, నందకుమార్ అబ్బినేని

''వరుణ్ తేజ్, నేను డిఫరెంట్ సినిమాలు చేయాలని అనుకుంటుంటాం. అలా చేసిందే ఈ 'ఆపరేషన్ వాలెంటైన్'' అన్నారు నిర్మాత సిద్ధు ముద్ద. వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఎయిర్‌ఫోర్స్ యాక్షన్ డ్రామా 'ఆపరేషన్ వాలెంటైన్'. ఈ చిత్రంలో మానుషీ చిల్లర్ హీరోయిన్. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో సోనీ పిక్చర్స్ ఇంటర్‌నేషనల్ ప్రొడక్షన్స్, సిద్ధు ముద్ద రినైసన్స్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో రేపు విడుదలవుతోంది. బుధవారం విలేకర్ల సమావేశంలో సిద్ధు ముద్ద మాట్లాడుతూ– ''శక్తి ప్రతాప్ చేసిన ఓ షార్ట్ ఫిల్మ్ వరుణ్‌తేజ్‌కు, నాకు నచ్చింది. ఆ షార్ట్ ఫిల్మ్‌నే శక్తి ఫుల్ లెంగ్త్ సినిమా చేయాలనే ప్రయత్నాల్లో ఉన్నాడని తెలిసి, పూర్తి కథ విన్నాం. మాకు నచ్చడంతో సినిమా చేయాలనుకున్నాం. ఏరియల్ యాక్షన్ నేపథ్యంలో 'ఫైటర్' తర్వాత వస్తోన్న చిత్రం మాదే అనుకుంటున్నా. భారత డిఫెన్స్ విభాగం నుంచి అనుమతులు వచ్చాకే ఈ సినిమా షూటింగ్ ఆరంభించాం. ప్రతి ఇండియన్ చూడాల్సిన చిత్రమిది'' అన్నారు. ''ఆపరేషన్ వాలెంటైన్' ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు సహ–నిర్మాతల్లో ఒకరైన నందకుమార్ అబ్బినేని.

వెబ్ సిరీస్‌గా పీవీ నరసింహారావు బయోపిక్

భారతదేశ దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు జీవితంతో వెబ్ సిరీస్ రూపొందనుంది. ఆహా స్టూడియో, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలిసి 'హాఫ్ లయన్' పేరుతో ఈ వెబ్ సిరీస్ నిర్మించనున్నట్లు ప్రకటించాయి. ప్రముఖ రచయిత వినయ్ సీతాపతి రచించిన 'హాఫ్ లయన్' పుస్తకం ఆధారంగా జాతీయ అవార్డు గ్రహీత ప్రకాశ్ ఝా ఈ సిరీస్‌కి దర్శకత్వం వహించ నున్నారు. ''1991 నుంచి 1996 వరకు పీవీ నరసింహారావు అందించిన విశేష సేవలకుగానూ భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో ఈ సిరీస్‌ను రూపొందిస్తాం'' అని మేకర్స్ అన్నారు.

థ్రిల్లింగ్ డైరీస్



● ఆకృతి, డా. యోగేష్

డా. యోగేష్, ఆకృతి అగర్వాల్ జంటగా సన్నీ లియోన్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'డాక్టర్ యోగి డైరీస్'. రాజేశ్–ప్రసాద్‌ల దర్శకత్వంలో హర్షవర్ధన్, శ్రీదేవి మద్దాలి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవంలో తొలి సీన్‌కి దర్శకుడు వీరశంకర్ క్లాప్ ఇవ్వగా, దర్శకుడు వీఎన్ ఆదిత్య కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు మహేశ్ గౌరవ దర్శకత్వం వహించారు. ''ఈ ఏడాది ప్రేక్షకులు ఓ మంచి పారానార్మల్ థ్రిల్లర్‌ను చూస్తారు'' అన్నారు డా. యోగేష్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్	నిఫ్టీ
790 ▽	247 ▽
72,305	21,951

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,950	▽	86
డోజోన్స్	38,888	▽	92
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,625	▽	58
డాక్స్	17,601	△	45
షాంఘై	2,958	▽	58
నికాయ్	39,208	▽	31

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,135	▽	136
బంగారం (99.5 స్వచ్ఛత)	61,866	▽	136
వెండి (కేజీ)	69,343	▽	559

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.46	83.49
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.94	106.51
€	యూరో	ఎస్‌బీఐ	88.89	91.24
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.53	55.76
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.26	55.17
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.38	64.06
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.09	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.62	23.46
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.47

డిస్నీ, రిలయన్స్ మెగా డీల్

మీడియా కార్యకలాపాల విలీనానికి ఒప్పందం • రూ. 70,000 కోట్ల దిగ్గజంగా జాయింట్ వెంచర్ • రిలయన్స్‌కు 63.16 శాతం వాటా • జేవీలో రూ. 11,500 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: దిగ్గజ సంస్థలు వాల్ట్ డిస్నీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశీ మీడియా రంగంలో భారీ డీల్‌కు తెరతీశాయి. భారత్‌లో తమ మీడియా కార్యకలాపాలను విలీనం చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీంతో రూ. 70,352 కోట్లు (దాదాపు 8.5 బిలియన్ డాలర్లు) విలువ చేసే భారీ మీడియా దిగ్గజం ఆవిర్భవించనుంది. ఇందులో రిలయన్స్, దాని అనుబంధ సంస్థలకు 63.16 శాతం, డిస్నీకి 36.84 శాతం వాటాలు ఉంటాయని ఇరు సంస్థలు ఒక ప్రకటనలో తెలిపాయి. నెట్‌ఫ్లిక్స్, సోనీ వంటి దిగ్గజాలకు దీటుగా పోటీనిచ్చేందుకు జాయింట్ వెంచర్‌లో రిలయన్స్ దాదాపు రూ. 11,500 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. జేవీకి రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ సారథ్యం వహించనుండగా, డిస్నీ మాజీ టాప్ ఎగ్జిక్యూటివ్ ఉదయ్‌శంకర్ వైస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ఈ ఏడాది ఆఖరు త్రైమాసికంలో లేదా 2025 తొలి త్రైమాసికంలో డీల్ పూర్తి కాగలదని అంచనా.



కీలక ఒప్పందం ..

'వయాకామ్18, స్టార్ ఇండియా వ్యాపారాలను విలీనం చేయడం ద్వారా జాయింట్ వెంచర్ నెలకొల్పేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ (దాని అనుబంధ సంస్థ) వయాకామ్ 18 మీడియా, వాల్ట్ డిస్నీ కంపెనీ ఒప్పందం కుదుర్చుకున్నాయి. కోర్టు ఆమోదిత ప్రణాళికకు అనుగుణంగా స్టార్ ఇండియా (ఎస్ఐపీఎల్)లో వయాకామ్18 విలీనమవుతుంది' అని ఇరు సంస్థలు తెలిపాయి. భారతీయ వినోద పరిశ్రమలో ఇదొక మైలురాయిలాంటి ఒప్పందమని ముకేశ్ అంబానీ వ్యాఖ్యానించారు. 'అంతర్జాతీయంగా అత్యుత్తమ మీడియా గ్రూప్‌గా డిస్నీ అంటే మాకెంతో గౌరవం. డిస్నీతో జట్టు కట్టడం ద్వారా దేశవ్యాప్తంగా వీక్షకులకు అందుబాటు ధరల్లో అపరిమిత కంటెంట్‌ను అందించేందుకు వీలవుతుంది. రిలయన్స్ గ్రూప్‌లోకి డిస్నీకి స్వాగతం' అని పేర్కొన్నారు. మరోవైపు, 'ఈ జేవీతో కంపెనీకి దీర్ఘకాలంలో మరింత విలువ చేకూరుతుంది. వినియోగదారులకు విస్తృతమైన డిజిటల్ సర్వీసులు, వినోదం, స్పోర్ట్స్ కంటెంట్‌ను అందించగలుగుతాం' అని వాల్ట్ డిస్నీ సీఈవో బాబ్ ఐగర్ తెలిపారు.

మరిన్ని విశేషాలు..

- విలీన సంస్థకు అత్యధిక సంఖ్యలో ఓటీటీ సబ్‌స్క్రయిబర్స్, రెండు స్ట్రీమింగ్ సర్వీసులు, 120 పైచిలుకు టీవీ చానళ్లు (కలర్స్, స్టార్‌ప్లస్, స్టార్ గోల్డ్ లాంటివి) ఉంటాయి.
- జేవీకి 75 కోట్ల మంది వీక్షకులు ఉండనున్నారు. 30,000 పైచిలుకు డిస్నీ కంటెంట్ అసెట్స్‌కి లైసెన్సు లభిస్తుంది. అలాగే, భారత్‌లో డిస్నీ సినిమాల పంపిణీకి ప్రత్యేక హక్కులు లభిస్తాయి.
- ట్వెంటీఫస్ట్ సెంచరీ ఫాక్స్ అసెట్స్ కొనుగోలు ద్వారా 2020లో దేశీయంగా డిస్నీప్లస్‌హాట్‌స్టార్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. తొలినాళ్లలో పెయిడ్ యూజర్ల సంఖ్య గణనీయంగా వృద్ధి చెందినప్పటికీ ఆ తర్వాత జోరు తగ్గింది. కార్యకలాపాలు ఆశించిన స్థాయిలో విస్తరించకపోవడంతో, సంక్లిష్టంగా మారిన తమ భారత విభాగాన్ని వీలైతే పూర్తిగా విక్రయించేందుకు లేదా ఇతర సంస్థలతో జట్టు కట్టి జేవీ ఏర్పాటు చేసేందుకు డిస్నీ కొన్నాళ్లుగా కసరత్తు చేస్తోంది.
- రిలయన్స్ మీడియా సంస్థ నెట్‌వర్క్ 18కి పలు న్యూస్, వినోద, స్పోర్ట్స్ చానల్స్ ఉన్నాయి. అలాగే మనీకంట్రోల్‌డాట్‌కామ్, బుక్‌మైషోలో వాటాలు ఉన్నాయి. రిలయన్స్‌కి జియో స్టూడియోస్ అనే సినీ నిర్మాణ సంస్థ ఉంది.

మార్కెట్ క్రాష్

- సెన్సెక్స్ 790 పాయింట్లు పతనం
- 22,000 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ
- అన్ని రంగాల్లోనూ అమ్మకాలు
- ఒకే రోజులో రూ.6 లక్షల కోట్ల నష్టం



ముంబై: దలాల్ స్ట్రీట్‌లో బుధవారం బేర్ ప్రతాపం చూపింది. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ (2%), బ్యాంకింగ్ రంగ షేర్ల పతనంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాలు ఇందుకు కారణమయ్యాయి. ఫిబ్రవరి డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు, భారత జీడీపీ వృద్ధి డేటా వెల్లడి(గురువారం)కి ముందు ట్రేడర్లు అప్రమత్తత వహించారు. అమెరికా స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించవచ్చనే అంచనాలతో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు వాయిదా ఆందోళనలు కొనసాగాయి. ఫలితంగా నిఫ్టీ కీలకమైన 22,000 స్థాయిని, సెన్సెక్స్ 73,000 స్థాయిలను కోల్పోయాయి. సెన్సెక్స్ ఒక శాతానికి పైగా నష్టపోవడంతో బీఎస్ఈలో రూ. 6 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.386 లక్షల కోట్లకు పడింది. ఫ్లాట్‌గా మొదలైన మార్కెట్, ఒకానొక దశలో సెన్సెక్స్ 873 పాయింట్లు క్షీణించి 72,222 వద్ద, నిఫ్టీ 282 పాయింట్లు దిగివచ్చి 21,916 వద్ద ఇంట్రాడే కనిష్టాలను దిగివచ్చాయి. చివరికి సెన్సెక్స్ 790 పాయింట్లు నష్టపోయి 72,305 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 247 పాయింట్ల నష్టంతో 21,951 వద్ద స్థిరపడ్డాయి.

జునిపర్ హోటల్స్ లిస్టింగ్ సక్సెస్

జునిపర్ హోటల్స్ ఇష్యూ ధర(రూ.360)తో పోలిస్తే బీఎస్ఈలో 0.33% ప్రీమియంతో రూ.361 వద్ద లిస్టయ్యింది. 10.36% ఎగసి రూ.397 స్థాయిని తాకి అప్పర్ సర్క్యూట్ వద్ద లాకైంది. మార్కెట్ విలువ రూ.8,840 కోట్లుగా నమోదైంది.

ఆర్‌కే స్వామి @ రూ. 270–288

మార్కెటింగ్ కమ్యూనికేషన్స్ కంపెనీ ఆర్‌కే స్వామి లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 270–288 ధరల శ్రేణిని ప్రకటించింది. మార్చి 4న ప్రారంభంకానుంది. తద్వారా దాదాపు రూ. 424 కోట్లు సమీకరించాలని భావిస్తోంది.

సంపన్నుల సంఖ్య పైపైకి..



- 6 శాతం వృద్ధితో 13,263కు చేరిక
- 2028 నాటికి 20,000కు
- నైట్‌ఫ్రాంక్ ఇండియా అంచనా

న్యూఢిల్లీ: దేశంలో సంపన్నులు మరింతగా విస్తరిస్తున్నారు. గతేడాది (2023) అల్ట్రా హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (యూహెచ్ఎన్‌డబ్ల్యూఐ/) సంఖ్య 6 శాతం పెరిగి 13,263కు చేరుకుంది. అంతేకాదు, 2028 నాటికి వీరి సంఖ్య 20,000కు పెరుగుతుందని నైట్‌ఫ్రాంక్ ఇండియా అంచనా వేసింది. 30 మిలియన్ డాలర్లు (రూ.250 కోట్లు), అంతకంటే ఎక్కువ నికర విలువ కలిగిన వ్యక్తులను యూహెచ్ఎన్‌డబ్ల్యూఐ కింద నైట్‌ఫ్రాంక్ పరిగణనలోకి తీసుకుంది. 'ద వెల్త్ రిపోర్ట్ 2024' పేరుతో ఓ నివేదికను విడుదల చేసింది. 2022 చివరికి దేశంలో సంపన్నుల సంఖ్య 12,495గా ఉన్నట్టు తెలిపింది. 2028 నాటికి 19,908కి వీరి సంఖ్య పెరుగుతుందని అంచనా వేసింది. ''అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై భారత్ సంపద సృష్టి, అవకాశాలకు వేదికగా నిలుస్తోంది. సంపన్నుల జనాభా గణనీయంగా పెరగడం, వచ్చే ఐదేళ్లలో వీరి సంఖ్య మరో 50 శాతం వృద్ధి చెందడం దీనికి సూచిక'' అని నైట్‌ఫ్రాంక్ ఇండియా చైర్మన్, ఎండీ శిశిర్ బైజాల్ పేర్కొన్నారు.

2024 సానుకూలం..

తమ సంపద 2024లో వృద్ధి చెందుతుందని 90 శాతం మంది సంపన్నులు అంచనా వేస్తున్నట్టు నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక తెలిపింది. మొత్తం మీద 63 శాతం మంది అయితే, తమ సంపద 10 శాతానికి పైగా పెరుగుతుందని భావిస్తున్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
29-2-2024	
విశాఖ	500–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	460–00
విజయవాడ	460–00
రిటైల్ ధర (డజను)	72.00
28-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	460–00
వరంగల్	462–00
రిటైల్ ధర	5.20

భారత్‌లో బిల్ గేట్స్..

• హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఐడీసీ సందర్శన

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ భారత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లోని ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ (ఐడీసీ)ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇంజనీర్లను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో కృత్రిమ మేధ సాంకేతికత విషయంలో భారత్‌కి గల అవకాశాలపై ఆయన అత్యంత ఆశాభావం వ్యక్తం చేసినట్లు మైక్రోసాఫ్ట్ ఐడీసీ ఎండీ రాజీవ్ కుమార్ తెలిపారు. గేట్స్ తాను 1998లో ఆకాంక్షించిన సెంటర్ ఆఫ్ ఇన్నోవేషన్‌ను ప్రస్తుతం సందర్శించడం ఎంతో ప్రాధాన్యత ఉందని ఆయన పేర్కొన్నారు. పరిశోధనలు, ఇంజనీరింగ్, డెవలప్‌మెంట్ కార్యకలాపాలకు సంబంధించి ఐడీసీ.. 25 ఏళ్లు పూర్తి చేసుకుంది.


బిల్ గేట్స్, రాజీవ్ కుమార్

మల్టీప్లెక్స్‌ల ఆదాయం వీక్

2024–25లో వృద్ధి 15 శాతమే: క్రిసిల్



ముంబై: వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25)లో వినోద రంగం(మల్టీప్లెక్స్) వృద్ధి మందగించవచ్చని రేటింగ్ దిగ్గజం క్రిసిల్ పేర్కొంది. వెరసి ఈ ఏడాది (2023–24)తో పోలిస్తే మల్టీప్లెక్స్‌ల ఆదాయం 10–15% మాత్రమే పురోగమిస్తుందని అంచనా వేసింది. లాభాల మార్జిన్లు మాత్రం నామమాత్రంగా బలపడే వీలున్నట్లు తెలియజేసింది. అయితే కరోనా ముందు స్థాయితో పోలిస్తే ఇవి తక్కువగానే నమోదుకానున్నట్లు తెలియజేసింది. ఇందుకు అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, డిస్నీహాట్‌స్టార్ తదితర ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ కారణంకానున్నట్లు వెల్లడించింది. వచ్చే ఏడాది మల్టీప్లెక్స్ రంగం ఆదాయం 10–15% పుంజుకుని రూ. 7,300 కోట్లకు చేరవచ్చని ఊహిస్తోంది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం రసాయన శాస్త్రం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐలో 50 క్రెడిట్ అనలిస్ట్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. రెగ్యులర్ ప్రాతిపదికన క్రెడిట్ అనలిస్ట్(మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్3) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50
» **అర్హత:** డిగ్రీ, ఎంబీఏ(ఫైనాన్స్)/పీజీడీబీఏ/పీజీడీబీఎం/ఎంఎంఎస్(ఫైనాన్స్)/సీఏ/సీఎఫ్ఏ/ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.63,840 నుంచి రూ.78,230
» **ఎంపిక విధానం:** దరఖాస్తు షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.03.2024.
» **వెబ్‌సైట్:** www.sbi.co.in

ఇండియన్ నేవీలో 254 షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ పోస్టులు

ఇండియన్ నేవీ ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)లో 2025 జనవరి నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సుల వారీగా ఖాళీలు:** జనరల్ సర్వీస్–50, పైలట్–20, నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్–18, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్–08, లాజిస్టిక్స్–30, నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టర్ కేడర్(ఎన్ఏఐసీ)–10, ఎడ్యుకేషన్–18, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్)–30, ఎలక్ట్రికల్ బ్రాంచ్ (జనరల్ సర్వీస్)–50, నావల్ కన్‌స్ట్రక్టర్–20.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ,పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **ప్రారంభ వేతనం:** నెలకు రూ.56,100+ ఇతర అలవెన్సులు.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.03.2024.
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in.

తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలు

తెలంగాణ సోషల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక పాఠశాల(బాలురు), రుక్మాపూర్, కరీంనగర్ జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు అర్హులైన బాలుర నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 80
» **అర్హత:** 2023–24 విద్యా సంవత్సరంలో ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాల నుంచి ఐదో తరగతిలో పరీక్షకు హాజరైన/ఉత్తీర్ణులైన బాలురు మాత్రమే అర్హులు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,00,000(పట్టణ ప్రాంతం), రూ.1,50,000 (గ్రామీణ ప్రాంతం) మించకూడదు. తెలుగు/ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు అర్హులు. విద్యార్థులు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 01.04.2004 నాటికి 11 ఏళ్లు మించకూడదు. 01.04.2013 నుంచి 31.03.2015 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** మూడంచెల్లో ఉంటుంది. స్టేజ్–1(స్టేట్ లెవల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్–100 మార్కులు), స్టేజ్–2(స్క్రీనింగ్ టెస్ట్‌లు–150 మార్కులు). ఇందులో ఫిజికల్, సైనిక్ స్కూల్ ఆప్టిట్యూడ్(రాత–డిస్క్రిప్టివ్), కమ్యూనికేషన్ స్కిల్ టెస్ట్‌లు ఉంటాయి. వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.03.2024.
» **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది:** 06.03.2024.
» **ప్రవేశ పరీక్ష తేది:** 10.03.2024.
» **ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ తేదీలు:** 22.03.2024, 23.03.2024, 26.03.2024, 27.03.2024, 28.03.2024.
» **వెబ్‌సైట్:** www.tswrsplschools.cgg.gov.in

ఏపీఎండీసీ, విజయవాడలో వివిధ పోస్టులు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎండీసీ).. రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీ(సర్వే)పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
» **పోస్టుల వివరాలు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(సర్వే)(మెటాలిఫరస్)–03, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సర్వే)(కోల్)–03.
» **అర్హత:** డిగ్రీ/డిప్లొమా(మైనింగ్/మైన్ సర్వే) లేదా డిగ్రీ(సైన్స్), మైన్ సర్వేయర్స్ సర్టిఫికేట్ ఆఫ్ కాంపిటెన్సీ కలిగి ఉండాలి.
» **వయసు:** 31.01.2024 నాటికి 18 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** రూ.40,970 నుంచి రూ.1,24,380.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.03.2024.
» **వెబ్‌సైట్:** www.apmdc.ap.gov.in.

రివిజన్‌తోనే.. నీట్‌లో జయం!

» నీట్–2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» మే 5న దేశ వ్యాప్తంగా పరీక్ష నిర్వహణ
» సిలబస్‌లో పలు మార్పులు

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-యూజీ.. సంక్షిప్తంగా నీట్-యూజీ! దేశంలో ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య కోర్సుల్లో చేరాలని కలలు కనే విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసే పరీక్ష!! నీట్ యూజీకి ప్రిపరేషన్ సాగిస్తున్న అభ్యర్థులు..తమ సన్నద్ధతకు మరింత పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. కారణం.. నీట్ యూజీ 2024 నోటిఫికేషన్ వెలువడటమే! ఈ నేపథ్యంలో.. నీట్ యూజీ-2024 పరీక్ష వివరాలు, సిలబస్ మార్పులు, పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు..



ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో కొత్త సిలబస్

నీట్ యూజీ కొత్త సిలబస్‌ను ఎన్‌టీఏ, నేషనల్ మెడికల్ కమిషన్ వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంచారు. తాజా సిలబస్‌ను పరిశీలిస్తే.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీల నుంచి మొత్తం 18 చాప్టర్లను తొలగించారు. అదే విధంగా.. కొన్ని అంశాలను జోడించారు. విద్యార్థులు ఈ మార్పులను గుర్తించి.. మారిన సిలబస్‌కు అనుగుణంగా ప్రిపరేషన్ సాగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ర్యాంకుల నిర్ధారణలోనూ మార్పులు

ఎన్‌టీఏ.. నీట్–యూజీ ర్యాంకుల నిర్ధారణ విధానంలోనూ ఈ ఏడాది మార్పులు చేసింది. ముఖ్యంగా ఇద్దరు అభ్యర్థులకు ఒకే స్కోర్ వచ్చిన సందర్భంలో ఆ ఇద్దరిలో టాపర్‌ను గుర్తించడానికి అనుసరించే ఫార్ములాలో మార్పులు చేసింది. మొదట బయాలజీలో ఎక్కువ మార్కులు పొందిన వారిని టాపర్‌గా గుర్తిస్తారు. ఇక్కడ కూడా టై ఏర్పడితే.. తర్వాత వరుసగా కెమిస్ట్రీలో, అనంతరం ఫిజిక్స్‌లో ఎక్కువ మార్కులు పొందిన విద్యార్థిని గుర్తించి.. ఇద్దరిలో ఒకరికి టాప్ స్కోర్ ఇస్తారు.

మే 5న పరీక్ష

నీట్ యూజీ పరీక్షను మే 5న నిర్వహించనున్నారు. అంటే..ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయ్యాక.. నీట్ పరీక్ష తేదీకి నెల రోజులకు పైగా సమయం అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో విద్యార్థులు పూర్తిగా నీట్ ప్రిపరేషన్‌కు కేటాయించాలి. ఈ ఏడాది నీట్ నిర్వహణకు పరీక్ష కేంద్రాలను కూడా పెంచారు. గత ఏడాది 499 సెంటర్లలోనే పరీక్ష నిర్వహించగా.. ఈ సంవత్సరం ఆ సంఖ్యను 554కు పెంచారు. దీనివల్ల విద్యార్థులకు సమీప ప్రాంతాల్లోనే పరీక్ష కేంద్రాల కేటాయింపునకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

పరీక్ష స్వరూపం

నీట్–యూజీ పరీక్షను నాలుగు సబ్జెక్టులలో మొత్తం 720 మార్కులకు నిర్వహిస్తారు. ఫిజిక్స్‌లో.. సెక్షన్ ఏ 35 ప్రశ్నలు–140 మార్కులు, సెక్షన్ బీ 15 ప్రశ్నలు–40 మార్కులు; కెమిస్ట్రీలో.. సెక్షన్ ఏ 35 ప్రశ్నలు–140 మార్కులు, సెక్షన్ బీ 15 ప్రశ్నలు–40 మార్కులు; బోటనీలో.. సెక్షన్ ఏ 35 ప్రశ్నలు–140 మార్కులు, సెక్షన్ బీ 15 ప్రశ్నలు–40 మార్కులు; జువాలజీలో.. సెక్షన్ ఏ 35 ప్రశ్నలు –140 మార్కులు, సెక్షన్ బీ 15 ప్రశ్నలు–40 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. పెన్ పేపర్ విధానంలో ఓఎంఆర్ షీట్ ఆధారంగా పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ప్రతి సబ్జెక్ట్‌లోనూ సెక్షన్–బిలోని 15 ప్రశ్నలకు గాను పది ప్రశ్నలకు సమాధానాలిస్తే సరిపోతుంది. పరీక్షకు అందుబాటులో ఉండే సమయం మూడు గంటల ఇరవై నిమిషాలు.

ప్రతి సబ్జెక్ట్‌లో 130 టార్గెట్

నీట్‌లో మంచి స్కోర్ సాధించి.. మెడికల్ సీటు సొంతం చేసుకునేందుకు విద్యార్థులు.. ప్రతి సబ్జెక్ట్‌లోనూ 180 మార్కులకు గాను కనీసం 130 మార్కులు సాధించేలా కృషి చేయాలి. మొత్తంగా 720 మార్కులకు గాను 450 మార్కుల నుంచి 500 మార్కులు స్కోర్ చేసేలా ప్రిపరేషన్ సాగిస్తే..డాక్టర్ కల సాకారం చేసుకోవచ్చు.

రివిజన్‌కు ప్రాధాన్యం

నీట్‌కు ప్రిపరేషన్ సాగిస్తున్న అభ్యర్థులు రివిజన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంటర్మీడియెట్ బోర్డ్ పరీక్షలు పూర్తయిన తర్వాత వీలైనంత మేరకు రివిజన్‌కు ఎక్కువ సమయం కేటాయించాలి. ప్రతి సబ్జెక్టుకూ సమానంగా సమయం కేటాయించుకోవాలి. ప్రతి రోజు చదవాల్సిన టాపిక్స్‌ను ముందుగానే విభజించుకుని దానికి అనుగుణంగా అధ్యయనం చేయాలి.

షార్ట్ నోట్స్ కీలకం

ప్రిపరేషన్ సమయంలోనే విద్యార్థులు షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. ఈ షార్ట్ నోట్స్‌లో.. కీలక భావనలు, కాన్సెప్ట్‌లు, ఫార్ములాలు ఉండేలా చూసుకుంటే.. వేగంగా పునశ్చరణ చేసుకోవడానికి వీలవుతుంది. అదేవిధంగా ఆయా అంశాలకు సంబంధించి ప్రశ్నలు చదువుతున్నప్పుడు వెంటనే రెడీ రెకనర్‌గా షార్ట్ నోట్స్‌ను వినియోగించుకోవచ్చు.

మాక్ టెస్ట్‌లు

అభ్యర్థులకు ఉపకరించే మరో వ్యూహం..మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావడం. ప్రతి రోజు మోడల్ టెస్ట్‌లు రాయడం, అదే విధంగా వారానికి ఒక మాక్ టెస్ట్‌కు హాజరు కావడం వంటి వ్యూహాలు అనుసరించాలి. ఫలితంగా.. డైరెక్ట్ కొశ్చన్స్ ఎక్కువగా అడుగుతున్న నీట్‌లో మంచి స్కోర్ సాధించే ఆస్కారం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, మార్చి 9
- **నీట్ తేదీ:** 2024, మే 5 (మధ్యాహ్నం 2 గంటల నుంచి 5:20 వరకు)
- **ఫలితాల వెల్లడి:** 2024, జూన్ 14
- **వెబ్‌సైట్:** https://neet.ntaonline.in/, https://exams.nta.ac.in/NEET

సబ్జెక్ట్ వారీగా ప్రిపరేషన్ ఇలా

ప్రాక్టీస్‌తో ఫిజిక్స్‌లో స్కోర్

నీట్ అభ్యర్థులు ఫిజిక్స్ విషయంలో ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. ఆప్టిక్స్, మెకానిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మోడరన్ ఫిజిక్స్ చాప్టర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో అధ్యాయానికి చివర ఇచ్చిన ప్రశ్నలను సాధించాలి. అవకలనం, సమాకలనం అనువర్తనాలపై పట్టు సాధించాలి. ఇంటర్ రెండేళ్ల పాఠ్యాంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. రొటేషనల్ డైనమిక్స్, సిగ్మా పార్టికల్స్‌పై ఎక్కువగా దృష్టిపెట్టాలి. అదేవిధంగా ఎలక్ట్రోమ్యాగ్నటిజం, ఇండక్షన్, కరెంట్ ఎలక్ట్రిసిటీ వంటి చాప్టర్లను చదవడంతోపాటు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

కెమిస్ట్రీ.. కాన్సెప్ట్స్, రివిజన్

నీట్‌లో విద్యార్థులు సులభంగా భావించే సబ్జెక్ట్.. కెమిస్ట్రీ. ఇందులో స్కోర్ కోసం.. కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా రివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, మోల్ కాన్సెప్ట్, కెమికల్ బాండింగ్, ఎలక్ట్రోకెమిస్ట్రీ, కోఆర్డినేషన్ కాంపౌండ్, ఈక్విలిబ్రియమ్, పాలిమర్‌లు, బయో మాలిక్యూల్స్, పరమాణు నిర్మాణం, సాలిడ్ స్టేట్, ద్రావణాలు, సర్ఫేస్ కెమిస్ట్రీ; ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఐసోమెరిసమ్, సమ్మేళనాల తయారీలకు కొంత వెయిటేజీ ఎక్కువగా ఉంటుంది. కెమిస్ట్రీలో విద్యార్థులు చర్యలు, సమీకరణాలను మర్చిపోతుంటారు. కాబట్టి నిరంతరం పునఃశ్చరణ చేయాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో వివిధ మూలకాలు, వాటి సమ్మేళనాల ధర్మాలను అధ్యయనం చేయాలి.

బోటనీ

బోటనీకి సంబంధించి ఫిజియాలజీ ఆఫ్ ప్లాంట్స్ అండ్ యానిమల్స్, మార్ఫాలజీ, జెనెటిక్స్ అండ్ ఎవల్యూషన్, సెల్ బయాలజీ, బయోటెక్నాలజీ, హ్యూమన్ ఫిజియాలజీ, డైవర్సిటీ ఆఫ్ లివింగ్ ఆర్గానిజమ్‌లను ముఖ్య చాప్టర్లుగా భావించి చదవాలి. అన్ని అంశాలకు సంబంధించి కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి. ఎకాలజీలో ఆర్గనైజేషన్స్ అండ్ పాప్యులేషన్, ఎకోసిస్టమ్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. వీటితోపాటు బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్ ఇష్యూస్ పాఠ్యాంశాలపై ఫోకస్ చేయడం లాభిస్తుంది. ప్లాంట్ ఫిజియాలజీలో ప్లాంట్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్, మొక్కల హార్మోనులు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్స్‌లో కణ విభజన (సమవిభజన, క్షయకరణ విభజన)లోని వివిధ దశల్లో జరిగే మార్పులు, కణ చక్రం తదితరాలను అధ్యయనం చేయాలి. బయో మాలిక్యూల్స్ నుంచి కంటెంట్ సంబంధిత ప్రశ్నలు వస్తాయి. రీ ప్రొడక్షన్ నుంచి దాదాపు 10 ప్రశ్నల వరకు అడుగుతున్నారు. మాలిక్యులర్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటన్స్‌లో రెప్లికేషన్, ట్రాన్స్‌క్రిప్షన్, ట్రాన్స్‌లేషన్, రెగ్యులేషన్స్‌లపై దృష్టిపెట్టాలి.

జువాలజీ

జువాలజీ సబ్జెక్ట్‌లో రాణించేందుకు విద్యార్థులు హ్యూమన్ ఫిజియాలజీ, ఎకాలజీ, జెనెటిక్స్, ఎవల్యూషన్ టాపిక్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీతో పాటు ఇంటర్ పుస్తకాల నుంచీ ప్రశ్నలు అడుగుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గత ప్రశ్న పత్రాలను, ఇంటర్‌లో ఆయా చాప్టర్స్ చివరలో అడిగే ప్రశ్నలను సాధన చేయాలి. అదేవిధంగా.. ఎన్‌సీఈఆర్‌టీ, ఇంటర్ పుస్తకాలను క్షుణ్నంగా చదివితే ఉపయుక్తంగా ఉంటుంది.

క్లుప్తంగా...

నేడు కాపు భవన నిర్మాణానికి భూమి పూజ

కొమ్మాది (విశాఖ): కాపు భవన నిర్మాణానికి ఎండాడ జాతీయ రహదారి సమీపంలో గురువారం భూమి పూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్ శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. మొత్తం 2,500 గజాల స్థలాన్ని భవన నిర్మాణానికి కేటాయించినట్లు పేర్కొన్నారు. కాపు, తెలగ, బలిజ సామాజిక వర్గాలకు సంబంధించి భవనం నిర్మించనున్నట్లు తెలిపారు.

సీఆర్‌డీఏ ప్రాంతంలో పేదల పెన్షన్ రూ.5 వేలకు పెంపు

- రూ.2,500 పెన్షన్ రెట్టింపు చేస్తూ జగన్ సర్కార్ ఉత్తర్వులు
- మార్చి 1 నుంచి పంపిణీ

సాక్షి, అమరావతి: అమరావతి సీఆర్‌డీఏ ప్రాంతంలో భూమిలేని పేదలకు ఒక్కొక్కరికీ ప్రతి నెలా ఇచ్చే పెన్షన్ మొత్తాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెట్టింపు చేసింది. ప్రస్తుతం రూ. 2,500 చొప్పున ఇస్తున్న పెన్షన్ డబ్బులను రూ. 5,000కు పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి ఒకటో తేదీ నుంచి చేపట్టే పంపిణీలోనే పెరిగిన పెన్షన్ డబ్బులు అందజేయనున్నట్లు పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఈ నెల 15వ తేదీన తాడికొండ నియోజకవర్గ పరిధిలోని ఫిరంగిపురం మండలకేంద్రంలో పర్యటన సందర్భంగా సీఆర్‌డీఏ ప్రాంతంలో భూమిలేని పేదలకు పెన్షన్ మొత్తం పెంపుపై సీఎం జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. 15 రోజుల వ్యవధిలోనే ఆ హామీ అమల్లోకి తీసుకురావడంపై ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం ద్వారా 17,215 మంది లబ్ధి పొందనున్నారు.

మానసిక వైద్యులు రిజిస్టర్ అవ్వాలి

స్టేట్ మెంటల్ హెల్త్ అథారిటీ సీఈవో డాక్టర్ నరసింహం

సాక్షి, అమరావతి: ప్రజల మానసిక ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసిన ప్రభుత్వం, మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం–2017 అమలుకు ప్రాధాన్యం ఇస్తోందని డీఎంఈ, రాష్ట్ర మెంటల్ హెల్త్ అథారిటీ (ఎస్ఎంహెచ్ఏ) సీఈవో డాక్టర్ నరసింహం తెలిపారు. చట్టం అమలులో భాగంగా మానసిక రుగ్మతలకు వైద్య సేవలు అందించే ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, వాటిల్లో పనిచేసే వైద్యులు ఎస్ఎంహెచ్ఏలో తప్పనిసరిగా రిజిస్టర్ అవ్వాలని ఇటీవల నరసింహం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే పదేళ్లపాటు కాలపరిమితి ఉంటుందన్నారు. ప్రైవేట్, అటానమస్ సంస్థలకు సంబంధించిన సైకియాట్రిస్టులు రూ.10 వేలు, క్లినికల్ సైకాలజిస్ట్, సైకియాట్రిక్ సోషియల్ వర్కర్స్, మెంటల్ హెల్త్ నర్స్, సైకియాట్రిక్ నర్స్ రూ.5వేలు చొప్పున డీడీ రూపంలో రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

1 నుంచి సాగర్ కుడి కాలువకు 3 టీఎంసీలు

సాక్షి, అమరావతి: గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ కుడి కాలువకు 3 టీఎంసీలు విడుదలకు కృష్ణా బోర్డు అంగీకరించింది. ఈ నెల 1న త్రిసభ్య కమిటీ చేసిన సిఫార్సు మేరకు మార్చి 1 నుంచి సాగర్ కుడి కాలువకు 3 టీఎంసీలు విడుదల చేయాలని బోర్డు ఉత్తర్వులిస్తూ ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలకు బుధవారం లేఖ రాసింది. సీఆర్పీఎఫ్ బలగాల పహారాలో ఉన్న నాగార్జునసాగర్ నుంచి కుడి కాలువకు 3 టీఎంసీలను బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే నేతృత్వంలో విడుదల చేయనున్నారు.

రుషికొండ నిర్మాణాలపై గడువు కోరిన కేంద్రం

అంగీకరించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: విశాఖలోని రుషికొండపై ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ చేపట్టిన నిర్మాణాల్లో ఉల్లంఘనల్ని పరిశీలించేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన కమిటీ సిద్ధం చేసిన నివేదికను కోర్టు ముందుంచేందుకు మరో రెండు వారాల గడువు కావాలని కేంద్ర ప్రభుత్వం హైకోర్టును బుధవారం అభ్యర్థించింది. సానుకూలంగా స్పందించిన హైకోర్టు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. రుషికొండపై నిబంధనలకు, మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ వేర్వేరుగా గత ఏడాది హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. వీటిపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం నిర్మాణాలను పరిశీలించి నివేదిక ఇచ్చేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖను ఆదేశించింది. కాగా.. కమిటీ చైర్మన్ కుప్పుస్వామి గౌరప్పన్ ఆకస్మిక మరణం నేపథ్యంలో నివేదిక సమర్పణలో కొంత జాప్యం జరుగుతోందని,రెండు వారాల గడువిస్తే నివేదికను కోర్టు ముందుంచుతామంది.

ఆలయ దర్శనం.. ఆధ్యాత్మిక పరవశం

రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకానికి పెద్దపీట

- 20 ప్రముఖ, చారిత్రక ఆలయాల అనుసంధానం
- తొలిదశలో 18 సర్య్యూట్లలో స్పెషల్ టూర్ ప్యాకేజీలు
- దేవదాయ, పర్యాటక శాఖ సంయుక్తంగా నిర్వహణ
- నేడు లాంఛనంగా ప్రారంభం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దేవదాయ, పర్యాటక శాఖ సంయుక్తంగా భక్తులకు వ్యయప్రయాసలు లేనివిధంగా ఆలయ దర్శనాలు కల్పించనుంది. ఇందులో భాగంగా తొలి దశలో 20 ప్రముఖ, చారిత్రక ఆలయాలను అనుసంధానం చేస్తూ 18 సర్క్యూట్లను రూపొందించింది. స్పెషల్ దర్శనంతో పాటు భోజన, వసతి, రవాణా సౌకర్యాలతో కూడిన ఒకటి/రెండు రోజుల ప్రత్యేక టూర్ ప్యాకేజీలను అందుబాటులోకి తెస్తోంది. పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వేర్వేరుగా ఆధ్యాత్మిక సర్క్యూట్ల ప్రయాణాలను గురువారం లాంఛనంగా ప్రారంభించనున్నారు.

నచ్చిన ప్యాకేజీల్లో నిత్య దర్శనం

పిల్‌గ్రిమ్ పాత్‌వేస్‌కు చెందిన 'బుక్ మై దర్శన్' వెబ్‌సైట్ ద్వారా ఏపీటీడీసీ ప్రత్యేక ప్యాకేజీలను నిర్వహించనుంది. గతంలో సీజన్ల వారీగా నడిచే ప్యాకేజీ టూర్లను ఇకపై నిత్యం ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో సాధారణ ప్యాకేజీలో పాటుకో బ్రాండింగ్ ఏజెన్సీ అయిన బుక్ మై దర్శన్ ద్వారా భక్తులు కోరుకున్న (కస్టమైజ్డ్ సర్వీసు) ఆలయాల దర్శనాలకు, పర్యటనలకు, గైడ్, భోజన వసతుల (బ్యాకెండ్ సర్వీసుల)ను కల్పిస్తోంది.

ఏపీటీడీసీ బస్సులతో పాటు..

ప్రస్తుతం రాష్ట్రంలో ఏపీటీడీసీకి చెందిన 21 బస్సులు, మరో రెండు వాహనాలు పర్యాటక సేవలు అందిస్తున్నాయి. వీటిలో 15 బస్సులు తిరుపతిలో, మరో 8 వాహనాలు విశాఖపట్నంలో నడుస్తున్నాయి. తాజాగా ఆధ్యాత్మిక సర్క్యూట్లను నిర్వహించేందుకు ట్రాన్స్‌పోర్టు, మార్కెటింగ్ సేవలను 'బుక్ మై దర్శన్' అందించేలా అగ్రిమెంట్ చేసుకుంది. ప్రస్తుత ప్యాకేజీల ద్వారా రోజుకు 1,500 నుంచి 2వేల మంది వరకు మాత్రమే పర్యాటకులు నమోదవుతున్నారు. ఈ సంఖ్యను 5వేల వరకు పెంచాలని ఏపీటీడీసీ యోచిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సర్వీసులను పెంచుతోంది. తొలి దశల్లో 18 సర్క్యూట్లను ప్రతిపాదించగా.. రెండో దశలో మరో 7 సర్క్యూట్లను తీసుకురానుంది. తిరుపతిలో బ్యాక్ ఎండ్ సర్వీసుల కింద ప్రతి పర్యాటకుడికి ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లు వేసి పక్కాగా దర్శనం కల్పించేలా సాంకేతిక వ్యవస్థను వినియోగించనుంది.

ఒక రోజు ప్యాకేజీ ధరలు ఇలా (పెద్దలు/చిన్నారులు)

- విజయవాడ, అమరావతి, మంగళగిరి, పొన్నూరు, బాపట్ల, సూర్యలంక బీచ్ (రూ.970/రూ.780)
- హైదరాబాద్, శ్రీశైలం (రూ.1,960/రూ.1,570)
- కర్నూలు, శ్రీశైలం (రూ.1,560/రూ.1,250)
- విశాఖపట్నం సిటీ టూర్ (రూ.940/రూ.750)
- కర్నూలు, మంత్రాలయం (రూ.1,320/రూ.1,060)
- విశాఖపట్నం, అరసవల్లి, శ్రీకాకుళం, రామబాణం (రూ.1,650/రూ.1,320)
- విజయవాడ, అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, పిఠాపురం (రూ.1,470/రూ.1,180)
- విశాఖపట్నం, అరసవల్లి, శ్రీకూర్మం (రూ.1,560/రూ.1,250)
- రాజమహేంద్రవరం, ద్రాక్షారామం, పిఠాపురం, అన్నవరం (రూ.1,470/రూ.1,180)
- విజయవాడ, ద్వారకా తిరుమల, మద్ది ఆంజనేయస్వామి (రూ.1,610/రూ.1,290)
- కడప, గండి, కదిరి, లేపాక్షి (రూ.1,840/1,470)

2 రోజుల ప్యాకేజీల ధరలు ఇలా

- కర్నూలు, అహోబిలం, మహానంది, శ్రీశైలం (రూ.4,020/రూ.3,220)
- విజయవాడ, గుంటూరు, శ్రీశైలం, త్రిపురాంతకం, కోటప్పకొండ (రూ.3,220/రూ.2,560)
- కర్నూలు, యాగంటి, మహానంది, శ్రీశైలం (రూ.4,020/రూ.3,220)
- విజయవాడ, శ్రీశైలం, యాగంటి, మహానంది (రూ.4,670/రూ.3,740)
- విశాఖపట్నం, అరకు (రూ.3,070/రూ.2,460)
- కడప, అహోబిలం, మహానంది, శ్రీశైలం (రూ.4,460/రూ.3,570)
- కడప, యాగంటి, మహానంది, శ్రీశైలం (రూ.4,520/రూ.3,610)

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ అమల్లో

ఏపీ ముందంజ

- రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ వెల్ఫేర్ శాఖ కమిషనర్ నివాస్ వెల్లడి
- విశాఖలో కేంద్ర రాష్ట్ర ఆరోగ్య పథకాలపై ప్రాంతీయ సదస్సు



ప్రసంగిస్తున్న నివాస్

మహారాణిపేట: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ అమల్లో దేశంలో ఏపీ ముందంజలో ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ చెప్పారు. విశాఖలోని రుషికొండలోని బుధవారం రాడిసన్ హోటల్‌లో కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య పథకాల అమలు మీద జరిగిన ప్రాంతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్ఏ) నమోదు ఏపీలో 77.9 శాతం జరిగిందని, ఈ నమోదులో అన్ని రాష్ట్రాల కన్నా ఏపీ దూసుకుపోతోందన్నారు. ఏబీహెచ్ఏలో నమోదుతో ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఇందులో 14 అంకెలతో ఆస్పత్రుల్లో ప్రోగ్రెస్ హెల్త్ రికార్డు(పీహెచ్ఆర్)ను అమలు చేయడం వల్ల రోగులకు పలు ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఆధార్ నంబర్ ఏబీహెచ్ఏ ఖాతాకు అనుసంధానంగా ఉంటుందన్నారు. అన్ని పరీక్షలు, రిపోర్టులు రోగి సెల్‌లోనే వస్తాయన్నారు. రోగి ఆరోగ్యానికి సంబంధించి అన్ని రికార్డ్స్ భద్రంగా ఉంటాయన్నారు. రోగి అనుమతితోనే వైద్యులు కూడా చూసే అవకాశం ఉంటుందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మైక్రో సైట్‌ను ప్రారంభించే ఆలోచన ఉందని, రాష్ట్రంలో 9 వేల ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్స్, లేబొరేటరీలు నమోదై ఉన్నాయన్నారు. వీటిలో రోగులకు సంబంధించి అన్ని రికార్డ్స్ భద్రంగా ఉంటాయన్నారు. రాష్ట్ర ఆరోగ్య శ్రీ కో–ఆర్డినేటర్ డీకే బాలాజీ, నేషనల్ హెల్త్ మిషన్ సీఈవో దీప్తి గౌర్ ముఖర్జీ, నేషనల్ హెల్త్ మిషన్ అసిస్టెంట్ సీఈవో బసంత్ గార్గ్, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్లు వి. కిరణ్ గోపాల్, లత గణపతి, జాయింట్ సీఈవో అలంకిత పాండే, విశాఖ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏపీ, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి 180 మంది వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హాజరయ్యారు.

పాస్‌పోర్ట్ 'హద్దు'లపై అపోహలొద్దు

- 12 జిల్లాల పరిధిలోనే విశాఖ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం
- స్పష్టం చేసిన విశాఖ ఆర్పీవో అధికారి విశ్వంజలీ గైక్వాడ్



సాక్షి, విశాఖపట్నం: దరఖాస్తుదారులకు పూర్తిస్థాయిలో పాస్‌పోర్టు సేవలందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని విశాఖపట్నం రీజనల్ పాస్‌పోర్టు కేంద్రం అధికారి విశ్వంజలీ గైక్వాడ్ తెలిపారు. విశాఖపట్నం ఆర్పీవో పరిమితులు తగ్గిపోయాయంటూ వివిధ పత్రికల్లో వస్తున్న కథనాల్ని ఆమె తీవ్రంగా ఖండించారు. విశాఖ ఆర్పీవో పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు జిల్లాలతో పాటు యానాం కూడా ఉందని స్పష్టం చేశారు. విజయవాడ ఆర్పీవో పరిధిలో కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలున్నాయని వివరించారు. రాష్ట్ర విభజన తర్వాత విజయవాడలో ఉన్న పాస్ పోర్టు సేవాకేంద్రాన్ని 2017లో రీజనల్ పాస్‌పోర్టు కేంద్రంగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. దానికి సంబంధించి ఇటీవల కాలంలో కొత్త భవనం నిర్మాణం పూర్తికాగా.. సేవల్ని అక్కడికి తరలించాలన్నారు. ఇది కొత్తగా ఏర్పాటైనట్లుగా భావించి.. కొందరు.. విశాఖ ఆర్పీవో పరిధి తగ్గిపోయిందంటూ కథనాలు రాస్తున్నారని, దీనివల్ల వినియోగదారులు గందరగోళానికి గురవుతున్నారని విశ్వంజలీ గైక్వాడ్ అన్నారు. విశాఖపట్నం ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం పరిధిలో 2 పాస్‌పోర్టు కేంద్రాలుండగా 7 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవాకేంద్రాలున్నాయన్నారు. రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నంలో ఉన్న రెండు ప్రాంతీయ పాస్‌పోర్టు కేంద్రాల ద్వారా తత్కాల్, సాధారణ అపాయింట్‌మెంట్లను పెంచి, కాలపరిమితిని తగ్గించడంతో పాటు శనివారం కూడా సేవలు అందిస్తుండటంతో.. పాస్‌పోర్టుల జారీ ప్రక్రియ కూడా వేగవంతం అవుతున్నాయని వివరించారు.

అద్భుతంగా 'వికసిత్ ఆంధ్ర'

నీతి ఆయోగ్ రూపొందించిన ముసాయిదా విజన్ డాక్యుమెంటేషన్‌పై సీఎస్ జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: 'వికసిత్ ఆంధ్ర–2047'పై నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో రూపొందించిన ముసాయిదా విజన్ డాక్యుమెంట్ అద్భుతంగా ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డా.కేఎస్ జవహర్‌రెడ్డి చెప్పారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో 'వికసిత్ ఆంధ్ర–2047'పై నీతి ఆయోగ్ ప్రతినిధులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. '2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. దానికి అనుగుణంగా ఏపీని కూడా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోంది. దేశంలోనే 2వ అతిపెద్ద సముద్ర తీర ప్రాంతం కలిగిన రాష్ట్రం ఏపీ. దానిని సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. పారిశ్రామికంగా, పర్యాటక పరంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తోంది. ఓడరేవులు, జాతీయ రహదారులు, విమానాశ్రయాలతో మెరుగైన కనెక్టివిటీ కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. ప్రపంచస్థాయి విద్య, వైద్య పరమైన మౌలిక సదుపాయాలను కూడా అందుబాటులోకి తెస్తోంది. ఈ నేపథ్యంలో 2047 నాటికి ఏపీని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ విజన్ డాక్యుమెంట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. త్వరలో దీనిపై ముఖ్యమంత్రి వద్ద ప్రజెంటేషన్ ఇచ్చి వారి సూచనలు తీసుకుంటాం. అనంతరం సీఎం ఆమోదంతో ఈ ప్రణాళిక అమలుకు చర్యలు తీసుకుంటాం' అని సీఎస్ జవహర్‌రెడ్డి చెప్పారు. నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి రాధ మాట్లాడుతూ.. 'ఏపీలో తీర ప్రాంత అభివృద్ధికి ఎక్కువ అవకాశాలున్నాయి. ఏపీకి ఇప్పటికే వ్యవసాయ, ఉద్యానవన, ఆక్వా రంగాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. పర్యాటకం పరంగా మరింత అభివృద్ధికి అవకాశాలున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు వల్ల ఉత్తమ మానవ వనరులు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ 2047 నాటికి వికసిత్ ఆంధ్ర లక్ష్య సాధనకు దోహదం చేస్తాయి' అని చెప్పారు. నీతి ఆయోగ్ సలహాదారులు ప్రభాకర్ సాహు, పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ.. 2047 నాటికి ఏపీలో వివిధ రంగాల వారీగా సాధించే అభివృద్ధి తదితర అంశాలను వివరించారు. అలాగే అభివృద్ధి చెందడానికి గల అవకాశాలను తెలియజేశారు.

ఎప్పటికప్పుడు పోస్టుల భర్తీ

- వైద్యరంగాన్ని బలోపేతం చేసిన సీఎం జగన్ ప్రభుత్వం
- వైద్య శాఖలో నియామకాలకు ప్రత్యేక రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఏర్పాటు
- బోర్డు ఏర్పాటైన తొమ్మిది నెలల్లోనే 3,353 మంది సిబ్బంది నియామకం
- 2019 నుంచి ఇప్పటి వరకు వైద్య శాఖలో 53 వేలకు పైగా పోస్టుల భర్తీ



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో కునారిల్లిన ప్రభుత్వ వైద్య రంగాన్ని సీఎం జగన్ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలతో బలోపేతం చేసింది. 57 నెలల పాలనా కాలంలో వైద్యశాఖలో ఏకంగా 53 వేలకు పైగా పోస్టులను భర్తీ చేసింది. దేశంలో ఎక్కడా లేని రీతిలో నాడు–నేడు, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలను అమలు చేస్తోంది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి ప్రభుత్వాస్పత్రుల్లో తీవ్రమైన మానవ వనరుల కొరత ఉండేది. పీహెచ్‌సీల్లో ఉన్న ఒక వైద్యుడు సెలవుపై వెళితే మరొకరిని ఆ స్థానంలోకి పంపలేని దుస్థితి ఉండేది. ఈ పరిస్థితికి చెక్ పెడుతూ వైద్య శాఖలో జీరో వేకెన్సీ విధానాన్ని సీఎం జగన్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో వైద్య శాఖలో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడే భర్తీ చేసేలా అత్యవసర అనుమతులు ఇచ్చారు.

తొమ్మిది నెలల్లో 3,353 పోస్టులు

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ, పోలీస్ శాఖలో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఉన్నట్టే వైద్య శాఖలో నియామకాల కోసం ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. గతేడాది జూన్ నెలలో బోర్డ్ కార్యకలాపాలను వైద్య శాఖ ప్రారంభించింది. తొమ్మిది నెలల్లోనే 3,353 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య పోస్టులను భర్తీ చేసింది. ఇందులో 2,442 పోస్టుల కోసం గతేడాది, మరో 911 పోస్టులకు ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో నోటిఫికేషన్‌లను ప్రభుత్వం ఇచ్చింది. 911 పోస్టుల్లో పలు పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. గ్రామ స్థాయిలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్ నుంచి బోధన ఆస్పత్రుల వరకూ.. వాచ్‌మెన్ నుంచి వైద్యుల వరకూ ఏ ఒక్క పోస్టు ఖాళీగా ఉంచకుండా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో 2019 నుంచి ఇప్పటి వరకూ ఏకంగా 53 వేలకు పైగా పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. రిక్రూట్‌మెంట్ బోర్డ్ అందుబాటులోకి వచ్చాక రాష్ట్ర, జోనల్ స్థాయి పోస్టులను బోర్డ్ ద్వారా, మిగిలిన పోస్టులను జిల్లా స్థాయిల్లోనే డీఎస్సీల ద్వారా భర్తీ చేస్తున్నారు. వైద్య శాఖలో రిక్రూట్‌మెంట్ కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలనే ఆలోచన లేని చంద్రబాబు.. కనీసం ఖాళీల భర్తీకి కూడా ఆసక్తి చూపలేదు. దీంతో చంద్రబాబు హయాంలో వైద్య శాఖలో సిబ్బంది లేక ప్రజలకు సరైన వైద్యం అందేదికాదు.

2019 నుంచి ఇప్పటివరకు పోస్టుల భర్తీ ఇలా


అంశం	పోస్టులు
స్పెషలిస్ట్ వైద్యులు	4,324
మెడికల్ ఆఫీసర్లు	2,475
స్టాఫ్ నర్సులు	6,734
ఏఎన్ఎంలు	13,540
మల్టీలెవల్ హెల్త్ ప్రొవైడర్	10,032
పారామెడికల్ సిబ్బంది	9,751
క్లాస్ 4	3,303
డేటా ఎంట్రీ ఆపరేటర్లు	249
కొత్త వైద్య కళాశాలల్లో సిబ్బంది	1,582
ఇతరులు	1,476
మొత్తం	53,466

నిర్వాసితులకు వారున్న కాలనీల్లోనే ఓటుహక్కు

- ఎన్నికల సంఘం నిబంధనల మేరకే ఓట్లు మార్పు
- అన్ని రాజకీయాల పార్టీల అభిప్రాయాలు కూడా తీసుకున్నాం
- కృష్ణునిపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీలో కొత్త ఓట్లు నమోదు
- వాస్తవ విరుద్ధంగా 'ఈనాడు' కథనం
- రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్


సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్


ఈ అరాచకం అనంతం!
ఓడిస్తారనే భయంతో ఓట్లను మార్చేశారు



రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలైన దేవీపట్నం, తొయ్యేరు నిర్వాసితులకు వారు నివాసం ఉండే ఆర్అండ్ఆర్ కాలనీలోనే ఓటు హక్కు కల్పించినా తట్టుకోలేని 'ఈనాడు' అబద్ధాలు, అసత్యాలతో కూడిన కథనాన్ని బుధవారం అచ్చేసింది. అధికారులు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే ఓట్లు మార్పు చేస్తే ఏదో మహాపాపం జరిగిపోయినట్టు పతాక శీర్షికలో 'ఈ అరాచకం అనంతం' అంటూ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. ఈ కథనాన్ని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ తీవ్రంగా ఖండించారు. పోలవరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులైన దేవీపట్నం మండలంలోని గోదావరి తీరంలో ఉన్న గిరిజనేతరులకు గోకవరం మండలంలో పునరావాసం కల్పించినట్లు తెలిపారు. దేవీపట్నం, తొయ్యేరు నిర్వాసితులకు కృష్ణునిపాలెం సమీపంలో రెండేళ్ల క్రితం ఆర్ అండ్ఆర్ కాలనీ నిర్మించి 1,282 కుటుంబాలకు పునరావాసం కల్పించామని గుర్తు చేశారు. ఈనాడు కథనం పూర్తి వాస్తవ విరుద్ధంగా ఉందన్నారు.

అంతా ఎన్నికల సంఘం నిబంధనల మేరకే..

కృష్ణునిపాలెం ఆర్అండ్ఆర్ కాలనీలో నివసిస్తున్న 2,475 మంది ఓటర్లను జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గంలో చేర్చినట్లు సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. తొయ్యేరులోని 237, 238, 239 పోలింగ్ బూత్‌లకు చెందిన ఈ ఓటర్లందరినీ రెండేళ్ల క్రితం ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జగ్గంపేట నియోజకవర్గంలో ఓటర్లుగా నమోదు చేసేందుకు అప్పటి దేవీపట్నం తహసీల్దార్ సిఫారసు చేశారన్నారు. ఎన్నికల సంఘం ఆమోదం కూడా తెలిపిందన్నారు. ఓట్లను మార్చే ముందు అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను కూడా తీసుకున్నామని తెలిపారు. నాటి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ అనుమతితోనే ఓట్లు మార్పు జరిగిందని వివరించారు. మండల స్థాయి నుంచి జిల్లా కలెక్టర్‌కు, అక్కడ నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి వెళ్లి.. తిరిగి జిల్లా కలెక్టర్‌కు అనుమతులు వచ్చాకే ఓట్ల మార్పు సాధ్యపడుతుందని వివరించారు. నిబంధనల ప్రకారమే.. రెండేళ్ల క్రితమే నిర్వాసితుల ఓట్లు మార్చితే ఇప్పుడు ఈనాడు పత్రిక అనవసర రాద్ధాంతం చేస్తోందన్నారు. నిర్వాసితులకు వారు ఉండే ప్రాంతంలోనే ఓటు హక్కు కల్పించామన్నారు. దొంగ ఓట్లు, వేరే రాష్ట్రాల వారి ఓట్లేమీ చేర్చలేదు కదా అని నిలదీశారు.

ఓటు మార్చడంలో తప్పేముంది?



పోలవరం ముంపులో తొయ్యేరు గ్రామం మునిగిపోయింది. కృష్ణునిపాలెం ఆర్అండ్ఆర్ కాలనీలో ఇళ్లు నిర్మించారు. శాశ్వతంగా ఎప్పటికీ ఇక్కడే నివాసం ఉండాలి. ఈ నేపథ్యంలో ఓటును ఇక్కడకు మార్చడంలో తప్పేముంది? కాలనీలోనే పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

–నందూరి సీతారామ్, కృష్ణునిపాలెం ఆర్అండ్ఆర్ కాలనీ

ఓటు మార్పు వల్ల ఇబ్బందేమీ లేదు..



కాలనీకి వచ్చాక 18 ఏళ్లు నిండిన వారు కొత్త ఓట్లు నమోదు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం మేమున్న కృష్ణునిపాలెం ఆర్అండ్ఆర్ కాలనీలోనే ఓటు హక్కు కల్పించారు. ఓట్లు మార్చడం వల్ల ఇబ్బంది ఏమీ లేదు. ఇక్కడే స్వేచ్ఛగా మా ఓటు హక్కును వినియోగించుకుంటాం.

–దేవరపల్లి వీరబాబు, కృష్ణునిపాలెం ఆర్అండ్ ఆర్ కాలనీ

వైఎస్సార్‌సీపీకి మాగుంట రాజీనామా



ఒంగోలు: ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేశారు. ఈ విషయమై బుధవారం ఒంగోలులో ఆయన మీడియాతో మాట్లాడారు. '1991 నుంచి మా కుటుంబానికి ప్రకాశం జిల్లాతో విశేష అనుబంధం ఉంది. మా కుటుంబం నుంచి 8సార్లు ఎంపీగా, రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా పోటీ చేశారు. ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో మా కుటుంబ ఆత్మగౌరవం కోసం వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేస్తున్నా. 2024 ఎన్నికల్లో ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా నా కుమారుడు రాఘవరెడ్డి పోటీ చేస్తారు. సీఎం వైఎస్ జగన్ మాకు చాలా సహాయ సహకారాలు అందించారు. కానీ, అనివార్య కారణాల వల్ల పార్టీని వీడుతున్నాను. ఇన్నాళ్లు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నా' అని మాగుంట చెప్పారు. లోక్‌సభ సమావేశాలు ముగియడంతోనే ఎంపీ పదవి అయిపోయినట్లని.. అయినా కూడా రాజీనామా లేఖను పంపిస్తున్నానని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.